
'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 117

మంగళవారం 18-7-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

"తమకు తాము ఉపాధి కల్పించుకుంటూ నామమాత్రపు లాభాలతో సేవలందిస్తూ.. వడ్డీలు, చక్రవడ్డీలు కట్టలేక అవస్థలు ఎదుర్కొంటున్న చిరు వ్యాపారులు, సాంప్రదాయ చేతి వృత్తుల వారి కష్టాలను దగ్గరగా చూశా.. వారి జీవితాల్లో మార్పు తీసుకు రావాలి.. మంచి జరగాలి.. వారికి తోడుగా ఉండాలని ఈ పథకం తీసుకొచ్చాం".. - మీ ముఖ్యమంత్రి

వరుసగా నాలుగో ఏడాది.. మొదటి విడతగా

జగనన్న తోడు..

చిరు వ్యాపారుల ఉపాధికి ఊతం..

పూర్తి వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తూ ఒక్కొక్కరికి రూ.10,000, అంతకు పైగా..
5,10,412 మంది చిరు వ్యాపారులకు రూ. 549.70 కోట్ల వడ్డీలేని రుణాలు, రూ.11.03 కోట్ల వడ్డీ రీయింబర్స్‌మెంట్ కలిపి మొత్తం రూ. 560.73 కోట్లను నేడే బటన్ నొక్కి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్న గౌరవ ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి...

నిరుపేదలైన చిరు వ్యాపారులు, హస్త కళాకారులు, సాంప్రదాయ చేతి వృత్తుల వారిని వారి కాళ్లమీద వారిని నిలబెడుతూ.. ఒక్కొక్కరికి ఏటా రూ.10,000 సున్నా వడ్డీకే రుణం అందిస్తూ, గతంలో రుణాలు తీసుకొని సకాలంలో చెల్లించిన వారికి ఆ రూ.10,000 కు అదనంగా ఏటా మరో రూ.1,000 చొప్పున జోడిస్తూ రూ.13,000 వరకు వడ్డీలేని రుణం..

నేడు అందిస్తున్న రూ. 549.70 కోట్ల రుణంతో కలిపి ఇప్పటివరకు చిరువ్యాపారాలు చేసుకునే 15,87,492** మంది లబ్ధిదారులకు అందించిన వడ్డీ లేని రుణాలు రూ. 2,955.79 కోట్లు..

(**వీరిలో సకాలంలో రుణాలు చెల్లించి పలుమార్లు రుణం కోరి పొందిన వారు 13,29,011 మంది)



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి
శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి

నేడు అందిస్తున్న వడ్డీ రీయింబర్స్‌మెంట్ రూ.11.03 కోట్లతో కలిపి సకాలంలో రుణాలు చెల్లించిన 15.31 లక్షల లబ్ధిదారులకు ఇప్పటి వరకు మన ప్రభుత్వం తిరిగి చెల్లించిన వడ్డీ రూ. 74.69 కోట్లు..

సకాలంలో రుణాలు చెల్లించండి..
మీ తరపున వడ్డీని జగనన్న ప్రభుత్వమే భరిస్తుంది..

లబ్ధిదారులు బ్యాంకులకు కట్టిన వడ్డీ మొత్తాన్ని ప్రతి ఆరు నెలలకోసారి నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా జగనన్న ప్రభుత్వమే చెల్లిస్తుంది..! సకాలంలో రుణాలు చెల్లించిన వీధి వ్యాపారులు, సాంప్రదాయ చేతి వృత్తుల వారికి నిత్యం మూలధనం అందుబాటులో ఉండేలా ఏ ఏడాదికి ఆ ఏడాది రుణాల మొత్తాన్ని రూ.10,000 నుండి రూ.11,000 కు, రూ.11,000 నుండి రూ.12,000 కు, రూ.12,000 నుండి రూ.13,000 కు పెంచుతూ బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాలు అందిస్తున్న జగనన్న ప్రభుత్వం..

దేశంలోనే అత్యధికంగా వడ్డీ లేని రుణాలు అందిస్తున్న మన జగనన్న ప్రభుత్వం..






థాంక్యూ జగనన్న..

వీరందరికీ " జగనన్న తోడు.."

- గ్రామాలు, పట్టణాల్లో సుమారు 10 అడుగుల పొడవు, 10 అడుగుల వెడల్పు స్థలంలో శాశ్వత లేక తాత్కాలిక షాపులు ఏర్పాటు చేసుకున్న వారు..
- ఫుట్ పాత్ ల మీద, వీధుల్లో తోపుడు బండ్ల మీద వస్తువులు, కూరగాయలు, పండ్లు, ఆహార పదార్థాలు అమ్ముకుని జీవించే వారు, రోడ్ల పక్కన టిఫిన్ సెంటర్లు నిర్వహించేవారు, గంపలు, బుట్టలతో వస్తువులు అమ్మేవారు, సైకిల్, మోటార్ సైకిల్, ఆటోలపై వెళ్లి వ్యాపారం చేసుకునేవారు..
- చేనేత మరియు సాంప్రదాయ చేతివృత్తుల కళాకారులైన ఇత్తడి పని చేసే వారు, బొబ్బిలి వీణ, ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, కలంకారీ, తోలు బొమ్మలు, ఇతర సామాగ్రి తయారీదారులు, లేస్ వర్క్స్, కుమ్మరి తదితర వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వ్యక్తులు..

లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఇలా..

- వడ్డీలేని రుణాలకు దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు గ్రామ/వార్డు సచివాలయాలను సంప్రదించండి లేదా మీ వాలంటీర్ ని సంప్రదించండి.
- నిరంతర సామాజిక తనిఖీ కోసం అర్హుల జాబితా గ్రామ/వార్డు సచివాలయాల్లో ప్రదర్శన..
- అర్హత ఉండీ, జాబితాలో పేర్లు నమోదు కానివారు కంగారు పడవలసిన పనిలేదు. గ్రామ/వార్డు వాలంటీర్లను సంప్రదించండి లేదా సమీప గ్రామ/వార్డు సచివాలయాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోండి.. వెరిఫై చేసుకుని మీకు తోడుగా ఉండి నడిపిస్తారు..

"జగనన్న తోడు"కు సంబంధించిన సహాయం, ఫిర్యాదుల కొరకు
జగనన్నకు చెబుదాం
1902
టోల్ ఫ్రీ నంబర్

డా. ఆదిమూలపు సురేష్, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామాత్యులు

శ్రీ. బూడి ముత్యాల నాయుడు, ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖామాత్యులు.

గమనిక: రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ.వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి "జగనన్న తోడు" క్రింద లబ్ధిని 18 జూలై, 2023న ఉదయం 10 గంటలకు సీఎం క్యాంపు కార్యాలయంలో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తారు. ఈ కార్యక్రమాన్ని అన్ని ప్రముఖ న్యూస్ ఛానళ్లలో లైవ్ లో వీక్షించవచ్చు..

జారీచేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

పచ్చళ్లు పెట్టే వనితల ఊరు

ఉసులుమర్రు

గోదావరి జిల్లా వాసులంటే తిండితో చంపేస్తారురా బాబు అంటుంటారు. గోదావరి తీరాన వంటకాలకు ప్రసిద్ధి చెందిన పల్లెలు చాలానే ఉంటాయి. కండ్రిగ పాలకోవా, నగరం గరాజీలు, ఆత్రేయపురం పూతరేకులు, అంబాజీపేట పొట్టిక్కలు... ఉసులుమర్రు పచ్చళ్లు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వశిష్ట గోదావరి గట్టుకు ఆనుకుని తణుకుకు అరగంట ప్రయాణ దూరంలో ఉండే ఆ గ్రామం ఎప్పుడూ సముద్రంలో ఉప్పునూ చెట్టు మీద కాయను కలిపి పచ్చళ్లు పెట్టడంలో నిమగ్నమై ఉంటుంది. వ్యక్తిగతంగా కావచ్చు, యజమాని కింద కావచ్చు ఆ గ్రామంలోని స్త్రీలలో ముప్పై, నలభై శాతం పచ్చళ్లు పెట్టడంలో ఉపాధి పొందుతూ ఉంటారు. వీరితో పాటు ఇరవై శాతం మగవారు ఈ పనిలో ఉంటారు. ఇక్కడి స్త్రీల చేతికి రుచి ఎక్కువ. అందుకే ఉసులుమర్రు పచ్చళ్లకు గిరాకీ ఎక్కువ.

అందరూ ఆవకాయ పెట్టుకోరు. బయటి నుంచి తెచ్చుకునేవారు ఎప్పుడూ ఉంటారు. అలాంటి వారి కోసమే ఆ ఊరి స్త్రీలు ఆవకాయ పెడతారు. మే నుంచి జూన్ వరకూ ఉమ్మడి తూ.గో.జిల్లాలోని ఉసులుమర్రు స్త్రీలు ఆవకాయతో పాటు రకరకాల పచ్చళ్లు పెడుతుంటారు. వాటిని తీసుకుని మగవారు జిల్లాలకు బయలుదేరి నెలల తరబడి అమ్ముతారు. రోజూ ఏదో ఒక పచ్చడి తయారు చేసే ఆ ఊరి స్త్రీలు శ్రమైక జీవన సౌందర్యానికి ప్రతినిధులు.

40 సంవత్సరాల క్రితం నుంచి


ఉసులుమర్రి జనాభా 2500 మాత్రమే. వీరిలో ఐదు వందల మంది స్త్రీలకు పైగా, మూడు వందల మంది పురుషులకు పైగా అందరూ కలిసి దాదాపు 1000 మంది వరకు సీజన్‌లో పచ్చళ్లు పెట్టడంలో బిజీగా ఉంటారని అంచనా. ఏప్రిల్ నుంచి జూన్ వరకు చిన్న, పెద్ద, ముసలి అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరు క్షణం తీరిక లేకుండా రేయింబవళ్లు అనేక రకాల పచ్చళ్లు పెడుతుంటారు. ఊరు ఊరంతా ఏ కంపెనీ కోసం, ఏ యజమాని కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధిని కల్పించుకున్నారు. 40 సంవత్సరాల క్రితం పిళ్లా పెదకాపు కుటుంబం వారు మొదటిసారిగా పచ్చళ్లను తయారు చేయడం మొదలు పెట్టారు. మంచి లాభాలు, మిగులు ఉండడంతో వారిని చూసి వారి బంధువులు మొదలుపెట్టారు. అలా ఒకరిని చూసి మరొకరు అదే పనిని నేర్చుకుని స్వంతంగా తయారు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. 200 కుటుంబాలకు పైగానే ఈ చిరు వ్యాపారాన్ని చేస్తున్నారు. ఇప్పుడు తయారీలో మూడోతరం నిమగ్నమైంది.













ఇవీ ప్రత్యేకం

టమాటా, ఉసిరి, అల్లం, మాగాయి, ఆవకాయ, గోంగూర, కాలీఫ్లవర్, పండుమిరప, నిమ్మ తదితర పచ్చళ్ళకు ఉసులుమర్రు ప్రత్యేకం. పచ్చళ్ల తయారీలో మహిళలకు కనీసం 300 రోజు కూలీ దక్కుతోంది. అన్ని రకాల పచ్చళ్ళు పెట్టాలంటే రూ.5 లక్షలు పెట్టుబడి అవుతుంది. ఖర్చులు పోగా మిగిలే లాభంతో తమకెంతో సంతోషంగా ఉంటుందంటున్నారు. ఈ ఒక్క పల్లెలో అన్ని రకాల పచ్చళ్లూ కలిసి ఏడాదికి 500 టన్నులు పచ్చళ్లు పడుతుంటారని అంచనా. టన్ను పచ్చడి రూ.2.50 లక్షలు వంతున విక్రయిస్తుంటారు. ఈ లెక్కలను పరిగణనలోకి తీసుకుంటే రూ.10 నుంచి రూ.12 కోట్లు. మహిళలు ఇళ్లవద్ద పచ్చళ్లు పెడితే పురుషులు మాత్రం ఏడెనిమిది నెలలపాటు ఊళ్లు తిరుగుతూ చివరిడబ్బా అమ్మేశాక మాత్రమే ఇంటికి తిరిగొస్తారు. కుటుంబాన్ని వదిలి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో, వరంగల్, నల్గొండ, బోధన్, హైదరాబాద్, నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు, ఖమ్మం, మిరియాలగూడ, అశ్వారావుపేట తదితర ప్రాంతాల్లో విక్రయిస్తుంటారు.

ఏడాది పొడవునా నిల్వ

ఉసులుమర్రు ఆవకాయ అంటే ఏడాది పొడవునా నిల్వకు తిరుగుండదంటారు. ముదురు మామిడికాయలను ముక్కలుగా కోసి ఆరబెట్టి ఆవపిండి, మెంతులు, ఎర్రపచ్చడి కారం, వేరుశెనగ లేదా నువ్వుల నూనె కలిపి మూడు రోజుల తరువాత జాడీలో పెడతారు. ఉప్పు, కారం, ఆవపిండి కలిపిన ముక్కలను డ్రమ్ములో వేసుకుని ఎక్కడ అవసరమైతే అక్కడే వారి కళ్లెదుటే అన్నీ కలిపి ఇవ్వడంతో నమ్మకం రెట్టింపు అయ్యిందంటారు. వేసవిలో పండుమిరప, ఉసిరి, ఆవకాయ, గోంగూర, కాకరకాయ పెడతారు. వానాకాలం బ్రేక్ ఇచ్చి మళ్లీ ఆగస్టు నుంచి అల్లం, వెల్లుల్లి, టొమాటో, కాలీఫ్లవర్, కొత్తిమీరలాంటివి పెడతారు. మిక్స్‌డ్ వెజిటబుల్ అడిగితే పెట్టి ఇస్తారు. నిమ్మకు నిల్వ తక్కువ కాబట్టి తక్కువగా పెడతారు. చికెన్, రొయ్యలతో నాన్‌వెజ్ పచ్చళ్లు కూడా చేసి ఇస్తారు. సరుకును బట్టి లాభం. ఉదాహరణకు డ్రమ్ (200 కిలోలు) పండు మిరప పచ్చడి పట్టడానికి 20 వేలు అవుతుంటే మార్కెట్‌లో కిలో రూ.250కు అమ్ముతుంటారు.

– లక్కింశెట్టి శ్రీనివాసరావు
సాక్షి, కాకినాడ
ఫొటోలు: పంతం వెంకటేశ్వర్లు, పెరవలి

గెలుపు పాఠం



మనసే గురువై అనుభవమే అపురూప పాఠమై...

– స్టార్ మోడల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ లీనా నాయర్


ఫ్రాన్స్ పర్యటనలో ప్రధాని మోదీని కలుసుకున్న ప్రముఖులలో లీనా నాయర్ ఒకరు. మోదీ ఆమెను ప్రత్యేకంగా ప్రశంసించారు. మేనేజ్‌మెంట్ ట్రైనీ నుంచి గ్లోబల్ బ్రాండ్ చానల్(ఫ్రెంచ్ ఫ్యాషన్ కంపెనీ)కి సీయివో కావడం వరకు ఆమెది స్ఫూర్తిదాయకమైన ప్రయాణం....

లీనా నాయర్ మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో పుట్టింది. అక్కడి హోలీ క్రాస్ హైస్కూల్, ది న్యూ కాలేజ్‌లో చదువుకుంది. మహారాష్ట్ర, సంగ్లీ పట్టణంలోని 'వాల్‌చంద్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్'లో ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్ ఇంజనీరింగ్ పూర్తి చేసింది.

హిందూస్థాన్ యూనిలీవర్(హెచ్‌యూఎల్)లో మేనేజ్‌మెంట్ ట్రైనీగా ఉద్యోగ ప్రస్థానం మొదలు పెట్టిన లీనా ఫ్యాక్టరీ ఫ్లోర్‌లో పని చేసిన తొలి మహిళ, నైట్ షిఫ్ట్‌లో పనిచేసిన తొలి మహిళ, మేనేజ్‌మెంట్ కమిటీలోని తొలి మహిళగా గుర్తింపు పొందింది. ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో పట్టా పుచ్చుకున్న లీన 'మేనేజ్‌మెంట్' వైపు రావడానికి కారణం ఏమిటి?

ఆమె మాటల్లోనే...''చిన్న పట్టణంలో పుట్టి పెరిగాను. ఆ రోజుల్లో అమ్మాయిల కోసం సరియైన బడులు ఉండేవి కావు. అమ్మాయిలు ఇవి మాత్రమే చేయాలి....ఇలా రకరకాల ఆంక్షలు ఉండేవి. పెద్దగా నవ్వడం కూడా పెద్ద తప్పయ్యేది! చిన్నప్పటి నుంచి నాకు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ అంటే ఇష్టం. అలా ఇంజనీరింగ్ చేశాను. ఇంజనీరింగ్‌లో ఉండే ఇంటలెక్చువల్ చాలెంజ్ అంటే ఇష్టం ఉన్నప్పటికీ ఇంజనీర్‌గా ఉద్యోగజీవితాన్ని మాత్రం ఎంజాయ్ చేయలేకపోయాను.

అదృష్టవశాత్తు ఒక ప్రొఫెసర్ దగ్గర మేనేజ్‌మెంట్ అండ్ ఇంజనీరింగ్ సబ్జెక్ట్ చదువుకున్నాను. నీలో అరుదైన మేనేజ్‌మెంట్ స్కిల్స్ ఉన్నాయి అంటూ ఆయనే నన్ను మేనేజ్‌మెంట్ దిశగా ప్రోత్సహించారు.



● ప్రధాని మోదీతో లీనా నాయర్

మేనేజ్‌మెంట్ వైపు వెళ్లాలనుకుంటున్నాను అని నాన్నతో చెబితే ఆయన చాలా నిరాశకు గురయ్యారు. నీలాంటి ప్రతిభ గల ఇంజనీర్ అటు వైపు వెళ్లడం ఏమిటి? అన్నారు. ఆయన అలా అనడంతో నాకు చాలా నిరాశగా అనిపించింది. తరువాత బాగా ఆలోచించాను. అప్పుడు నాకు నేనే గురువుగా మారిపోయాను. 'నీ మనసు చెప్పింది చెయ్. ఎవరో ఏదో అనుకుంటారని సంశయించవద్దు. నీ కంటూ ఒక లక్ష్యంతో బయలుదేరు'... అలాగే చేశాను. నా కలను నిజం చేసుకున్నాను''.

ప్రతి అనుభవం, ప్రతి పని ఒక పాఠం నేర్పుతుంది. ఫ్యాక్టరీ ఫ్లోర్‌లో పనిచేసిన అనుభవం నుంచి లీన నేర్చుకున్న పాఠం ఏమిటి?

తాను ఫ్యాక్టరీ ఫ్లోర్‌లోకి అడుగుపెట్టినప్పుడు అందరూ ఆశ్చర్యంగా చూడడం మొదలుపెట్టారు. ఒక మహిళ తమ ఫ్యాక్టరీలో పనిచేస్తుందని వారు ఊహించలేదు. తన కోసం ఒక టాయిలెట్ నిర్మించేలా చేయడంలో విజయం సాధించింది లీన. 'హెచ్‌యూఎల్'లో పనిచేస్తున్న కాలంలో ఫ్యాక్టరీ మేనేజ్‌మెంట్, ప్రొడక్షన్‌కు సంబంధించి ఎన్నో పాఠాలు నేర్చుకుంది. అవన్నీ తన కెరీర్‌కు పునాది రాళ్లుగా ఉపయోగపడ్డాయి.

ఫ్యాక్టరీలో యంత్రాలలో యంత్రమై పనిచేయలేదు లీన. చీఫ్ హ్యూమన్ రిసోర్స్ ఆఫీసర్‌గా ఉద్యోగులను కనిపెట్టుకొని ఉండేది. ఎవరైనా ఒంటరితనంతో బాధపడుతున్నా, పనిఒత్తిడితో సతమతం అవుతున్నా....వారిని ఆ స్థితి నుంచి బయటికి తీసుకువచ్చేది. పాకిస్థాన్‌లో 'హెచ్‌యూఎల్' షాప్ ఫ్లోర్ కోసం కొందరు అమ్మాయిలు ఉద్యోగంలో చేరారు. అయితే వారి తల్లిదండ్రులకు రకరకాల సందేహాలు ఉండేవి. ఇది గమనించిన లీన వారిని కంపెనీ గెస్ట్‌హౌజ్‌లో రెండు వారాల పాటు ఉండేలా చేసింది. తమ పిల్లలు షాప్ ఫ్లోర్‌లో చేస్తున్న పని ఏమిటి? అక్కడ ఎలాంటి సౌకర్యాలు, సదుపాయాలు ఉన్నాయి...మొదలైనవి ప్రత్యక్షంగా చూసుకునే అవకాశం వారికి లభించింది.

'మాకిప్పుడు ఎలాంటి సందేహాలు లేవు. మా పిల్లలు మంచి ఉద్యోగాన్ని ఎంచుకున్నారు' అన్నారు వారు వెళ్లేటప్పుడు.

'ప్రతి సమస్యకు ఒకేఒక పరిష్కారం ఉండదు. సందర్భాలు, దేశాలను బట్టి కొత్త పరిష్కార మార్గాల కోసం ఎప్పటికప్పుడు అన్వేషించాల్సి ఉంటుంది' అంటోంది గ్లోబల్ ఫ్యాషన్ బ్రాండ్ 'చానల్' సీయివో లీనా నాయర్.

రోబీస్...

● సాధారణ తేనెటీగల్లాగే పరపరాగ సంపర్కానికి దోహదం చేస్తున్న రోబో-బీలు (తేనెటీగ యంత్రాలు)

● బ్లూబెర్రీ, అవకాడో తోటల కోసం రూపొందించిన ఇజ్రాయెల్ కంపెనీ



● బ్లూ బెర్రీ తోటలో రోబో యంత్రంతో పాలినేషన్ చేస్తున్న మహిళా రైతు

● పాలినేట్ చేస్తున్న 'రోబీ' చెయ్యి

కొన్ని రకాల పంటలు, పండ్ల తోటల్లో పరపరాగ సంపర్కానికి అత్యవసరమైన తేనెటీగల సంఖ్య ప్రకృతిలో అంతకంతకూ తగ్గిపోతుండడంతో... అగ్రిటెక్ సంస్థలు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కారం వెతికే ప్రయత్నం చేస్తున్నాయి. ఇజ్రాయెల్‌కి చెందిన 'బ్లూమ్‌ఎక్స్' కంపెనీ తేనెటీగల్లా పనిచేసే రోబో యంత్రాలను రూపొందించింది. పరిశోధనలు, క్షేత్రస్థాయి పరీక్షలను పూర్తిచేసుకున్న రోబో తేనెటీగ యంత్రాలు (రోబో-బీలు/రోబీలు) మెక్సికో, పెరూ తదితర దేశాల్లోని బ్లూబెర్రీ, అవకాడో(వెన్నపండు) పండ్ల తోటల్లో హల్‌చల్ చేస్తున్నాయి. పంటల అవసరాలను బట్టి ప్రత్యేక రోబీలను రూపొందిస్తుండటం విశేషం.

రసాయనిక సాంద్ర వ్యవసాయ ప్రభావం, వాతావరణ మార్పుల వల్ల ప్రకృతిలో తేనెటీగల సంఖ్య తగ్గిపోతోంది. ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార-వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఓ.) గణాంకాల ప్రకారం.. సాగు భూమి విస్తీర్ణం 1961 తర్వాత 600% పెరిగితే, ఇదే కాలంలో పెట్టెల్లో తేనెటీగల పెంపకం 83% మాత్రమే పెరిగింది. కాలిఫోర్నియా(అమెరికా)లో విస్తారంగా సాగవుతున్న బాదం తోటల్లో పరపరాగ సంపర్కం సజావుగా జరిపించేందుకు విదేశాల నుంచి ఏకంగా ఏడాదికి 4,800 కోట్ల తేనెటీగలను దిగుమతి చేసుకుంటున్నారు. అక్కడ పని పూర్తయ్యాక ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అయితే, ప్రయాణంనే కోట్లాది తేనెటీగలు ప్రాణాలు కోల్పోతున్నాయి. దేశ సరిహద్దులు దాటి తేనెటీగల దిగుమతిలో పర్యావరణ సమస్యలున్నాయి. ఈ సమస్యలను అధిగమిస్తూ.. తేనెటీగల కొరతను రోబో తేనెటీగలతో 'బ్లూమ్‌ఎక్స్' తీర్చే ప్రయత్నం చేస్తోంది.

బ్లూబెర్రీ తోటల్లో 'రోబీ' రొద

ఇజ్రాయెల్‌లోని ఓ చిన్న వ్యవసాయ గ్రామం రిష్పన్‌లో బ్లూమ్‌ఎక్స్ 2019లో ఏర్పాటైంది. సీఈఓ థాయ్ సదెది అదే ఊరు. ఇప్పటికైతే బ్లూబెర్రీ, అవకాడో పంటల కోసం వేర్వేరుగా ప్రత్యేక 'రోబో-బీ' యంత్రాలను రూపొందించింది. ఈ రెండూ దిగుబడి పెంచితే రైతుల ఆదాయం భారీగా పెరిగే అవకాశం ఉన్న ఖరీదైన పంటలు. అందుకే వీటిని ఎంపికచేసుకున్నామన్నారు బ్లూమ్‌ఎక్స్ ప్రతినిధి ఎమిలీ స్పీసర్.

బ్లూబెర్రీ చెట్ల పూలల్లోనే ఆడ, మగ భాగాలుంటాయి. అయితే, పుప్పొడి ఆడ భాగాలకు చేరాలంటే తేనెటీగలు మగ భాగాలను స్పృశించి మంద్రంగా కదపాల్సి ఉంటుంది. ఈ పని అనేక దఫాలు జరిగితేనే చక్కటి దిగుబడి వస్తుంది. సరిగ్గా జరగకపోతే పండ్ల సంఖ్యతోపాటు సైజు కూడా తగ్గిపోతుంది. కాబట్టి, బ్లూబెర్రీ చెట్ల వరుసల మధ్య నుంచి రోబోను మనిషి నడుపుతూ తీసుకెళ్తుంటే.. రోబో తన చేతులు చాచి పూలను తగుమాత్రంగా చురుగ్గా కదుపుతూ పరపరాగ సంపర్కానికి దోహదం చేస్తుంది. దీన్ని 'రోబీ' అంటున్నారు.

అవకాడో తోటలో 'క్రాస్‌బీ'

అవకాడో ఎత్తు పెరిగే చెట్లు. ఈ చెట్లకు ఆడ, మగ పూలు పూస్తాయి. అయితే, మగ పూలు విచ్చుకున్న కొద్ది గంటల తర్వాత గానీ ఆడ పూలు విచ్చుకోవు. మగ పూలను తాకిన తేనెటీగలకు పుప్పొడి రేణువులు అంటుకుంటాయి. కొన్ని గంటల తర్వాత ఆడ పూలను తేనెటీగలు తాకినప్పుడు ఆ పుప్పొడి ఈ పూలకు అంటడం వల్ల పరపరాగ సంపర్కం సజావుగా సాగుతుంది. ఈ అవసరాలకు అనుగుణంగా పరపరాగ సంపర్కం జరిపేందుకు 'క్రాస్‌బీ' పేరుతో బ్యాడ్మింటన్ బ్యాట్ మాదిరి చేతి రోబో పరికరాన్ని బ్లూమ్‌ఎక్స్ రూపొందించింది. దీనితో పువ్వులపై సున్నితంగా రుద్దితే పుప్పొడి దానికి అంటుతుంది. ఆ పుప్పొడిని సేకరించి భద్రపరుస్తారు. కొన్ని గంటల తర్వాత ఆడ పూలు విచ్చుకున్నప్పుడు రోబో చేతితో ఈ పుప్పొడిని ఆ పూలకు సున్నితంగా రుద్దుతారు. ఈ విధంగా విజయవంతంగా పరపరాగ సంపర్కం జరుగుతున్నట్లు రుజువైందని సంస్థ తెలిపింది. వేర్వేరు రకాల అవకాడో చెట్లను పక్కపక్కనే నాటితే.. అప్పటికప్పుడే పరపరాగ సంపర్కం జరిగిపోతుంది. పుప్పొడిని భద్రపరచి, తర్వాత వినియోగించాల్సిన అవసరం ఉండదని సంస్థ వివరించింది.



● 'క్రాస్‌బీ' రోబోతో అవకాడో తోటలో పాలినేషన్ చేస్తున్న మహిళా రైతు

కృత్రిమ మేధ సాయం

ఏయే తోటల్లో పాలినేషన్ సేవలు ఎప్పుడు అవసరమో తెలుసుకోవటం కోసం డేటాబేస్‌లను కృత్రిమ మేధతో మేళవించే మొబైల్ అప్లికేషన్‌ను రైతులకు కంపెనీ అందిస్తోంది. అవకాడోలు, బ్లూబెర్రీలు ఎక్కువగా సాగయ్యే మెక్సికో, పెరూ, కొలంబియా, అమెరికా, దక్షిణాఫ్రికా, ఇజ్రాయెల్ తదితర దేశాల్లో రైతులు ఈ 'రోబీ'లను వాడుతున్నారు. దిగుబడి బ్లూబెర్రీలో 30%, అవకాడోలో 40% పెరిగిందట.

సాగుబడి

పునర్వసు కార్తె : జూలై 19 వరకు
పుష్యమి కార్తె : జూలై 20 నుంచి



● కొబ్బరి తోటలో మేకల ఫామ్

ఇటు మాంసం.. అటు పాలు!

● వేగంగా పెరిగి అధిక మాంసం ఉత్పత్తికి దోహదపడుతున్న సరికొత్త మేకల జాతి
● దక్షిణాఫ్రికా బోయర్ రకం పొట్టేళ్లతో అనేక దేశీ మేకల జాతులతో క్రాస్ బ్రీడింగ్
● 8 నెలల్లోనే 40 కిలోల బరువు.. రోజుకు రెండు లీటర్ల పాల దిగుబడి
● అమలాపురం ఎన్నారై రైతు ప్రయోగం సక్సెస్

ఓ ప్రవాస భారతీయుడు చొరవతో మేలైన సంకర జాతి మేకల జాతిని ఉత్పత్తి చేశారు. ఇది మాంసోత్పత్తికి, పాల దిగుబడికి రెండు విధాలుగా ఉపయోగపడే మేకల జాతి కావడం విశేషం. వేగంగా పెరగడంతో పాటు రుచికరమైన మాంసాన్ని అందిస్తుంది. ఈ జాతి మేకలు రోజుకు రెండు లీటర్ల వరకు పాలు కూడా ఇస్తుండటంతో రైతుల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది.

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం భట్లపాలెం చెందిన కె.నాగేశ్వరరావు 21 ఏళ్లుగా సింగపూర్‌లో ఓ నిర్మాణ సంస్థలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. కరోనా సమయంలో స్వస్థలానికి వచ్చిన ఆయన ఇక్కడే వ్యవసాయాన్ని వాణిజ్య స్థాయిలో చేపట్టాలని నిర్ణయించుకున్నారు. కొంత కాలం ఆక్వా సాగు చేసిన తర్వాత మేకల పెంపకంపై దృష్టిసారించారు. మేలైన విదేశీ మేకలను తీసుకువచ్చి స్థానిక మేకలతో క్రాసింగ్ చేయించారు. అమలాపురం సమీపంలోని కామనగరువులోని వ్యవసాయ క్షేత్రంలో వీటిని పెంచుతూ చక్కని ఫలితాలు సాధిస్తున్నారు.

దక్షిణాఫ్రికా బోయర్ రకం

ఇటు మాంసం ఉత్పత్తికి, అటు పాల దిగుబడికి ఉపయోగపడే దక్షిణాఫ్రికాకు చెందిన బోయర్ రకం మేకల మాంసం రుచిగా ఉంటుంది. వేగంగా పెరుగుతుంది. ఒక్కోటి రూ.3 లక్షల వ్యయంతో దక్షిణ ఆఫ్రికా బోయర్ రకం విత్తన పొట్టేళ్లను దిగుమతి చేసుకున్నారు. ఈ పొట్టేలు బరువు ఏకంగా 140 కేజీల వరకు ఉంటుంది. ఆ జాతి విత్తన పొట్టేళ్లను దిగుమతి చేసుకొని స్థానిక జాతులతో సంకరం చేయటం వల్ల ఉత్తమ ఫలితాలు ఉంటాయని భావించారు. ఆ విధంగానే పొట్టేళ్లను దిగుమతి చేసుకొని.. రాజస్థాన్‌కు చెందిన అజ్మీర్, సిరోహి, కేరళకు చెందిన తలచేరి, పంజాబ్‌కు చెందిన బిటిల్ రకాల మేకలతో సంకరం చేయించారు. దీంతో ప్రయోగం విజయవంతమైంది.



● సంకర జాతి మేకలు



● దక్షిణాఫ్రికా బోయర్ జాతి పొట్టేలు

8 నెలల్లోనే 40 కిలోలు..

తమ వ్యవసాయ క్షేత్రంలో ఈ క్రాస్ బ్రీడ్ (సంకర జాతి) మేకల సంతతి స్థానిక రకాల కన్నా వేగంగా బరువు పెరుగుతున్నట్లు నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక దేశవాళి మేక రెండేళ్లలో గరిష్ఠంగా 40 కేజీలు బరువు పెరుగుతుంది. ఈ సంకరజాతి మేక 8 నెలల్లోనే ఈ బరువుకు పెరుగుతోంది. రెండేళ్లలో 70 కేజీలవుతోంది. ఆడ మేక రోజుకు రెండు లీటర్ల వరకు పాలు ఇస్తోందని ఆయన వివరించారు.

ఇంటిగ్రేటెడ్ పద్ధతిలో సంకర జాతి మేకలు పెంచుతున్నారు. ఇది ఖర్చుతో కూడుకున్న వ్యవహారమే అయినా మేకలు 2–3 రెట్ల బరువు పెరుగుతాయి. నాణ్యమైన, రుచికరమైన మాంసం ద్వారానే కాకుండా, పాల ద్వారా రోజువారీ ఆదాయాన్ని పొందే అవకాశముంది. బోయర్ జాతి లక్షణాలు 100 శాతం స్థానిక బ్రీడ్‌లో తెప్పించే దిశగా ప్రయత్నిస్తున్నారు. క్రాస్ బ్రీడింగ్ ద్వారా వచ్చే సంతతిని రైతులకు ఒక పొట్టేలుకు 20 మేకలను యూనిట్‌గా విక్రయిస్తున్నారు. మాంసం రిటెయిల్ విక్రయించడానికి అవుట్‌లెట్ ఏర్పాటు చేయబోతున్నామని నాగేశ్వరరావు వివరించారు. వీటికి క్రమం తప్పకుండా వ్యాక్సినేషన్ చేస్తే జబ్బుల బారినపడే అవకాశం చాలా తక్కువని నాగేశ్వరరావు అన్నారు.

– నిమ్మకాయల సతీష్ బాబు,
సాక్షి, అమలాపురం

నాణ్యమైన బ్రీడ్ అభివృద్ధే లక్ష్యం



మన ప్రాంతంలో దేశవాళీ మేక మాంసం కన్నా నాణ్యమైన, రుచికరమైన మాంసం అందించే సంకర జాతి బ్రీడ్‌ను అందుబాటులోకి తేవాలన్నదే నా కోరిక. విదేశీ బ్రీడ్ మేక పిల్లలను దిగుమతి చేసుకొని ఇక్కడ పెంచితే స్థానిక వాతావరణానికి ఎంతగా తట్టుకుంటాయో చెప్పలేం. అందుకే దక్షిణాఫ్రికా బోయర్ రకంతో స్థానిక రకాలను సంకరం చేసి కొత్త బ్రీడ్‌ను రూపొందిస్తున్నాం. తద్వారా మేలు రకం మాంసం ఉత్పత్తి చేయగలుగుతున్నాం. ఈ సంకర జాతి మేకలు పూర్తిస్థాయిలో బోయర్ గుణగణాలను సంతరించుకునేందుకు మూడు, నాలుగేళ్ల సమయం పడుతుంది. ఈ సంకరజాతి మేకలు స్థానిక వాతావరణాన్ని తట్టుకుంటాయి.

- కె. నాగేశ్వరరావు (99235 44777), కామనగరువు, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా

శాస్త్రీయ పద్ధతిలో మేలు జాతి ఉత్పత్తి



స్థానిక దేశవాళీ మేకల పెంపకం కన్నా మేలైన రకాల నుంచి ఉత్పత్తి అయ్యే సంకర జాతి మేకలు త్వరగా ఎదుగుతాయి. నాణ్యమైన మాంసం ఉత్పత్తి అవుతుంది. రైతు నాగేశ్వరరావు శాస్త్రీయ పద్ధతిలో మేలు జాతి మేకలను ఉత్పత్తి చేస్తున్నారు. ఈ జాతి ద్వారా మేకల పెంపకందారులు అధిక మాంసం, పాల దిగుబడి సాధించే అవకాశముంది.

- విజయ రెడ్డి, సహాయ సంచాలకులు, పశు సంవర్ధక శాఖ, అమలాపురం, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా

ఐదంచెల ఉద్యాన తోటల సాగుపై శిక్షణా శిబిరం

నిర్వహణ: పంతంగి రాంబాబు
సాగుబడి డెస్క్

ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ఐదంచెల ఉద్యాన తోటల సాగుపై కర్నూలు జిల్లా జూపూడి బంగ్లా మండలం పారుమంచాలలో ఈ నెల 21,22 తేదీల్లో శ్రమదానంతో కూడిన అవగాహన శిబిరాన్ని సేవ్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించనుంది. సేవ్ వ్యవస్థాపకులు, ప్రకృతి వ్యవసాయ ప్రచారకులు విజయ్ రామ్ అవగాహన కల్పిస్తారు. 21న 50 మందికి, 22న మరో 50 మందికి నేర్పిస్తారు. కనీసం 3 గంటల సేపు శ్రమదానం చేయగల సామర్థ్యం వున్న వారు మాత్రమే పేరు నమోదు చేసుకోవాలని విజయరామ్ కోరారు. ప్రవేశం ఉచితం. కర్నూలుకు సమీప జిల్లాల వారికి ప్రాధాన్యం. వివరాలకు.. 63091 11427, 04027654337.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16 సంచిక: 117
మంగళవారం 18-7-2023


'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'



మరోసారి చంద్రయాన్-3 కక్ష్య దూరం పెంపు

ఇస్రో ఈనెల 13న ప్రయోగించిన చంద్రయాన్-3 మిషన్‌కు సోమవారం వేకువజామున రెండోసారి కక్ష్య దూరాన్ని పెంచే ప్రక్రియను విజయవంతంగా చేపట్టారు. 6 లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



రూ.2,381 కోట్ల డ్రగ్స్ ధ్వంసం

రూ.2.381 కోట్ల విలువైన 1.40 లక్షల కిలోల డ్రగ్స్‌ను అధికారులు ధ్వంసం చేయగా.. హోం మంత్రి అమిత్‌షా వర్చువల్‌గా వీక్షించారు.

వివరాలు 6లో ▸



శరద్‌తో మరోసారి అజిత్ భేటీ

అందరం ఒక్కటిగా ఉందామని తిరుగుబాటు నేత అజిత్ ప్రతిపాదించగా.. ఎన్సీపీ అధినేత శరద్ పవార్ స్పందించలేదని తెలిసింది.

వివరాలు 6లో ▸



తమిళ మంత్రి ఇంటిపై ఈడీ దాడి

తమిళనాడు మంత్రి పొన్ముడి, ఆయన తనయుడు, ఎంపీ గౌతం శిఖామణి నివాసాల్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు.

వివరాలు 6లో ▸



అమెరికాలో భీకర వర్షాలు

అమెరికాలోని పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో 2,600కు పైగా విమానాల రాకపోకలు రద్దయ్యాయి.

వివరాలు 6లో ▸

26 విపక్షాలు బెంగళూరులో.. 38 ఎన్డీయే మిత్రపక్షాలు హస్తినలో

యాంటీ భేటీ.. ఫ్రెండ్స్ పోటీ

- 'కలుద్దాం, నిలుద్దాం' నినాదంతో విపక్షాలు ముందుకు
- బెంగళూరులో మొదలైన మేధోమథనం
- బీజేపీకి ముకుతాడే లక్ష్యంగా కీలక ఐక్యతా భేటీ.. నేడూ కొనసాగనున్న విపక్ష కూటమి చర్చలు
- సోనియా సారథ్యంలో కొత్త కూటమి ఆవిర్భావం!
- మరోపక్క విపక్షాల భేటీకి దీటుగా ఎన్డీయే సమావేశం.. నేటి భేటీకి 38 పార్టీలు హాజరయ్యే అవకాశం

6 లో


బెంగళూరులో జరిగిన విపక్షాల భేటీలో పాల్గొన్న కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ. చిత్రంలో తమిళనాడు, పశ్చిమబెంగాల్, బిహార్, ఢిల్లీ ముఖ్యమంత్రులు ఎంకే స్టాలిన్, మమతా బెనర్జీ, నితీశ్‌కుమార్, అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు లాలూప్రసాద్‌యాదవ్

జాతీయ రాజకీయాల తీరుతెన్నులను నిర్ణాయక మలుపు తిప్పగల కీలక పరిణామానికి మంగళవారం సాక్షిగా నిలవనుంది. అటు బెంగళూరులో కాంగ్రెస్ చొరవతో సోమవారం మొదలైన 26 విపక్షాల కీలక సమావేశం మంగళవారం పూర్తిస్థాయిలో జరగనుంది. ఇటు అందుకు దీటుగా బీజేపీ సారథ్యంలో అధికార ఎన్డీయే కూటమి ఏకంగా 38 పార్టీలతో హస్తినలో పోటీ భేటీ తలపెట్టింది. సోనియా, రాహుల్, ఖర్గే తదితర కాంగ్రెస్ అగ్ర నేతలతో పాటు నితీశ్ సహా పలు విపక్ష పాలిత రాష్ట్రాల సీఎంలు... ఇలా మొత్తం 26 విపక్ష పార్టీల అధినేతలు సోమవారమే బెంగళూరు చేరారు. మంగళవారం చర్చించాల్సిన అంశాలపై సాయంత్రం నుంచి రాత్రి విందు భోజనం దాకా సుదీర్ఘ మంతనాల్లో మునిగి తేలారు. మరోవైపు బీజేపీ కూడా ఎల్జేపీ (పాశ్వాన్)ని సోమవారం ఎన్డీయే కూటమిలో చేర్చుకోవడం ద్వారా విపక్షాల సవాలుకు దీటుగా స్పందించింది. మంగళవారం జరిగే ఎన్డీయే పూర్తిస్థాయి భేటీలో ఎల్జేపీ, హిందూస్తానీ అవామ్ మోర్చా వంటి కొత్త మిత్రులతో కలిపి ఏకంగా 38 పార్టీలు పాల్గొంటాయని కూడా బీజేపీ వర్గాలు వెల్లడించాయి! హస్తిన, బెంగళూరు వేదికలుగా జరగనున్న అధికార, విపక్ష కూటముల పోటాపోటీ భేటీల మీదే ఇప్పుడిక అందరి కళ్లూ నిలిచాయి.

ఫ్యాక్ట్ చెక్



పిల్లల చదువులపై రామోజీ క్షుద్ర 'విద్య'!

- ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులపై 'ఈనాడు' కాకి లెక్కలు
- పెరిగిన జీఈఆర్, టాప్ ర్యాంకులు, డిస్టింక్షన్లు కళ్లకు కనపడవా?
- జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సత్తా చాటిన 67 మంది ఎస్సీ, ఎస్టీ గురుకులాల విద్యార్థులు
- పాఠశాలల్లో ఇంకా కొనసాగుతున్న ప్రవేశాలు.. ఆగస్టు చివరిదాకా సమయం
- ప్రతిబంధకాలు లేకుండా 'అమ్మఒడి'ని అందిస్తున్న ప్రభుత్వం

11 లో

సమన్వయంతో ఆదాయార్జన



- కలెక్టర్ల భాగస్వామ్యాన్ని పెంచండి
- ఆర్జన శాఖలు క్రమం తప్పకుండా సమీక్షించాలి
- ఆర్థికశాఖ అధికారులు కలెక్టర్లతో నిరంతరం చర్చించాలి
- ఆదాయాన్నిచ్చే శాఖలు మరింత బలోపేతం కావాలి
- రవాణా రంగంలో అత్యుత్తమ విధానాలను తేవాలి
- వాహన కొనుగోలుదారులను ప్రోత్సహించేలా పన్నులుండాలి
- నాటుసారా తయారీ కుటుంబాలపై దృష్టి పెట్టండి
- ప్రత్యామ్నాయ జీవనోపాధి మార్గాలను అమలు చేయాలి
- ఆదాయార్జన శాఖలపై సమీక్షలో సీఎం జగన్ దిశా నిర్దేశం

2 లో

ఎగుమతుల్లో 'ఎగిసిన' ఏపీ



- 2022 సంవత్సరానికి ఎగుమతుల సన్నద్ధత సూచీ ర్యాంకులు ప్రకటించిన నీతి ఆయోగ్
- ఆ ర్యాంకుల్లో 8వ స్థానం సాధించిన ఆంధ్రప్రదేశ్
- మొదటి మూడు స్థానాల్లో తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక
- 2020 ర్యాంకుల్లో 20వ స్థానంలో నిలిచిన రాష్ట్రం
- రెండేళ్లలో 12 స్థానాలు మెరుగుపర్చుకున్న ఆంధ్రప్రదేశ్
- రాష్ట్ర ప్రభుత్వానికి నీతి ఆయోగ్ ప్రశంసలు
- నిర్దిష్టమైన పాలసీలతోనే ఏపీ ప్రగతి సాధ్యమైంది
- అంతర్జాతీయంగా పోటీ పడటానికి వైఎస్ జగన్ ప్రభుత్వ చర్యలు దోహదం.. రాష్ట్రంపై దృష్టి పెట్టిన పెట్టుబడిదారులు

2 లో

విద్య.. శక్తివంతమైన ఆయుధం



అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో జరిగిన 21వ స్నాతకోత్సవంలో గవర్నర్, చాన్సలర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పాల్గొన్నారు. విద్య అత్యంత శక్తివంతమైన ఆయుధమని.. ఉజ్వల భవిష్యత్‌ను సృష్టించేందుకు, ప్రపంచాన్ని మార్చడానికి దోహదం చేస్తుందన్నారు. 14 లో

నేడు చిరు వ్యాపారులకు జగనన్న తోడు



'జగనన్న తోడు' ఏడో విడత కార్యక్రమం మంగళవారం జరగనుంది. 5,10,412 మందికి ప్రభుత్వం వడ్డీ లేకుండా రూ. 549.70 కోట్ల రుణాలు అందజేయనుంది. గతంలో రుణాలు పొంది, సకాలంలో చెల్లించిన వారి బ్యాంకు ఖాతాల్లో రూ.11.03 కోట్ల వడ్డీని జమ చేయనుంది. 2 లో

గిట్టుబాటు ధరకు శాస్త్రీయ పరిష్కారం



'వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు ఏపీ ప్రభుత్వం బీజం వేసింది. ఇంటిగ్రేటెడ్ కాల్‌సెంటర్, ఆర్బీకే చానల్, అగ్రి ల్యాబ్స్ నిజంగా గొప్ప ఆవిష్కరణలు. ఆర్బీకేలతో రైతుల వెతలు తీరాయి. దేశంలో మరే రాష్ట్రంలోనూ ఇలాంటి వ్యవస్థ లేదు' అని సీఏసీపీ చైర్మన్ విజయపాల్ శర్మ ప్రశంసించారు. 11 లో

క్లుప్తంగా...

కొత్త జిల్లాల్లో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్స్‌లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని కొత్త జిల్లాల్లో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్స్‌లను ప్రభుత్వం నిర్మించబోతోంది. తొలి దశలో రూ.600 కోట్లతో నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. ఆర్ అండ్ బీ శాఖకు చెందిన స్టేట్ ఆర్కిటెక్ట్ బోర్డు రూపొందించిన ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోదించింది. ప్రభుత్వ కార్యాలయాలన్నీ జిల్లా కేంద్రంలో ఒకే చోట ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు సౌలభ్యంగా ఉంటుంది. దీన్ని గుర్తించిన ప్రభుత్వం వీటి నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. తొలి దశలో పార్వతీపురం, అమలాపురం, భీమవరం, నరసరావుపేట, నంద్యాల, పుట్టపర్తిలో వీటిని నిర్మిస్తారు. ఒక్కో కాంప్లెక్స్‌ను 2.25 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తారు. త్వరలో టెండర్ల ప్రక్రియ చేపట్టి వచ్చే జనవరికల్లా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రెండో దశలో అనకాపల్లి, పాడేరు, రాజమహేంద్రవరం, విజయవాడ, బాపట్ల, తిరుపతి, రాయచోటిలో నిర్మిస్తారు.

రక్షణ రంగ హబ్‌గా విశాఖ

సాక్షి, అమరావతి: రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేసే నూతన ఆవిష్కరణలకు విశాఖ కేంద్రంగా మారుతోంది. ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ(ఏపీఐఎస్) చొరవతో రక్షణ, నేవీ రంగాలకు సంబంధించిన పలు స్టార్టప్స్ విశాఖ కేంద్రంగా ముమ్మరంగా పరిశోధనలు చేస్తున్నాయి. ఆత్మ నిర్భర్ భారత్‌లో భాగంగా రక్షణ ఉత్పత్తుల దిగుమతులను తగ్గించి.. దేశీయ పరిజ్ఞానాన్ని పెంచుకోవడంపై కేంద్ర రక్షణ శాఖ దృష్టి పెట్టిన సంగతి తెలిసిందే. ఈ అవకాశాన్ని ఏపీఐఎస్ సద్వినియోగం చేసుకుంటోంది. రక్షణ శాఖకు చెందిన ఇన్నోవేషన్ ఫర్ డిఫెన్స్ ఎక్సలెన్స్(ఐడీఈఎక్స్)తో కలిసి ఏపీఐఎస్ ముందుకెళ్తోంది. డీఆర్‌డీవోకు చెందిన నావల్ సైన్స్ అండ్ టెక్నలాజికల్ ల్యాబొరేటరీతో కలిసి పలు స్టార్టప్స్‌ను, ఐడీఈఎక్స్‌తో కలిసి ప్రోగ్రాం ఇన్నోవేటర్స్‌ను ప్రోత్సహిస్తోంది. రక్షణ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచేందుకు విజయవాడ కేంద్రంగా ఒకటి, విశాఖ కేంద్రంగా ఆరు స్టార్టప్స్ పనిచేస్తున్నాయి. రక్షణ రంగంలో సెమీ కండక్టర్ అప్లికేషన్స్ వినియోగాన్ని పెంచేలా ఎకో సిస్టమ్స్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఇందుకోసం ఏటా క్రమం తప్పకుండా దేశీ కాన్‌క్లేవ్ పేరుతో రక్షణ, ఎలక్ట్రానిక్స్ రంగ నిపుణులతో ఏపీఐఎస్ సమావేశాలు నిర్వహిస్తోంది. రక్షణ రంగ స్టార్టప్స్‌ను ప్రపంచానికి పరిచయం చేయడానికి ఈ సమావేశాలు ఉపయోగపడుతున్నాయని ఏపీఐఎస్ సీఈవో అనిల్ చెప్పారు.

పులస చిక్కిందోచ్...



యానాం: గోదారమ్మ వద్దకు పులస చేప వచ్చేసింది. కేంద్రపాలిత ప్రాంతమైన యానాం వద్ద గోదావరిలో సోమవారం ఈ సీజన్‌లో మొట్టమొదటి పులస చేప మత్స్యకారుల వలకు చిక్కింది. సుమారు 1.5 కిలోల బరువున్న ఈ చేపకు వేలం నిర్వహించగా, యానాం మార్కెట్‌లో చేపలు విక్రయించే తల్లీకూతుళ్లు పార్వతి, సత్యవతి రూ.13 వేలకు దక్కించుకున్నారు. ఈ చేపను తిరిగి భీమవరానికి చెందిన వ్యక్తికి రూ.15 వేలకు విక్రయించారు.

నేడు 'జగనన్న తోడు'

చిన్న వ్యాపారాలు చేసుకునే వారికి రూ. 549.70 కోట్ల వడ్డీ లేని రుణాలు

- గతంలో తీసుకున్న రుణాన్ని చెల్లించిన వారికి రూ. 11.03 కోట్ల వడ్డీ డబ్బు వారి ఖాతాల్లో జమ
- నేడు ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్న సీఎం జగన్
- జగనన్న తోడు పథకంతో చిరువ్యాపారులకు చేయూత
- తొలుత రూ.10 వేలు వడ్డీ లేని రుణం
- రుణం సకాలంలో చెల్లించినవారికి మరింత రుణం
- లబ్ధిదారుల వడ్డీని వారి ఖాతాల్లో జమ చేస్తున్న ప్రభుత్వం
- ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 15.87 లక్షల మందికి లబ్ధి
- ఇప్పటివరకు రూ.74.69 కోట్లు వడ్డీని భరించిన ప్రభుత్వం



ఇప్పటివరకు మొత్తం రూ. 2,955.79 కోట్ల రుణ సాయం

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా చిరువ్యాపారులకు చేయూతనందించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన 'జగనన్న తోడు' ఏడో విడత కార్యక్రమం మంగళవారం జరగనుంది. ఈ కార్యక్రమంలో 5,10,412 మందికి ప్రభుత్వం మరో విడత వడ్డీ లేని రూ. 549.70 కోట్ల రుణాలను అందజేయడంతో పాటు గతంలో ఈ పథకం ద్వారా రుణాలు పొంది, సకాలంలో చెల్లించిన వారికి రూ. 11.03 కోట్ల వడ్డీ మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేయనుంది. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి లాంఛనంగా ప్రారంభిస్తారు.

రాష్ట్రంలో తోపుడు బండ్లు, రోడ్ల వెంబడి చిన్న దుకాణాల్లో పండ్లు, కూరగాయలు వంటివి అమ్ముకోవడం, టీ, టిఫిన్ సహా పలు రకాల వ్యాపారాలు చేసే చిరు వ్యాపారులు రోజువారీ పెట్టుబడికి అవసరమయ్యే **రూ. 5000** కూడా స్థానిక వడ్డీ వ్యాపారుల నుంచి తీసుకొనేవారు. ఇందుకోసం రోజుకు ప్రతి వంద రూపాయలకు రూ. 3 నుంచి రూ. 10 వరకు వడ్డీ చెల్లించేవారు. వారి సంపాదనలో అత్యధిక భాగం వడ్డీలకే సరిపోయేది. అధిక వడ్డీలతో కుదేలైపోతున్న చిరువ్యాపారుల దుస్థితిని చూసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్.. వారికి చేయూతనందించడానికి 2020 నవంబరు 25వ తేదీన 'జగనన్న తోడు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమం కింద చిరు వ్యాపారులకు ఎలాంటి పూచీకత్తు లేకుండా తొలిసారి రూ. 10,000 రుణం అందజేయడంతో పాటు తీసుకున్న రుణాన్ని ప్రతి నెలా కిస్తీ రూపంలో సకాలంలో చెల్లించే వారికి ఆ రుణంపై అయ్యే వడ్డీ మొత్తం ప్రభుత్వమే తిరిగి చెల్లిస్తుంది. వారికి మరింత రుణ సాయాన్ని కూడా అందిస్తుంది. కొత్త వారికి కూడా ఈ పథకాన్ని వర్తింపజేస్తోంది. ఈ పథకం ద్వారా లబ్ధి పొందే వారిలో దాదాపు 85% మహిళలే కావడం గమనార్హం.

- ఈ పథకం ద్వారా ఇప్పటికే **ఆరు విడతలు**గా చిరు వ్యాపారులకు ప్రభుత్వం రుణాలు అందజేసింది. ఇప్పుడు ఏడో విడతలో రుణ పంపిణీ చేయనుంది.
- ఒక విడత రుణం తీసుకొని తిరిగి చెల్లించిన వారికి వారి వడ్డీ మొత్తాన్ని ఎప్పటికప్పుడు ఆయా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోనే ప్రభుత్వం నేరుగా జమ చేస్తోంది. వారికి తిరిగి ఇచ్చే రుణాన్ని పెంచి మళ్లీ కొత్త రుణాలు ఇప్పిస్తోంది. మొదటి విడతలో రూ.10 వేలు రుణం తీసుకొని నిర్ణీత కాలంలో చెల్లించిన వారికి రెండో విడత ఓ వెయ్యి పెంచి రూ. 11 వేలు, రెండో విడత రుణం కూడా చెల్లించిన వారికి మూడో విడతలో రూ. 12 వేలు.. ఇలా ప్రతి ఏటా పెంచుతూ రుణాలు అందజేస్తోంది.
- ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 15,87,492 మంది ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి పొందారు. వీరిలో 13,29,011 మంది పాత రుణం చెల్లించి రెండు మూడు సార్లు కొత్త రుణాలు పొందారు.
- గత ఆరు విడతల్లో చిరు వ్యాపారులకు 29,16,504 రుణ ఖాతాల ద్వారా రూ. 2406.09 కోట్ల రుణాలను అందజేయగా.. ఏడో విడతలో అందజేసే రుణ సహాయంతో కలిపి మొత్తం రూ. 2,955.79 కోట్లు రుణ సహాయం పొందినట్టు అవుతుంది.
- ఇప్పుడు ఏడో విడతలో 5,10,412 మందికి ప్రభుత్వం రుణాలు అందజేస్తుండగా.. అందులో 4,54,267 మంది గతంలో ఒకటికంటే ఎక్కువ సార్లు రుణం పొంది తిరిగి చెల్లించిన వారు. ఈసారి కొత్తగా మరో 56,145 మందికి తొలిసారి ఈ పథకం ద్వారా ప్రభుత్వం రుణం అందజేస్తోంది.

ఇప్పటివరకు రూ. 74.69 కోట్లు వడ్డీ డబ్బు జమ

జగనన్న తోడు కార్యక్రమంలో రుణాలు తీసుకొని చెల్లించిన వారికి ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు వారి వడ్డీ మొత్తాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తోంది.

- గత ఆరు నెలల్లో సకాలంలో పాత రుణాలు పూర్తిగా చెల్లించిన 5,03,729 మంది లబ్ధిదారులకు సీఎం వైఎస్ జగన్ బటన్ నొక్కి రూ.11,03,32,202 డీబీటీ విధానంలో వారి బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నారు.
- మంగళవారం అందజేసే వడ్డీతో కలిపి ఇప్పటి దాకా రూ. 74.69 కోట్ల మొత్తం వడ్డీ డబ్బులు 15.31 లక్షల మంది చిరు వ్యాపారుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసినట్టు అవుతుందని అధికారులు వివరించారు.

ప్రివిలేజెస్ కమిటీ చైర్మన్‌గా భూమన

ఎథిక్స్ కమిటీ చైర్మన్‌గా చక్రపాణిరెడ్డి





సాక్షి, అమరావతి: అసెంబ్లీ ప్రివిలేజెస్ కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి నియమితులయ్యారు. పలు అసెంబ్లీ కమిటీలు, జాయింట్ కమిటీలను ఏర్పాటు చేస్తూ అసెంబ్లీ కార్యదర్శి సోమవారం రెండు బులెటిన్లు విడుదల చేశారు. ప్రివిలేజెస్ కమిటీ చైర్మన్ గా ఉన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంత్రివర్గంలో చేరడంతో ఆయన స్థానంలో కరుణాకర్‌రెడ్డిని నియమించారు. సభ్యులుగా ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, కోన రఘుపతి, అబ్బయ్యచౌదరి, సుధాకర్‌బాబు, వెంకట చినఅప్పలనాయుడు, అనగాని సత్యప్రసాద్‌ను నియమించారు. రూల్స్ కమిటీ చైర్మన్‌గా స్పీకర్ తమ్మినేని సీతారాం, పిటిషన్స్ కమిటీ చైర్మన్‌గా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, హామీల కమిటీ చైర్మన్‌గా కైలే అనిల్‌కుమార్, ఎథిక్స్ కమిటీ చైర్మన్‌గా శిల్పా చక్రపాణిరెడ్డిని నియమించారు. అసెంబ్లీ, కౌన్సిల్‌కు పలు జాయింట్ కమిటీలను కూడా నియమించారు. ఎమినిటీస్, వన్యప్రాణి–పర్యావరణ పరిరక్షణ కమిటీల చైర్మన్‌గా తమ్మినేని, ఎస్సీల సంక్షేమ కమిటీ చైర్మన్‌గా గొల్ల బాబూరావు, ఎస్టీల సంక్షేమ కమిటీ చైర్మన్‌గా బాలరాజు, మైనారిటీల సంక్షేమ కమిటీ చైర్మన్‌గా ముస్తఫా, మహిళ, శిశు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్‌గా జొన్నలగడ్డ పద్మావతి, సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ చైర్మన్‌గా మల్లి రాజశేఖర్, బీసీల సంక్షేమ కమిటీ చైర్మన్‌గా రమేష్‌యాదవ్, లైబ్రరీ కమిటీ చైర్మన్‌గా పి.రామసుబ్బారెడ్డిని నియమించారు.

సమన్వయంతో ఆదాయార్జన

- కలెక్టర్ల భాగస్వామ్యాన్ని పెంచండి
- ఆర్జన శాఖలు క్రమం తప్పకుండా సమీక్షించాలి
- ఆర్థికశాఖ అధికారులు కలెక్టర్లతో నిరంతరం చర్చించాలి
- ఆదాయార్జన శాఖలపై సమీక్షలో ముఖ్యమంత్రి జగన్ దిశా నిర్దేశం



ఉన్నత స్థాయి సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ఆదాయాన్ని ఆర్జించే విభాగాలు కలెక్టర్ల భాగస్వామ్యాన్ని పెంచుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. క్రమం తప్పకుండా కలెక్టర్లతో సమీక్షలు నిర్వహించడం ద్వారా ఆదాయాన్ని పెంచుకునే విధానాలపై దృష్టి సారించాలన్నారు. ఆర్థికశాఖ అధికారులు కలెక్టర్లతో నిరంతరం సంప్రదింపులు జరపడం ద్వారా ఆదాయాన్నిచ్చే శాఖలు మరింత బలోపేతమై ఎక్కడా చిల్లు పడకుండా ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూరుతుందన్నారు. ఆదాయార్జన శాఖల మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి జగన్ సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. 2023 – 24 తొలి త్రైమాసికంలో వివిధ విభాగాల పనితీరు, విభాగాల వారీగా రెవెన్యూ వసూళ్లను సమీక్షించి పలు సూచనలు చేశారు.

వాహన కొనుగోలుదారులను ప్రోత్సహిస్తూ..

రవాణా రంగంలో సంస్కరణలపై దృష్టి సారించి ఇతర రాష్ట్రాల్లో విధానాలను పరిశీలించి అత్యుత్తమ పద్ధతులను అమలు చేయాలని సీఎం సూచించారు. వాహనాలపై పన్నుల విషయంలో కొత్త విధానాలను అన్వేషించాలని, అయితే అవి కొనుగోలు దారులను ప్రోత్సహించేలా ఉండాలని స్పష్టం చేశారు.

నాటు సారా కుటుంబాలకు ప్రత్యామ్నాయం

నాటుసారా తయారీలో నిమగ్నమైన కుటుంబాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి ప్రత్యామ్నాయ జీవనోపాధి మార్గాలను చూపాలని సీఎం ఆదేశించారు. ఆయా కుటుంబాలకు ఈ కార్యక్రమం కింద ఇప్పటికే రూ.16.17 కోట్లు పంపిణీ చేసినట్లు అధికారులు పేర్కొనగా ఈ కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని ముఖ్యమంత్రి సూచించారు. నాటుసారా తయారీదారుల్లో చైతన్యం కల్పించడంతోపాటు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను సమర్థంగా అమలు చేయాలని సూచించారు.

పారదర్శకతతో పెరిగిన గనుల ఆదాయం

భూగర్భ గనులు – ఖనిజాల శాఖ, ఏపీఎండీసీ ఆదాయానికి సంబంధించి గతంతో పోలిస్తే భారీ వ్యత్యాసం ఉందని ముఖ్యమంత్రి జగన్ తెలిపారు. ఈ విభాగాల పరిధిలో ఆదాయం గణనీయంగా పెరిగిందన్నారు. లీకేజీలను అరికట్టడంతోపాటు పారదర్శక విధానాలు, సంస్కరణలతో ఇది సాధ్యమైందని చెప్పారు.

మూడేళ్లలో 32 శాతం సీఏజీఆర్

గనులు–ఖనిజాల శాఖలో గత మూడేళ్లలో 32 శాతం సీఏజీఆర్ (కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేట్) నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. 2018–19లో కేవలం రూ.1,950 కోట్లు ఆదాయం సమకూరగా 2022–23 నాటికి రూ.4,756 కోట్లకు పెరిగినట్లు చెప్పారు. కార్యకలాపాలు నిలిచిపోయిన 2,724 మైనింగ్ లీజుల్లో 1,555 చోట్ల పునఃప్రారంభమైనట్లు తెలిపారు. మిగిలిన చోట్ల కూడా పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ఏపీఎండీసీ ఆర్థికంగా పరిపుష్టం

ఏపీఎండీసీ ఆర్థిక పరిస్థితి గణనీయంగా మెరుగుపడినట్లు అధికారులు తెలిపారు. 2020–21లో ఏపీఎండీసీ ఆదాయం రూ.502 కోట్లు కాగా 2022–23లో రూ.1,806 కోట్లకు పెరిగింది. 2023 – 24లో ఏపీఎండీసీ ఆదాయం రూ.4 వేల కోట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. మంగంపేట బైరటీస్, సులియారీ బొగ్గు గనుల నుంచి ఏపీఎండీసీకి భారీగా ఆదాయం సమకూరుతోంది. సులియారీలో ఈ ఏడాది 5 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

రిజిస్ట్రేషన్ల ఆదాయం పెరుగుదల


గతేడాదితో పోలిస్తే రిజిస్ట్రేషన్ల ఆదాయం కూడా పెరిగినట్లు అధికారులు వెల్లడించారు. గతేడాది ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి జూలై 15 వరకూ రూ.2,291.97 కోట్లు ఆదాయం రాగా ఈ ఏడాది అదే కాలానికి సంబంధించి రూ.2,793.7 కోట్లు ఆర్జించినట్లు చెప్పారు. భూముల రీ సర్వే పూర్తైన గ్రామాల్లో రిజిస్ట్రేషన్ సేవలు మొదలైనట్లు తెలిపారు. గ్రామ సచివాలయాల్లో దాదాపు 5 వేల రిజిస్ట్రేషన్ సేవలు జరిగాయని, వీటి ద్వారా రూ.8.03 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. సమీక్షలో హోంశాఖ మంత్రి తానేటి వనిత, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, అటవీ పర్యావరణశాఖ స్పెషల్ సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్, పురపాలక పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ వై.శ్రీలక్ష్మి, ఎక్సైజ్ శాఖ స్పెషల్ సీఎస్ రజత్ భార్గవ, ఆర్థికశాఖ స్పెషల్ సీఎస్ ఎస్ఎస్ రావత్, మైనింగ్ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది, హోంశాఖ ముఖ్య కార్యదర్శి హరీష్‌కుమార్ గుప్త, రోడ్డు రవాణా, భవనాలశాఖ కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న, రవాణాశాఖ కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా, ఆర్థికశాఖ కార్యదర్శి ఎస్.గుల్జార్, రాష్ట్ర పన్నుల చీఫ్ కమిషనర్ ఎం.గిరిజాశంకర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ వివేక్ యాదవ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ కోటేశ్వరరావు, రిజిస్ట్రేషన్లు–స్టాంపుల శాఖ కమిషనర్ రామకృష్ణ, ఏపీ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ ఎండీ డి.వాసుదేవరెడ్డి, మైన్స్ డైరెక్టర్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ రయ్.. మద్యం డీలా!

- ఈ ఆర్థిక సంవత్సరంలో జూన్ వరకు రూ.7,653.15 కోట్ల జీఎస్టీ పన్నుల వసూళ్లు. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే 23.74 శాతం పెరుగుదల నమోదు.
- గత సర్కారు హయాంతో పోలిస్తే గణనీయంగా తగ్గిన మద్యం విక్రయాలు. 2018-19లో లిక్కర్ అమ్మకాలు 384.36 లక్షల కేసులు కాగా 2022 - 23లో కేవలం 335.98 లక్షల కేసుల విక్రయాలు. ఇదే సమయానికి సంబంధించి గతంలో బీరు అమ్మకాలు 277.16 లక్షల కేసులు కాగా ఇప్పుడు 116.76 లక్షల కేసులు మాత్రమే విక్రయం.
- 2018-19 ఏప్రిల్, మే, జూన్‌తో పోలిస్తే 2023-24 తొలి త్రైమాసికంలో బీరు అమ్మకాలు మైనస్ 56.51 శాతం తక్కువగా, లిక్కర్ విక్రయాలు మైనస్ 5.28 శాతం తక్కువగా నమోదు కావడం గమనార్హం.

తడికలపూడి టు ఫ్రాన్స్

- రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో పైలట్ ప్రాజెక్ట్ విజయవంతం
- 23 టన్నుల కోకో గింజలు ఫ్రాన్స్‌కు ఎగుమతి
- తొలి దశలో 5 ఎఫ్‌పీవోలకు ఆర్థిక చేయూత
- డిసెంబర్ నాటికి 150 టన్నుల ఎగుమతి



సాక్షి, అమరావతి: కోకో పంటకు ప్రపంచస్థాయి బ్రాండింగ్ తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇప్పటివరకు స్థానికంగా మాత్రమే కోకో గింజలను విక్రయిస్తున్న రైతుల ద్వారా ఫైన్ ఫ్లేవర్డ్ కోకో గింజల్ని ఉత్పత్తి చేసి వాటిని నేరుగా విదేశాలకు ఎగుమతి చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. పైలట్ ప్రాజెక్ట్‌గా ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం తడికలపూడిలో ఉత్పత్తి చేసిన ప్రీమియం కోకో గింజలను ఫ్రాన్స్‌కు ఎగుమతి చేయడంతో ఇదే స్ఫూర్తితో మరిన్ని యూనిట్ల ఏర్పాటుకు చేయూతనివ్వాలని ప్రభుత్వం సంకల్పించింది. కోకో సాగు, ఉత్పాదకతలో దేశంలోనే మొదటి స్థానంలో ఉన్న ఏపీలో సాగు విస్తీర్ణం నాలుగేళ్లలో 21వేల హెక్టార్ల నుంచి 39,714 హెక్టార్లకు విస్తరించింది. తద్వారా 10,903 టన్నుల కోకో గింజలు ఉత్పత్తి వస్తుండగా దిగుబడిలో 80 శాతం క్యాడ్బరీ, మిగిలింది నెస్లే, క్యాంప్కో వంటి కంపెనీలు సేకరిస్తున్నాయి.

అదనపు ధర కల్పించడమే లక్ష్యంగా..

రైతులకు అదనపు ఆదాయం సమకూర్చడమే లక్ష్యంగా ఏలూరులో రూ.75 కోట్లతో కోకోవా, వెనీలా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుచేస్తున్న ప్రభుత్వం మరోవైపు గింజల్ని ఫర్మెంటేషన్ చేయడం ద్వారా నేరుగా విదేశాలకు ఎగుమతి చేసుకునేలా రైతులను తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టింది. శాస్త్రీయ పద్ధతిలో ఫర్మెంటేషన్ వల్ల ప్రీమియం చాక్లెట్స్ తయారీకి అవసరమైన ఫ్లేవర్ కోకో గింజలకు వస్తుంది. వీటికి మార్కెట్ ధర కంటే 30% అదనంగా చెల్లించేందుకు కంపెనీలు ముందుకొస్తున్నాయి. సేంద్రియ పద్ధతిలో సాగు, శాస్త్రీయ పద్ధతిలో ఫర్మెంటేషన్ చేస్తే మరో 15% అదనంగా చెల్లిస్తామంటున్నాయి. ప్రీమియం చాక్లెట్స్ తయారీలో ఉపయోగించే ఫైన్ ఫ్లేవర్ గింజల ఉత్పత్తే లక్ష్యంగా ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా ప్రభుత్వం 35% సబ్సిడీపై రూ.28 లక్షల వరకు ప్రభుత్వం ఆర్థిక చేయూత అందిస్తోంది.

గోదావరి కోకోకు గ్లోబల్ బ్రాండింగ్



గోదావరి కోకోకు గ్లోబల్ బ్రాండింగ్ కల్పించడమే లక్ష్యంగా ముందుకొచ్చే రైతులు, ఎఫ్‌పీఓలకు సబ్సిడీపై ఆర్థిక చేయూతనిస్తున్నాం. పైలట్ ప్రాజెక్ట్ సక్సెస్ కావడంతో మరింతమంది రైతుల ద్వారా ప్రీమియం కోకో గింజలను ఉత్పత్తి చేసి నేరుగా విదేశాలకు ఎగుమతి చేసేలా ఏర్పాట్లు చేస్తున్నాం.

– చిరంజీవి చౌదరి, ప్రిన్సిపల్ సెక్రటరీ, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్

ఎగుమతుల్లో 'ఎగిసిన' ఏపీ

- 2022 సంవత్సరానికి ర్యాంకులు ప్రకటించిన నీతి ఆయోగ్
- ఆ ర్యాంకుల్లో 8వ స్థానం సాధించిన ఆంధ్రప్రదేశ్
- రాష్ట్ర ప్రభుత్వానికి నీతి ఆయోగ్ ప్రశంసలు



సాక్షి, అమరావతి: నీతి ఆయోగ్ ఏటా ప్రకటించే ఎగుమతుల సన్నద్ధత సూచీ ర్యాంకుల్లో ఆంధ్రప్రదేశ్ మరోసారి తన స్థానాన్ని మెరుగుపర్చుకుంది. నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బెరీ సోమవారం విడుదల చేసిన 2022కు సంబంధించిన ర్యాంకుల్లో 59.27 పాయింట్లతో ఏపీ ఎనిమిదో స్థానంలో నిలిచింది. గతేడాది తొమ్మిదో స్థానంలో ఉన్న మన రాష్ట్రం మరోస్థానం ఎగబాకింది. ఈ ర్యాంకుల్లో 80.89 పాయింట్లతో తమిళనాడు మొదటిస్థానంలో నిలిస్తే, ఆ తరువాతి స్థానాల్లో వరుసగా మహారాష్ట్ర (78.20), కర్ణాటక (76.36), గుజరాత్ (73.22), హరియాణ (63.65), తెలంగాణ (61.36), ఉత్తరప్రదేశ్ (61.23) ఉన్నాయి. 2020లో 20వ స్థానంలో ఉన్న ఏపీ .. కేవలం రెండేళ్లలో 12 స్థానాలను మెరుగుపర్చుకుని సత్తా చాటింది. ఇక కోస్తాతీరం కలిగిన రాష్ట్రాలు 8 ఉంటే ఈ విభాగంలో ఆంధ్రప్రదేశ్ ఐదో స్థానంలో నిలిచింది. ఎగుమతుల పాలసీలో 99.52 పాయింట్లతో 4వ స్థానం, ఎగుమతుల ఎకోసిస్టమ్‌లో 6వ స్థానం దక్కించుకుంది.

టాప్ 100లో రాష్ట్రం నుంచి 8 జిల్లాలు..

దేశం నుంచి 2021–22లో 422 బిలియన్ డాలర్ల వాణిజ్య ఎగుమతులు జరగ్గా ఏపీ వాటా 4.58 శాతం (19 బిలియన్ డాలర్లు) ఉందని నివేదిక పేర్కొంది. 127 బిలియన్ డాలర్ల ఎగుమతులతో గుజరాత్ మొదటిస్థానంలో ఉంది. దేశం నుంచి అత్యధికంగా ఎగుమతులు జరుగుతున్న టాప్ 100 జిల్లాల్లో రాష్ట్రం నుంచి 8 ఉమ్మడి జిల్లాలకు చోటు దక్కింది. అందులో విశాఖకు టాప్ 10లో తొమ్మిదో స్థానం దక్కగా ఉమ్మడి తూర్పుగోదావరికి 24వ స్థానం దక్కింది. ఎగుమతులు ఇన్‌ఫ్రాలో మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పనితీరు బాగుందని, అలాగే గతేడాదితో పోలిస్తే రాష్ట్రంలో ఎగుమతిదారులకు రుణ లభ్యతకూడా భారీగా పెరిగినట్లు నివేదిక పేర్కొంది.

రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతోనే..

రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల వారీగా నిర్దిష్టమైన పాలసీలను రూపొందించి అమలు చేయడం ద్వారా ఏపీ ర్యాంకులు మెరుగుపడ్డాయని నీతిఆయోగ్ తన నివేదికలో పేర్కొంది. రాష్ట్రంలో అత్యధికంగా ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ జోన్స్, అగ్రిఎక్స్‌పోర్ట్ జోన్స్ ఏర్పాటు చేయడంతో పాటు ఎగుమతిదారుల సామర్థ్యాన్ని పెంచే విధంగా ప్రభుత్వం వర్క్‌షాప్స్, ట్రేడ్ ఫెయిర్స్‌ను నిర్వహించిందంటూ కితాబునిచ్చింది. టెస్టింగ్ ల్యాబ్స్ ద్వారా నాణ్యతా ప్రమాణాలు పాటించే విధంగా చర్యలు తీసుకోవడంతో అంతర్జాతీయంగా రాష్ట్రం పోటీపడటానికి దోహదం చేసిందని, అది రాష్ట్ర ఎగుమతుల్లో భారీ వృద్ధిని నమోదు చేసిందని పేర్కొంది. రాష్ట్రంలోకి విదేశీపెట్టుబడుల రాక పెరుగుతున్నప్పటికీ.. ఎగుమతుల ఎకోసిస్టమ్‌కు అనుగుణంగా వ్యాపార వాతావరణం మెరుగుపర్చుకుంటే ఎగుమతుల్లో మరింత వృద్ధి నమోదు చేయవచ్చని సూచించింది. కాగా, ఎగుమతులు పెంచుకోవడానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న చర్యలు, సాధిస్తున్న ఫలితాల ఆధారంగా ఈ సూచీలో ర్యాంకులు నిర్ధారిస్తారు. 2020లో 20వ స్థానంలో ఉన్న ఏపీ.. 2021లో 9వ ర్యాంకుకు, ఈ ఏడాది మరో ర్యాంకుకు ఎగబాకి అంతర్జాతీయంగా పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షిస్తోందని, దీని వెనుక రాష్ట్ర ప్రభుత్వ కృషి ఎంతో ఉందని నిపుణులు చెబుతున్నారు.

సేంద్రీయ సాగుకు సహకరిద్దాం

- ఆవు పేడ, గోమూత్ర ఆధారిత ఎరువులను ప్రోత్సహించాలి
- నీతి ఆయోగ్ టాస్క్‌ఫోర్స్ నివేదిక



సాక్షి, అమరావతి : వ్యవసాయ రంగంలో రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సేంద్రీయ, జీవ ఎరువుల వాడకాన్ని మరింతగా ప్రోత్సహించాలని, ఇందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని నీతి ఆయోగ్ టాస్క్‌ఫోర్స్ కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. రసాయన ఎరువుల వల్ల వాతావరణ కాలుష్యం, వ్యాధులూ పెరుగుతున్నాయని పేర్కొంది. ప్రస్తుతం దేశంలో సేంద్రీయ సాగు విస్తీర్ణం 38.09 లక్షల హెక్టార్లు ఉందని, వచ్చే మూడేళ్లలో మరో 10 లక్షల హెక్టార్లను సేంద్రీయ సాగులోకి తేవాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు టాస్క్‌ఫోర్స్ తెలిపింది. కేంద్రానికి పలు సిఫార్సులు చేసింది.

- సేంద్రీయ, జీవ ఎరువుల తయారీదారులను ప్రోత్సహించేందుకు సంస్కరణలు తేవాలి. నాణ్యమైన ప్రయోగశాలలు ఏర్పాటు చేయాలి.
- వీటి ఉత్పత్తికి లైసెన్సుల జారీ, పునరుద్ధరణకు విధానాన్ని రూపొందించాలి.
- ఆవు పేడ ఉత్పత్తిని పెంచేందుకు గోశాలలకు సాయం చేయాలి. ఆవు పేడ నుంచి ఆదాయాన్ని పొందేలా ఇతర మార్గాలు, సరైన ప్రాసెసింగ్ సౌకర్యాలుండాలి. బయోగ్యాస్ ప్లాంట్ల ద్వారా దీనికి అదనపు విలువ జోడించాలి.
- గోశాలలకు మూలధన పెట్టుబడులకు ఆర్థిక సాయం అందించాలి. వడ్డీ రాయితీ ఇవ్వాలి.
- గోశాలల్లో ఉత్పత్తయే బయో ఎరువులు, పెస్టిసైడ్స్‌కు మార్కెట్ సౌకర్యం కల్పించాలి. బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటులో గ్రామ పంచాయతీలకు ప్రమేయం ఉండాలి.

ఆర్టీసీలో మరిన్ని కారుణ్య నియామకాలు

- అర్హులకు జిల్లా ఎంపిక కమిటీల ద్వారా ఉద్యోగాలు
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: అనారోగ్య కారణాలతో ఉద్యోగ విరమణ చేసిన ఆర్టీసీ ఉద్యోగుల వారసుల కారుణ్య నియామకాల దరఖాస్తులను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం కలెక్టర్లను ఆదేశించింది. ప్రభుత్వం నిర్ణయించిన అయిదు కేటగిరీల్లో పేర్కొన్న అనారోగ్య కారణాలతో 2020 జనవరి 1 తరువాత ఉద్యోగ విరమణ చేసినవారి వారసుల్లో అర్హులకు జిల్లా ఎంపిక కమిటీల ద్వారా కారుణ్య నియామకాలు చేపట్టాలని పేర్కొంది. ఈ మేరకు రవాణా శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్టీసీ ఉద్యోగుల పట్ల సానుకూలంగా స్పం దించి కారుణ్య నియామకాలు చేయాలన్న ప్ర భుత్వ నిర్ణయంపై ఆర్టీసీ ఎంప్లాయిస్ యూని యన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.దామోద రరావు, జి.వి. నరసయ్య ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు టోకరా

రూ.కోటి వరకూ వసూళ్లు.. ఆపై బోర్డు తిప్పేసిన టీడీపీ నేత

- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

సాక్షి, పుట్టపర్తి : ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేసిన వ్యక్తి ఉదంతం ఇది. అయితే మోసం చేసిన వ్యక్తి తెలుగుదేశం పార్టీకి చెందిన వ్యక్తి కావడం గమనార్హం. ఇటీవల లోకేశ్ నిర్వహించిన యువగళం పాదయాత్రలోనూ చురుగ్గా పాల్గొన్నాడు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఇద్దరు బాధితులు ఎస్పీ ఎస్వీ మాధవ్‌రెడ్డిని కలిసి 'తమ్ముడి' మోసాన్ని వివరించారు. దీంతో ఆయన ఈ కేసును ధర్మవరం వన్‌టౌన్ సీఐకి అప్పగించారు. బాధితుల కథనం మేరకు వివరాలు.. ధర్మవరం పట్టణానికి చెందిన దుస్సా హేమనాథ్ గతేడాది 'షోవే' పేరుతో కన్సల్టెన్సీ కార్యాలయాన్ని ప్రారంభించాడు. బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లోని ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నిరుద్యోగులకు గాలం వేశాడు. ఆరు నెలల వ్యవధిలోనే 50 మందికి పైగా నిరుద్యోగుల నుంచి రూ.1.50 లక్షల చొప్పున వసూలు చేశాడు. హేమనాథ్‌కు డబ్బు చెల్లించినా ఉద్యోగం రాకపోవడంతో బాధితులు అతన్ని ప్రశ్నించడం మొదలుపెట్టారు. దీంతో కొందరికి నకిలీ ఆఫర్ లెటర్లు ఇచ్చాడు. నెలకు రూ.15 వేల చొప్పున ఒకట్రెండు నెలలు తానే వేతనం చెల్లించాడు. తర్వాత ప్రతిభ కనబరచనందున ఉద్యోగం నుంచి తొలగించారని, మరో రూ.50 వేలు ఇస్తే ఇంకో కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి మరికొంత నగదు రాబట్టుకున్నాడు. ఇలా మొత్తం రూ.కోటికి పైగా వసూలు చేసినట్టు తెలుస్తోంది. అయితే కొన్ని రోజులుగా అతను కార్యాలయం తెరవడం లేదు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

మాజీ ఎమ్మెల్యే ఆమంచికి పాముకాటు

- మెరుగైన చికిత్స కోసం విజయవాడ మణిపాల్ ఆస్పత్రికి తరలింపు
- నిలకడగా ఆరోగ్యం


చికిత్స పొందుతున్న ఆమంచి

చీరాల: బాపట్ల జిల్లా చీరాల మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ పాముకాటుకు గురయ్యారు. సోమవారం రాత్రి 7.30 గంటల సమయంలో ఆమంచి తన ఆక్వా నర్సరీలో వాకింగ్ చేస్తుండగా కట్లపాము కాటేసింది. ఆయన అనుచరులు పామును చంపి ఆమంచిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఆమంచికి చికిత్స చేసిన వైద్యులు ప్రాణాపాయం లేదని చెప్పారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నప్పటికీ మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు విజయవాడ మణిపాల్ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు.

గిరిజన కులధ్రువీకరణ పత్రాలపై కార్యాచరణ

ఎస్టీ ధ్రువీకరణ పత్రాల జారీపై జిల్లాస్థాయి కమిటీల విచారణ

సాక్షి, అమరావతి: గిరిజనులకు జారీచేసే కుల ధ్రువీకరణ పత్రాలపై పెండింగ్‌లో ఉన్న వివాదాలను త్వరితగతిన పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ విషయమై రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. ఇప్పటికే అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలిచ్చారు. ఎస్టీ కుల ధ్రువీకరణ జారీ, ధ్రువీకరణ వంటి అంశాలపై జిల్లాస్థాయి కమిటీ(డీసీఎల్)లు కేసుల విచారణ వేగవంతం చేయాలని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు. ఎస్టీ రిజర్వేషన్లు పొందేందుకు కుల ధ్రువీకరణ పత్రాలపై పలు సందర్భాల్లో వివాదాలు, ఫిర్యాదులు వస్తుంటాయి. ప్రధానంగా ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ నేతలు, ఉన్నత విద్యాసంస్థల్లో సీట్లు తదితర వాటి కోసం విద్యార్థులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం ప్రజలు ఎస్టీ ధ్రువీకరణ పత్రాన్ని సమర్పిస్తుంటారు. వీటిపై ఆయా ప్రాంతాల్లో కొన్ని ఫిర్యాదులు ఉన్నతాధికారులకు వస్తుంటాయి. వాటిపై జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో విచారణ జరిపి నిజమైన గిరిజనులా? కాదా? అని నిర్ధారిస్తుంటారు. అప్పటికీ వివాదం కొలిక్కిరాకపోయినా? పరిష్కారానికి నోచుకోకపోయినా? న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తుంటారు. ఈ వివాదాలు ఏళ్ల తరబడి సాగడంతో రిజర్వేషన్లు, రాయితీలు, అవకాశాలు పొందాల్సిన విద్యార్థులు, ప్రజలు నష్టపోవడమో, లబ్ధి పొందడమో జరుగుతుంటుంది. నిజమైన గిరిజనులకు మాత్రమే మేలు జరిగేలా దృష్టి సారించిన గిరిజన సంక్షేమ శాఖ సత్వర విచారణతో కుల ధ్రువీకరణపై ఉన్న వివాదాలను పరిష్కరించాలని ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)ల పరిధిలో ప్రాజెక్ట్ ఆఫీసర్(పీవో)లు, మైదాన ప్రాంతాల్లో జిల్లా సయుక్త కలెక్టర్(జేసీ)లు జిల్లా స్థాయి కమిటీలకు చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ కమిటీల్లో సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు ఉంటారు. ఎస్టీ కుల ధ్రువీకరణపై కమిటీలో తీసుకున్న నిర్ణయాన్ని కలెక్టర్లు, ప్రభుత్వానికి నివేదించిన అనంతరం నిర్ధారిస్తారు.

రాష్ట్రంలో 52 ఎస్టీ కేసుల పరిష్కారం

ఎస్టీ కుల ధ్రువీకరణ వివాదాలపై రెండు నెలలపాటు పీవో, జేసీల స్థాయిలో ప్రత్యేక కోర్టులు నిర్వహించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టారు. తాజాగా గిరిజన సంక్షేమ శాఖ చేపట్టిన ప్రత్యేక కార్యాచరణ(స్పెషల్ డ్రైవ్)తో రాష్ట్రంలో 52 ఎస్టీ కుల ధ్రువీకరణ కేసులు పరిష్కరించారు. 2021 నాటికి 295 కేసులు పెండింగ్‌లో ఉండగా 2022లో 39 కేసులు నమోదయ్యాయి. మొత్తం 334 కేసుల్లో 52 పరిష్కారం కావడంతో మరో 282 కేసులు పరిష్కారం కావాల్సి ఉంది. వాటిలో ప్రధానంగా సీతంపేట ఐటీడీఏ పరిధిలో 129 కేసులు, పార్వతీపురం ఐటీడీఏలో 28, పాడేరు ఐటీడీఏలో 28, రంపచోడవరం ఐటీడీఏలో 76 కేసులు ఉండగా పలు ఐటీడీఏలు, మైదాన ప్రాంతాల్లో 21 కేసులు పరిష్కరించాల్సి ఉంది.

సౌందర్యం సౌందర్య ప్రదర్శనకు దిగితే వికారంగా ఉంటుంది. మంచితనం మంచితన ప్రదర్శనకు దిగితే చెడ్డతనం అవుతుంది.
– తావోయిజం

సాక్షి
మంగళవారం, 18 జూలై 2023

ఈ విస్తరణ మంచిదేనా?

అనేక సందర్భాల్లో ఆగి ఆలోచించడం, జరిగిన కథను సింహావలోకనం చేసుకోవడం అత్యవసరం. వివిధ దేశాల అంతర్ ప్రభుత్వ సైనిక కూటమి 'నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్' (నాటో) సభ్యులు గత వారం లిథువేనియాలో ఆ పనే చేశారు. ఉక్రెయిన్‌పై రష్యా దాడికి 500 రోజులు పూర్తయిన వేళ బాధితదేశానికి తామిస్తున్న ఆర్థిక, సైనిక సహకారాలను పరిశీలించడానికి సమావేశమయ్యారు. 'నాటో'లో స్వీడన్ చేరేందుకు టర్కీ, ఆ వెంటనే హంగరీ అంగీకరించడం తాజా సమావేశంలోని కీలక పరిణామం. అదే సమయంలో ఉక్రెయిన్ చేరికపై మాత్రం నిర్ణీత కాలవ్యవధి ఏదీ ఈ కూటమి ప్రతిపాదించ లేదు. అమెరికా అధ్యక్షుడు సాంత్వన వచనాలు పలికినా, ఇది ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీలో నిరుత్సాహం రేపింది. వెరసి, యుద్ధక్షేత్రంలో ఉక్రెయిన్ ఎదురుదాడి నిదానించిందేమో కానీ, ఆ దేశానికి వెన్నుదన్నుగా నిలిచిన పాశ్చాత్య కూటమి బలోపేతమవుతోంది. రష్యాను చక్రబంధంలో ఇరికించే ప్రయత్నం నిరంతరాయంగా సాగుతోంది.

మొన్నటి దాకా స్వీడన్ చేరికను వీటో చేస్తూ టర్కీ అడ్డుకుంటోంది. ఇప్పుడు ఎత్తివేతతో స్వీడన్‌కు ఇక అన్ని అవరోధాలూ తొలగిపోయినట్లే! అటు రష్యాతో సుదీర్ఘమైన సరిహద్దున్న ఫిన్లాండ్, అలాగే ఇటు బాల్టిక్ సముద్రంలోని కీలకమైన గాట్లాండ్ తన చేతుల్లో ఉన్న స్వీడన్... రెండూ నాటో వైపు మొగ్గడం రష్యాకు చీకాకు పెంచే విషయమే. అసలైతే... ఫిన్లాండ్, స్వీడన్లు సాంప్రదాయికంగా సైనిక వ్యవహారాల్లో ఏ కూటమి వైపూ మొగ్గకుండా అలీన విధానాన్ని అనుసరించినవే. గత ఏడాది ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై రష్యా దాడికి దిగడంతో అవి తమ వైఖరిని మార్చుకోవాల్సి వచ్చింది. 2022 మేలోనే ఫిన్లాండ్‌తో పాటు స్వీడన్ కూడా సభ్యత్వానికి దరఖాస్తు చేసుకుంది. మొన్న ఏప్రిల్‌లో ఫిన్లాండ్ 'నాటో'లో 31వ దేశ సభ్యదేశం కాగా, త్వరలోనే స్వీడన్ 32వది కానుందన్న మాట.

తాజా పరిణామాలతో ఒక విషయం అర్థమవుతోంది. బెలారుస్, ఉక్రెయిన్, జార్జియా మినహా పడమటి సరిహద్దులంతా ఇక నాటో బలగాల ఉనికితో రష్యా సర్దుకుపోక తప్పదు. అంతా అనుకున్నట్టు జరిగి నాటో ఇలాగే విస్తరిస్తూపోతే, యూరోపియన్ ప్రపంచ భద్రతా వలయంలోనూ మరిన్ని మార్పులు తథ్యం. దశాబ్దాలుగా రక్షణ వ్యయంపై వైముఖ్యం ప్రదర్శించిన దేశాలు సైతం ఇప్పటికే తమ సైనిక సన్నద్ధతకు పదును పెట్టుకుంటున్నాయి. 'నాటో'ను విస్తరించబోమంటూ సోవియట్ పతనకాలంలో వాగ్దానం చేసిన అమెరికా ఆ మాట తప్పి, ఉక్రెయిన్‌ను చేర్చుకొనేందుకు ఉత్సాహపడడమే సమస్యకు మూలమనేది రష్యా ఆరోపణ. నాటో విస్తరణతో తనకు భౌగోళిక, వ్యూహాత్మక ప్రమాదాలున్నాయనేది దాని వాదన. అందుకే కీవ్‌పై దాడికి తెగబడింది. ఈ రష్యా దురాక్రమణ వైఖరిని అటుంచితే దాని భయసందేహాలు సమంజసమే. ఆ సంగతి పాశ్చాత్యప్రపంచానికీ తెలుసు.


ప్రచ్ఛన్న యుద్ధకాలంలో ఇటు పాశ్చాత్య ప్రపంచ 'నాటో' ఏర్పాటు, అటు దానికి ప్రతిగా సోవియట్ యూనియన్ కూటమి 'వార్సా' ఒప్పందం గత చరిత్ర. సోవియన్ యూనియన్ విచ్ఛిత్తితో 'వార్సా'నే రద్దయ్యాక, ఇప్పుడు నాటో ప్రాసంగికత, దాన్ని విస్తరించాలనే అమెరికా ఆకాంక్ష దేనికి చిహ్నమనేది కొందరి ప్రశ్న. అయితే, రష్యాతో యుద్ధం ముగిసేవరకు 'నాటో'లో ఉక్రెయిన్ చేరిక అసాధ్యమే. స్వీయభద్రత సాకుతో రష్యా దండెత్తిన ప్రస్తుత పరిస్థితుల్లో ఉక్రెయిన్‌కు అధికారికంగా సభ్యత్వమిచ్చి, మరింత కోపం తెప్పించడం తెలివైన పని కాదు. అది పూర్తిస్థాయి యుద్ధానికి దారి తీయవచ్చు. అందుకే పాశ్చాత్య లోకం కీవ్‌కు కావాల్సిన ఆర్థిక, సైనిక సహకారమిస్తూనే సాంకేతికంగా కూటమిలో చేర్చుకోకుండానే కథ నడిపించే పనిలో ఉంది. నాటో భేటీ అదే ధ్రువీకరించింది.

మరోపక్క ఉక్రెయిన్‌పై దాడితో... నాటో వైపు చూస్తున్న పొరుగు దేశాలను దారికి తేవచ్చనుకున్న రష్యా అధినేత పుతిన్ అంచనాలూ తప్పాయి. నాటోలో సంఘీభావాన్ని బలహీనపరచడం, రష్యా సరిహద్దుల వైపు నాటో మరింత విస్తరించకుండా ఆపడమనే లక్ష్యంలో ఆయన విఫలమయ్యారు. ఉక్రెయిన్ యుద్ధానికి ముందు నాటోతో రష్యా భూ సరిహద్దు 754 మైళ్ళే. ఇవాళ అది 1584 మైళ్ళయింది. రేపు ఉక్రెయిన్ కూడా ఆ కూటమిలో చేరితే, అది మరింత పెరుగుతుంది. పెనునష్టం తెచ్చిపెట్టిన యుద్ధంతో ఉక్రెయిన్ భూభాగంలో 17 నుంచి 18 శాతం రష్యా కలుపుకోగలిగింది. ఈ కలుపుకొన్న కొద్ది ప్రాంతం సాంకేతికంగా లాభదాయకమే కానీ, అంతకన్నా విశ్వవేదికపై వ్యూహపరంగా రష్యాకు జరిగిన నష్టమే అధికం. ఒక్కమాటలో పుతిన్ సెల్ఫ్ గోల్ చేసుకున్నారు. నాటోలో చేరితే తీవ్ర పరిణామాలు తప్పవని తీవ్రంగా హెచ్చరించినా, ఇప్పటికే ఫిన్లాండ్, త్వరలోనే స్వీడన్ నాటోతో జట్టు కడుతున్నాయి. ఇక పుతిన్ ఏం చేస్తారో?

వాస్తవానికి, ఉక్రెయిన్ యుద్ధంతో నిరంతర నాటో విస్తరణ రాజకీయ వ్యూహ అనివార్యతగా తయారైంది. కానీ, ఇది రెండంచులా పదునైన కత్తి. ఈ చర్య రష్యా పొరుగుదేశాలకే చేటు తేవచ్చు. నిత్యం సరిహద్దుల్లో ఉద్రిక్తతలు, వివాదాలు ఏదో ఒక సమయంలో యుద్ధానికి దారి తీయ వచ్చు. పొరపాటున అది ప్రపంచ యుద్ధమైనా ఆశ్చర్యం లేదు. నిర్ణీత ప్రాంతంలో భద్రత, సుస్థిరత కోసమంటూ సైనిక కూటములలో చేరుతున్నామంటారు. తీరా ఆ కూటములు మరింత అస్థిరతకూ, భావి యుద్ధాలకు పునాదులు వేస్తున్నాయనిపిస్తుంది. నాటో విస్తరణతో ఎవరి ప్రయోజనాలు ఎలా ఉన్నా, ఐరోపా మాత్రం వ్యూహాత్మక సుస్థిరతను అందుకుంటున్న దాఖలాలైతే లేవు. పైపెచ్చు, అది దీర్ఘకాలిక అస్థిరత, నిరంతర అభద్రత వైపు అడుగులేస్తున్నట్టు కనిపిస్తోంది. ఆ అనుమానాల రీత్యా చూస్తే, నాటో సభ్య దేశాలు పెరగడం పాశ్చాత్య ప్రపంచానికి నిజంగా శుభప్రదమేనా అన్నది ప్రశ్న.

మద్దతు ధరతోనే వైవిధ్యం సాధ్యం

విశ్లేషణ



అరుణ్ సిన్హా

అవసరానికి మించి ఎరువులను వాడడం వల్ల నేలలోని పోషకాలు క్షీణిస్తున్నాయి. వృద్ధులైన వాళ్లు ప్రమాదకరమైన స్టెరాయిడ్లపై బతుకుతున్నట్లు ఉందిప్పుడు నేల పరిస్థితి. దేశంలో హరిత విప్లవం మొదలైన రాష్ట్రాల్లో రైతులు పంట మార్పిడి పద్ధతిని వదిలేశారు. ఈ పద్ధతి నేల, నీరు, ఎరువులను సమతుల పద్ధతిలో ఉపయోగించుకునేందుకు ఉద్దేశించినది. దాన్ని వదిలి, వరి లేదా గోధుమ పంటలకే పరిమితమయ్యారు. వైవిధ్యభరితమైన ఇతర పంటలను సాగు చేయకపోతే రసాయన ఎరువులు, నీటిపై మరింత ఎక్కువ ఆధారపడాల్సిన పరిస్థితులు వస్తాయి. రైతులు మారాలంటే వారి పంటలకు కనీస మద్దతు ధర లభించాలి. రసాయనిక ఎరువులకు దీటుగా దిగుబడి ఇవ్వగల సమర్థమైన సహజ ఎరువుల ఉత్పత్తికి ప్రాధాన్యమివ్వాలి.

కేంద్ర ప్రభుత్వం ఇటీవలే పీఎం–ప్రణామ్ పేరుతో ఓ కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. వ్యవసాయం కోసం ప్రత్యామ్నాయ పోషకాల వాడకాన్ని ప్రోత్సహించడం దీని లక్ష్యం. పర్యావరణానికి హాని కలిగిస్తున్న రసాయన ఎరువుల స్థానంలో సేంద్రీయ, జీవ సంబంధిత ఎరువులను వాడే మంచి ఉద్దేశంతో మొదలైందీ పథకం. అవసరానికి మించి ఎరువులను వాడటం వల్ల నేలలోని పోషకాలు క్షీణిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ప్రమాదం హరిత విప్లవం మొదలైన పంజాబ్, హరియాణా, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల్లోనే తీవ్రంగా ఉండటం గమనార్హం. వృద్ధులైన వాళ్లు ప్రమాదకరమైన స్టెరాయిడ్లపై బతుకుతున్నట్లు ఉందిప్పుడు ఈ రాష్ట్రాల్లోని నేల పరిస్థితి. పని జరుగుతూంటుంది కానీ, నేల డొల్లగా మారిపోతూ ఉంటుంది. నేల సామర్థ్యం, పంట దిగుబడులు క్రమేపీ తగ్గిపోతాయి. మిగిలిన రాష్ట్రాల్లోనూ నేల పరిస్థితి ఇలాగే ఉందనడంలో సందేహం ఏమీ లేదు.

ప్రమాదకరమైన రసాయన ఎరువుల స్థానంలో సేంద్రియ, జీవ సంబంధిత ఎరువులను వాడేందుకు ప్రభుత్వం పీఎం–ప్రణామ్ పథకాన్ని ప్రారంభించడం ఆహ్వానించదగ్గ పరిణామమే. కానీ, అమలుకు ఎన్నో అడ్డంకులు ఉన్నాయి. మొదటిది, ఈ పథకానికి కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించకపోవడం. ప్రస్తుతం రైతులకు అందించే ఎరువుల సబ్సిడీలోంచే ఈ పథకానికి కావాల్సిన మొత్తాలను సర్దుకోవాలి. ఇందుకు తగ్గట్టుగా సహజసిద్ధమైన ఎరువులను వాడేలా రైతులను ప్రోత్సహించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాలని కేంద్రం ఆశిస్తోంది. ఇలా మిగిల్చిన ఎరువుల సబ్సిడీ మొత్తంలో యాభై శాతాన్ని కేంద్రం రాష్ట్రాలకు అందివ్వనుంది. ఈ మొత్తాలతో సహజ ఎరువులపై అవగాహన పెంచడం, ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటు చేపట్టాలి.

రాష్ట్రాలకు ఈ మార్పును సమర్థంగా అమలుచేయగల సత్తా ఉందా? భారీ స్థాయిలో సహజ ఎరువులు వాడేలా చేయగలదా? అలాంటి సూచనలు ఇప్పటికైతే ఏమీ కనిపించలేదు. ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న 'సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' గత ఏడాది విడుదల చేసిన నివేదిక ప్రకారం, సహజ ఎరువుల రంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. నియంత్రణల్లేవు. అసంఘటితంగా ఉంది. కేంద్రం సహజ ఎరువులను ప్రోత్సహించేందుకు అందిస్తున్న నిధులు చాలావరకూ మురిగిపోతున్నాయి. సహజ ఎరువుల ఉత్పత్తి కూడా తక్కువగా ఉంది. పైగా ఉత్పత్తి అవుతున్న వాటి నాణ్యత కూడా నాసిగా ఉంది. చాలా రాష్ట్రాల్లో తగిన పరిశోధనాశాలలూ లేవు.

ప్రాంతీయ స్థాయిలోని ఆర్గానిక్ ఫార్మింగ్ లాబొరేటరీలను కూడా 2019–20 సంవత్సరంలో వాటి సామర్థ్యంలో మూడో వంతు మాత్రమే వినియోగించుకున్నట్లు ఈ నివేదిక స్పష్టం చేసింది. బయో ఫర్టిలైజర్ నమూనాల పరీక్షలు ఏటికేడాదీ పెరగాల్సింది పోయి



తగ్గిపోతున్నాయి. 2013–14లో ఏడాదికి 654 నమూనాలు పరీక్షిస్తే, 2019–20లో ఈ సంఖ్య 483కు పడిపోయింది. అదే సమయంలో ఈ పరీక్షలను తట్టుకుని వాడకానికి సిద్ధమైన ఎరువుల శాతం ఒకటి నుంచి 44 శాతం కావడం గమనార్హం. అంటే నకిలీ బయో ఫర్టిలైజర్లు పెరిగిపోయాయన్నమాట.

పీఎం – ప్రమాణ్ పథకం మొత్తం రైతులు సహజ ఎరువుల వాడకానికి మొగ్గు చూపుతారన్న అంచనాపై మొదలైంది. లాభాలు లేని పక్షంలో రైతులు వీటి వాడకానికి ఎందుకు మొగ్గు చూపుతారన్న ప్రశ్నకు సమాధానం లేదు. సహజ ఎరువుల వాడకం వల్ల మట్టి ఆరోగ్యం పెరగాలి. సాగు, పంట ఖర్చులు తగ్గాలి. దిగుబడులు పెరగాలి. తద్వారా ఆదాయమూ ఎక్కువ కావాలి. ఇప్పటివరకూ ఒక స్థాయి జీవనశైలిని అలవర్చుకున్న రైతులు ఇప్పుడు తక్కువ ఆదాయం, దిగుబడి వస్తుందంటే సహజ ఎరువులవైపు మళ్లే అవకాశాలుండవు. అందుకే ప్రభుత్వం సహజ ఎరువుల లాభాలను విస్తృతంగా ప్రచారం చేయాలి. ఉత్పత్తి, సరఫరాల సామర్థ్యాలను కూడా పెంచుకోవాలి. రసాయనిక ఎరువులకు దీటుగా దిగుబడి ఇవ్వగల సమర్థమైన, నాణ్యమైన సహజ ఎరువుల ఉత్పత్తికి ప్రాధాన్యమివ్వాలి.

ఇవన్నీ చేసినప్పటికీ నేల సారాన్ని పెంచేందుకు, పునరుజ్జీవింపచేసేందుకు పీఎం – ప్రణామ్ సరిపోదు. ఎందుకంటే దేశంలో మట్టి సారం అంతగా దిగజారిపోయింది. రసాయనిక ఎరువుల వాడకంతో పాటు, అతిగా సాగు చేయడమూ దీనికి కారణం. దేశంలో హరిత విప్లవం మొదలైన రాష్ట్రాల్లో రైతులు పంట మార్పిడి పద్ధతిని ఎప్పుడో వదిలేశారు. ఈ పంట మార్పిడి పద్ధతి నేల, నీరు, ఎరువులను సమతుల పద్ధతిలో ఉపయోగించుకునేందుకు ఉద్దేశించినది. దాన్ని వదిలేసుకుని వరి లేదా గోధుమ పంటలకు మాత్రమే పరిమితమయ్యారు! అప్పట్లో ప్రభుత్వానికి ఈ రెండు ధాన్యాల అవసరం ఎక్కువగా ఉండింది కాబట్టి ఆ పంటలు ఎక్కువ పండించేలా రైతులను ప్రోత్సహించింది. మొక్కజొన్న, చిరుధాన్యాలతో పోలిస్తే ఈ రెండు పంటలకూ నీటి అవసరం చాలా ఎక్కువ. వరి, గోధుమలను ఎక్కువగా ఉత్పత్తి చేయడమంటే నదీ, భూగర్భ జలాలను అతిగా వాడుకోవడమే. దీనివల్ల నీటి లవణత కూడా పెరిగి పోషకాలు తగ్గిపోతాయి. అంటే ఈ సమస్య మూలం వరి, గోధుమల సాగులోనే ఉందన్నమాట. నైట్రోజన్ , ఫాస్ఫరస్, పొటాషియం, సేంద్రీయ కర్బనం, జింక్, ఐరన్, మాంగనీస్ వంటి పోషకాలన్నీ కూడా తుడిచిపెట్టుకుపోతున్నాయి. రైతులు వరి, గోధుమ పంటల సాగును తగ్గించుకుని వైవిధ్యభరితమైన ఇతర పంటలను సాగు చేయకపోతే రసాయన ఎరువులు, నీటిపై వారు మరింత ఎక్కువ ఆధారపడాల్సిన పరిస్థితులు వస్తాయి. రైతులు మారాలంటే వారి పంటలకు కనీస మద్దతు ధర లభించాలి. ఏడు రకాల ధాన్యాలు, ఐదు పప్పులు, ఏడు నూనె గింజలు, నాలుగు వాణిజ్యం పంటలకు కేంద్రం ఏటా కనీస ధరను నిర్ణయిస్తూంటుంది. ఈ పంటలన్నింటినీ ప్రభుత్వమే కొనుగోలు చేయనవసరం లేనప్పటికీ వాటికి కనీస మద్దతు ధరను నిర్ణయించడం అవసరం.

హరియాణాలో ఇటీవల పొద్దుతిరుగుడు సాగు చేసే రైతులు ఆందోళనకు దిగారు. కేంద్రం క్వింటాల్‌కు రూ.6,400 కనీస మద్దతు ధర నిర్ణయించినా, ప్రైవేట్ వ్యాపారులు రూ.4,200కు మించి చెల్లించడం లేదన్నది రైతుల ఆరోపణ. ఇంకోపక్క రాష్ట్ర ప్రభుత్వం ఈ పంటలు కొనుగోలు చేయడం నిలిపివేసింది. ఈ విషయమై రైతులు ఆందోళనకు దిగడంతో రాష్ట్ర ప్రభుత్వం పొద్దుతిరుగుడు పంటను క్వింటాల్‌కు రూ.4,800 ధర చెల్లించేందుకు ఒప్పుకుంది. కనీస మద్దతు ధరకు, ఈ మొత్తానికి ఉన్న తేడాను తగ్గించేందుకు ప్రతి క్వింటాల్‌కు అదనంగా ఇంకో వెయ్యి రూపాయలు చెల్లించేందుకు సరేనంది. అయినప్పటికీ ఈ మొత్తం కనీస మద్దతు ధర కంటే ఆరు వందల రూపాయలు తక్కువగా ఉండటం గమనార్హం. రైతులు దీనికీ ఒప్పుకోకుండా చండీగఢ్ –ఢిల్లీ రోడ్డుపై ధర్నాకు దిగారు. ఆఖరుకు ప్రభుత్వం ధర ఇంకో రెండు వందల రూపాయలు పెంచింది.

ఈ విషయంలో రైతులను తప్పుపట్టాల్సిన అవసరం లేదు. వారు తమ పొలాల్లో వేర్వేరు పంటలు వేసేందుకు సిద్ధంగానే ఉన్నారు. పొద్దు తిరుగుడు పంటనే తీసుకుంటే, 2018–19లో కేవలం 9,440 హెక్టార్ల విస్తీర్ణంలో సాగవుతూండగా, 2020–21కి ఇది 12,290 హెక్టార్లకు పెరిగింది. ఆ తరువాతి సంవత్సరం 13,020 హెక్టార్లకు, 2022–23 నాటికి 14,160 హెక్టార్లకు పెరగడం గమనార్హం. ప్రభుత్వం కనీస మద్దతు ధరను రైతులకు ఆకర్షణీయంగా ప్రకటించగలిగితే పొద్దుతిరుగుడు సాగు మరింత ఎక్కువగా జరిగేందుకు అవకాశముంది. అలాగే మొక్కజొన్న, చిరుధాన్యాల సాగు కూడా ఊపందుకుంటుంది.

వ్యాసకర్త 'ఎగైనెస్ట్ ద ఫ్లూ: స్ట్రగుల్స్ ఆఫ్ ఇండియాస్ రూరల్‌పూర్' గ్రంథ రచయిత
('ద ఫ్రీ ప్రెస్ జర్నల్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

నిజంగా ఒక్కడేనా?



ఒకవైపేమో ఆప్, కాంగ్రెస్, జేడీయూ, తృణమూల్, ఆర్జేడీ, ఇంకా ఇతర పార్టీలున్నాయి. ఇవన్నీ నరేంద్ర దామోదరదాస్ మోదీ అనే మనిషిని ఓడించడమే లక్ష్యంగా ఏకమయ్యాయి. ఒక్క నిమిషం ఆగండి: మోదీ+ఎన్సీపీ(అజిత్ పవార్)+ ఓపీ రాజ్‌భర్+ ముఖ్తార్ అన్సారీ అబ్బాయి+ ఏఐఏడీఎంకే+ అప్నాదళ్+శివసేన (ఏక్‌నాథ్ శిందే)+ ఆర్ఎల్‌పీ+ ఇంకా 22 పార్టీలు. అంటే మోదీ వర్సెస్ అన్ని పార్టీలు అనే కథనం ఎప్పుడు పనిచేస్తుందంటే, బీజేపీ ఎవరినీ కలుపుకోక, ఐక్య ప్రతిపక్షంతో ఒంటరిగా పోరాడినప్పుడు మాత్రమే! మోదీ ఒంటరిగానే పోరాడి, దాన్ని మోదీ వర్సెస్ అందరూ చేయాలని ఆశిద్దాం.

– రోషన్ రాయ్, వ్యాఖ్యాత

సగానికి సగం



ఇవ్వాళ నేను 5,000 రూపాయలు సంపాదించాను. ఇందులో ప్రభుత్వానికి 30 శాతం పన్నుగా చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన డబ్బుతో ఏమైనా కాఫీ తాగుదామా అనుకున్నాను. దీనికి నేను 28 శాతం పన్నుగా చెల్లించాలి. అంటే రోజుకు 12 గంటలు నేను పనిచేస్తున్నది కేవలం నా ఆదాయంలో 50 శాతం ప్రభుత్వానికి చెల్లించడానికే అని గ్రహించాను.

– సంచిత్ గోయల్, మేనేజర్

పట్టించుకోవాల్సిన అంశం



విభజనప్పుడు కరాచీలో ఎక్కువగా ఉండిపోయిన హిందువులు ఎస్సీలు, ఎస్టీలు. నౌకర్లుగా పని చేస్తుండటంతో 'అత్యవసర సేవల చట్టం' వారిని దేశం విడిచి వెళ్లడానికి అనుమతించక బలవంతంగా ఆపింది. ఆ చారిత్రక తప్పిదాన్ని 'పౌరసత్వ సవరణ చట్టం' (సీఏఏ) పట్టించుకుంటుంది. ఇది అర్థంకాని ఇక్కడి కులీనులు గోలపెడుతుంటారు.

– సజ్జన్ కుమార్ సింగ్, పొలిటికల్ ఎనలిస్ట్

హింస కనబడదా?



మణిపూర్ ఇప్పటికీ ఉద్రిక్తంగానే ఉంది. ఆ ప్రాంతం నుంచి మీ దృష్టి మరల్చకండి. చావులు, హింస ఇంకా అధికంగానే ఉన్నాయి. కానీ చూస్తుంటే మీడియా ఈ పరిణామాలను విస్మరిస్తున్నట్టు కనబడుతోంది.

– పమేలా ఫిలిపోస్, జర్నలిస్ట్

చర్చ జరగాల్సింది... వీటి పైన!

సందర్భం



రెహానా

ఎన్నికలు దగ్గర పడేకొద్దీ రాజకీయ పార్టీలు తమ గెలుపు కోసం సకల ప్రయత్నాలూ చేయడం సహజమే. అయితే గెలవడమే లక్ష్యంగా ప్రజల ప్రయోజనాలు, వారి గౌరవ మర్యాదలను సైతం పణంగా పెడతామంటేనే సమస్య వస్తుంది. 'వాలంటీర్ వ్యవస్థ'పై జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేస్తున్న ఆరోపణలు ఇటువంటి సమస్యలనే సృష్టించాయి.

పవన్ కల్యాణ్ చేసిన రెండు ఆరోపణలూ తీవ్రమైనవే. అందులో ఒకటి – వాలంటీర్లు మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు అన్నది. సుమారు రెండున్నర లక్షల మంది ఉన్న వాలంటీర్లలో 60 శాతం వరకు మహిళలే. పైగా వాలంటీర్లు అందరూ ఆ యా గ్రామాల్లో, దాదాపుగా అదే వీధిలోని వారే. ఇరుగు పొరుగుకు పరిచయస్థులు, బంధువులే అయి ఉంటారు. 'వాలంటీర్లు మహిళల పట్ల నీచమైన భావంతో ఉంటారు, వారి శరీరంతో వ్యాపారం చేసే కుట్రలో భాగం అవుతున్నార'ని పవన అన్న మాట సమర్థించరాని ఆరోపణే. జనసేన మాత్రమే కాదు టీడీపీ కూడా ఈ స్థాయిలో కాకపోయినా ఇదే లైన్‌లో ఆరోపణలు చేస్తోంది. దీనిపై ఇప్పటికే వాలంటీర్ల నుంచే కాకుండా మొత్తం సమాజం నుంచి కూడా నిరసన వ్యక్తం అయ్యింది.

వాలంటీర్ల ద్వారా 'ప్రజల సమాచార చౌర్యం జరుగుతోంద'న్నది జనసేన, టీడీపీ నుంచి వచ్చిన మరో తీవ్రమైన ఆరోపణ. నిజానికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 'పెగసస్' సాఫ్ట్‌వేర్ సహాయంతో ప్రజల సమాచారాన్ని చౌర్యం చేశారనే అంశం న్యాయ విచారణ వరకు వెళ్లిన విషయాలను ఈ పార్టీలు మరచినట్లున్నాయి. ఫలానా కుటుంబం లేదా వ్యక్తి ఫలానా సంక్షేమ పథకానికి అర్హులు అవుతారా లేదా అన్నది నిర్ధరించడానికి కొంత సమాచారం కచ్చితంగా అవసరం ఉంటుంది. వాలంటీర్లు ప్రభుత్వ ఉద్యోగులు కాకపోయినా వీరంతా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలో భాగం. ప్రభుత్వ ప్రతినిధులుగానే ప్రజల వద్దకు వెళుతున్నారు. వారు తెచ్చే సమాచారం గ్రామ, వార్డు సచివాలయాల్లో భద్రం అవుతుంది.

కొంచెం వెనక్కి వెళితే ప్రభుత్వంతో సంబంధం లేకుండా పూర్తిగా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ప్రజల సమాచారం పెడుతున్న 'మీ సేవ' వ్యవస్థను గత ప్రభుత్వం తీసుకొచ్చింది. బర్త్ సర్టిఫికెట్ల నుంచి పొలం 'పాస్ బుక్'ల వరకు 'మీ సేవ'లోనే దరఖాస్తు చేసుకోవాలి. ఈ సేవలు పొందటానికి నిర్ధారిత రుసుం చెల్లించాలి. 'మీ సేవ' కేంద్రాలను నిర్వహించే వారికి ప్రభుత్వంతో ఏ మాత్రం సంబంధం ఉండదు. వారు పూర్తిగా ప్రైవేటు వ్యక్తులు. ఒక సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలంటే దానికి అవసరం అయిన పేరు, ఊరు, ఆధార్ కార్డు, కాంటాక్ట్ నంబర్, కుటుంబ సభ్యుల వివరాలు, సంబంధిత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు వంటివి అన్నీ ఇవ్వాల్సిందే.

ఇదే కాదు... కొన్ని ప్రైవేటు సంస్థలు కూడా డేటా సేకరణలో భాగంగా ఉన్నాయి. ఉదాహరణకు ఈ మధ్య బాగా వార్తల్లో ఉన్న ఒక ప్రముఖ చిట్స్, ఫైనాన్స్ సంస్థనే తీసుకుందాం. ఈ సంస్థలో ఒక చిట్ వేయాలంటే పేరు, కాంటాక్ట్ నెంబర్, మెయిల్ ఐడీ వంటివే కాకుండా ఆధార్ కార్డు, ఐడీ ప్రూఫ్ కార్డు, శాలరీ పే స్లిప్ వంటివి ఇవ్వాలి. ష్యూరిటీ సంతకాలు పెట్టే వారి పే స్లిప్పులు, ఐడీ ప్రూఫ్‌లు, బ్యాంక్ స్టేట్‌మెంట్లు, ఐటీ రిటర్న్ పత్రాలు ఇవ్వాల్సిందే. చిట్ దారులకు సంబంధించిన ఈ కీలక ఆర్థిక సమాచారం అంతా ఆ సంస్థ గత 60 ఏళ్ళుగా సేకరిస్తూనే ఉంది. మరి ఈ డేటా అంతా ఎక్కడ స్టోర్ అవుతోంది? ఎవరి చేతుల్లోకి వెళ్ళి దుర్వినియోగం అవుతోంది? ఇటువంటి అనేక అనుమానాలు, ప్రశ్నలు పవన్ కల్యాణ్ ఆరోపణల నేపథ్యంలో ముందుకు వస్తున్నాయి. ఇప్పుడు నిజంగా చర్చ జరగాల్సింది వీటిపైనే!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

చెయ్యాల్సింది వదిలి ఇంకేదో చేస్తున్నారు!



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

"భారత రాజ్యాంగంలో కీలకమైన 44వ అధికరణ ప్రకారం దేశానికంతకూ కలిపి ఒకే ఒక పౌరస్మృతి అమలులో ఉండాలి. ఇది లేనందుననే దేశంలోని సామాజికులలో ఐక్యత, అమలు జరగాల్సిన ఆర్థిక న్యాయం కుంటుపడి పోతున్నాయి"

– ఎం. వెంకయ్య నాయుడు, భారత మాజీ ఉపరాష్ట్రపతి ప్రకటన (7.7.2023)

వెనకటికొకడు 'తాడి చెట్టు ఎందుకెక్కావురా' అంటే, కల్లు కోసమనే రీతిగా సమాధానం చెప్పకుండా 'దూడ మేత కోసం' అని సమాధానం చెప్పాడట. 'ఒకే దేశం ఒకే జాతి' అనే బీజేపీ ఎజెండాను అమలు చేయడంలో భాగంగా 'ఉమ్మడి పౌర స్మృతి'ని ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ముందుకు తెచ్చిందనేది బహిరంగ రహస్యమే. అసమానతలను రూపుమాపుకునే హక్కు రాజ్యాంగం ప్రసాదించింది. కానీ ఆ విషయాన్ని మరచి అందుకు పూర్తిగా భిన్నమైన భూస్వామ్య, పెట్టుబడిదారీ వ్యవస్థల మూలాలు చెక్కు చెదరకుండా భారత కాంగ్రెస్, బీజేపీ పాలకులు సంపూర్ణ మంత్రి వర్గాల పేరుతోనో, సంకీర్ణ ప్రభుత్వాల నాటకంతోనో ఇంతకాలం కాలక్షేపం చేస్తూ వచ్చారు. కుల, మత, వర్గ విభేదాలు ప్రజల మధ్య పెరగడానికి, పాక్షిక రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చుకుని తాత్కాలికంగా గట్టెక్కడానికి ఎత్తులు, పైఎత్తులతో కాలక్షేపం చేస్తూ వస్తున్నారు. అటువంటి ఒక ఎత్తుగడే 'ఉమ్మడి పౌర స్మృతి.'

తమ స్వార్థ రాజకీయాలను వివిధ అణగారిన ప్రజా శక్తులు ఆందోళనల ద్వారా, సమ్మెల ద్వారా, ఉధృత స్థాయిలో ఉద్యమాల ద్వారా ఎదుర్కొంటూ వస్తుండటంతో పాలక వర్గాలు అరెస్టులు, కాల్పులు, నిర్బంధ విధానాల ద్వారా ప్రజా శక్తుల్ని అణచ జూస్తున్నారు. ఈ సందర్భంగా, ప్రజలపై నిర్బంధ విధానాన్ని అమలు జరపడం ద్వారా పాలకులు అనుసరించే ఎత్తుగడలకు విచిత్రమైన రెండు ఘటనలను చరిత్రనుంచి ఉదహరించుకుందాం: ముందుగా పాత సోవియెట్ యూనియన్‌లో చోటుచేసుకున్న సంఘటన. పంటలు పండించడంలో ఆరితేరిన ఒక రైతు ఒక మార్కెట్ స్క్వేర్‌లో నిలబడి, 'మన వ్యవసాయ మంత్రి ఒక తెలివితక్కువ దద్దమ్మ (ఫూల్)' అని అరిచాడట. అంతే ఆ రైతును అరెస్టు చేసి 10 సంవత్సరాల ఒక మాసం పాటు జైల్లో నిర్బంధించారు. అందులో ఆ రైతు, మంత్రి గారిని 'ఫూల్' అని అగౌరవ పరచినందుకు ఒక మాసం పాటు, ప్రభుత్వ గుట్టును రట్టు చేసినందుకు 10 ఏళ్ళు శిక్ష విధించారు. ఇంతకూ అసలు రహస్యం – ఆ రైతు పెద్ద మంత్రిని ఎద్దేవా చేసినందుకు విధించిన జరిమానా చిన్నదే, కానీ మంత్రిని 'పనికిమాలిన దద్దమ్మ' అన్న విమర్శ ప్రజల మనస్సుల్ని బాగా ప్రభావితం చేసినందుకు బారీ పెనాల్టీ విధించడం జరిగిందట!

అలాగే మన దేశంలో జరిగిన మరో సంఘటన చూద్దాం. 'నీరవ్ మోదీ, లలిత్ మోదీ, నరేంద్ర మోదీ ... వీళ్లందరి ఇంటిపేర్లుగా మోదీ ఎలా వచ్చింది? దొంగలందరి ఇంటిపేరుగా మోదీ ఎలా వచ్చింది' అన్న రాహుల్ గాంధీ 'జోక్' కూడా క్రిమినల్ కేసులో చేరిపోయింది. దీనిపైన సుప్రీంకోర్టు సీనియర్ అడ్వొకేట్ సంజయ్ హెగ్డే వ్యాఖ్యానిస్తూ 'జోక్‌ను, విమర్శను పరువు నష్టం కింద భావించి ఒక వ్యక్తిని అమెరికాలో జైలులో నిర్బంధించరు. 'ఏలిననాటి శని' లాంటి వలస

రెండో మాట



చట్టం వల్ల ఇది ఇక్కడ సాధ్యమయింద'న్నారు. 'ఏదో ఒక మోదీని అవమానించారని కాదు, మోదీలందరినీ ఉద్దేశించి అన్న సాధారణ అర్థంలో రాహుల్ వ్యాఖ్యలు ఉన్నాయని కోర్ట్ శిక్ష విధించింది' అని ఆయన వివరించారు. పలువురు వ్యక్తులను సంబోధించే క్రమంలో ఇంటి పేర్లు, వంశనామాలు పెట్టి పిలిచినంత మాత్రాన 'పరువు నష్టం' కింద జమ కట్టడానికి వీలు కాదన్నారు. ఈ సందర్భంగా ఆయన హోమీ మోదీ, లాలా మోదీ, సయెద్ మోదీ, పూర్ణేందు మోదీ వంటి పేర్లను ప్రస్తావించారు.

భారత రాజ్యాంగానికి విశిష్టమైన వ్యాఖ్యాన పరంపర అందించిన సుప్రసిద్ధ మానవ హక్కుల పరిరక్షణా ఉద్యమ నేతల్లో అగ్రజుడైన ఉన్నత న్యాయవాది కేజీ కన్నాభిరాన్ దేశంలోని పౌరహక్కుల ఉద్యమ కార్యకర్తల్ని భూస్వామ్య పెట్టుబడిదారీ ప్రభుత్వం అన్యాయంగా అరెస్టులు చేసి, నిరాధారమైన ఆరోపణలతో జైళ్లపాలు చేసినప్పుడు నిద్రాహారాలు లెక్క చేయకుండా వారికి లీగల్ సహాయం అందించి విడుదలయ్యేటట్టు చేశారు. నక్సలైట్ ఖైదీల విడుదల కోసం ఏర్పడిన రక్షణ కమిటీకి కన్వీనర్‌గా పనిచేశారు. దేశంలో న్యాయ వ్యవస్థ పనితీరును ప్రస్తావిస్తూ కన్నాభిరాన్, న్యాయ వ్యవస్థ పనిచేస్తున్న తీరును ప్రస్తావించి ఇలా వ్యాఖ్యానించారు: "దేశంలోని కోర్టులు అధికార, అనధికార స్థానాల్లో ఆధిపత్య స్థానాల్లో ఉన్న బలవంతులైన వారిని దుర్మార్గపు పరిణామాలకు బాధ్యుల్ని చేసి శిక్షించలేకపోతున్నాయి. చివరికి అణగారిన కార్మికులు ఆత్మగౌరవం కోసం పోరాడుతున్న సందర్భాల్లో కూడా అలాంటి వారి రక్షణకు కొన్ని కోర్టులు ముందుకు రావడం లేదు"!

చివరగా... చరిత్రలో కొందరు పాలకులు ప్రజలపైన, చివరికి, ప్రసిద్ధ చరిత్రకారులపైన ఎన్ని కిరాతకమైన ఆంక్షలు విధిస్తారో, దుర్మార్గాలకు పాల్పడుతుంటారో తెలియచేసే ఉదాహరణ ఒకటి చూద్దాం. చైనా చరిత్రలో 'సీమా కియాన్' అనే ప్రసిద్ధ చరిత్రకారుడు చక్రవర్తిని విమర్శించి ప్రజలముందు అభాసుపాలు చేశాడు. అందుకు ఆ చక్రవర్తి ఒక దుర్మార్గమైన 'ఆఫర్' ఇచ్చాడు. చేసిన నేరానికి 'ఉరిశిక్ష కావాలా లేక ఆ స్థానంలో నపుంసకుడిగా మారిపోతావా' అని అడిగాడు. మరి తాను చరిత్రకారుడు కాబట్టి నపుంసకుడిగా ఉండిపోయి అయినా తాను ప్రారంభించిన చరిత్ర రచనను పూర్తిచేయాలనుకున్న కియాన్ నపుంసకునిగా మారడానికే మొగ్గాడు. (సైమన్ సీబాగ్ మాంటిఫియోర్ 'ది వరల్డ్: ఎ ఫ్యామిలీ హిస్టరీ ఆఫ్ హుమానిటీ'). బహుశా కారల్ మార్క్స్ మహనీయుడు అందుకే అని ఉంటాడు: "మనుషులు తమ చరిత్రను తామే లిఖించుకుంటారు. కానీ, తమ ఇష్టా ఇష్టానుసారంగా రాసుకుంటూ పోలేరు. ఎవరికి వారు తమకు తామై ఎంచుకునే సందర్భాల ప్రకారమూ రాసుకోలేరు. మరి ఏ పునాది ఆధారంగా రాస్తారు – సిద్ధాన్నంలాగా అప్పటికే ఉన్న పరిస్థితులు ఆధారంగా, గతం నుంచి సంక్రమించిన పరిస్థితులు ఆసరాగా తప్ప మరొక మార్గం లేదు"!

అవును కదా మరి –

"భూమిలోన పుట్టు భూసారమెల్లను
తనువులోన పుట్టు తత్వమెల్ల
శ్రమములోన పుట్టు సర్వంబు తానేను"!

abkprasad2006@yahoo.co.in

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, తిథి: శు.పాడ్యమి రా.12.19 వరకు, తదుపరి విదియ, నక్షత్రం: పుష్యమి పూర్తి (24గంటలు), వర్జ్యం: ప.1.31 నుండి 3.17 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.12 నుండి 9.05 వరకు తదుపరి రా.10.58 నుండి 11.44 వరకు, అమృతఘడియలు: రా.12.01 నుండి 1.47 వరకు; రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు, యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు, సూర్యోదయం: 5.37, సూర్యాస్తమయం: 6.34.

డాక్టర్ సమరానికి గోల్డ్‌మెడల్ ప్రదానం

రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా అందుకున్న సమరం



లబ్బీపేట(విజయవాడ తూర్పు): కరోనా సమయంలో విశేష సేవలు అందించిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ డాక్టర్ జి.సమరానికి జాతీయ స్థాయిలో గోల్డ్‌మెడల్ లభించింది. సోమవారం న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వార్షిక సమావేశంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సమరాన్ని హరియాణా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ గవర్నర్లు బండారు దత్తాత్రేయ, విశ్వభూషణ్ హరిచందన్, తమిళిసై, తదితరులు అభినందనలు తెలియజేశారు

దుర్గమ్మ చీరల టెండర్ రూ.4.21 కోట్లు

- పాట దక్కించుకున్న పావని కలెక్షన్స్
- రెండేళ్ల కాల వ్యవధికి టెండర్


ఆలయ ప్రాంగణంలో సారెతో చైర్మన్ రాంబాబు, ఈవో భ్రమరాంబ

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భక్తులు సమర్పించిన చీరలను పోగు చేసుకుని విక్రయించుకునే హక్కు కోసం దేవస్థానం సోమవారం టెండర్లు ఆహ్వానించింది. బహిరంగ వేలంలో టెండర్‌ను విజయవాడకు చెందిన పావని కలెక్షన్స్ ఏడాదికి రూ.4.21 కోట్లకు దక్కించుకుంది. దుర్గగుడికి చెందిన బ్రాహ్మణ వీధిలోని జమ్మిదొడ్డి ఆవరణలోని బోర్డు మీటింగ్ హాల్‌లో టెండర్ల ప్రక్రియ కొనసాగింది. ఈ టెండర్లు, బహిరంగ వేలం, సీల్డ్ టెండర్లు విధానం ద్వారా దేవస్థానం టెండర్లు ఆహ్వానించింది. రూ.50 లక్షలు ప్రథమ ధరావత్తుగా చెల్లించిన మెలిన్ యజమాని ఎం.హరీష్, రేఖా శిల్క్స్, పావని కలెక్షన్ వేలంలో పాల్గొనగా, దేవస్థానం పాటను రూ.3.30 కోట్లుగా నిర్ణయించింది. పావని కలెక్షన్స్ రూ.4,21,50,000లకు పాట దక్కించుకుంది. ఇక సీల్డ్ టెండర్, ఈ టెండర్లను ఎవరూ దాఖలు చేయకపోవడంతో బహిరంగ వేలాన్ని ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. టెండర్‌ను అప్పగించిన తేదీ నుంచి రెండేళ్ల గడువులో అమ్మవారికి భక్తులు సమర్పించే చీరలను పోగు చేసుకుని విక్రయించుకునే వీలు కలుగుతుంది. రెండో ఏడాది టెండర్ మొత్తానికి అదనంగా మరో పది శాతం కలిపి దేవస్థానానికి చెల్లించాల్సి ఉంటుందని ఆలయ అధికారులు పేర్కొన్నారు. 72 గంటల్లో పాట మొత్తంలో 50 శాతం చెల్లించాలని, కమిషనర్ అనుమతి వచ్చిన వెంటనే మిగిలిన మొత్తం చెల్లించాలని సూచించారు.

ఇంద్రకీలాద్రిపై ముగిసిన ఆషాఢ మాసోత్సవాలు

ఇంద్రకీలాద్రిపై ఆషాఢ మాసోత్సవాలు సోమవారంతో ముగిశాయి. దేవస్థానం తరపున ఈవో భ్రమరాంబ అమ్మవారికి సారె సమర్పించారు. బ్రాహ్మణవీధిలోని జమ్మిదొడ్డి ఆవరణలో ఉన్న రావిచెట్టు వద్ద అమ్మవారి ఉత్సవ మూర్తులకు పూజలు చేశారు. అనంతరం సారెతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. మూలవిరాట్‌ను దర్శించుకుని సారెను సమర్పించారు. అలాగే మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవమూర్తికి సారె సామాగ్రిని సమర్పించారు. చైర్మన్ కర్నాటి రాంబాబు పాల్గొన్నారు.

సంద్రంలో మత్స్యకారుడు మృతి


పేర్ల గోపి (ఫైల్)

గార: శ్రీకాకుళం జిల్లా గార మండలం బందరువానిపేటలో సోమవారం వేకువజామున ధోని అప్పారావు బోటులో బయలుదేరిన ఐదుగురు మత్స్యకారుల్లో పేర్ల గోపి (49) అనే వ్యక్తి వల విసురుతూ సముద్రంలో పడిపోయి పెద్దరాతిని ఢీకొట్టి మృతి చెందాడు. పడవలో బయల్దేరిన మూడు గంటల తర్వాత గోపీ ముందుగా వల విసిరాడని, వెంటనే అదే వలతో పాటు సంద్రంలో పడిపోయాడని తోటి మత్స్యకారులు చెబుతున్నారు. హుటాహుటిన తోటి పడవల వారిని పిలిచి గాలించగా అప్పటికే మృతి చెందాడని తెలిపారు. అధికారులు మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు.

నేడు శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల కోటా విడుదల

తిరుమల: టీటీడీ షెడ్యూల్ ప్రకారం తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్ల కోటాను విడుదల చేసింది. అక్టోబర్ నెలకు సంబంధించిన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళపాదపద్మారాధన ఆర్జిత సేవల ఆన్‌లైన్ లక్కీడిప్ కోసం మంగళవారం ఉదయం 10 గంటల నుంచి ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. లక్కీడిప్‌లో టికెట్లు పొందిన భక్తులు సొమ్ము చెల్లించి వాటిని ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. కళ్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్ సేవ, సహస్రదీపాలంకార సేవా టికెట్లను ఈ నెల 21వ తేదీ ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. అక్టోబర్ నెల అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను ఈ నెల 24వ తేదీ ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు. భక్తులు ఈ విషయాలను గమనించి https://tirupatibalaji.ap.gov.in వెబ్‌సైట్‌లో సేవా టికెట్లను బుక్ చేసుకోవాలని టీటీడీ కోరుతోంది.

తిరుపతి-మదనపల్లెకు 12 విద్యుత్ బస్సులు

తిరుపతి అర్బన్: తిరుపతి-మదనపల్లె మార్గంలో సోమవారం నుంచి 12 విద్యుత్ బస్సులు ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చాయి. తిరుపతి నుంచి ఉదయం 5 గంటలకు, ఆ తర్వాత 6, 7, 8, 9, 9.40, 10, 11, 12, 13.20, 13.40, 14, 15, 16, 17.20, 18, 19, 20, 20, 20, రాత్రి 20.45 గంటల వరకు విద్యుత్ బస్సులను ఏర్పాటు చేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
స్పెషల్ కలెక్టర్ (భూ సేకరణ) వారి కార్యాలయం, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

Ref.C1/158/2022, తేది.17.07.2023

ఫారం నెం - VI (ఎ)

(2013 వ సంవత్సరం 30 వ చట్టం భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014 లో రూల్ 19, సబ్‌రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువ షెడ్యూల్ లో చూపబడిన పశ్చిమగోదావరి జిల్లా వేలేరుపాడు మండలం, తూర్పుమెట్ట H/o నార్లవరం గ్రామము నందలి ప్రజా ప్రయోజనమునకై అనగా కాంటూర్ + 41.5 ఆఫ్ పోలవరం ఇరిగేషన్ ప్రోజెక్టు ముంపునకు గురయ్యే నిమిత్తం భూమి కావలయునని స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రోజెక్టు, రాజమహేంద్రవరం వారు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, 2013వ సంవత్సరము, 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) నిబంధనలనుసరించి ఈ విషయము గురించి ఇందుకు సంబంధించిన యావన్మందికి యెరుక నిమిత్తం ఇందుమూలముగా నోటీసు జారీచేయబడినది.

పోలవరం ఇరిగేషన్ ప్రోజెక్టు కు సంబంధించిన పర్యావరణ ప్రభావ మదింపు క్లియరెన్స్ భారత ప్రభుత్వం వారి అటవీ మరియు పర్యావరణ మంత్రిత్వశాఖ వారి లేఖ నెం.జె 12011/74/2005-A1, తేది. 25.10.2005 ప్రకారం జారీచేయబడినది.

స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రోజెక్టు, రాజమహేంద్రవరం వారు చట్టంలోని విభాగము12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించెదరు. స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రోజెక్టు, రాజమహేంద్రవరం వారు / స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, యూనిట్-2, ఏలూరు వారికి, వారి సిబ్బందికి, పనివారికి ఇందుములముగా అధికారం ఇవ్వబడినది. పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి,ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుండి ప్రత్యేక కలెక్టర్ (భూసేకరణ) , పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం/ ప్రత్యేక ఉపకలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన, కాలువ, యూనిట్-2, ఏలూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకం/ కొనుగోలు (క్రయ విక్రయములు) లేదా ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని తెలియచేయడమైనది.

పై చట్టంలో సెక్షన్ 15 ననుసరించి భూసేకరణ పై ఏవైనా అభ్యంతరములు/ఆక్షేపణలు ఉన్న యెడల సంబంధించిన వ్యక్తి/వ్యక్తులు ఈ ప్రకటనలు ప్రచురించబడిన తేది నుండి 60 (అరువది) దినములలోగా ప్రత్యేక కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రోజెక్టు, రాజమహేంద్రవరం/ప్రత్యేక ఉప కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ, యూనిట్-2, ఏలూరు వారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

జిల్లా : ఏలూరు | మండలం వేలేరుపాడు | గ్రామము: తూర్పుమెట్ట H/o నార్లవరం

క్ర. నెం.	రైతు పేరు	వర్గీకరణ	సర్వే.నెం	విస్తీర్ణం య.సెంట్లు	కట్టడములు యొక్క వివరములు మరియు ఇతరములు	కట్టడములు యొక్క వివరములు మరియు ఇతరములు
1	కప్పలూరు సీతమ్మ భర్త: చిన్న బుజ్జి	పుంజ	25	3.45	....	....
	మొత్తం			3.45		

సం/- ఎస్. సరళ వందనం, స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
స్పెషల్ కలెక్టరు(భూసేకరణ) వారి కార్యాలయం, ఒంగోలు
ది ప్రకాశం జిల్లా భూసేకరణ ప్రకటన

ఆర్.సి.నెం. C/187/2020 తేది.03-07-2023

ఫారమ్ నెం. VII

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారము పొందే హక్కు, పారదర్శకత చట్టంలోని సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 25, సబ్ రూల్ (1) ననుసరించి)

రూఢీ ప్రకటన

క్రింది షెడ్యూలులో నిర్దిష్ట పరచిన భూములను మరియు వాటి విస్తీర్ణములను ప్రజా ప్రయోజనముకై అనగా కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ రిజర్వాయర్ ప్రాజెక్ట్ కు సంబంధించి దుద్దుకూరు గ్రామము ఇంకొల్లు మండలము **18 T.E Branch Canal** నిర్మాణము కొరకు భూమి కావలయునని శ్రీ స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్, ఒంగోలు వారు భావించు చున్నందున, 2013 సం.వ 30వ చట్టములోని 15వ విభాగం ప్రకారము సదరు భూముల యందు ఆసక్తి గల వ్యక్తుల నుండి వచ్చిన అభ్యంతరములు పై విచారణ జరిపిన పిమ్మట శ్రీ స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్, ఒంగోలు వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలు ధాఖల భూములను ప్రజా ప్రయోజనముల నిమిత్తము భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు.

రూఢీ ప్రకటన

శ్రీయుత స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ), వారు 2013 సం.వ 30 చట్టములోని 19(1) విభాగము ననుసరించి ఈ దిగువ నుదహరించి షెడ్యూలులో దాఖలా భూములు మరియు షుమారుగా వాటి విస్తీర్ణములను ప్రజా ప్రయోజనముకై అనగా కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ రిజర్వాయర్ ప్రాజెక్ట్ కు సంబంధించి 18 **T.E Branch Canal** నిర్మాణము కొరకు భూములు అవసరమైనవని ఇందు మూలముగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

జిల్లా ః బాపట్ల | మండలము ః ఇంకొల్లు | గ్రామము ః దుద్దుకూరు

క్రమ సంఖ్య	సర్వే నెం	మొత్తం విస్తీర్ణము ఎ.సెంట్లు	కాలువ క్రింద తీసుకున్న విస్తీర్ణము ఎ.సెంట్లు	భూస్థితి	సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా	సరిహద్దులు ఉత్తరం సర్వేనెం స.డి. నెం	దక్షిణం సర్వేనెం స.డి. నెం	తూర్పు సర్వేనెం స.డి. నెం	పడమర సర్వేనెం స.డి. నెం	రిమార్కులు
1	2	3	4	5	6			7		8
1	89/2బి	13.56	1.18	సర్కారు పుంజ	ఉప్పల సోమయ్య తండ్రి బసవయ్య	89/2A	89/3	89/2C	972	
2	89/2డి		0.69	సర్కారు పుంజ	మదాల శ్రీదేవి భర్త శ్రీనివాసరావు	89/1	89/2C	90/2B	89/2A	
3	90/1F2	10.65	1.10	ఇనాం పుంజ	మల్లెం అంకులు తండ్రి వెంకటస్వామి	90/1F1	90/1F3	61	90/2B	
4	97/2		0.60	సర్కారు పుంజ	కుర్రా సదానందరావు తండ్రి వెంకటేశ్వర్లు					
5	97/2	10.26	0.47	సర్కారు పుంజ	కుర్రా అప్పారావు తండ్రి వెంకటేశ్వర్లు	97/1	97/3	89/2 A2B	185/2	
6	97/2		0.47	సర్కారు పుంజ	కుర్రా శ్యాంప్రసాద్ తండ్రి వెంకటేశ్వర్లు					
7	108/1	17.54	0.45	సర్కారు పుంజ	మాదాల రాంబాబు తండ్రి వీరయ్య	180/2 181/2E	108/2	108/2	104/3 B	
8	104/3 B		0.60	సర్కారు పుంజ	మాదాల రాంబాబు తండ్రి వీరయ్య					
9	104/3 B	17.64	1.45	సర్కారు పుంజ	మాదాల శ్రీనివాసరావు తండ్రి వెంకటేశ్వర్లు	104/2	104/4 106/2C	104/4	104/2	
10	104/3 B		0.90	సర్కారు పుంజ	మాదాల మమత భర్త గోరంట్ల రామక్రిష్ణ					
11	106/2 A	6.39	0.54	సర్కారు పుంజ	గరికపాటి కోటేశ్వరరావు తండ్రి వెంకటేశ్వర్లు	106/1	106/3	106/2B	174/2B	
12	106/2B		0.55	సర్కారు పుంజ	గరికపాటి లక్ష్మీనారాయణ తండ్రి వెంకటేశ్వర్లు	106/1	106/3	106/2C	106/2A	
13	108/2 D	6.94	0.20	సర్కారు పుంజ	ఉప్పల వెంకటరామయ్య తండ్రి బసవయ్య	174/1B	108/2A 2B	108/3	108/2C	
14	174/1 B	0.66	0.42	సర్కారు పుంజ	ఉప్పల వెంకటరామయ్య తండ్రి బసవయ్య	174/1A	108/2C 2D	106/2 A	174/2A 2B	
15	111/1B1	8.65	0.09	సర్కారు పుంజ	చిగురుపాటి శేషయ్య తండ్రి నాయుడు	109/2	111/1 B3	111/1 C	111/1 B2	
16	111/1B2		0.63	సర్కారు పుంజ	మాదాల నీరజ D/o నారాయణ స్వామి	109/2	111/1 B3	111/1B1	111/1 A	
17	126/2	0.84	0.38	సర్కారు పుంజ		127/2	రాచపూడి పొలిమేర	125/A1	126/1	
	127/2	19.10	0.34	సర్కారు పుంజ	జెట్టి చెన్నకేశవులు తండ్రి కోటేశ్వరరావు	127/1	126/2	125/1 A1	127/1	
	125/1 A1	4.24	0.21	సర్కారు పుంజ		124/2	రాచపూడి పొలిమేర	125/ A2	127/1	
		మొత్తము	11.27							

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మరియు భూసేకరణ అధికారి కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ రిజర్వాయర్ ప్రాజెక్ట్ కార్యాలయము, ఒంగోలు నందు సదరు భూముల ప్లాను ఉంచినందున పని దినములలో కార్యాలయపు వేళల యందు పరిశీలించు కొనవచ్చును.

భూసేకరణ వలన పునరావాస పునఃనిర్మాణము చేయవలసి వచ్చు కుటుంబముల సంఖ్య లేనందువలన పునరావాస స్థలము గుర్తించ బడలేదు.

ప్రాజెక్ట్ నిర్మాణ దశలో అవసరమైన బాగములో గనులు మరియు ఖనిజములు త్రవ్వుట/ తొలగించుట/వినియోగించుట తప్ప భూసేకరణ షెడ్యూలు మిగిలిన భూములలో ఉన్న బొగ్గు గనులు, ఇనుప రాయి, పలక రాయి లేదా ఇతర ఖనిజములు అవసరము లేదు.

స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (యల్.ఎ)
ఆర్ అండ్ ఆర్ యూనిట్, ఒంగోలు

సం//-కె. చెన్నయ్య, (FAC)
స్పెషల్ కలెక్టరు (యల్.ఎ), పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు, ఒంగోలు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

నిట్ నెం.04/టి.ఓ/2023-24/భీమవరం తేది: 10-07-2023

పశ్చిమగోదావరి జిల్లా (ర.భ) భీమవరం డివిజన్‌లో రహదారి మరమ్మతు 11 పనులకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. **అంచనా వ్యయం: రూ.151.24 లక్షలు.** టెండరు షెడ్యూళ్ళను డౌన్‌లోడ్ చేసుకొను చివరి తేది: 28-07-2023 మ.2.00 గం.ల వరకు. వివరాలు: https://tender.apeprocurement.gov.in

సం/- కార్యనిర్వాహక ఇంజినీర్, (ర.భ) డివిజన్, భీమవరం
DIPR RO No.10214/CL/Advt/1/1/2021-22, Dt.17.07.2023

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు & భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

NIT No.CE(R&B)NH&CRF/3/CRF/ROBs/2023-24 తేది: 14-07-2023

విశాఖపట్నం, పశ్చిమ గోదావరి & గుంటూరు జిల్లాలలో రూ.261.74 కోట్ల మొత్తం విలువ గల సేతు బంధన్ CRIF స్కీమ్ క్రింద 3 పనుల కోసం ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరుదార్లు 26-07-2023న సా.4.00 గం॥ నుండి ఇ-మార్కెట్‌ప్లేస్ అంటే : www.tender.apeprocurement.gov.in నుండి టెండరు షెడ్యూళ్ళను డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. టెండర్ల స్వీకరణకు ఆఖరి తేది, సమయం 10-08-2023న సా.4.00 గం॥ వరకు.

సం/- చీఫ్ ఇంజనీర్ (R&B) నేషనల్ హైవేస్ & CRF
DIPR RO No.10207/CL/Advt/1/1/2021-22, Dt. 17.07.2023

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య శాఖ

నెం.113 టు 187/టిఓ/2023-24, **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు** తేది: 15-07-2023

కార్యనిర్వాహక ఇంజనీర్, ఆర్.డబ్ల్యు.ఎస్ & ఎస్ డివిజన్, భీమవరం పరిధిలోని 75 పనులు చేయుటకు రూ.1649.08 లక్షలతో ఆన్‌లైన్ టెండర్లు కోరడమైనది. టెండరు తీసుకొను ఆఖరి తేది: 02-08-2023, మ.3.00 గం. వరకు. తదుపరి వివరాలను www.apeprocurement.gov.in లో చూడగలరు. ఫోన్ నెం.: 8074658111.

సం/- కార్యనిర్వాహక ఇంజనీర్, ఆర్.డబ్ల్యు.ఎస్ & ఎస్ డివిజన్, భీమవరం
DIPR RO No.10210/CL/Advt/1/1/2021-22, Dt.17.07.2023

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
సమగ్ర శిక్షా, అమరావతి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా నిర్వహించబడుచున్న పాఠశాలల ఉపాధ్యాయుల కోసం 3 నుండి 10 గ్రేడ్ల అన్ని సబ్జెక్టుల కోసం టీచర్ సపోర్ట్ మెటీరియల్ మరియు కంటెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం (CMS) అభివృద్ధి చేయడానికి పటమట, విజయవాడ వద్ద సమగ్ర శిక్షా, అమరావతిలో ఆసక్తి వ్యక్తీకరణ (EoI) EoI Ref No.01/APSS/EOI/CMS/2023-24, తేది: 17.07.2023 కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఆసక్తి వ్యక్తీకరణ కోరబడుచున్నది. EoI డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 18.07.2023 మ.03.00 గం. నుండి. EoI స్వీకరణకు చివరి తేది: 16.08.2023 మ.03.00 గం. వరకు. గమనిక: తదుపరి వివరాలను https://tender.apeprocurement.gov.in లో చూడవచ్చును లేదా సంప్రదించండి 0866-2428599, 9972925761

సం/- స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్
DIPR RO No.2217PP/CL/Advt/1/1/2021-22, Dt: 17.07.2023

GOVERNMENT OF ANDHRA PRADESH
Andhra Pradesh Maritime Infrastructure Development Corporation Limited (APMIDCL)
e-Procurement cum Reverse Tendering (2nd call)

Tender No. 02/SE/FH-APMIDCL/2023-24 Dt. 14.07.2023

Online Tenders are invited for the following work.

1. Construction of 3-Fish Landing Centres at Bheemili in Visakhapatnam District, Rajayyapeta, Anakapalli District and Chintapalli in Vizianagaram District of Andhra Pradesh.

The details can be viewed and downloaded online directly through www.tender.apeprocurement.gov.in from 19.07.2023 onwards. Last date for submission of online Tenders is 04.08.2023 till 4.00PM.

Sd/- Superintending Engineer, APMIDCL, Mangalagiri
DIPR RO No. 2215PP/CL/Advt/1/1/2021-22, Dt: 17.07.2023

కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లి., మచిలీపట్నం.

ఖాతాదారులు క్లెయిమ్ చేయని అకౌంట్ డిపాజిట్లు వాటి అసలైన యజమానులు / హక్కుదారులకు తిరిగి చెల్లించుటకు

కృష్ణాజిల్లా సహకార కేంద్రబ్యాంకు లిమిటెడ్, మచిలీపట్నం వారు తమ బ్యాంక్ యొక్క "క్లెయిమ్ చేయబడని డిపాజిట్లు" (ఆర్‌బిఐ డిఇఎ ఫండ్ బదిలీ చేసిన డిపాజిట్లను) గుర్తించుటకు మరియు తిరిగి చెల్లించుటకు సెప్టెంబర్ 08, 2023 వరకు "100 రోజులు 100 చెల్లింపులు" క్యాంపైన్‌ను రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) వారి మార్గదర్శకాల ప్రకారం ప్రారంభించుట జరిగినది. మరిన్ని వివరములు, ఖాతా నిర్వహణ, కెవైసి (ఆధార్ కార్డ్, పాన్‌కార్డ్ మొదలగునవి) మరియు అవసరమైన ఇతర క్లెయిమ్ సెటిల్‌మెంట్ కోసం మీ దగ్గరలో వున్న కృష్ణాజిల్లా సహకార కేంద్రబ్యాంక్ శాఖను సంప్రదించవలసినదిగా కోరబడుచున్నది.

ఇట్లు, ముఖ్య కార్యనిర్వహణాధికారి,
కె.డి.సి.సి.బ్యాంకు లి., మచిలీపట్నం.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్

R.C.No.1593697/E1/2023 **ప్రకటన** తేది: 17-07-2023

వివిధ ESI ఇన్‌స్టిట్యూషన్స్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్స్/ డెంటల్ అసిస్టెంట్ సర్జన్‌గా ప్రాథమికంగా ఒక సంవత్సర కాలవ్యవధి కోసం కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేయడానికి రీఎంప్లాయిమెంట్ కోసం వాక్-ఇన్ రిక్రూట్‌మెంట్‌కు ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్, ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ప్రభుత్వ పదవీ విరమణ పొందిన ఉద్యోగులను ఆహ్వానిస్తున్నారు. సదరు కాలవ్యవధి సంతృప్తికరమైన సర్వీస్ మరియు ఇతర అర్హతా ప్రమాణాలకు లోబడి పొడిగించబడినది. ఖాళీల సంఖ్య సివిల్ అసిస్టెంట్ సర్జన్స్-46 మరియు డెంటల్ అసిస్టెంట్ సర్జన్-1. ప్రభుత్వ పదవీ విరమణ పొందిన ఉద్యోగులు కావలసిన మేరకు లభించనట్లయితే, మిగతా ఖాళీల కోసం కాంట్రాక్టు ప్రాతిపదికన తాజా మెడికల్ గ్రాడ్యుయేట్స్ పరిశీలించబడతారు. సవివరమైన ప్రకటన https://dimsap.uat.dcservices.in/IMCS లో లభిస్తుంది. వాక్-ఇన్ రిక్రూట్‌మెంట్ తేది: 24.07.2023, ప్రదేశం: ESI ఆసుపత్రి, విజయవాడ గుణదల క్యాంపస్.

సం/- వి. అంజనేయులు, IRTS, డైరెక్టర్-ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్
DIPR RO No.2216PP/CL/Advt/1/1/2021-22, Dt:17.07.2023

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
స్పెషల్ కలెక్టరు(భూసేకరణ) వారి కార్యాలయం, ఒంగోలు
ది ప్రకాశం జిల్లా భూసేకరణ ప్రకటన

లేఖ నెం. ఆర్.సి.బి/89/2023 తేది.09-07-2023

ఫారం నెం. VI (ఎ)

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారము పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19, సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖలు భూములను ప్రజా ప్రయోజనమునకై పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు అప్రోచ్ రోడ్ నిమిత్తము కావలయునని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, 2013వ సంవత్సరము 30వ చట్టము వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారము పొందే హక్కు, పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) నిబంధనలననుసరించి ఇందుకు సంబంధించిన యావన్మందికి ఇందుమూలముగా నోటీసు జారీచేయడమైనది.

పైన పేర్కొనిన చట్టంలోని సెక్షన్-3 (ఇ) మరియు రూల్ 2 (బి) 12 క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించి ప్రత్యేక ఉపకలెక్టరు, భూసేకరణ మరియు ఆర్ & ఆర్ యూనిట్, మార్కాపురం వారికి, వారి సిబ్బందికి మరియు పనివారలకు ఆ భూముల భూసేకరణకై పై సెక్షన్ క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించుటకు అధికారము ఇవ్వబడినది.

పై చట్టంలోని సెక్షన్ 11 (4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుంచి కలెక్టరు / భూసేకరణ అధికారి వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకం / కొనుగోలు (క్రయవిక్రయములు) లేదా ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి భూసేకరణ ఏమైనా అభ్యంతరములు / ఆక్షేపణలు ఉన్న యెడల సంబంధించిన వ్యక్తి / వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 60 (అరువది) దినములలోగా కలెక్టరు / భూసేకరణ అధికారి వారి ఎదుట అభ్యర్ధనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

జిల్లా ః ప్రకాశం | మండలము ః పెద్దారవీడు | గ్రామము ః దేవరాజుగట్టు


క్రమ సంఖ్య	సర్వే నెం	పూర్తి విస్తీర్ణము య.సెం	తరగతి / భూస్థితి	భూసేకరణక్రింద విస్తీర్ణము	సంబంధిత ఆసామీ పేరు (పట్టాదారు) మరియు చిరునామా	సంబంధిత ఆసామీ పేరు (అనుభవదారు) మరియు చిరునామా	సరిహద్దులు తూ	ప	ఉ	ద	చెట్లు మరియు కట్టడముల వివరాలు
1	2	3	4	5	6	7	8	9	10	11	12
	124/1ఎ1	1.83	సర్కారు పుంజ	0.08	పోతిరెడ్డి వెంకటరెడ్డి తండ్రి వీరయ్య మరియు ఇతరులు	పోతిరెడ్డి వెంకటరెడ్డి తండ్రి వీరయ్య మరియు ఇతరులు	124/1ఎ3	189	119	124/1ఎ2	ఆర్చి మరియు బస్ షెల్టర్ కొరకు
1	124/1ఎ2	1.83	సర్కారు పుంజ	0.54	పోతిరెడ్డి వెంకటరెడ్డి తండ్రి వీరయ్య మరియు ఇతరులు	పోతిరెడ్డి వెంకటరెడ్డి తండ్రి వీరయ్య మరియు ఇతరులు	124/1ఎ3	189	124/1ఎ1	124/1బి1	తార్ ప్లాంట్
2	124/1బి1	2.98	సర్కారు పుంజ	0.36	పోతిరెడ్డి వెంకటరెడ్డి తండ్రి వీరయ్య మరియు ఇతరులు	పోతిరెడ్డి వెంకటరెడ్డి తండ్రి వీరయ్య మరియు ఇతరులు	124/1బి2	187	124/1ఎ2	124/3ఎ	తార్ ప్లాంట్
3	124/3ఎ	14.09	సర్కారు పుంజ	0.60	అన్నా ఎడ్యుకేషనల్ సొసైటీ, మార్కాపురం మరియు ఇతరులు	అన్నా ఎడ్యుకేషనల్ సొసైటీ, మార్కాపురం మరియు ఇతరులు	125 3బి	186	124 1బి2	125	మల్బరి వేపచెట్లు
4	125/1ఎ	2.09	సర్కారు పుంజ	0.07	గోళ్ళ సురేంద్ర నాద్ తండ్రి సత్యన్నారాయణ మరియు ఇతరులు	గోళ్ళ సురేంద్ర నాద్ తండ్రి సత్యన్నారాయణ మరియు ఇతరులు	125/1బి	186	124	125/2ఎ1	మల్బరి వేపచెట్లు
5	125/2ఎ1	1.02	సర్కారు పుంజ	0.04	బట్టగిరి రామకృష్ణారెడ్డి తండ్రి చంద్రారెడ్డి	బట్టగిరి రామకృష్ణారెడ్డి తండ్రి చంద్రారెడ్డి	125/2ఎ2	186	125/1ఎ	125/2బి1	ప్లాట్లు
6	125/2బి1	1.02	సర్కారు పుంజ	0.04	బట్టగిరి రామకృష్ణారెడ్డి తండ్రి చంద్రారెడ్డి	బట్టగిరి రామకృష్ణారెడ్డి తండ్రి చంద్రారెడ్డి	125/2బి2	186	125/2ఎ1	125/2సి1	ప్లాట్లు
7	125/2సి1	1.02	సర్కారు పుంజ	0.04	బట్టగిరి సీతారామిరెడ్డి తండ్రి చంద్రారెడ్డి	బట్టగిరి సీతారామిరెడ్డి తండ్రి చంద్రారెడ్డి	125/2సి2	186	125/2బి1	127, 172	ప్లాట్లు
8	127/1ఎ	0.60	సర్కారు పుంజ	0.07	బట్టగిరి రామకృష్ణారెడ్డి తండ్రి చంద్రారెడ్డి	బట్టగిరి రామకృష్ణారెడ్డి తండ్రి చంద్రారెడ్డి	127/1బి	172	125	127 2ఎ	ప్లాట్లు
9	127/2ఎ	0.61	సర్కారు పుంజ	0.02	బట్టగిరి రామకృష్ణారెడ్డి తండ్రి చంద్రారెడ్డి	బట్టగిరి రామకృష్ణారెడ్డి తండ్రి చంద్రారెడ్డి	127/2బి	172	127/1ఎ	127/3ఎ	ప్లాట్లు
10	127/3ఎ	0.61	సర్కారు పుంజ	0.01	బట్టగిరి సీతారామిరెడ్డి తండ్రి చంద్రారెడ్డి	బట్టగిరి సీతారామిరెడ్డి తండ్రి చంద్రారెడ్డి	127/3బి	172	127/2ఎ	128	ప్లాట్లు
11	128/1ఎ1	0.10	సర్కారు పుంజ	0.01	బట్టగిరి రామకృష్ణారెడ్డి తండ్రి చంద్రారెడ్డి	బట్టగిరి రామకృష్ణారెడ్డి తండ్రి చంద్రారెడ్డి	128/1ఎ2	172	127	128/1ఎ2	ప్లాట్లు
12	128 2ఎ	3.34	సర్కారు పుంజ	0.26	సూర బైరెడ్డి కౌశిక్ తండ్రి పరమేశ్వరరెడ్డి మరియు ఇతరులు	సూర బైరెడ్డి కౌశిక్ తండ్రి పరమేశ్వరరెడ్డి మరియు ఇతరులు	128/2బి	172, 171	128/1ఎ1	128/2బి	ప్లాట్లు
13	156/1	2.12	సర్కారు పుంజ	0.14	ఈదర పద్మ భర్త శివారెడ్డి	ఈదర పద్మ భర్త శివారెడ్డి	149	169	1	156	ప్రత్తి
14	169/1బి	3.22	సర్కారు పుంజ	0.58	మెట్టు సూర్యనారాయణరెడ్డి తండ్రి పెద్దరంగారెడ్డి	మెట్టు సూర్యనారాయణరెడ్డి తండ్రి పెద్దరంగారెడ్డి	129	1ఎ	171, 128	169/2ఎ2	ప్లాట్లు
15	169/2ఎ2	2.81	సర్కారు పుంజ	0.16		కందుల సుబ్బారెడ్డి తండ్రి నాగిరెడ్డి	129, 148	2ఎ1	169/1బి	169/2సి2	ప్లాట్లు
16	169/2సి2	1.6725	సర్కారు పుంజ	0.14		కందుల సుబ్బారెడ్డి తండ్రి నాగిరెడ్డి	148	2డి/ఎ	169/2ఎ2	169/2డి1బి	ప్లాట్లు
17	169/2డి1బి	0.80	సర్కారు పుంజ	0.07	కందుల వెంకటసుబ్బారెడ్డి తండ్రి నాగిరెడ్డి	కందుల వెంకటసుబ్బారెడ్డి తండ్రి నాగిరెడ్డి	148	2డి2ఎ	169/2సి2	169/2డి2బి	ప్లాట్లు
18	169/2డి2బి	21.7475	సర్కారు పుంజ	0.77	గోగుల రమ్యదీప్తి భర్త కోటిరెడ్డి మరియు ఇతరులు	గోగుల రమ్యదీప్తి భర్త కోటిరెడ్డి మరియు ఇతరులు	149	2డి2ఎ	169/2డి1బి	157	రేకుల షెడ్డు-1 బోరు, పెన్సింగ్-3, గేట్-1
19	170/4బి	0.74	సర్కారు పుంజ	0.07	కందుల సుబ్బారెడ్డి తండ్రి నాగిరెడ్డి	కందుల సుబ్బారెడ్డి తండ్రి నాగిరెడ్డి	128, 129	4ఎ	-	4బి	ప్లాట్లు
20	171/3బి	2.77	సర్కారు పుంజ	0.28	కందుల సుబ్బారెడ్డి తండ్రి నాగిరెడ్డి	కందుల సుబ్బారెడ్డి తండ్రి నాగిరెడ్డి	128	3ఎ	-	169, 129	ప్లాట్లు
21	172/2	7.21	సర్కారు పుంజ	0.46	సాదుల లింగమ్మ భర్త మల్లారెడ్డి మరియు ఇతరులు	సాదుల లింగమ్మ భర్త మల్లారెడ్డి మరియు ఇతరులు	127, 128	1	-	1	టేకుచెట్లు, రాతిగోడ గేటు-1
22	185/2	2.87	సర్కారు పుంజ	0.19	పఠాన్ మోమిన్‌ఖాన్ తండ్రి గఫూర్ ఖాన్	పఠాన్ మోమిన్‌ఖాన్ తండ్రి గఫూర్ ఖాన్	-	184	186	173	ప్లాట్లు రస్తా
23	186/2	2.51	సర్కారు పుంజ	0.82	దూదేకుల నాగూర్ వలి తండ్రి చిన్న హుస్సేన్ మరియు ఇతరులు	దూదేకుల నాగూర్ వలి తండ్రి చిన్న హుస్సేన్ మరియు ఇతరులు	124, 125	173 183	187	172	ప్లాట్లు, రోడ్డు
24	187/1బి	2.46	సర్కారు పుంజ	0.01	గుమ్మా గంగరాజు తండ్రి లింగయ్య మరియు ఇతరులు	గుమ్మా గంగరాజు తండ్రి లింగయ్య మరియు ఇతరులు	124	1ఎ2ఎ	-	187/3బి	
25	187/3బి		సర్కారు పుంజ	0.14			124	3ఎ	187/1బి	186	ప్లాట్లు
	మొత్తం విస్తీర్ణము			5.97							

ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ)
ఆర్ అండ్ ఆర్ యూనిట్, మార్కాపురం

సం//- కె.చెన్నయ్య, (FAC)
ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ),
పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు, ఒంగోలు.

క్లుప్తంగా...

మరోసారి చంద్రయాన్‌-3 కక్ష్య దూరం పెంపు



సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సతీష్‌ ధవన్‌ స్పేస్‌ సెంటర్‌ షార్‌ నుంచి ఈనెల 13న ప్రయోగించిన చంద్రయాన్‌-3 మిషన్‌కు సోమవారం వేకువజామున రెండోసారి కక్ష్య దూరాన్ని పెంచే ప్రక్రియను విజయవంతంగా చేపట్టారు. ఎల్‌వీఎం3-ఎం4 ఉపగ్రహ వాహక నౌక ద్వారా చంద్రయాన్‌-3 మిషన్‌ను భూమికి దగ్గరగా 170 కిలోమీటర్లు, భూమికి దూరంగా 36,500 కిలోమీటర్లు ఎత్తులో భూమధ్యంతర కక్ష్యలోకి ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. మొదటి విడతలో భూమికి దగ్గరగా 173 కిలోమీటర్లు ఎత్తుకు, భూమికి దూరంగా 41,762 కిలోమీటర్లు ఎత్తుకు పెంచిన విషయం తెలిసిందే. ప్రొపల్షన్‌ మాడ్యూల్‌లో ఉన్న అపాజి ఇంధనాన్ని సోమవారం నిమిషం పాటు మండించి రెండోసారి కక్ష్య దూరాన్ని పెంచడంలో భాగంగా భూమికి దగ్గరగా 173 కిలోమీటర్ల ఎత్తును 223 కిలోమీటర్లకు, భూమికి దూరంగా 41,762 కిలోమీటర్ల ఎత్తును 42,000 కిలోమీటర్లకు విజయవంతంగా పెంచారు. మంగళవారం వేకువ జామున మూడోసారి కక్ష్య దూరాన్ని పెంచేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు ఏర్పాట్లు చేస్తున్నారు.

రూ.కోటి సంపాదించిన యూట్యూబర్‌ ఇంట్లో ఐటీ సోదాలు

న్యూఢిల్లీ: వీడియోల ద్వారా కోటి రూపాయలు సంపాదించిన యూట్యూబర్‌పై ఆదాయపన్ను(ఐటీ) శాఖ అధికారులు దాడి చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని బరేలీకి చెందిన తస్లీమ్‌ ఇంట్లో సోదాల్లో రూ.24 లక్షల నగదు లభించినట్లు అధికారులు తెలిపారు. గత కొన్నేళ్లుగా యూట్యూబ్‌ చానెల్‌ను నడుపుతున్న అతడు రూ.కోటి వరకు సంపాదించాడన్నారు. ఆ సొమ్మును అక్రమంగా ఆర్జించినట్లు ఆరోపించారు. బరేలీకి చెందిన తస్లీమ్‌ 'ట్రేడింగ్‌ హబ్‌ 3.0' పేరుతో షేర్‌మార్కెట్‌కు సంబంధించిన వీడియోలు చేస్తున్నాడు. ఆదాయ పన్ను కూడా చెల్లిస్తున్నామని తస్లీమ్‌ సోదరుడు ఫెరోజ్‌ చెప్పాడు. మొత్తం రూ.1.2 కోట్ల ఆదాయానికి గాను ఇప్పటికే రూ.4 లక్షలను ట్యాక్స్‌లుగా చెల్లించినట్లు తెలిపాడు. తాము ఎలాంటి తప్పూ చేయలేదన్నాడు. ఇదంతా కుట్ర ప్రకారమే జరిగిందని తస్లీమ్‌ తల్లి కూడా ఆరోపించారు.



ఏమో! కారు ఎగరావచ్చు..

కానీ!

నగరాల్లో విపరీతమైన వాహనాల రద్దీ, అధ్వాన్నమైన రహదారుల వల్ల సమయానికి గమ్యస్థానాలకు చేరుకోలేక ప్రయాణికులు విసుగెత్తిపోతుంటారు. ట్రాఫిక్‌ జంఝాటం లేకుండా హాయిగా ఆకాశంలో విహరిస్తూ వేగంగా దూసుకెళ్తే బాగుంటుందని అనుకోనివారు ఉండరు. అలాంటివారి కోసం అమెరికాలోని కాలిఫోర్నియాకు చెందిన అలెఫ్‌ ఏరోనాటిక్స్‌ సంస్థ ఎగిరే కారును(ఫ్లైయింగ్‌ కారు) అభివృద్ధి చేసిన సంగతి తెలిసిందే. 2015లో మొదలైన ఈ ఆలోచనకు పదునుపెట్టిన అలెఫ్‌ కంపెనీ 2019 నాటికి ఎగిరే కారును తయారు చేసింది. మోడల్‌-ఎ ఫ్లైయింగ్‌ కారును ఆవిష్కరించింది. కొన్ని రకాల పరీక్షల తర్వాత ఈ ఏడాది జూన్‌ 12న అమెరికా ఫెడరేషన్‌ ఏవియేషన్‌ అడ్మినిస్ట్రేషన్‌(ఎఫ్‌ఏఏ) ఈ కారుకు స్పెషల్‌ ఎయిర్‌వర్తీనెస్‌ సర్టిఫికెట్‌ అందజేసింది. అంటే పరిమిత ప్రాంతాల్లో ఫ్లైయింగ్‌ కారును ప్రదర్శించడానికి, దీనిపై పరిశోధన-అభివృద్ధి వంటి కార్యకలాపాల కోసం అనుమతి మంజూరు చేసింది. ఇదొక టర్నింగ్‌ పాయింట్‌ అని చెప్పాలి. ఇదంతా బాగానే ఉన్నప్పటికీ ఎగిరే కారు ప్రజలకు విస్తృతంగా అందుబాటులోకి రావడానికి సాంకేతికపరమైన, చట్టపరమైన ఎన్నో అవరోధాలు, సవాళ్లు ఉన్నాయి. వాటిని అధిగమిస్తేనే కారులో ఆకాశంలో స్వేచ్ఛగా ప్రయాణించడానికి అవకాశం ఉంటుంది.

- సాక్షి, నేషనల్‌ డెస్క్‌

అడ్డంకులూ ఉన్నాయ్‌
- ఫ్లైయింగ్‌ కారు నడపడానికి రెండు రకాల డ్రైవింగ్‌ శిక్షణ అవసరం
- నగరాల్లో శబ్ద, వాయు కాలుష్యం మితిమీరే అవకాశం
- గగన తలంలోనూ ప్రమాదాలకు ఆస్కారం
- అవరోధాలు అధిగమిస్తే సులువుగా ఆకాశయానం

విడిభాగాల లభ్యత ఎలా?

ఎక్కువ సంఖ్యలో ఎగిరే కార్లను తయారు చేయడానికి కొన్ని విడిభాగాలు విస్తృతంగా అందుబాటులో లేవని అలెఫ్‌ ఏరోనాటిక్స్‌ ముఖ్య కార్యనిర్వహణాధికారి జిమ్‌ డుఖోవ్నీ చెప్పారు. వాటిని సమకూర్చుకోవడం చాలా కష్టమని అన్నారు. ఉదాహరణకు ఫ్లైయింగ్‌ కారుకు ప్రయాణంలో ఎదురయ్యే ఒత్తిడిని తగ్గించడానికి హైలీ స్పెషలైజ్డ్‌ ప్రొపెల్లర్‌ మోటార్‌ సిస్టమ్స్‌ అవసరమని, అలాంటివి తయారు చేసుకోవడం శ్రమ, ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని తెలిపారు. ఎగిరే కారు ఎంత త్వరగా క్షేత్రస్థాయిలోకి వస్తుందన్నది దాని పరిమాణం, బరువు, ధర, అది ఎంతవరకు సురక్షితం అనేదానిపైనా ఆధారపడి ఉంటుందన్నారు.

సేఫ్టీ ఫీచర్ల మాటేమిటి?

అలెఫ్‌ కంపెనీ మోడల్‌-ఎ కార్ల విక్రయాల కోసం ఇప్పటికే ప్రి-ఆర్డర్లను స్వీకరిస్తోంది. ఒక్కో కారు ధరను 3 లక్షల డాలర్లుగా (రూ.2.46 కోట్లు) నిర్ధారించింది. మోడల్‌-ఎ అనేది అల్ట్రాలైట్‌, లో స్పీడ్‌ వెహికల్‌. చట్టప్రకారం ఈ మోడల్‌ కారు గోల్ఫ్‌ కార్ట్‌లు, చిన్నపాటి విద్యుత్‌ వాహనాల విభాగంలోకి వస్తుంది. ఫ్లైయింగ్‌ కారు కేవలం గాల్లో ఎగరడమే కాదు, రోడ్లపై కూడా సాధారణ వాహనాల్లాగే ప్రయాణిస్తుంది. దానికి అనుమతి రావాలంటే 'నేషనల్‌ హైవే ట్రాఫిక్‌ సేఫ్టీ అడ్మినిస్ట్రేషన్‌' మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాల్సి ఉంటుంది. అంటే సాధారణ కార్లలో ఉండే సేఫ్టీ ఫీచర్లన్నీ ఉండాలి. అలెఫ్‌ సంస్థ అభివృద్ధి చేసిన మోడల్‌-ఎ కారు రోడ్లపై ప్రయాణానికి అంతగా సురక్షితం కాదన్న వాదన వినిపిస్తోంది.

నడపడానికి లైసెన్స్‌ ఎవరిస్తారు?

కార్లు నడపాలన్నా, విమానాలు నడపాలన్నా కచ్చితంగా లైసెన్స్‌ ఉండాల్సిందే. ఫ్లైయింగ్‌ కార్లు నడపడానికి కూడా లైసెన్స్‌ అవసరం. డ్రైవింగ్‌ శిక్షణ ఎవరిస్తారు? లైసెన్స్‌లు ఎవరు జారీ చేస్తారన్న దానిపై స్పష్టత లేదు. ఇందుకోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీనిపై ప్రభుత్వాలదే తుది నిర్ణయం. నేలపై, గాలిలో నడపడానికి డ్రైవర్లు శిక్షణ తీసుకోవాలి. ఫ్లైయింగ్‌ కార్ల డ్రైవింగ్‌ లైసెన్స్‌లు జారీ చేయడానికి రవాణా, పౌర విమానయాన శాఖ సమన్వయంతో పని చేయాల్సి రావొచ్చు.


భారీ శబ్దాలు, కాలుష్యం

ఫ్లైయింగ్‌ కార్లు పరిమితమైన ఎత్తులోనే ఎగురుతాయి. భారీ శబ్దాలు, కాలుష్యం ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది. దీనివల్ల కొత్త సమస్యలు తప్పవు. ప్రజల్లో అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం లేకపోలేదు. ఏమాత్రం శబ్దం వెలువడని ఫ్లైయింగ్‌ కార్లు డిజైన్‌ చేయడం చాలా సంక్లిష్టమైన ప్రక్రియ అంటున్నారు. రోడ్లపై వాహనాలు ఢీకొంటున్నట్లుగానే గగనతలంలో వేగంగా దూసుకెళ్లే ఫ్లైయింగ్‌ కార్లు పరస్పరం ఢీకొనే అవకాశాన్ని కొట్టిపారేయలేం. ఎగిరే కార్లు భవనాలను ఢీకొని నేలకూలడానికి ఆస్కారం ఉంది. అదే జరిగితే నష్టం భారీగానే ఉంటుంది. ఈ సమస్యను పరిష్కరించాల్సి ఉంది. ఆకాశంలో ట్రాఫిక్‌ జామ్‌లు ఏర్పడకుండా ఎయిర్‌ ట్రాఫిక్‌ కంట్రోల్‌ తరహాలో ఎగిరే కార్ల రాకపోకల కోసం శాస్త్రీయమైన మార్గసూచిని రూపొందించాలి.

ధనవంతులకే సాధ్యమా?

ఇప్పుడున్న పరిస్థితిని బట్టి చూస్తే ఎగిరే కార్ల ధరలను సంపన్నులే భరించగలరు. కోట్లాది రూపాయలు వెచ్చించి ఇలాంటివి కొనేసే స్తోమత కొందరికే ఉంటుంది. నిర్వహణ ఖర్చులు, లైసెన్స్‌ ఫీజులు కూడా తక్కువేమీ కాదు. విమాన ప్రయాణం ప్రారంభమైన తొలి రోజుల్లో ధనవంతులకే పరిమితం అన్నట్లుగా ఉండేది. కానీ, ఇప్పుడు దిగువ మధ్యతరగతి ప్రజలు కూడా విమానాల్లో ప్రయాణిస్తున్నారు. ఫ్లైయింగ్‌ కార్ల విషయంలోనూ అలాంటి పరిణామం సాధ్యపడొచ్చు. ప్రభుత్వాలే ప్రజా రవాణా వ్యవస్థలో భాగంగా ఈ కార్లను ప్రవేశపెడితే సామాన్య ప్రజలు సైతం ఆకాశయానం చేయొచ్చు.

క్రిమియా వంతెనపై మళ్లీ పేలుడు



మాస్కో: ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలో రష్యా సైనిక సరఫరాలకు కీలకంగా మారిన క్రిమియా వంతెనపై మరోసారి పేలుడు సంభవించింది. సోమవారం జరిగిన డ్రోన్ల దాడితో వంతెనలో కొంతభాగం దెబ్బతింది. ఘటనలో దంపతులు మృతి చెందగా చిన్నారి గాయపడింది. దాడి కారణంగా వంతెనపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రైళ్ల రాకపోకలను మాత్రం ఆరుగంటలపాటు ఆపేశారు. దాడి వెనుక ఉక్రెయిన్‌ హస్తం ఉందని రష్యా ఆరోపించింది. ఉక్రెయిన్‌ ప్రయోగించిన రెండు సీ డ్రోన్ల వల్లే పేలుళ్లు జరిగాయని రష్యా దర్యాప్తు విభాగం తెలిపింది. ఉక్రెయిన్‌కు చెందిన క్రిమియా ద్వీపకల్పాన్ని 2014లో ఆక్రమించిన రష్యా తన ప్రధాన భూభాగాన్ని కలుపుతూ యూరప్‌లోనే అత్యంత పొడవైన 19 కిలోమీటర్ల భారీ వంతెనను నిర్మించింది. ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలో రష్యా సైనిక సరఫరాలకు ఇది అత్యంత కీలకంగా మారింది. యుద్ధం మొదలయ్యాక ఈ వంతెనపై మొదటిసారిగా గత ఏడాది అక్టోబర్‌లో ట్రక్కు బాంబు పేలుడు సంభవించింది. దీంతో, బ్రిడ్జిపై రాకపోకలకు కొన్ని నెలలపాటు అంతరాయం ఏర్పడింది. తాజాగా జరిగిన పేలుడుతో వంతెనలోని కొంత భాగం వంగి, కిందికి వేలాడుతూ కనిపిస్తున్న దృశ్యాలను స్థానిక వార్తా చానెళ్లు ప్రసారం చేశాయి. దీనిపై ఉక్రెయిన్‌ ప్రతినిధి అర్టెమ్‌ డెగ్టియారెంకో మాత్రం.. యుద్ధంలో తాము విజయం సాధించిన తర్వాత పేలుడుకు సంబంధించి వివరాలు వెల్లడిస్తామనడం గమనార్హం.

ఉక్రెయిన్‌ నుంచి ధాన్యం ఎగుమతులు బంద్‌!

ఉక్రెయిన్‌ నుంచి ఆఫ్రికా, మధ్యప్రాచ్యం, ఆసియాలోని పేద దేశాలకు ఆహార ధాన్యాలను రవాణా చేసేందుకు ఉద్దేశించిన ఒప్పందాన్ని రష్యా నిలిపేసింది. తమ దేశం నుంచి ఆహారం, ఎరువుల ఎగుమతులకు వీలు కల్పించే వరకు నల్ల సముద్రం మీదుగా జరిగే ధాన్యం రవాణాను అడ్డుకుంటామని సోమవారం స్పష్టం చేసింది. నల్లసముద్రం మీదుగా ఉక్రెయిన్‌ గోధుమలు, ఆహారధాన్యాలతో వెళ్లే ఓడలపై దాడి చేయకూడదనే షరతుతో తుర్కియే మధ్యవర్తిత్వంతో రష్యా, ఉక్రెయిన్‌ మధ్య ఏడాది క్రితం ఒప్పందం కుదిరింది. 120 రోజులకోసారి దీన్ని పొడిగిస్తూ వస్తున్నారు. మేలో దీనిని 60 రోజులకు మాత్రమే పొడిగించేందుకు రష్యా అంగీకరించింది. తాజాగా ఆ గడువు ముగియడంతో ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో పేద దేశాల్లో ఆహార ధరలకు రెక్కలు రావడంతోపాటు, పేదరికం మరింతగా పెరిగే ప్రమాదముందన్న ఆందోళనలున్నాయి.

అమెరికాలో భీకర వర్షాలు.. పిడుగులు

వాషింగ్టన్‌: అమెరికాలో పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. పిడుగులు పడుతుండడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. కనెక్టికట్‌, మసాచుసెట్స్‌, న్యూహ్యాంప్‌షైర్‌, న్యూయార్క్‌, రోడ్‌ఐలాండ్‌ తదితర ప్రాంతాల్లో ప్రభుత్వం వాతావరణ హెచ్చరికలు జారీ చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. భీకర వర్షాలకుతోడు పిడుగుల ముప్పు కారణంగా అమెరికాలో తాజాగా 2,600కుపైగా విమానాల రాకపోకలను రద్దుచేశారు. మరో 8,000 విమానాలు షెడ్యూల్‌ కంటే ఆలస్యంగా రాకపోకలు సాగించాయి. ప్రధానంగా ఈశాన్య అమెరికాలో వాతావరణం ప్రతికూలంగా మారింది. న్యూయార్క్‌, న్యూజెర్సీ, కనెక్టికట్‌, పెన్సిల్వేన్వియా, మసాచుసెట్స్‌, వెర్మాంట్‌లో వరద హెచ్చరికలు జారీ అయ్యాయి. ఇదిలా ఉండగా, పశ్చిమ, దక్షిణ అమెరికా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండ వేడిని తట్టుకోలేక జనం ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. కాలిఫోర్నియా రాష్ట్రంలోని డెత్‌ వ్యాలీలో ఏకంగా 52 డిగ్రీల సెల్సియస్‌ ఉష్ణోగ్రత నమోదయ్యింది.

శరద్‌ పవార్‌తో మరోసారి అజిత్‌ సమావేశం

ముంబై: నేషనలిస్ట్‌ కాంగ్రెస్‌ పార్టీ(ఎన్సీపీ) అధ్యక్షుడు శరద్‌ పవార్‌తో ఆయన సోదరుడి కుమారుడు, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్‌ పవార్‌ వరుసగా రెండోరోజు సోమవారం కూడా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అజిత్‌ వెంట ఆయన వర్గం నేతలు కూడా ఉన్నారు. ఎన్సీపీ ఐక్యంగా ఉండాలని, ఇందుకోసం అందరం ఒక్కటిగా కలిసి ఉందామని శరద్‌ పవార్‌ వద్ద వారు ప్రతిపాదించినట్లు సమాచారం. దీనిపై ఆయన ప్రతిస్పందించలేదని తెలిసింది. మహారాష్ట్ర శాసనసభలో ప్రతిపక్ష స్థానాల్లోనే కూర్చోవాలని శరద్‌ పవార్‌ వర్గం ఎన్సీపీ ఎమ్మెల్యే నిర్ణయించుకున్నారు. ఈ మేరకు వారుతీర్మానాన్ని స్పీకర్‌ ముందుంచారు. మరోవైపు మంగళవారం ఢిల్లీలో జరిగే ఎన్డీయే మిత్రపక్షాల సమావేశానికి ఎన్సీపీ చీలిక వర్గం నేతలు అజిత్‌ పవార్‌, ప్రఫుల్‌ పటేల్‌ హాజరు కానున్నారు.

పేరులో ఇండియా.. సారథిగా సోనియా!

విపక్షాల ఐక్యతా రాగం

'కలుద్దాం, నిలుద్దాం' నినాదం

- బెంగళూరులో మొదలైన కీలక మేధోమథనం
- కాంగ్రెస్‌తో పాటు పాల్గొంటున్న 26 విపక్షాలు
- బీజేపీకి ముకుతాడే లక్ష్యంగా రెండు రోజులు చర్చలు
- పాల్గొంటున్న సోనియా, రాహుల్‌, ఖర్గేతో పాటు మమత, నితీశ్‌, స్టాలిన్‌ తదితర విపక్ష సీఎంలు, కీలక నేతలు
- సాయంత్రం నుంచి రాత్రి విందు భేటీ దాకా మంతనాలు
- ఉమ్మడి కార్యాచరణ తదితరాలపై నేడు రోజంతా కీలక చర్చలు
- 2024 ఎన్నికలే లక్ష్యంగా రోడ్‌మ్యాప్‌ రూపకల్పన



బెంగళూరులో విపక్షాల భేటీ జరుగుతున్న హోటల్‌ వద్ద ఏర్పాటుచేసిన భారీ పోస్టర్‌. (ఇన్‌సెట్‌లో) ప్రధాన వేదిక వద్ద ఏర్పాటుచేసిన పోస్టర్‌

బెంగళూరు: 2024 ఎన్నికల్లో కేంద్రంలో అధికార బీజేపీని ఓడించడమే లక్ష్యంగా జాతీయ స్థాయిలో విపక్షాలు కొంతకాలంగా చేస్తున్న ముమ్మర ప్రయత్నాలు కీలక దశకు చేరుకున్నాయి. ఇందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు తలపెట్టిన రెండు రోజుల సమావేశాలు సోమవారం బెంగళూరులో మొదలయ్యాయి. కాంగ్రెస్‌ సహా 26 విపక్ష పార్టీల అధినేతలు, అగ్ర నేతలు సాయంత్రానికల్లా సమావేశ వేదిక వద్దకు చేరుకున్నారు. రాత్రి పొద్దుపోయేదాకా చర్చోపచర్చల్లో మునిగి తేలారు. బీజేపీని నిలువరించడమే ఏకైక అజెండాగా ఉమ్మడి కార్యాచరణకు రూపమిచ్చేందుకు మంగళవారం రోజంతా కీలక మేధోమథనం జరపనున్నారు. కాంగ్రెస్‌ అగ్ర నేత సోనియా సారథ్యంలో కొత్త కూటమి ఆవిర్భావం జరగవచ్చని తెలుస్తోంది. సోనియాతో పాటు కాంగ్రెస్‌ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ వద్రా, విపక్ష పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు నితీశ్‌కుమార్‌ (జేడీ-యూ), మమతా బెనర్జీ (తృణమూల్‌ కాంగ్రెస్‌), ఎంకే స్టాలిన్‌ (డీఎంకే), అరవింద్‌ కేజ్రీవాల్‌ (ఆప్‌)తో పాటు ఆర్జేడీ చీఫ్‌ లాలుప్రసాద్‌, జేఎంఎం నేత హేమంత్‌ సొరేన్‌, అఖిలేశ్‌ యాదవ్‌ (ఎస్పీ), ఉద్ధవ్‌ ఠాక్రే (శివసేన-యూబీటీ), ఫరూక్‌ అబ్దుల్లా (ఎన్సీ), మెహబూబా ముఫ్తీ (పీడీపీ), సీతారాం ఏచూరి (సీపీఎం), డి.రాజా (సీపీఐ), బిహార్‌ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్‌, జయంత్‌చదరి (ఆరెల్డీ), వైకో (ఎండీఎంకే) తదితరులు సోమవారం సమావేశంలో పాల్గొన్నారు. బెంగళూరు నగరమంతటా ఎటు చూసినా 'కలుద్దాం, నిలుద్దాం' నినాదంతో విపక్ష కూటమి నేతలందరి ఫొటోలతో కూడిన భారీ బ్యానర్లే కన్పించాయి. ఇక కాంగ్రెస్‌తో చిరకాలంగా ఉప్పూనిప్పుగా ఉన్న మమత విందు భేటీలో సోనియా పక్కనే కూర్చోవడం ప్రధానాకర్షణగా నిలిచింది. ఆ సందర్భంగా వారిరువురూ 20 నిమిషాల పాటు చర్చలు కూడా జరిపారు. పార్టీలో చీలికతో సతమతమవుతున్న ఎన్సీపీ అధినేత శరద్‌ పవార్‌ సోమవారం భేటీకి హాజరు కాలేదు. మంగళవారం కుమార్తె సుప్రియా సులేతో పాటు ఆయన చర్చల్లో పాల్గొంటారని విపక్ష వర్గాలు తెలిపాయి. విపక్షాలతో తలపడేందుకు తానొక్కన్నే చాలని గొప్పలకు పోయిన ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పుడు 30కి పైగా పార్టీలతో జట్టు కట్టేందుకు ఎందుకు తహతహలాడుతున్నారని ప్రశ్నించారు. జేడీ(ఎస్‌)తో పాటు బీజేపీ ఓటమి కోరే భావ సారూప్య పార్టీలన్నింటికీ కూటమిలోకి స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉన్నట్టు కాంగ్రెస్‌ నేత పవన్‌ ఖేరా తెలిపారు.

సయోధ్య ఏ మేరకు సాధ్యం?

అయితే పశ్చిమ బెంగాల్‌లో వామపక్షాలు-తృణమూల్‌ సహా పలు రాష్ట్రాల్లో విపక్షాల మధ్యే సహజ వైరం నెలకొని ఉన్న నేపథ్యంలో వాటి మధ్య సయోధ్య ఏ మేరకు సాధ్యమవుతుంన్నది ఆసక్తికరం. తృణమూల్‌తో బెంగాల్‌లో ఎలాంటి పొత్తూ ఉండబోదని సమావేశ వేదిక వద్దే సీపీఎం ప్రధాన కార్యదర్శి కుండబద్దలు కొట్టారు. అయితే, విపక్షాల ఓటు బ్యాంకులో చీలికను నివారించేందుకు కలిసి పని చేస్తామంటూ ముక్తాయించారు.

భేటీలో పాల్గొంటున్న పార్టీలు

కాంగ్రెస్‌, తృణమూల్‌ కాంగ్రెస్‌, ఆమ్‌ ఆద్మీ పార్టీ, సీపీఎం, సీపీఐ, ఆర్జేడీ, జేఎంఎం, ఎన్సీపీ, శివసేన (యూబీటీ), ఎస్పీ, జేడీ(యూ), ఎండీఎంకే, కేడీఎంకే, వీసీకే, ఆరెస్పీ, సీపీఐ-ఎంఎల్‌, ఫార్వర్డ్‌ బ్లాక్‌, అప్నాదళ్‌, మణిథనేయ మక్కల్‌ కచ్చి (ఎంఎంకే) సహా మొత్తం 26 పార్టీలు. వీటన్నింటికీ కలిపి లోక్‌సభలో 150 మంది దాకా ఎంపీల బలముంది!

కూటమి కన్వీనర్‌గా నితీశ్‌...?

కొత్త కూటమి పేరు కూడా మంగళవారం నాటి చర్చల అజెండాలో ఉన్నట్టు సమాచారం. ''ఇండియా అని వచ్చేలా కూటమికి ఆకర్షణీయమైన పేరును పార్టీలన్నీ సూచిస్తాయి. 'యునైటెడ్‌ వుయ్‌ స్టాండ్‌' అన్నది ట్యాగ్‌లైన్‌గా ఉండనుంది'' అని కాంగ్రెస్‌ వర్గాలు వెల్లడించాయి.

- అంతేగాక యూపీఏ చైర్‌పర్సన్‌గా వ్యవహరించిన సోనియాగాంధీని కొత్త కూటమి సారథిగా వ్యవహరించే అవకాశముందని చెబుతున్నారు.
- సామాజిక న్యాయం, సమ్మిళిత వృద్ధి, జాతీయ సంక్షేమమే ప్రధాన లక్ష్యాలుగా ఉమ్మడి కార్యాచరణ ఉంటుందని కాంగ్రెస్‌ వర్గాలు తెలిపాయి.
- కన్వీనర్‌గా బిహార్‌ సీఎం నితీశ్‌ కీలక బాధ్యతలు తీసుకోవచ్చు.
- కీలకమైన రాష్ట్రాలవారీగా పార్టీలవారీగా పోటీ చేయాల్సిన లోక్‌సభ స్థానాల సంఖ్యను ఖరారు చేసుకోవడం వంటివీ చర్చకు వస్తాయంటున్నారు.
- మంగళవారం భేటీ అనంతరం సంయుక్త ప్రకటనతో పాటు ఉమ్మడి ఆందోళన ప్రణాళికను కూడా విపక్ష కూటమి ప్రకటించవచ్చని సమాచారం.
- ఒక కమిటీతో పాటు కనీస ఉమ్మడి ప్రణాళిక, విపక్షాల సంయుక్త నిరసన కార్యక్రమాల ఖరారుకు రెండు సబ్‌ కమిటీలు కూడా ఏర్పాటు చేసే అవకాశముంది.

ఎన్డీయే బల ప్రదర్శన

విపక్షాల భేటీకి దీటుగా సమావేశం

- కూటమిలోకి ఎల్జేపీ సహా పలు కొత్త ముఖాలు
- నేడు పూర్తిస్థాయి భేటీ... పాల్గొననున్న 38 పార్టీలు!



సోమవారం ఎల్జేపీ నేత చిరాగ్‌ పాశ్వాన్‌ను ఎన్డీఏలోకి ఆహ్వానిస్తున్న బీజేపీ చీఫ్‌ నడ్డా

న్యూఢిల్లీ: బెంగళూరులో జరుగుతున్న విపక్షాల భేటీకి దీటుగా అధికార జాతీయ ప్రజాస్వామ్య కూటమి(ఎన్డీయే) తన బలాన్ని ప్రదర్శించాలని ఉవ్విళ్లూరుతోంది. మంగళవారం ఢిల్లీలో ఎన్డీయే పక్షాల కీలక సమావేశం జరుగనుంది. మరికొన్ని కొత్త పార్టీలు సైతం కూటమిలో చేరనున్నట్లు తెలుస్తోంది. లోక్‌ జనశక్తి పార్టీ(రామ్‌ విలాస్‌), ఒ.పి.రాజ్‌భర్‌ నేతృత్వంలోని ఎస్‌బీఎస్పీ, హిందూస్తానీ అవామ్‌ మోర్చా(సెక్యులర్‌) వంటి పార్టీలు అధికార కూటమిలో చేరేందుకు రంగం సిద్ధమైంది. కొత్త పార్టీల రాకతో తమ కూటమి మరింత బలోపేతం కావడం ఖాయమని, వచ్చే ఎన్నికల్లో విపక్షాలకు భంగపాటు తప్పదని ఎన్డీయే భాగస్వామ్యపక్షాల నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం జరిగే భేటీకి 38 పార్టీలు హాజరు కానున్నాయి. ఈ విషయాన్ని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా స్వయంగా ప్రకటించారు. ఆయా పార్టీలకు ఆహ్వానాలు పంపించామని చెప్పారు. శివసేన(ఏక్‌నాథ్‌ షిండే), ఎన్సీపీ(అజిత్‌ పవార్‌), రాష్ట్రీయ లోక్‌ జనతాదళ్‌(ఆర్‌ఎల్‌జేడీ) తదితర పక్షాలు సైతం తొలిసారిగా ఎన్డీయే సమావేశంలో పాల్గొనబోతున్నాయి. ఇందులో కొన్ని పార్టీలు ఇప్పటికే బీజేపీతో పొత్తు కొనసాగిస్తున్నాయి.

వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా..

వాస్తవానికి కొన్ని పార్టీలు ఎన్డీయే నుంచి బయటకు వెళ్లిపోయాయి. జేడీ(యూ), శివసేన(ఉద్ధవ్‌ ఠాక్రే), అకాలీదళ్‌ దూరమయ్యాయి. వీటి స్థానంలో కొత్త పార్టీలు తమ కూటమిలో అడుగు పెతుండడం ఎన్డీయేలో కొత్త ఉత్సాహం నింపుతోంది. తమిళనాడుకు చెందిన ఏఐఏడీఎంకేతోపాటు ఈశాన్య రాష్ట్రాలకు చెందిన కొన్ని పార్టీలు కూడా ఎన్డీయే సమావేశానికి హాజరు కానున్నాయి. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం రెండోసారి ఏర్పాటైన తర్వాత అధికార కూటమి సమావేశం భారీ స్థాయిలో జరుగుతుండడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. వచ్చే ఏడాది జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఈ భేటీలో వ్యూహ రచన చేయనున్నట్లు తెలుస్తోంది.

తమిళ మంత్రి పొన్ముడి ఇంటిపై ఈడీ దాడి

సాక్షి, చెన్నై: తమిళనాడు ఉన్నత విద్యాశాఖ మంత్రి పొన్ముడి, ఆయన తనయుడు, ఎంపీ గౌతం శిఖామణి నివాసాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డైరెక్టరేట్‌(ఈడీ) అధికారులు సోమవారం సోదాలు నిర్వహించారు. చెన్నై, విల్లుపురం, విక్రవాండిలోని 10 చోట్ల సోదాలు జరుగుతున్నాయి. 2006-2011 మధ్య కాలంలో గనుల మంత్రిగా ఉండగా అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు అన్నాడీఎంకే హయాంలో కేసు నమోదైంది. పొన్ముడి, ఆయన తనయుడు గౌతమ్‌ శిఖామణి, డీఎంకే నేతలు సదానందన్‌, జయచంద్రన్‌, రాజమహేంద్రన్‌, గోపినాథ్‌లపై దాఖలైన ఈ కేసు మద్రాస్‌ హైకోర్టులో విచారణలో ఉంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కళ్లకురిచ్చి స్థానం నుంచి గౌతమ్‌ శిఖామణి ఎన్నికయ్యారు. అదే సమయంలో అక్రమార్జన సొమ్ముతో విదేశాల్లో పెట్టుబడులు పెట్టినట్లుగా ఆయనపై ఈడీ మనీలాండరింగ్‌ కేసును నమోదు చేసింది. 2020లో గౌతమ్‌ శిఖామణి పేరిట ఉన్న రూ.8 కోట్ల ఆస్తులను ఈడీ అటాచ్‌ చేసింది. 2021లో డీఎంకే ప్రభుత్వంలో ఉన్నత విద్యాశాఖ మంత్రిగా పొన్ముడి బాధ్యతలు చేపట్టారు. కొంత కాలంగా ఆయన తమిళనాడు గవర్నర్‌ ఆర్‌ఎన్‌ రవిపై విమర్శలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఈడీ అధికారులు చెన్నై నివాసంలో జరిపిన సోదాల్లో సోదాల్లో రూ.41.9 కోట్ల ఫిక్స్‌డ్‌ డిపాజిట్‌ పత్రాలు, రూ.70 లక్షల నగదు, సుమారు రూ.10 లక్షల విదేశీ కరెన్సీ లభించింది. అనంతరం పొన్ముడిని రాత్రి 8 గంటల సమయంలో ఈడీ అధికారులు తీసుకెళ్లారు.

సెల్‌ ఛార్జర్‌లో మంటలు.. వెనక్కి మళ్లిన విమానం

ముంబై: టేకాఫ్‌ తీసుకున్న కొద్దిసేపటికే ప్రయాణికుడు సెల్‌ఫోన్‌ చార్జర్‌లో మంటలు రావడంతో విమానం వెనక్కి మళ్లింది. సోమవారం ఉదయ్‌పూర్‌- ఢిల్లీ ఎయిరిండియా విమానంలో ఘటన చోటుచేసుకుంది. విమానం టేకాఫ్‌ తీసుకున్న కొద్దిసేపటికే ప్రయాణికుడొకరు తన సెల్‌ఫోన్‌ చార్జర్‌ బాగా వేడెక్కిందంటూ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. దీంతో, ముందు జాగ్రత్త చర్యగా విమానాన్ని తిరిగి ఉదయ్‌పూర్‌లో దించారు. కొద్దిసేపటి తర్వాత తిరిగి ఢిల్లీకి బయలుదేరింది. సెల్‌ఫోన్‌ బ్యాటరీ పేలడం వల్లే ఆ విమానం వెనక్కి మళ్లిందనే వార్తలు కూడా వస్తుండటం గమనార్హం.

రూ.2,381 కోట్ల డ్రగ్స్‌ ధ్వంసం

డ్రగ్స్‌ నుంచి యువతను కాపాడటమే లక్ష్యమన్న అమిత్‌ షా



న్యూఢిల్లీ: మాదకద్రవ్యాల బారిన పడకుండా యువతను కాపాడటమే లక్ష్యంగా డ్రగ్స్‌పై పోరాటం చేస్తున్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్‌ షా చెప్పారు. సోమవారం ఆయన డ్రగ్స్‌ స్మగ్లింగ్‌ అండ్‌ నేషనల్‌ సెక్యూరిటీ అంశంపై జరిగిన సదస్సులో ప్రసంగించారు. డ్రగ్స్‌ అక్రమ రవాణాదారులను ఆర్థికంగా దెబ్బకొట్టే వరకు ఈ పోరాటం పూర్తి కాదని తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో అధికారులు స్వాధీనం చేసుకున్న రూ.2,381 కోట్ల విలువైన 1.40 లక్షల కిలోల డ్రగ్స్‌ ధ్వంసాన్ని మంత్రి వర్చువల్‌గా వీక్షించారు. ఇందులో హైదరాబాద్‌లో స్వాధీనం చేసుకున్న సుమారు 6,600 కిలోల డ్రగ్స్‌ కూడా ఉన్నాయి.

ఎన్‌డీఏకి జీవం పోసేందుకు బీజేపీ ప్రయత్నం

ప్రతిపక్ష పార్టీలను ఓడించేస్తామ టఇంతకాలం ప్రగల్భాలు పలికిన బీజేపీ ఇప్పుడు, చలనం లేని ఎన్‌డీఏకి మళ్లీ జీవం పోసేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ప్రధాని మోదీకి అకస్మాత్తుగా ఎన్‌డీఏ గుర్తుకు వచ్చింది. ఇదంతా మా పట్నా భేటీ ప్రభావమే. భవిష్యత్తు కార్యాచరణను, మా కూటమికి గత యూపీఏ పేరునే కొనసాగించాలా లేకుంటే మరో పేరు పెట్టాలా అనేది భేటీలో నిర్ణయిస్తాం.

-కాంగ్రెస్‌ నేత జైరాం రమేశ్‌

ప్రతిపక్షాలది స్వార్థ కూటమి

మంగళవారం ఎన్‌డీఏ భేటీకి వస్తామని 38 పార్టీలు హామీ ఇచ్చాయి. మోదీ నేతృత్వాన్ని మరోసారి బలపరచాలని ప్రజలను కోరనున్నాం. విపక్షాలకు నాయకుడు లేడు, సిద్ధాంతమూ లేదు. స్వార్థ ప్రయోజనాల కోసమే కలుస్తున్నారు. టీడీపీ, అకాలీ దళ్‌లను ఎన్‌డీఏలోకి మళ్లీ రావాలని అడిగేది లేదు.

-బీజేపీ చీఫ్‌ జేపీ నడ్డా



దుర్గమ్మ సేవలో కొడాలి నాని

ఇంద్రకీలాద్రి: కనకదుర్గమ్మను గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని దంపతులు సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు.



కాలువలోకి దూసుకెళ్లిన కారు

విజయవాడ–అవనిగడ్డ కరకట్టపై వెళ్తున్న కారు కేఈబీ కెనాల్‌లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదం సోమవారం వేకువజామున జరిగింది.

–8లో▸



37,050 బస్తాల మిర్చి రాక

కొరిటెపాడు(గుంటూరు): మార్కెట్ యార్డుకు సోమవారం 37,050 బస్తా మిర్చి వచ్చింది. నిల్వలతో కలిపి 34,864 బస్తాలు విక్రంచారు. విక్రయాలు ముగిసే సమయానికి ఇంకా 11,284 బస్తాల మిర్చి నిల్వ ఉంది.

న్యూస్‌రీల్

సత్తా చాటిన సోనికాసాయి



విజయవాడ స్పోర్ట్స్: భారత రైల్వే అంతర జోనల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజయవాడ క్రీడాకారిణి పి.సోనికా సాయి సత్తాచాటింది. సికింద్రాబాద్‌లో ఇటీవల జరిగిన ఈ పోటీలకు సోనికాసాయి విజయవాడ రైల్వే డివిజన్ నుంచి ప్రాతినిధ్యం వహించి మిక్సిడ్ డబుల్స్‌లో పృథ్వీ కె.రాయ్‌తో కలిసి సిల్వర్ మెడల్, డబుల్స్‌లో ఎక్తాకాలియాతో కలిసి బ్రాంజ్ మెడల్‌ను కైవసం చేసుకుంది. జాతీయ పోటీల్లో రాణించి రెండు పతకాలు సాధించిన సోనికా సాయిని పలువురు సీనియర్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు అభినందించారు.

19 వరకు రేషన్ పంపిణీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో రేషన్ పంపిణీ గడువును ఈ నెల 19వ తేదీ వరకు పొడిగించినట్లు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని రైస్ కార్డుదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చౌక ధరల దుకాణ డీలర్ల ద్వారా ఎండీయూ ఆపరేటర్లు ఈ నెల 19 వరకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించారు.

31 మందికి ట్రై స్కూటర్ల పంపిణీ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విభిన్న ప్రతిభావంతుల జీవితాల్లో వెలుగులు నింపి వారు ఆత్మస్థైర్యం, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగే విధంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో విభిన్న ప్రతిభావంతులకు ట్రై స్కూటర్ల పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, కలెక్టర్ ఢిల్లీరావు చేతుల మీదుగా జిల్లాకు చెందిన 31 మంది విభిన్న ప్రతిభావంతులకు రూ.37.20 లక్షల విలువ చేసే ట్రై స్కూటర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గానికి పది చొప్పున జిల్లాకు 70 ట్రై స్కూటర్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. నగరంలోని మూడు నియోజకవర్గాలకు 31 ట్రై స్కూటర్లను లబ్ధిదారులకు అందించామన్నారు. ట్రై స్కూటర్ల కోసం జిల్లా వ్యాప్తంగా 200లకు పైగా దరఖాస్తులు అందగా, తొలి దశలో 70 మందికి మంజూరు చేశామన్నారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ట్రై స్కూటర్లు దివ్యాంగులకు అన్ని విధాల ఉపయోగపడతాయన్నారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

డైట్‌లో అడ్మిషన్ల కౌన్సెలింగ్



గుడ్లవల్లేరు(గుడివాడ): మండలంలోని అంగలూరులో ఉన్న ప్రభుత్వ జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థ(డైట్)లో 2023–25 బ్యాచ్‌కు సంబంధించిన అడ్మిషన్ల కౌన్సెలింగ్ సోమవారం జరిగింది. జిల్లా ప్రభుత్వ డైట్ నుంచి 62 సీట్లు, ప్రైవేట్ కాలేజీల నుంచి 14 సీట్లు అడ్మిషన్లు జరగాల్సి ఉందని డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తెలిపారు. జిల్లా డైట్‌కు ఏడు సీట్లకు అడ్మిషన్లు జరిగాయని పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌లో అధ్యాపకులు ప్రకాశం, రాజ్యలక్ష్మి, జయశ్రీ, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు పీఈటీల సర్టిఫికెట్ల పరిశీలన

పెడన: ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న పీఈటీల్లో అర్హులకు స్కూల్ అసిస్టెంట్ పీఈలుగా ఉద్యోగోన్నతి కల్పించడానికి మంగళవారం ధ్రువీకరణ పత్రాల పరిశీలన చేస్తామని నోడల్ అధికారి, కృష్ణాజిల్లా డీఈఓ తాహెరా సుల్తానా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన పీఈటీలు ఉదయం 11 గంటలకు మచిలీపట్నంలోని డీఈఓ కార్యాలయానికి ఒరిజినల్ విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, సర్వీస్ రిజిస్టర్‌తో హాజరు కావాలని సూచించారు.

ఫలప్రదంగా ఉపాధి

- ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకం
- ఎన్టీఆర్ జిల్లాలో 431 ఎకరాల్లో పండ్లతోటల సాగుకు ఏర్పాట్లు
- ఎకరానికి రైతులకు రూ.లక్షపైగా లబ్ధి
- ప్రభుత్వ ప్రోత్సాహంపై సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు



మైలవరం మండలం చంద్రాలలో మొక్కనాటి నీరుపోస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, పీడీ సునీత

సాక్షి ప్రతినిధి విజయవాడ: ఆహార, వాణిజ్య, కూరగాయల పంటలకన్నా పండ్ల తోటల సాగుపై పలువురు రైతులు ఆసక్తి చూపుతున్నారు. వారికి ప్రభుత్వం కూడా సహకారం అందిస్తోంది. ఉపాధి హామీ పథకం కింద నమోదైన చిన్న, సన్నకారు రైతులు, బీసీ, ఎస్సీ, ఎస్టీలు పండ్ల తోటలు పెంచేలా నూరు శాతం సబ్సిడీలతో అండగా నిలుస్తోంది. 15 రకాల ఉద్యాన పంటలను రైతులు సాగుచేయొచ్చు. ఎన్టీఆర్ జిల్లా లక్ష్యం 300 ఎకరాలు కాగా 297 మంది రైతులు 433 ఎకరాలను పండ్ల మొక్కలు నాటేందుకు సిద్ధం చేశారు. మామిడి, నిమ్మ, జామ, డ్రాగన్ ఫ్రూట్ వంటి రకాలపై రైతులు మొగ్గు చూపుతున్నారు. మరి కొందరు మునగ సాగు చేస్తున్నారు. ఇప్పటికే పండ్ల తోటలు సాగుచేస్తున్న రైతులు వేరు శనగ, కూరగాయలు, మినుము, పెసర వంటి అంతరపంటలు సాగు చేసుకొని అదనపు ఆదాయం పొందుతున్నారు.

5 ఎకరాల్లోపు అవకాశం

పండ్ల తోటల పెంపకానికి ఐదు ఎకరాల్లోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులు, బీసీ, ఎస్సీ, ఎస్టీలు అర్హులు. ఇప్పటికే జిల్లాలో వర్షాలు కురుస్తుండటంతో మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వారు. ఈ నెలాఖరు నాటికి మొక్కలు నాటేలా అధికారులు ప్రణాళికలు రచించారు. ఉపాధి హామీ పథకంలో పండ్ల మొక్కల కొనుగోలుకు రైతులకు డబ్బులు చెల్లిస్తున్నారు. మూడేళ్ల పాటు మొక్కల సంరక్షణకయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తోంది. మామిడి మొక్కకు రూ.45, జామ గ్రాఫ్ట్‌కు రూ.30, జామ లేయర్‌కు రూ.20, నిమ్మకు రూ.25, కొబ్బరికి రూ.60 చొప్పున ఇస్తారు. ఆయిల్ పాం మొక్కలను ఉద్యాన శాఖ ఉచితంగా ఇస్తోంది. ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు ఉచితంగా భూసార పరీక్షలు చేయడంతోపాటు, ఉపాధి కూలీలతో గుంతలు తవ్విస్తున్నారు. ఉదాహరణకు.. మామిడి సాగుకు ఎకరానికి 70 మొక్కలు నాటుతారు. మూడేళ్ల పాటు దుక్కి దున్నినందుకు ఒక్కో మొక్కకు రూ.15.75, నీరు పోసినందుకు ఏడాదికి 24 చొప్పున మూడేళ్లకు 72 తడులకు ఒక్కో తడికి రూ.5.45 చొప్పున, ఎరువులు, పురుగు మందులకు మొక్కకు రూ.25 చొప్పున ఇస్తారు. కూరగాయలు, మినుము, పెసర, వేరుశనగ వంటి అంతర పంటల సాగుకు ఏడాదికి రూ.1000 చొప్పున రెండేళ్ల పాటు ఇస్తారు. తోట సంరక్షణ కోసం చుట్టూ కంచె వేసేందుకు ఎకరాకు రూ.3213లను పని దినాల రూపంలో చెల్లిస్తారు. ఎకరంలో మామిడి సాగు చేస్తున్న రైతుకు రూ.1,07,567 మేర లబ్ధి చేకూరుతుంది. ఎన్టీఆర్ జిల్లాలోని 16 మండలాల్లో 252 మంది రైతులు 371.26 ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేస్తున్నారు. 45 మంది రైతులు 61 ఎకరాల్లో మునగ సాగు చేస్తున్నారు. ఉద్యాన పంటల్లో అత్యధికంగా 360 ఎకరాల్లో మామిడి, మిగిలిన 12 ఎకరాల్లో నిమ్మ, జామ, ఆయిల్ పాం, డ్రాగన్ ఫ్రూట్ సాగవుతున్నాయి.

పండ్ల తోటలతో మేలు



ఉపాధి హామీ పథకం కింద రైతులు పండ్ల తోటల సాగును సద్వినియోగం చేసుకోవాలి. దీనిపై ఇప్పటికే రైతులకు అవగాహన కల్పించాం. పండ్ల మొక్కలు ఉచితంగా ఇవ్వడంతోపాటు, మూడేళ్ల పాటు సంరక్షణకు ప్రభుత్వం నగదు చెల్లిస్తుంది. అంతర పంటల సాగును ప్రోత్సహిస్తున్నాం. జూలైనాటికి పండ్ల తోటల పెంపకం పూర్తయ్యేలా ప్రణాళిక రచించాం. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం ఇచ్చే పండ్లతోటల పెంపకం వైపు రైతులు సైతం మొగ్గు చూపుతున్నారు.

– సునీత, డ్వామా పీడీ, ఎన్టీఆర్ జిల్లా

ప్రోత్సాహం బాగుంది



మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను సాగుచేయాలనే ఆసక్తితో విస్సన్నపేటలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు నాటాను. శ్రమ ఎక్కువైనా తక్కువ సమయంలో అధిక లాభాలు వచ్చే అవకాశం ఉంది. ఈ పంటకు రాష్ట్ర ఉద్యాన శాఖ నుంచి ఇస్తున్న ప్రోత్సాహం బాగుంది. మార్కెటింగ్ సదుపాయం కల్పించడంతో పాటు పంట సస్యరక్షణ చర్యలు తీసుకోడానికి అధికారులు సహకారం అందిస్తున్నారు.

– జి.రవి, రైతు, విస్సన్నపేట

జగనన్న సంక్షేమ పథకాలను అందిపుచ్చుకోవాలి



సంక్షేమ క్యాలండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి రమేష్

భవానీపురం(విజయవాడపశ్చిమ): పేద, బడుగు బలహీన వర్గాల ప్రజల అభివృద్ధిని కాంక్షిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు అందరూ అందిపుచ్చుకోవాలని మంత్రి జోగి రమేష్ సూచించారు. నవరత్నాల్లో భాగంగా జూలైలో ప్రభుత్వం నిర్వహించే సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి వైఎస్సార్ సీపీ నాయకుడు ఆకుల శ్రీనివాస్ కుమార్ రూపొందించిన పోస్టర్‌ను మంత్రి జోగి రమేష్ సోమవారం ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ.. కులమతాలు, పార్టీలు, వర్గాలకు అతీతంగా అన్ని వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మేలు కారణంగా తమ ఉనికి కోల్పోతున్న ప్రతిపక్షాలు పనికిమాలిన విమర్శలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. 2024 ఎన్నికల్లో వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావడం తథ్యమన్నారు. నాయకులు పొదిలి చంటిబాబు, అల్లం పూర్ణచంద్రరావు, బి.దుర్గాప్రసాద్, నూకల వాసు, సలీం ఫర్వేజ్ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు సోమవారం రూ.లక్ష విరాళాన్ని సమర్పించారు. హైదరాబాద్ బీరంగూడకు చెందిన బి.సునీల్, సుప్రియ ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి రూ.1,00,116 విరాళం అందజేశారు. అనంతరం దాతలకు అమ్మవారి దర్శనం కల్పించారు. చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ భ్రమరాంబ దాతలకు అమ్మ వారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

కేరళ బృందం పర్యటన

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైద్య ఆరోగ్యశాఖలో అమలవుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాల అమలును పరిశీలించేందుకు కేరళ ప్రతినిధుల బృందం సోమవారం ఎన్టీఆర్ జిల్లాలో పర్యటించింది. ఆరోగ్య కార్యక్రమాల అమలు, నిర్వహణ, పనితీరు, సాధిస్తున్న లక్ష్యాలను తెలుసుకుంది. తొలుత డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని తన కార్యాలయంలోఆరోగ్య కార్యక్రమాల అమలును బృంద సభ్యులైన డాక్టర్ ఒమెన్ మాథ్యు, సచిన్‌కు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా ప్రోగ్రామ్ అధికారులందరూ తమ విభాగాల పనితీరు, ప్రగతిని వివరించారు. ఈ బృందం మూడు రోజుల పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించి, ఆరోగ్య కేంద్రాలను సందర్శించి, క్షేత్రస్థాయిలో ఆరోగ్య కార్యక్రమాల అమలును పరిశీలిస్తుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ జె.ఉషారాణి, డీఐఓ డాక్టర్ అమృత, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నరసింహనాయక్, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇందుమతి, డీఎంఓ డాక్టర్ మోతీబాబు, ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్ మాధవి, డీపీఎంఓ డాక్టర్ నవీన్, టీబీ వైద్యాధికారి డాక్టర్ పద్మావతి, ఎపిడిమియాలజిస్ట్ డాక్టర్ స్నేహ సమీర, గణాంక అధికారి లక్ష్మోజి, మహేష్, లిడియా పాల్గొన్నారు.

నవజాతకు సంజీవని

- జీజీహెచ్‌లో మరో నియోనాటల్ ఐసీయూ
- 40 పడకలు, అడ్వాన్స్‌డ్ పరికరాలతో ఏర్పాటు
- అందుబాటులో 10 వెంటిలేటర్లు, 10 సీపాప్ యంత్రాలు
- వార్మర్లు, ఫొటో థెరఫీ యూనిట్లు సిద్ధం
- వైద్యశాఖ మంత్రి విడదల రజిని చేతుల మీదుగా త్వరలో ప్రారంభం



నవజాత శిశు చికిత్సా విభాగంలోని ఐసీయూ

లబ్బీపేట(విజయవాడతూర్పు): నవజాత శిశువులకు విజయవాడ ప్రభుత్వాస్పత్రి (జీజీహెచ్) సంజీవనిలా సేవలు అందిస్తోంది. మరింత అత్యాధునిక వైద్య సేవలు అందించేందుకు మరో నియోనాటల్ ఇంటెన్సివ్‌కేర్ యూనిట్ ఏర్పాటైంది. మాతా శిశు విభాగ భవనంలోని రెండో అంతస్తులో దీనిని ఏర్పాటు చేశారు. ఇప్పటికే నిర్మాణం పూర్తవగా, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో కూడిన అత్యాధునిక యంత్ర పరికరాలను సైతం సమకూర్చారు. వెంటిలేటర్లు, సీ పాప్ మెషిన్‌ల కోసం సెంట్రల్ ఆక్సిజన్ సిస్టమ్ పైప్‌లైన్ పనులు కూడా పూర్తయ్యాయి. అతి త్వరలోనే రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని చేతుల మీదుగా కొత్త నియోనాటల్ ఐసీయూ ప్రారంభోత్సవం జరిపేందుకు ఆస్పత్రి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

40 పడకలతో వైద్యం

ప్రస్తుతం ప్రభుత్వాస్పత్రిలో 40 పడకలతో స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్ (ఎస్ఎన్‌సీయూ) అందుబాటులో ఉంది. ఇక్కడకు వచ్చే రోగుల రద్దీ దృష్ట్యా అదిచాలడం లేదు. దీంతో మరో యూనిట్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఏడాది క్రితమే శ్రీకారం చుట్టింది. మాతా శిశు విభాగం రెండో అంతస్తులో 40 పడకలతో నవజాత శిశు చికిత్స విభాగాన్ని తీర్చిదిద్దారు. వీటిలో 20 పడకలు ఎన్ఐసీయూ(నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్)కు, మరో 20 పడకలు ఐసీయూకు కేటాయించారు. ఇక్కడ చికిత్స పొందే శిశువులకు ఇన్‌ఫెక్షన్స్ సోకకుండా అత్యాధునిక ల్యామినర్ ఎయిర్‌ఫ్లో సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. నగరంలోని ఏ కార్పొరేట్ ఆస్పత్రిలో లేని విధంగా వీటిని తీర్చిదిద్దారు.

అత్యాధునిక పరికరాలు

కొత్తగా ఏర్పాటు చేసిన నవజాత శిశు చికిత్స విభాగంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కలిగిన పరికరాలను అందుబాటులోకి తెచ్చారు. రెండు విభాగాల్లో 40 పడకలు ఉండగా, ప్రతి బెడ్ వద్ద వార్మర్, ఫొటో థెరపీ యూనిట్లు ఉంటాయి. వాటితో పాటు, పది సీ పాప్ మెషిన్‌లు, మరో పది అత్యాధునిక సాంకేతికతతో కూడిన వెంటిలేటర్లను అందుబాటులోకి తెచ్చారు. ఇన్‌ఫ్యూజన్ పంపులతో పాటు, శిశువుల వైద్యానికి అవసరమైన అన్ని పరికరాలు సమకూర్చారు. ఈ విభాగంలో విధులు నిర్వహించేందుకు నిపుణులైన వైద్యులు, వైద్య సిబ్బందిని సైతం నియమించారు.

మరింత మెరుగైన వైద్యం

నవజాత శిశు చికిత్స విభాగంలో తక్కువ బరువుతో పుట్టిన శిశువులకు, నెలలు నిండకుండా పుట్టిన వారికి, ఊరిపి తిత్తులు పూర్తిస్థాయిలో రూపుదిద్దుకోని వారు, ఉమ్మనీరు తాగిన శిశువు, పుట్టుకతో కామెర్లుతో పాటు, ఇతర సమస్యలు ఉన్న వారికి ఇక్కడ చికిత్స అందిస్తారు. ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో రూ.లక్షల్లో ఖర్చయ్యే వైద్యం ఇక్కడ పూర్తిగా ఉచితం. ఒక్కో శిశువుకు నెల నుంచి రెండు నెలల పాటు కూడా చికిత్స పొందాల్సి ఉంటుంది. అలాంటి వారికి ప్రైవేటులో అయితే రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు ఖర్చవుతుంది. ఇక్కడ పైసా ఖర్చు లేకుండా అందించేందుకు ప్రభుత్వం అత్యాధునిక సౌకర్యాలు సమకూర్చింది.

త్వరలో అందుబాటులోకి



రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగానికి ఎంతో ప్రాధాన్యమిస్తోంది. అందులో భాగంగా ప్రభుత్వాస్పత్రిలో మరో నవజాత శిశు చికిత్స విభాగం అందుబాటులోకి రానుంది. 40 పడకల ఎన్ఐసీయూ, ఐసీయూల్లో అడ్వాన్స్‌డ్ పరికరాలను సమకూర్చింది. అప్పుడే పుట్టిన పిల్లల్లో లోపాలను గుర్తించి తక్షణమే వైద్య సేవలు అందించేందుకు ఇది దోహదపడుతుంది.

– డాక్టర్ డి.వెంకటేష్, సూపరింటెండెంట్, జీజీహెచ్

మెరుగైన సేవలు అందుతాయి



నూజివీడు, ఏలూరు, భీమవరం, బందరు ప్రాంతాల నుంచి చికిత్స కోసం శిశువులను తీసుకొస్తుంటారు. వారిలో నెలలు నిండకుండా పుట్టిన వారు, బరువు తక్కువతో పుట్టిన వారే ఎక్కువగా ఉంటారు. వారికి ఇప్పుడున్న 40 పడకల ఎస్ఎన్‌సీయూ చాలడం లేదు. మరో 40 పడకలతో నవజాత శిశు చికిత్స విభాగం అందుబాటులోకి వస్తోంది. మరింత మెరుగైన సేవలు అందించగలుగుతాం.

– డాక్టర్ పి.అనిల్‌కుమార్, ప్రొఫెసర్, పిల్లల వైద్య విభాగం, జీజీహెచ్

● ప్రకృతి పరవశం



తొలకరి వర్షాలకు కమ్మటి మట్టి వాసన గుప్పుమంటోంది.. దారంతా పచ్చదనం పులుముకుని సరికొత్త అందాలు అద్దుకుంది.. లేలేత సూర్య కిరణాల నడుమ, పచ్చని చెట్ల మధ్య ప్రకృతి రమణీయతను ఆస్వాదిస్తూ ఓ 80 ఏళ్ల వృద్ధుడు సైకిల్‌పై పొలం పనులకు బయలుదేరాడు. ఈ దృశ్యం పెనమలూరు మండలం చోడవరం గ్రామంలో సోమవారం ఉదయం కనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

గిరిజనుల ఇళ్ల మరమ్మతులకు ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం చెక్కును అందజేస్తున్న కలెక్టర్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జక్కంపూడి వైఎస్సార్ కాలనీకి చెందిన 32, కవులూరు గ్రామానికి చెందిన ఏడు గిరిజన కుటుంబాలకు గిరిజన సంక్షేమ శాఖ ఆర్థిక సహాయం అందించింది. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఢిల్లీరావు సోమవారం లబ్ధిదారులకు రూ.11.40 లక్షల ఆర్థిక సాయం చెక్కు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కృష్ణలంకలో నివసించే గిరిజన కుటుంబాలకు పునరావాసం కింద వైఎస్సార్ జక్కంపూడి కాలనీలో ఇళ్లు కేటాయించామన్నారు. ఆ ఇళ్లలో విద్యుత్ వైరింగ్, మీటర్లు, ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు ఈ నిధులు కేటాయించినట్లు చెప్పారు. నిధులకు సంబంధించిన చెక్‌ను ఏపీ ట్రాన్స్‌కో అధికారులకు అందజేస్తామన్నారు. జక్కంపూడి వైఎస్సార్ కాలనీకి చెందిన 32 కుటుంబాలకు రూ.6.99 లక్షలు, కవులూరు గ్రామానికి చెందిన ఏడు కుటుంబాలకు రూ.4.41 లక్షలు అందించినట్లు చెప్పారు. జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, హౌసింగ్ పీడీ రజనీ కుమారి, గిరిజన సంక్షేమ అధికారి ఎం.రుక్మాంగదయ్య, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు పునరావృతం కాకూడదు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్పందనలో నమోదయ్యే అర్జీలు పునరావృతం కాకుండా ప్రాథమిక దశలోనే పరిష్కారం చూపాలని అధికారులను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కారవేదిక స్పందన కార్యక్రమం సోమవారం జరిగింది. కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, డీఆర్వో కె.మోహన్‌కుమార్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వచ్చి తమ సమస్యలు పరిష్కరించాలంటూ వినతులు సమర్పిస్తారన్నారు. వాటిలో పునరావృతం అవుతున్న అర్జీలపై అధికారులు తక్షణమే స్పందించాలన్నారు. జగనన్నకు చెబుదాం పోర్టల్‌లో వచ్చే అర్జీలనూ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు.

ఆ యాప్‌లకు దూరంగా ఉండాలి

లివ్ ఇన్, డేటింగ్ యాప్‌ల సంస్కృతికి యువత దూరంగా ఉండాలని కలెక్టర్ ఢిల్లీరావు సూచించారు. జిల్లాలో లివ్ ఇన్, డేటింగ్ యాప్‌ల సంస్కృతి వ్యాపిస్తోందన్న ఫిర్యాదులు అదుతున్నాయని పేర్కొన్నారు. లివ్‌ఇన్, డేటింగ్, టిండర్, ఫ్రెండ్స్ వంటి యాప్‌లతో యువత పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంస్కృతి బారిన తమ పిల్లలు పడకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు ఇటువంటి యాప్‌లపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు.

స్పందనలో 162 అర్జీలు

స్పందనలో మొత్తం 162 అర్జీలు నమోదయ్యాయని కలెక్టర్ తెలిపారు. అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 70 అర్జీలు వచ్చాయి. శాఖల వారీగా మునిసిపల్‌లో 16, పోలీస్ 14, సర్వే అండ్ సెటిల్‌మెంట్ తొమ్మిది, డీఆర్‌డీఏ ఏడు, పౌర సరఫరాలు, హౌసింగ్ ఐదు చొప్పున, విద్య, అగ్రికల్చర్ నాలుగు, దేవాదాయ, వైద్యం, సోషల్ వెల్ఫేర్, ఏపీసీపీడీసీఎల్‌లో మూడేసి, బీసీ వెల్ఫేర్, డ్వామా, ఇరిగేషన్, ఉపాధికల్పనలో రెండు చొప్పున, బ్యాంకు, అటవీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్, విభిన్న ప్రతిభావంతులు, గ్రామ/వార్డు సచివాలయం, ఖజానా, కార్పొరేషన్‌లో మిగిలిన అర్జీలు నమోదయ్యాయి. డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాస్, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎం.విజయభారతి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎం.రుక్మాంగదయ్య, హౌసింగ్ పీడీ రజనీకుమారి, పశుసంవర్ధక శాఖ జేడీ కె.విద్యాసాగర్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి బాలాజీ కుమార్, డ్వామా పీడీ జె.సునీత తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్‌కు అంతర్జాతీయ గుర్తింపు



లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ అండ్ మిడ్‌వైవ్స్ కౌన్సిల్ రిజిస్ట్రార్ కె. సుశీల ఈ నెల 1 నుంచి 5 వరకూ కెనడాలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్నారు. రాష్ట్రానికి చెందిన పలువురు బీఎల్ఎస్ నిపుణులతో పాటు, ఇండియన్ రీ ససిటేషన్ కౌన్సిల్ ఫెడరేషన్ సభ్యురాలిగా తాను సదస్సులో పాల్గొన్నట్లు కె. సుశీల సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తాను సమర్పించిన పరిశోధనా పత్రం బెస్ట్ పేపర్‌గా నిలిచి అంతర్జాతీయంగా గుర్తింపు పొందినట్లు తెలిపారు. అంతేకాక నర్స్ టుగెదర్ ఏ ఫోర్స్ ఫర్ గ్లోబల్ ఛేంజస్ అనే అంశంపై ప్రసంగించినట్లు చెప్పారు. అమెరికాలోని పలు వర్సిటీల్లో నర్సింగ్ ప్రోగ్రామ్స్ ఎలా ఉన్నాయి? అనే అంశంపై అధ్యయనం చేసినట్లు తెలిపారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు



విజేతలతో దేవినేని అవినాష్, ఇంతియాజ్, శివశంకరరావు తదితరులు

విజయవాడ స్పోర్ట్స్: బొడ్డపాటి సాయిలక్ష్మి మెమోరియల్ ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి అండర్–11, 13, 15, 17, 19 బాలబాలికల బ్యాడ్మింటన్ పోటీలు సోమవారం ముగిశాయి. నగరంలోని డీఆర్ఆర్ ఇండోర్ స్టేడియంలో మూడు రోజుల పాటు ఈ పోటీలు జరిగాయి. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ పాల్గొన్నారు. సెర్ప్ సీఈవో ఏఎండీ ఇంతియాజ్, కనెక్ట్ ఆంధ్రా సీఈవో కె.శివశంకరరావుతో కలిసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ అంతర్జాతీయ క్రీడా వేదికలపై రాణించి జిల్లా ఖ్యాతిని నలుదిశలా చాటాలని బ్యాడ్మింటన్ క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు అంకమ్మ, పరసా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బొడ్డపాటి లక్ష్మీనారాయణ, రామినేని రామ్మోహన్ పాల్గొన్నారు. కాగా అండర్–11 బాలుర సింగిల్స్, అండర్–15 బాలికల సింగిల్స్‌లో విన్నర్, రన్నర్‌లకు బహుమతులు అందజేశామని, మిగిలిన విభాగాల్లో పోటీలు కొనసాగుతున్నాయని, విజేతల వివరాలను మంగళవారం ప్రకటిస్తామని అసోసియేషన్ కార్యదర్శి పరసా శ్రీనివాస్ తెలిపారు.

అభివృద్ధి పనులు వేగవంతం

అధికారులకు మున్సిపల్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి ఆదేశం

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ చేపట్టిన పలు అభివృద్ధి పనులను రాష్ట్ర మున్సిపల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై. శ్రీలక్ష్మి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. సోమవారం ఆమె వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో పాటు నగరంలో బ్యూటిఫికేషన్ పనుల నాణ్యత పరిశీలించి మిగిలిన పనులు సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. సర్కిల్–3 పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల నాణ్యత, పనుల పురోగతిని పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. 17వ డివిజన్ నేతాజీ వంతెన (వెటర్నరీ హాస్పిటల్) రోడ్ దగ్గర సాయిబాబా గుడి పక్కన ఉన్న ప్రదేశంలో ఏర్పాటు చేసిన బ్యూటిఫికేషన్ పనులను, వాటర్ ఫౌంటెన్ చుట్టూ ఏర్పాటు చేసిన గ్రీనరీ పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్–3 ఎం.కృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏ.ఎస్.ఎన్ ప్రసాద్, ఏడీహెచ్ శ్రీనివాస్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఇక్బాల్ హుస్సేన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



అంబేడ్కర్ స్మృతివనం పనులను పరిశీలిస్తున్న అధికారులు శ్రీలక్ష్మి, స్వప్నిల్ దినకర్ తదితరులు

అంబేడ్కర్ స్మృతివనం పనులపై ఆరా

స్వరాజ్య మైదానంలో జరుగుతున్న అంబేడ్కర్ స్మృతివనం పనులను మున్సిపల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డాక్టర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహ ప్రదేశాన్ని, స్మృతివనాన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. స్మృతివనంలో ఏయే ప్రాంతంలో సుందరీకరణ పనులు ప్రారంభించాలో సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఢిల్లీ నుంచి వచ్చిన నిర్మాణ డిజైన్ల ఆధారంగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనుల్లో వేగం పెంచాలన్నారు. సీలింగ్, ప్లాస్టింగ్ పనుల్లో జాప్యం లేకుండా జరగాలని, పనుల నాణ్యతా ప్రమాణాలను క్వాలిటీ కంట్రోల్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని, గ్రానైట్ ఫుట్ పాత్, ల్యాండ్ స్కేప్, కాంపౌండ్ నిర్మాణం వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు

కారులో ప్రయాణిస్తున్న వ్యక్తి ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆందోళన

పెనమలూరు: విజయవాడ–అవనిగడ్డ కరకట్టపై వెళ్తున్న కారు కేఈబీ కెనాల్‌లోకి సోమవారం వేకువజామున దూసుకెళ్లింది. కాలువలో నాలుగడుగుల మేర నీరు ప్రవహిస్తుండటంతో కారు సగ భాగం పైగా నీటిలో మునిగింది. కారులో ముందు డోర్ తెరిచి ఉండటంతో కారులో వ్యక్తి సురక్షితంగా బయటపడ్డాడా లేక కాలువలో గల్లంతయ్యాడా అనే విషయంలో స్పష్టత లేదు.

పోలీసులు తెలిపిన వివరాలు..

ముదినేపల్లికి చెందిన గాజుల రత్నభాస్కర్ (47) గత ఆరు నెలల క్రితం బ్యాంకు రుణం తీసుకుని ఐస్ ఫ్యాక్టరీ పెట్టాడు. అతను ఆదివారం అవనిగడ్డలో ఉన్న అత్తగారి ఇంటి వద్ద నుంచి సాయంత్రం బయలుదేరి మచిలీపట్నం వెళ్లాడు. అక్కడ కోనేరు సెంటర్‌లో టీడీపీ కార్యక్రమంలో పాల్గొన్నాడు. రాత్రి 7 గంటల సమయంలో కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడాడు. మరలా పది గంటల ప్రాంతంలో మిత్రులతో కూడా ఫోన్‌లో మాట్లాడి మచిలీపట్నంలో పని ఉందని, అది ముగించుకొని ముదినేపల్లికి వస్తానని తెలిపాడు. అయితే అతను రాత్రి ముదినేపల్లికి చేరలేదు.



కాలువలో పడిన కారును బయటకు తీస్తున్న పోలీసులు

చోడవరం వద్ద కాలువలో కారు..

గాజుల భాస్కర్‌కు చెందిన కారు అవనిగడ్డ వైపు నుంచి విజయవాడ వైపునకు వస్తుండగా చోడవరం వద్ద సోమవారం వేకువజామున 3.30 గంటలకు కాలువలోకి దూసుకెళ్లింది. కాలువలో కారు పడిందన్నా సమాచారంతో పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలం వద్దకు వెళ్లారు. కాలువలో పడిన కారు ముందు డోర్ తెరుచుకొని ఉంది. పోలీసులు కారులో వెతకగా ఆధార్‌కార్డు దొరకటంతో గాజుల రత్నభాస్కర్ అని గుర్తించారు. కానీ కారులో ఎవ్వరు లేరు. డీఎస్పీ జయసూర్య ఘటనా స్థలం వద్దకు వచ్చి క్రేన్ సాయంతో కాలువలో ఉన్న కారును బయటకు తీయించారు. కారులో దుస్తులు, సెల్‌ఫోన్, కాగితాలు తప్ప ఏమి దొరకలేదు. కనిపించకుండా పోయిన రత్నభాస్కర్‌కు భార్య, కుమార్తె ఉన్నారు.



కారులో ప్రయాణిస్తున్న రత్నభాస్కర్(ఫైల్)

మిస్టరీగా మారిన ఘటన..

కేఈబీ కెనాల్‌లో పడిన కారు ఘటన మిస్టరీగా మారింది. ముదినేపల్లికి వెళ్లాల్సిన రత్నభాస్కర్ అర్ధరాత్రి విజయవాడ వైపునకు ఎందుకు వచ్చాడనేది పెద్ద ప్రశ్నగా ఉంది. పైగా ప్రమాదం జరిగే ముందు తన ఫోన్‌తో కుమార్తెకు లోకేషన్ షేర్ చేశాడు. కాలువలో పడిన కారును పోలీసులు తనిఖీ చేయగా సెల్‌ఫోన్ కారులోనే ఉండటంతో స్వాధీనం చేసుకున్నారు. కారు కాలువలో పడిన సమయంలో కాలువలో నీరు నాలుగడుగులు మాత్రమే ఉంది. కాలువలో నీరు తక్కువగా ఉండటంతో కాలువలో రత్నభాస్కర్ కొట్టుకు పోయాడా లేదా అనే విషయం తేలలేదు. పోలీసులు కేఈబీ కెనాల్‌లో గాలింపు చేపట్టారు. కరకట్టపై ఉన్న సీసీ కెమెరాలను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. రత్నభాస్కర్‌కు కొందరు సొమ్ము బాకీ పడటంతో ఆర్థిక గొడవలు ఏమైనా ఉన్నయా అనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నారు. రుణం తీసుకుని ఐస్‌ఫ్యాక్టరీ పెట్టడంతో ఆర్థిక పరిస్థితి ఎలా ఉందనే విషయమై పోలీసులు బ్యాంక్ స్టేట్‌మెంట్ పరిశీలించనున్నారు. బంధువు మేడిశెట్టి సూర్యప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం

కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): సమాజసేవ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎప్పుడు ముందుంటుందని కృష్ణా జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో సోమవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యత్వాల నమోదు, విరాళాలు అందించి సహకరించిన వారికి కలెక్టర్ చేతుల మీదుగా సత్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అనేక సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటోందన్నారు. దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ట్రై సైకిళ్లను అందించటం అభినందనీయమన్నారు. సభ్యత్వ నమోదు, విరాళాలు అందించేందుకు కృషి చేసిన డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ శివనారాయణరెడ్డి, గుడివాడ ఆర్డీవో పద్మావతి, గూడూరు తహసీల్దార్ విజయప్రసాద్‌లను కలెక్టర్ సత్కరించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, జాయింట్ కలెక్టర్ అపరాజితాసింగ్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు తోట బాలాజీ, కార్యదర్శి బి. శంకర్‌నాథ్ పాల్గొన్నారు.

సేవలు విస్తృతం చేయాలి..

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లాశాఖ వార్షిక సర్వసభ్య సమావేశం కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సేవా పరంగా ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తోందని వాటిని మరింత విస్తృతం చేయాలన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ పూర్తి

ఆటోనగర్(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం రెండు నెలలు ముందుగానే పాఠ్యపుస్తకాల పంపిణీ పూర్తి చేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలలు ప్రారంభం నుంచి విద్యార్థుల చేతిలో పాఠ్యపుస్తకాలు ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. 1 నుంచి 10వ తరగతి వరకు రెండు సెమిస్టర్‌ల పుస్తకాలను పూర్తి స్థాయిలో విద్యార్థులకు అందించింది.

మొత్తం 30,90,941 పాఠ్యపుస్తకాలు..

ఉమ్మడి కృష్ణాజిల్లాలో సోమవారం సాయంత్రానికి రెండు సెమిస్టర్లకు గాను మొత్తం 30,90,941 పాఠ్య పుస్తకాలను వివిధ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు పంపిణీ చేశామని ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రభుత్వ పాఠ్యపుస్తకాల సేల్స్ మేనేజర్ ఏఎస్‌కే ఆంజనేయులు చెప్పారు. ఇందులో విభజిత కృష్ణాజిల్లా 25 మండలాలకు సంబంధించి మొదటి సెమిస్టర్‌కు 9,54,535, రెండో సెమిస్టర్‌కు 2,97,366 పుస్తకాలు.. ఎన్టీఆర్ జిల్లాలోని 17 మండలాలకు మొదటి సెమిస్టర్ సంబంధించి 10,52,104, రెండో సెమిస్టర్‌కు 3,25,065 పుస్తకాలు, ఏలూరు జిల్లాలోని ఎనిమిది మండలాలకు మొదటి సెమిస్టర్‌కు 3,51,447, రెండో సెమిస్టర్‌కు 1,10,424 పాఠ్యపుస్తకాలను అందించామన్నారు. మొత్తం 71 పాఠశాలలకు మొబైల్ డిస్పెన్స్ యూనిట్ ద్వారా గోడౌన్ నుంచి నేరుగా పాఠశాలలకు పంపించినట్లు చెప్పారు. ఇవి కాకుండా అవసరాన్ని బట్టి మరలా పుస్తకాలు ఇస్తామన్నారు.

కృష్ణా, గుంటూరు జిల్లాలు శుభారంభం

విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) సెంట్రల్ జోన్ అంతర జిల్లాల సీనియర్ పురుషుల వన్డే క్రికెట్ మ్యాచ్‌లలో కృష్ణా, గుంటూరు జిల్లాలు శుభారంభం చేశాయి. ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు ఏసీఏ క్రికెట్ మైదానాల్లో సోమవారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లలో కృష్ణా, గుంటూరు, ప్రకాశం, పశ్చిమగోదావరి జట్లు తలపడ్డాయి. సీపీ మైదానంలో కృష్ణా, ప్రకాశం జట్లు తలపడ్డాయి. వర్షం కారణంగా మ్యాచ్‌ను 34 ఓవర్లకు కుదించారు. టాస్ గెలిచిన ప్రకాశం జట్టు ఫీల్డింగ్ ఎంచుకోవడంతో తొలి ఇన్నింగ్స్‌లో కృష్ణా జట్టు 33.5 ఓవర్లకు 238 పరుగులు చేసి ఆలౌటయింది. బ్యాట్స్‌మెన్‌లు సుశ్యామ్‌కీర్త్ 34 బాల్స్‌కు 11ఫోర్లు, రెండు సిక్స్‌లతో 78 పరుగులు చేయగా, వరుణ్‌సాత్విక్ 41, సందీప్ 31 పరుగులు తీశారు. రెండో ఇన్నింగ్స్‌లో ప్రకాశం జట్టును కృష్ణా బౌలర్లు 27.2వ ఓవర్ వద్ద 112 పరుగులకు కట్టడి చేసి 126 పరుగుల తేడాతో గెలిచారు. కృష్ణా బౌలర్లు లోహిత్ మోహన్ నాలుగు, కౌశిక్ మూడు వికెట్లు తీశారు. డీవీఆర్ మైదానంలో గుంటూరు, పశ్చిమగోదావరి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన గుంటూరు జట్టు నిర్ణీత 40 ఓవర్లకు ఏడు వికెట్లు నష్టపోయి 290 పరుగులు చేసింది. బ్యాట్స్‌మెన్‌లు మహీప్‌కుమార్ 93(93 బాల్స్, ఆరు ఫోర్లు, మూడు సిక్స్‌లు), మనోహర్ 75(62 బాల్స్, ఐదు ఫోర్లు, మూడు సిక్స్‌లు), సిద్ధార్థ 47(20 బాల్స్, ఒక ఫోర్, ఐదు సిక్స్‌లు)లతో రాణించారు. రెండో ఇన్నింగ్స్‌లో ప్రత్యర్థి పశ్చిమగోదావరి జట్టును 32 ఓవర్లకు 132 పరుగుల వద్ద ఆలౌట్ చేసిన 158 పరుగుల తేడాతో గుంటూరు జట్టు విజయం సాధించింది.

కొండపల్లి బొమ్మకు అవార్డు అందిద్దాం

- ఈనెల 20 నుంచి ప్రారంభం కానున్న ఈ–ఓటింగ్
- వివరాలు వెల్లడించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కొండపల్లి బొమ్మలకు జాతీయ అవార్డు సాధించేందుకు ఈ–ఓటింగ్ నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి ఈ–ఓటింగ్ ప్రారంభమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ–ఓటింగ్‌లో పాల్గొని కొండపల్లి బొమ్మలకు జాతీయ అవార్డు దక్కేలా కృషి చేయాలన్నారు. ఓటింగ్ విజయవంతమైతే జిల్లాకు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందించే వన్ డిస్ట్రిక్ట్ – వన్ ప్రొడక్ట్ – 2023 అవార్డుకు ఎన్టీఆర్ జిల్లా నుంచి కొండపల్లి బొమ్మలను ప్రతిపాదించినట్లు చెప్పారు. జిల్లా అధికారులు కొండపల్లి బొమ్మల తయారీని తరచూ సందర్శించాలన్నారు. ప్రతి అధికారి కొండపల్లి బొమ్మలను కొనుగోలు చేయడం ద్వారా కళాకారులను ప్రోత్సహించాలన్నారు. నాలుగు వందల సంవత్సరాల సంస్కృతి నేటికి కొనసాగుతోందని, ఈ కళారూపాలు భావితరాలకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బొమ్మల తయారీకి తెల్ల పొణికి కలప వాడుతారని, కొండపల్లి, ఎ. కొండూరు, జి. కొండూరు అటవీ ప్రాంతాలలోని కలపను బొమ్మల తయారీదారులకు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలన్నారు. బొమ్మల తయారీలో వివిధ ఆకృతులు, కళా రూపాలకు అధికారులు తగు సూచనలు చేయాలన్నారు. జేసీ డాక్టర్ పి. సంపత్ కుమార్, డీఆర్వో కె. మోహన్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నలుగురిపై పోక్సో కేసు నమోదు

బాలికపై లైంగిక దాడి.. ముగ్గురి అరెస్ట్

వీరులపాడు(నందిగామ): బాలికకు మాయ మాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తితో పాటు అతనికి సహకరించిన ఇద్దరు వ్యక్తులు, మరో బాలికపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహాలక్ష్మణుడు సోమవారం తెలిపారు. వీరిలో ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేయగా.. మరో బాలిక పరారీలో ఉన్నట్లు ఆయన చెప్పారు. ఎస్ఐ తెలిపిన సమాచారం ప్రకారం.. ఈ నెల 12న రాత్రి తొమ్మిది గంటలకు వీరులపాడు గ్రామానికి చెందిన కారుమంచి నరేష్ అనే వ్యక్తి తన అన్న కుమార్తె అయిన బాలిక కనిపించటం లేదని ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తునకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఫిర్యాదు దారుడైన నరేష్ భార్యకు దూరపు బంధువైన తెలంగాణలోని ఖమ్మం జిల్లా ముదిగొండకు చెందిన ఓ బాలిక నాలుగు రోజుల క్రితం వీరులపాడు వచ్చినట్లు గుర్తించారు. ఈ బాలిక కూలి పనులకు వెళ్తూ నరేష్ అన్న కుమార్తెతో పరిచయం పెంచుకుంది. అనంతరం మాయమాటలు చెప్పి ముదిగొండకే చెందిన చిన్నబోయిన యుగంధర్‌తో వివాహం చేస్తానని నమ్మించింది. ఆ బాలిక మాటలు నమ్మిన వీరులపాడుకు చెందిన బాలిక ఈ నెల 12న మధ్యాహ్న సమయంలో తెలంగాణకు చెందిన బాలిక వెంట వెళ్లింది. యుగంధర్ తన స్నేహితుల సాయంతో బాలికను అదే రోజు రాత్రి ముదిగొండకు తీసుకెళ్లాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగికదాడికి పాల్పడ్డాడు. మరుసటి రోజు యుగంధర్ స్నేహితులు ఆ బాలికను కోదాడ బస్టాండ్ సమీపంలో వదలివెళ్లిపోయారు. ఆ తర్వాత తెలంగాణ బాలిక కూడా అక్కడి చేరుకుంది. వీరిని గమనించిన పోలీసులు బాలికను అదుపులోకి తీసుకున్నారు. అయితే తెలంగాణకు చెందిన బాలిక మాత్రం తప్పించుకుంది. అయితే చిన్నబోయిన యుగంధర్, అతనికి సహకరించిన స్నేహితులు షేక్ మదార్ సాహెబ్, దొంతగాని నాగేశ్వరరావులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈముగ్గురితో పాటు పరారైన బాలికపై కూడా పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ తెలిపారు. కిడ్నాప్‌కు గురైన బాలికను సురక్షితంగా ఇంటికి చేర్చినట్లు చెప్పారు.

కూలింగ్ కెనాల్లో గుర్తుతెలియని మృతదేహం లభ్యం



ఇబ్రహీంపట్నం(మైలవరం): ఎన్టీటీపీఎస్ కూలింగ్ కెనాల్లో గుర్తుతెలియని వ్యక్తి మృత దేహాన్ని ఇబ్రహీంపట్నం పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. రెండో స్టేజ్ కాలువ గేటు వద్ద మృతదేహాన్ని గుర్తించిన సంస్థ అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న పోలీసులు మృత దేహాన్ని కాలువ నుంచి బయటకు తీయించారు. వయస్సు 40–45 ఏళ్లు, ఎత్తు 5.5 అడుగులు ఉన్నట్లు గుర్తించారు. తెలుపు రంగు కాలర్‌తో బ్లూకలర్ హాఫ్ హ్యాండ్ టీషర్ట్, రెండు పేటల ఎరుపు రంగు మొలతాడు ధరించి ఉన్నట్లు ఎస్ఐ మణి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులు దుర్మరణం

మృతులు తెలంగాణ వాసులు

పమిడిముక్కల(పామర్రు): విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిపై గురజాడ బైపాస్ వద్ద సోమవారం జరిగిన ప్రమాదంలో భార్య, భర్తలు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ వైపు వెళ్తున్న కారు గురజాడ బైపాస్ వద్ద ప్రమాదవశాత్తూ డివైడర్‌ను ఢీకొంది. దీంతో కారు డ్రైవ్ చేస్తున్న ఉద్దండి బలాకర్ మోహన్ (55) అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కారులోని ఉద్దండి ఉమామహేశ్వరి(50)ని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. మృతులు భార్యాభర్తలని, వారిది తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా మునగనూరులోని యాదాద్రినగర్‌గా ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. కృష్ణాజిల్లాలో ఎక్కడికి వెళ్లి వస్తుందనే వివరాలు తెలియలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

తల్లి, ఇద్దరు కుమార్తెలు అదృశ్యం

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో తల్లితో పాటు ఇద్దరు కుమార్తెలు అదృశ్యం అవ్వటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు ఇందిరానగర్–1కు చెందిన కె.శ్రీనివాసరావు భార్య దుర్గ(25) కుమార్తెలు భవితశ్రీ(3), జస్విత(2)తో ఉంటున్నాడు. శ్రీనివాసరావు ఆటో డ్రైవర్‌గా పని చేస్తాడు. అయితే గత కొద్ది రోజుల క్రితం వరకు భార్య దుర్గ తాపీమేస్త్రి వద్ద పనికి వెళ్లింది. ఇటీవలె పని మానేసింది. అక్కడ పని చేసిన సమయంలో రమణ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. కాగా ఈ నెల 15వ తేదీన శ్రీనివాసరావు ఆటో డ్యూటీకి వెళ్లి తిరిగి రాత్రి ఇంటికి వచ్చే సరికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఇంట్లో లేరు. వారికోసం బంధువుల ఇళ్లల్లో వెతికాడు. దుర్గ ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉంది. భార్యా పిల్లలు కనబడక పోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కారు ఢీకొని ముఠా కార్మికుడు మృతి

కృష్ణలంక(విజయవాడతూర్పు): కారు ఢీకొనడంతో రోడ్డు దాటుతున్న ముఠా కార్మికుడు మృతి చెందిన ఘటన కృష్ణలంక పోలీస స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కృష్ణలంక, భూపేష్‌నగర్‌లో వేముల నాగరాజు(28) కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. నేతాజీ వంతెన సమీపంలో జాతీయ రహదారి పక్కన సాయిబాబా గుడి వద్ద ముఠా కార్మికుడిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతనికి భార్య శిరీషా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆదివారం ఉదయం 8 గంటలకు పని నిమిత్తం సాయిబాబా గుడి వద్దకు వెళ్లాడు. రాత్రి 12 గంటల సమయంలో టీ తాగేందుకు రాణిగారితోట ఫీడర్ రోడ్డు వైపు వెళ్లి తిరిగి జాతీయ రహదారిని దాటుతున్నాడు. ఆ సమయంలో బెంజిసర్కిల్ వైపు నుంచి వారధి వైపు వెళ్తున్న కారు అతనిని ఢీకొట్టింది. దీంతో అతను కిందపడిపోవడంతో తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే కారు డ్రైవర్ చుట్టు పక్కల వారి సహాయంతో చికిత్స నిమిత్తం అతనిని అదే కారులో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం 5.30 గంటలకు మృతి చెందాడు. పోలీసులు వివరాల సేకరించి కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

ఆటోనగర్(విజయవాడతూర్పు): రామలింగేశ్వరనగర్ విద్యుత్ ఉపకేంద్రం 11 కేవీ పుట్టరోడ్డు ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు కార్యనిర్వాహక ఇంజినీర్ బి.వి.సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనాడు కాలనీ, ఎస్టీపీ హెచ్‌టీ పాయింట్, శ్మశానవాటిక వీధి, ఠాగూర్‌వీధి, శివగంగభవాని వీధితో పాటు కొమ్మా పూర్ణచంద్రరావు వీధి, రాయపాటి రమణమ్మ వీధి, రాయపాటి సత్యయ్య వీధి, సాయిబాబా వీధి, పుట్టరోడ్డులో సరఫరాకు అంతరాయ కలుగుతుందని పేర్కొన్నారు.

కృష్ణలంక(విజయవాడతూర్పు): కరెంట్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ కారణంగా మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ విజయవాడ టౌన్ కార్యనిర్వాహక ఇంజినీర్ బి.వి.సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. పీఎస్ఆర్ ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ మెట్లబజార్ ఫీడర్‌లోని మెట్ల బజార్, బాబూరావు వీధి, రామాలయం వీధి, ఫీడర్ రోడ్డు, మంటాడవారి వీధి, విక్రమ్ దుర్గయ్య వీధి, కొట్టు సుబ్బారావు వీధి, బియ్యంకొట్ల బజార్, పాతబట్టల బజార్, గుండు కోటయ్య వీధి, వర్మ వీధి, ఆర్చి రోడ్డు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఏబీవీపీ ఉమ్మడి కృష్ణా కన్వీనర్‌గా యాగంటి




మొగల్రాజపురం(విజయవాడతూర్పు): అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఉమ్మడి కృష్ణా జిల్లా కన్వీనర్‌గా తనను ఎంపిక చేసినట్టు విజయవాడకు చెందిన యాగంటి వెంకట గోపి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు రాజమండ్రిలో జరిగిన ఏబీవీపీ రాష్ట్ర కమిటీ శిక్షణ సమావేశంలో ఎన్నిక జరిగిందని పేర్కొన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎండీడీటీఐ ప్రెసిడెంట్ డాక్టర్ జయమోహన్ తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ విజయవాడ డివిజన్ ఆధ్వర్యాన కృష్ణా కెనాల్‌లోని మల్టీ డిసిప్లినరీ డివిజనల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఎండీడీటీఐ)లో ప్లాంటేషన్ డ్రైవ్ చేపట్టారు. జయమోహన్ సభ్యులతో కలసి ఎండీడీటీఐ పరిసరాల్లో పలు రకాల పండ్ల మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ జీవవైవిధ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో పాటు సమాజానికి అవసరమైన పోషకాహారం అందించడానికి మామిడి, జామ, అరటి, దానిమ్మ పండ్ల మొక్కలు నాటాలన్నారు. మొక్కలు పెంపకంతో పర్యావరణ పరిరక్షణ, నేల కోత, సమతుల్యం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ వైస్ ప్రెసిడెంట్ డి.శ్రీదేవి, సభ్యులు పాల్గొన్నారు.

నిషేధిత మందులు విక్రయిస్తే చర్యలు



పటమట(విజయవాడతూర్పు): నిషేధిత మందులు విక్రయిస్తే చర్యలు తీసుకొంటామని సెంట్రల్ డివిజన్ ఏసీపీ భాస్కరరావు అన్నారు. పటమటలోని ఏసీపీ కార్యాలయంలో సోమవారం ఆయన మందుల షాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గంజాయికి అలవాటు పడిన పలువురు మందుల షాపుల్లో లభ్యమయ్యే ఆల్ప్రోజోమ్, డైజాఫ్టమ్, ట్రిమడాల్ వంటి వాటికోసం డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా తీసుకెళ్తున్నారని, ప్రిస్క్రిప్షన్ లేకుండా ఎవరికీ మందులు విక్రయించవద్దన్నారు. సమావేశంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ గోపాల్, పటమట సీఐ కాశీ విశ్వనాథ్, మాచవరం, గుణదల సీఐలు కృష్ణ మోహన్, గుణరాము పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు చేసుకోవాలి

కంచికచర్ల: ఓటరు లిస్టులో మార్పులు చేర్పులు ఉంటే సరిచేయాలని తహసీల్దార్ శంకరబాబు తెలిపారు. బూత్ లెవెల్ అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి ఓటర్ లిస్టులో ఉన్న మార్పులు చేర్పులు సరిచేసుకునే వెసులుబాటు కల్పించటం జరిగిందన్నారు. ప్రతి గ్రామంలో బీఎల్ఓలు తప్పనిసరిగా ఓటర్ల జాబితాను పరిశీలించి తప్పొప్పులను సరిచేయాలని కోరారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దార్ నాగుల్ మీరా, బీఎల్ఓలు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో మెరుగైన పాలన

- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు
- దేవినేని అవినాష్
- 10, 11 డివిజన్లలో 'జగనన్న సురక్ష'



సురక్ష కార్యక్రమంలో ధ్రువీకరణ పత్రం అందిస్తున్న దేవినేని అవినాష్, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ

పటమట(విజయవాడతూర్పు): పరిపాలనను ప్రజలకు చేరువ చేస్తూ అర్హులకు సంక్షేమ లబ్ధి అందజేయడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని, సచివాలయ వ్యవస్థతో మెరుగైన పాలన అందిస్తున్నామని ఆ పార్టీ 'తూర్పు' ఇన్‌చార్జి దేవినేని అవినాష్ తెలిపారు. 'తూర్పు'లో సోమవారం 10, 11 డివిజన్లకు సంబంధించి జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. అవినాష్ మాట్లాడుతూ 10, 11వ డివిజన్లలోని 42, 43, 47, 48, 5, 41, 45, 46, 201 సచివాలయాల పరిధిలో వివిధ సాంకేతిక సమస్యలతో నిలిచిపోయిన 1,800 మందికి ఆయా పథకాలు రాలేదని, వీరిని దృష్టిలో పెట్టుకుని వారందరికీ ఆదాయం, కుల, మరణ, జనన ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఏదైనా కారణాలతో ధ్రువీకరణ పత్రాలు అందని ప్రజలకోసం ప్రత్యేకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. తొంభై రోజుల్లో పేదలకు ఇళ్ల పట్టాలు అందజేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సొంతమని కితాబు ఇచ్చారు. గత ప్రభుత్వంలో టీడీపీ జెండా మోసే వాళ్లకే జన్మభూమి కమిటీలు ప్రభుత్వ పథకాలను అందించే వారని గుర్తు చేశారు. మళ్లీ ఇప్పుడు మీ భవిష్యత్తుకు మేం గ్యారంటీ అని కొత్త పాటతో వస్తున్నారని, టీడీపీకి, చంద్రబాబుకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇవ్వలేని గ్యారంటీ ఇప్పుడు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. పూర్ టూ రిచ్ అని ఎవరికీ అర్థంకాని మోసపూరిత మేనిఫెస్టోతో ప్రజలకు ముందుకు వస్తున్నారని అవినాష్ విమర్శించారు. 'తూర్పు'లో రూ.500 కోట్ల తో అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ, డీసీపీ జుబిన్, అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి. సత్యవతి, జోనల్ కమిషనర్లు కృష్ణ వీఎఎస్ డాక్టర్ రవిచంద్, 10వ డివిజన్ ఇన్‌చార్జి కరుటూరి హరీష్ ,11వ డివిజన్ ఇన్‌చార్జ్ పర్వతనేని పవన్ కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జులు గద్దె కల్యాణ్, పార్టీ నాయకులు దుర్గాప్రసాద్, చందు, ఉదయ్, సాంబశివరావు, రిజ్వాన్, తోట వాసు, ఝాన్సీ, శేఖర్, వంశీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఓర్వలేకే ప్రభుత్వంపై విషప్రచారం



గడప గడపకు మన ప్రభుత్వంలో స్థానికులతో మాట్లాడుతున్న దేవినేని అవినాష్

పటమట(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం చేస్తున్న మంచి పనులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రజల్లో రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్ష టీడీపీ ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని విషప్రచారం చేస్తోందని ఆ పార్టీ తూర్పు ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ విమర్శించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం 12వ డివిజన్ 53వ సచివాలయం పరిధిలోని యనమలకుదురు లాకుల నుంచి మొదలై గొట్టిపాటి బ్రహ్మయ్య స్ట్రీట్, వెలగపూడి వారి స్ట్రీట్ ప్రాంతాల్లో నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా వారి కుటుంబాలకు అందుతున్న సంక్షేమ లబ్ధి వివరాల కరపత్రాలు అందజేశారు. అవినాష్ మాట్లాడుతూ గతంలో ఒకసారి ఈ ప్రాంతంలో గడప గడపకు కార్యక్రమం నిర్వహించినప్పుడు ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన చాలా సమస్యలను పరిష్కరించామని స్థానికులు ప్రభుత్వానికి కితాబు ఇస్తున్నారని చెప్పారు. నాలుగేళ్లలో డివిజన్‌లో రూ. 12 కోట్ల అభివృద్ధి చేశారని, గతంలో నెహ్రూ తర్వాత ఇప్పుడే డివిజన్ అభివృద్ధి జరిగిందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. దుష్ప్రచారం చేస్తున్న టీడీపీ, ఎల్లో మీడియాకు ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. తెలంగాణలో మనుగడ లేని నాయకుల ముందు మైక్ పెట్టడంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేసి పబ్బంగడుపుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో 12వ డివిజన్ ఇన్‌చార్జి మాగంటి నవీన్, డెప్యూటీ మేయర్ బెల్లందుర్గ, వైఎస్సార్ సీపీ నాయకులు శిఖకొల్లి సుబ్బారావు, ధనేకుల ఇందిరా ప్రియదర్శిని, అబ్దుల్ మహమ్మద్ రహీం, బర్కతుల్లా బేగ్, షేక్ షకీల్, అరిగెళ్ళ అరుణ, దేవి ప్రియదర్శిని, సూరపనేని సరోజిని తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలి

కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



పనులు పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నిర్దేశించిన సమయంలోగా నాణ్యతా ప్రమాణాలతో ఆర్‌యూబీ పనులు పూర్తిచేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. మధురానగర్ ఆర్‌యూబీ పునరుద్ధరణ సందర్భంగా కార్పొరేటర్ పెనుమత్స శిరీష, ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్ట్ సంస్థ రవితేజ ప్రాజెక్టు ప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తొలుత రైల్వేగేటు, గద్దే వెంకట్రామయ్య పార్కు నుంచి మధురానగర్ వైపు చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టు సంస్థ, అధికారులకు సూచనలు చేశారు. పనులకు ప్రజలు సహకరించాలని కమిషనర్ కోరారు. సాధ్యమైనంత వరకు రాకపోకలకు ఇబ్బంది లేకుండా పనులు పూర్తిచేస్తామని కొన్ని సందర్భాల్లో మాత్రం అంతరాయం కలుగుతుందని తెలిపారు. గుణదల రైల్వే ట్రాక్ వద్ద నూతన మంచినీటి సరఫరా పైపులైను పనులు ప్రారంభించినందున గుణదల మూడు బ్రిడ్జిలపై రాక పోకలు మంగళవారం నుంచి నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

తోకలు కత్తిరిస్తానన్న మాటలు మరిచారా?

ఏపీ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్ధవటం యానాదయ్య



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఈనాడు పత్రిక వాస్తవాలను విస్మరించి, ప్రభుత్వంపై నిత్యం బురద చల్లటమే పనిగా పెట్టుకుందని ఏపీ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్ధవటం యానాదయ్య విమర్శించారు. ముఖ్యంగా విజయవాడలోని దుర్గగుడిలో పనిచేస్తున్న నాయీబ్రాహ్మణులు జీఓ110 పట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నా.. అసంతృప్తితో ఉన్నట్లు కథలు అల్లడం సరికాదన్నారు.

విజయవాడ గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో గల ఆయన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో భక్తుల నుంచి వసూలు చేసే తలనీలాలు రుసుమును రూ.15ల నుంచి రూ.25లకు పెంచిందని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాయీబ్రాహ్మణుల విజ్ఞప్తి మేరకు తలనీలాల రుసుమును రూ.25ల నుంచి రూ.40లకు పెంచుతూ జీఓ 110 విడుదల చేసిందని గుర్తు చేశారు. అయితే అది ఇంకా అమలు కావటం లేదనే సాకుతో టీడీపీకి చెందిన కొందరు గత ప్రభుత్వం అవలంబించిన విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేయటం వారి గొయ్యిని వారే తీసుకున్నట్లుందని ఎద్దేవా చేశారు.

మేలు గుర్తుంచుకోవాలి అవమానాన్ని మరిచిపోకూడదు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో దేవాలయాల్లో పనిచేస్తున్న నాయీబ్రాహ్మణులు కలిసి తమ ఇబ్బందులను చెప్పినప్పుడు మన ప్రభుత్వం అధికారంలోకి వస్తే మీకు గుర్తింపు కార్డులు ఇవ్వటంతోపాటు నిర్ణీత వేతనం అందేలా చూస్తానని హామీ ఇచ్చారని యానాదయ్య గుర్తు చేశారు. అయితే ఉద్యోగులుగా గుర్తిస్తామని సీఎం జగన్ హామీ ఇచ్చినట్లు ఈనాడు వక్రీకరించి రాసి నాయీబ్రాహ్మణుల్లో చీలిక తెస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో తమ కష్టాలను చెప్పుకునేందుకు సచివాలయానికి వెళితే.. 'లోపలకు ఎవరు రానిచ్చారు.. అసలు మీకూ దేవాలయాలకు సంబంధం లేదు, ఎక్కువగా మాట్లాడితే గుడి మెట్లు ఎక్కనివ్వనని, తోకలు కత్తిరిస్తానని అవమానిస్తే కన్నీటి పర్యంతమై వెనుదిరిగిన వైనాన్ని దుర్గగుడిలో పనిచేస్తున్న నాయీబ్రాహ్మణులు మరిచిపోయారా అని ప్రశ్నించారు.

అంత స్తోమత ఉందా?

రాష్ట్రంలోని దేవాలయాల్లో పని చేసేవారి నుంచి రూ.5 కోట్లు వసూలు చేశారని ఈనాడు విషపు రాతలు రోతగా ఉన్నాయని పేర్కొన్నారు. అంత పెద్ద మొత్తాన్ని ఇచ్చే స్తోమత నాయీబ్రాహ్మణులకు ఉందా అని ప్రశ్నించారు.

సీఎం జగన్ ప్రభుత్వం ఇచ్చిన చారిత్రాత్మకమైన జీఓ 110తో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దేవాలయాల్లో పని చేసే సుమారు 2వేలమందికి శాశ్వత పరిష్కారం లభించిందని, అందుకే దుర్గగుడి దగ్గర కేశఖండన శాల వద్ద, పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద జరిగిన కృతజ్ఞత సభలో థ్యాంక్యూ సీఎం సార్ అంటూ సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారని గుర్తు చేశారు.

ఎన్‌సీసీలో చేరేందుకు ముందుకు రావాలి



మైలవరం: విద్యార్థులు ఎన్‌సీసీలో చేరేందుకు ముందుకు రావాలని ఎన్‌సీసీ అధికారులు లక్ష్మణ్, కుందన్ పేర్కొన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ ఆర్మీ వింగ్ తృతీయ, ఫైనల్ ఇయర్ 10 మంది విద్యార్థినులకు కళాశాల ప్రెసిడెంట్ జీ శ్రీనివాసరెడ్డి, ఎన్‌సీసీ అధికారులు లక్ష్మణ్, కుందన్, ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు సమక్షంలో సీ సర్టిఫికెట్లను సోమవారం అందజేశారు. కుందన్, లక్ష్మణ్ మాట్లాడుతూ పురుషులతో పాటు మహిళలకు కూడా మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ కేర్ టేకర్ ఆర్.పవిత్ర పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్టు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్):నగరంలో గంజాయి విక్రయిస్తున్న యువకుడిని ఎస్ఎన్‌పురం పోలీసులు సోమవారం అరెస్టు చేసి 1.40 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని పైపులరోడ్డుకు చెందిన పోలిశెట్టి నాగకుమార్ ఇతర ప్రాంతాల నుంచి గంజాయి కొనుగోలు చేసి నగరంలోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలో రైల్వేస్టేషన్ సమీపంలోని కాల్‌టెక్స్ రోడ్డు, బస్‌స్టాప్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఎస్ఐ దుర్గామహేష్ సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నారు. బ్యాగు సోదా చేయగా గంజాయి లభ్యమైంది. నిందితుడిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించారు.

విలక్షణ నటుడు రంగనాథ్



మధురానగర్(విజయవాడసెంట్రల్): హీరోగా, విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా రంగనాథ్ సినీ పరిశ్రమలో తనదైన ముద్ర వేసుకున్నారని శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆర్. రామకృష్ణప్రసాద్ అన్నారు. దుర్గాపురం అల్లూరి సీతారామరాజు వంతెన సమీపంలో సోమవారం డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన ప్రముఖ సినీ నటుడు, సాహితీవేత్త, దర్శకులు రంగనాథ్ 74 వ జయంతి నిర్వహించారు. రంగనాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. వసంత కుమార్ మాట్లాడుతూ సినీనటుడు రంగనాథ్‌తో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. సొసైటీ కార్యదర్శి రాము, పి.విల్సన్ రాజు, షఫీ, నాగమల్లిక, నాగేశ్వర రావు, కోటేశ్వర రావు, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్మెల్ మాత పుణ్యక్షేత్ర మహోత్సవం

పెనమలూరు: కానూరులో మౌంట్ కార్మెల్ మాత మహోత్సవం ఘనంగా నిర్వహించారు. నవదిన ప్రార్థనల్లో భాగంగా ఆదివారం రాత్రి పరిశుద్ధ జపమాల ప్రార్థనలు ఫాదర్ బొల్లి జయరాజ్, ఫాదర్లు పృథ్వీ, మందా ప్రదీప్, సలివేంద్ర శౌరి, దేవదానం చేశారు. భక్తులు కొవ్వొత్తులతో ప్రార్థనలో పాల్గొన్నారు. భక్తులకు దివ్య ప్రసాదం అందజేశారు. అనంతరం లక్కీ డిప్ ద్వారా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రేమ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపదేశకులు, యూనిట్ లీడర్లు, కౌన్సిల్ సభ్యులు, గంగూరు, కానూరు, కామయ్యతోపు, పోరంకి నుంచి దాదాపు 2వేల మంది భక్తులు పాల్గొన్నారు. గత తొమ్మిది రోజులుగా మేరీమాత పుణ్యక్షేత్రంలో నిర్వహించిన మహోత్సవాలకు సహకరించిన వారికి ఫాదర్లు అభినందనలు తెలిపారు.

రైతుబజార్‌లో కందిపప్పు విక్రయాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల భారాన్ని తగ్గించే దిశగా రైతు బజార్లలో బియ్యం, టమాటాతో పాటు కందిపప్పు విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశామని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ తెలిపారు. విజయవాడ సాంబమూర్తి రోడ్డులోని రైతు బజారులో జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ హోల్ సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ సొసైటీ సహకారంతో కందిపప్పు విక్రయ కౌంటర్‌ను జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ సోమవారం ప్రారంభించారు. నాణ్యమైన దేశవాళీ కందిపప్పును కిలో రూ.135లకే విక్రయిస్తామని జేసీ తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి సబ్సిడీపై నాణ్యమైన బియ్యం, టమాటా, కందిపప్పు వంటి సరుకులను ప్రజలకు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. సాంబమూర్తి రోడ్డు రైతు బజార్‌తోపాటు మిగిలిన రైతు బజార్లలో కూడా కౌంటర్లు ఏర్పాటు చేసి నిత్యావసర సరుకులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కౌంటర్లలో కిలో టమాటా రూ.50, కిలో సోనా మసూరి బియ్యం రూ.49, కందిపప్పు రూ.135 చొప్పున విక్రయిస్తామని వివరించారు. డీఎస్ఓ మోహన్‌బాబు, ఏఎస్ఓలు సి.ధనుంజయరెడ్డి, శ్రీలక్ష్మి, మార్కెటింగ్ ఏడీ మంగమ్మ, మహాత్మా గాంధీ హోల్ సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ సొసైటీ అధ్యక్షుడు పి.నాగేశ్వర రావు, సెక్రటరీ కె నారాయణ, ఎస్టేట్ ఆఫీసర్ ఎం .శ్రీనివాసశాస్త్రి పాల్గొన్నారు.

సంతృప్తికర పరిష్కారాలు లభించాలి

మేయర్ భాగ్యలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



స్పందనలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్

పటమట(విజయవాడతూర్పు): స్పందనలో వచ్చే అర్జీలకు సంతృప్తికర పరిష్కారాలు అందించాలని, సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ సూచించారు. వీఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం జరిగిన స్పందనలో వీరు 21 ఫిర్యాదులను స్వీకరించి అధికారులకు పలు సూచనలు చేశారు. పట్టణ ప్రణాళిక విభాగం-11, ఇంజినీరింగ్ విభాగం-4, రెవెన్యూ-1, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు.సి.డి)-2, ఎస్టేట్ విభాగం-1, అదనపు కమిషనర్ (జనరల్) విభాగం-2 వచ్చాయి. ఆయా సమస్యలను నిర్దుష్ట గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు.

అనంతరం కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం 1902, స్పందన, అవర్ వీఎంసీ పోర్టల్‌లను వీఎంసీ అన్ని విభాగాల ఉన్నతాధికారులు ప్రతిరోజూ పరిశీలించుకోవాలని, ఫిర్యాదులు పెండింగ్‌లో లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. సచివాలయాల స్థాయిలో ఉన్న సమస్యలను సంబంధిత కార్యదర్శులు మాత్రమే పరిష్కరించాలని ఆదేశించారు. జగనన్న సురక్ష ద్వారా అర్హులకు సంక్షేమాన్ని అందించడానికి వీఎంసీ పరిధిలో అన్ని సచివాలయాల కార్యదర్శులను సమన్వయం చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. నగరపాలక సంస్థ సంబంధిత విభాగం అధికారి, సచివాలయ కార్యదర్శి నేరుగా ఫిర్యాదుదారుని కలిసి శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. స్పందన వేదికలో అందించే ఫిర్యాదుల సంఖ్యను తగ్గించడానికి అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

అన్ని విభాగాల ఉన్నతాధికారులు తమ విభాగాల పనితీరును మెరుగుపరచడానికి ఆకస్మిక తనిఖీలు చేయాలని కమిషనర్ సూచించారు. నోటీసు బోర్డుల ద్వారా సమాచారం ప్రజలకు అందేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. సీఈ ఎం.ప్రభాకర రావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, సిటీప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) వెంకటలక్ష్మి, ఎ.డి.హెచ్ శ్రీనివాసు, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాస్, బయాలజిస్ట్ సూర్య కుమార్ పాల్గొన్నారు.

విజయరాజరాజేశ్వరికి చండీహోమం



పెదపులిపాక ఆలయంలో శ్రీ విజయరాజరాజేశ్వరి

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో ఉన్న శ్రీ విజయరాజరాజేశ్వరి శ్రీవిజయసుందరేశ్వరస్వామి వారి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్య సందర్భంగా ఆలయంలో గోపూజ నిర్వహించారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అమ్మవారికి చండీహోమం చేశారు. అమ్మవారికి భక్తులు లక్ష పుష్పార్చన చేశారు. సాయంత్రం అమ్మవారిని రథంపై గ్రామంలో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీవాసుదేవానందగిరి స్వామీజీ పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఆషాఢ మాస అమావాస్యను పురస్కరించుకుని సోమవారం చండీహోమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హోమ గుండం వద్ద వేద పండితుల ఆధ్వర్యంలో చండీహోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రజలంతా సుఖంగా ఉండాలని, పాడి పంటలు సంవృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ నిర్వహించిన ఈ హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

మహిళల స్వయం ఉపాధికి సహకరించండి

ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్ వినతి



సీఈఓ శ్రీధర్‌రెడ్డికి వినపత్రం ఇస్తున్న శ్రీకాంత్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ (పీఎంఎఫ్ఎంఈ) పథకం ద్వారా విశ్వబ్రాహ్మణ మహిళలు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా చిరు వ్యాపారాలు చేసుకుని ఉపాధి పొందేలా ప్రోత్సహించాలని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎల్. శ్రీధర్ రెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ఫుడ్ వ్యాపార యూనిట్లు పెట్టుకునేందుకు జిల్లా హార్టికల్చర్ అధికారులు, అలాగే అవగాహన కల్పించేందుకు రిసోర్స్ పర్సన్స్ అన్ని మండలాల్లో అందుబాటులో ఉన్నారని, వారిని సంప్రదిస్తే తగిన సహాయ సహకారాలను అందిస్తారని చెప్పారు. పూర్తి ఉచితంగా ప్రాసెస్ చేసే ఈ పథకం ఎంతో ప్రయోజనకరమని, ప్రాజెక్ట్ వ్యయంలో 90 శాతం బ్యాంక్ రుణ సౌకర్యం ఉందని, అందులో 35 శాతం సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంఎల్ఎస్ పాయింట్ తనిఖీ



మైలవరం: మైలవరం వ్యవసాయ మార్కెట్ యార్డులోని రేషన్ బియ్యం మెయిన్ లిఫ్టింగ్ పాయింట్‌ను ఎన్టీఆర్ జిల్లా సబ్ కలెక్టర్ అదితిసింగ్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అదితిసింగ్ రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. రికార్డులు తనిఖీ చేశారు. సబ్ కలెక్టర్ వెంట మైలవరం తహసీల్దారు శ్రీనివాస్, డీటీ, సివిల్ సప్లెస్ మాధవి ఉన్నారు.

ఉచిత ధ్యాన శిక్షణ తరగతులు ప్రారంభం

మధురానగర్(విజయవాడసెంట్రల్):ఉచిత ధ్యాన శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర జీవనం సాగించాలని 31వ డివిజన్ కార్పొరేటర్ పెనుమత్స శిరీష సూచించారు. ముత్యాలంపాడు గంగానమ్మ దేవాలయంలో హిమాలయ అమరగురు ఆర్య శ్రీ మహావతార్ బాబాజీ ట్రస్ట్ ఆధ్వర్యాన సోమవారం ఉచిత ధ్యాన శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. శిరీష ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. శిక్షకులు అమన్ హనీ ఆలీఖాన్, భానుప్రకాష్ మాట్లాడుతూ ధ్యానం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరికీ ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియచేసేందుకు తాము ఉచిత ధ్యాన శిక్షణ తరగుతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

రేపు కానుకల లెక్కింపు

మధురానగర్(విజయవాడసెంట్రల్):మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయం హుండీ లెక్కింపు బుధవారం దేవదాయ శాఖ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు, సేవా సమితి సభ్యుల పర్యవేక్షణలో జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు హుండీ లెక్కింపు ప్రారంభ మవుతుందన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు సంప్రదాయ వస్త్రధారణతో హుండీ లెక్కింపులో పాల్గొన వచ్చని ఆమె పేర్కొన్నారు.

క్లుప్తంగా...

ప్రకాశం జిల్లాకు సాగర్ నీరు ఇవ్వండి
సీఎం జగన్‌ను కోరిన మంత్రి సురేశ్



సాక్షి, అమరావతి: ప్రకాశం జిల్లా ప్రజల తాగునీటి అవసరాల కోసం ఎస్ఎస్ ట్యాంకులు నింపేందుకు సాగర్ నీరు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేశ్ సోమవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను మంత్రి సురేశ్ కలిసి ప్రకాశం జిల్లాలో తాగునీటి అవసరాల గురించి వివరించారు. జిల్లాలో ఇప్పటికే కొన్ని సీపీడబ్ల్యూఎస్ స్కీముల్లో నీరు డెడ్ స్టోరేజ్‌కు పడిపోయిందని తెలిపారు. ప్రస్తుతం 5 టీఎంసీల నీరు విడుదల చేయాలని, సాగర్ నీరు విడుదల కాకపోతే మిగిలిన ఎస్ఎస్ ట్యాంకుల నుంచి కూడా నీరు సరఫరా చేయలేని పరిస్థితులు నెలకొంటాయని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సీఎం జగన్ ఈ నెల 19న జరిగే కృష్ణా రివర్ వాటర్ మేనేజ్‌మెంట్ బోర్డు సమావేశంలో ఈఎన్‌సీలు, ఇంజినీరింగ్ అధికారులు నిర్ణయం తీసుకుని తగిన ఏర్పాట్లు చేస్తారని హామీ ఇచ్చినట్లు మంత్రి సురేశ్ చెప్పారు.

ప్రత్యేక హోదా ఉద్యమాల కేసులు ఉపసంహరించాలి
సీపీఎం నేత వి.శ్రీనివాసరావు


సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కావాలని ఉద్యమం చేసిన వారిపై కేసులు ఉపసంహరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సోమవారం ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలు అమలు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా అనేక రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, మేధావుల వేదికలు నిరసన కార్యక్రమాలు చేశాయని తెలిపారు.

టీడీపీ గెలిస్తే పాడి పరిశ్రమకు పూర్వవైభవం: లోకేశ్



కొండపి (మాలెపాడు): టీడీపీ గెలిస్తే పాడి పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకొస్తామని, ఒంగోలు డెయిరీని తెరిపించే బాధ్యత తీసుకుంటామని టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. యువగళం పాదయాత్రను ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గం పొన్నలూరు మండలం చెంచుపాలెం శివారు నుంచి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాలెపాడు వద్ద రైతుల ముసుగులో టీడీపీ కార్యకర్తలు అడిగిన ప్రశ్నలకు లోకేశ్ సమాధానం ఇస్తూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయం, పాడి రైతుల నడ్డి విరిచిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వస్తే లీటరు పాలకు అదనంగా రూ.4 ఇస్తామన్న జగన్ ఆ మాట మరిచారన్నారు. టీడీపీ హయాంలో 50 శాతం సబ్సిడీతో పాడి రైతులకు ఇచ్చిన విత్తనాలు, మందులు, గడ్డి, దాణా అన్నింటికీ మంగళం పలికారన్నారు. ఒంగోలు డెయిరీ, విజయ డెయిరీలను ఈ ప్రభుత్వం మూతవేయించి అమూల్ సంస్థకు ద్వారాలు తెరిచిందన్నారు. పాడి పరిశ్రమకు సంబంధించి ఈ ప్రభుత్వం అన్నీ ఎత్తివేసి చివరకు గోపాల మిత్రలను రోడ్డున పడేశారన్నారు. పాడి పరిశ్రమ అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వం, ప్రైవేట్ రెండు రంగాలు ఉండాలన్నారు.

రాష్ట్ర ప్రయోజనాలు కాపాడటంలో ప్రభుత్వం విఫలం: చంద్రబాబు



సాక్షి, అమరావతి: విభజన చట్టం హామీల అమలు ద్వారా రాష్ట్ర ప్రయోజనాలు కాపాడటంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విఫలమైందని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు విమర్శించారు. ఈ నెల 20 నుంచి పార్లమెంటు సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో పార్టీ ఎంపీలతో హైదరాబాద్‌లోని తన నివాసంలో చంద్రబాబు సమావేశమయ్యారు. పదేళ్ల రాష్ట్ర విభజన చట్ట కాలపరిమితి మరికొద్ది నెలల్లో ముగుస్తున్నా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్ర హక్కులు కాపాడలేకపోయిందని అన్నారు. 31 మంది ఎంపీలున్నా కేంద్రం నుంచి రాష్ట్రానికి ఏమీ సాధించలేకపోయారని విమర్శించారు. రాష్ట్ర పరిస్థితులను పార్లమెంట్ వరకు తీసుకెళ్లాలని సూచించారు. తప్పుల మీద తప్పులు చేసి జాతీయ ప్రాజెక్టు పోలవరాన్ని నాశనం చేశారని, ఈ విషయాన్ని పార్లమెంటులో లేవనెత్తాలని చెప్పారు. పార్లమెంటులో ప్రవేశపెట్టే బిల్లులపై ఆయా సందర్భాలకు అనుగుణంగా పార్టీలో చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని ఎంపీలకు చంద్రబాబు సూచించారు.

దక్షిణ మధ్య రైల్వే ఐజీగా అరోమాసింగ్

సాక్షి, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే ఇన్‌స్పెక్టర్ జనరల్–కమ్–ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్‌గా అరోమా సింగ్ ఠాకూర్ బాధ్యతలు స్వీకరించారు. ఇండియన్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సర్వీస్ 1993 బ్యాచ్‌కు చెందిన ఆమె ఇంతకుముందు వాయువ్య జోన్‌లో ఇదే బాధ్యతలు నిర్వహిస్తూ బదిలీపై దక్షిణ మధ్య రైల్వేకు వచ్చారు. తూర్పు రైల్వే పరిధిలో వివిధ పోస్టుల్లో పని చేశారు. ఆమె పని తీరుకుగాను మూడు పర్యాయాలు ఇండియన్ పోలీసు సేవా పతకాలు దక్కాయి.

‘సికిల్‌సెల్’కు చెక్!

గిరిజన ప్రాంతంలో ఈ వ్యాధి నిర్మూలనకు పటిష్ట కార్యాచరణ

- రాష్ట్రంలో 40 ఏళ్లలోపు గిరిజనుల్లో లక్షణాలు గుర్తించేందుకు సర్వే
- మూడేళ్లలో 19.09 లక్షల మందికి వైద్య పరీక్షలు
- చదువురాని వారికి కూడా అర్థమయ్యేలా రోగ తీవ్రత తెలిపే కార్డులు
- భావితరాలకు సోకకుండా ముందస్తు చర్యలు
- నిర్ధారించిన రోగ పీడితులకు పెన్షన్..
- వైద్య సేవలతో జీవితకాలాన్ని పెంచే ప్రయత్నం
- 2047 స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల నాటికల్లా నివారణ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో సికిల్ సెల్ వ్యాధిని సమూలంగా నిర్మూలించేందుకు ప్రభుత్వం పటిష్టమైన కార్యాచరణ చేపట్టింది. ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ, వైద్య ఆరోగ్య శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. గిరిజనుల్లో ఎవరెవరికి ఈ వ్యాధి లక్షణాలు ఉన్నాయనే దానిపై స్క్రీనింగ్ (సర్వే) చేపట్టారు. ఇందుకోసం అప్పుడే పుట్టిన పిల్లల నుంచి 40 ఏళ్ల వయస్సున్న పెద్దల వరకు ఎంపికచేశారు. ఇలాంటివారు మొత్తం 19.09 లక్షల మంది ఎస్టీలున్నారు. వీరిలో ఏడాదికి 6.36 లక్షల మందికి సికిల్ సెల్‌తోపాటు తలసేమియా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారు. మూడేళ్లలో దశలవారీగా వైద్య పరీక్షలు పూర్తిచేస్తారు. ఆ తర్వాత.. వారిలో సికిల్‌సెల్, తలసేమియా వంటి రోగ లక్షణాలు ఉన్నాయో? లేదో తెలిపే కార్డులు జారీచేస్తారు. చదువురాని వారికి సైతం అర్థమయ్యే రీతిలో స్త్రీ, పురుషులకు వేర్వేరుగా కార్డులు డిజైన్ చేసి అందిస్తారు. సికిల్‌సెల్, తలసేమియా వ్యాధి తీవ్రతను తెలిపేలా తెలుపు, పసుపు రంగుల్లో వాటిని రూపొందిస్తున్నారు. రోగ లక్షణాలు లేకపోతే పూర్తిగా తెలుపు, లక్షణాల తీవ్రతను బట్టి తెలుపు నుంచి ముదురు పసుపు రంగు వరకు ఉండేలా కార్డులు అందిస్తారు.

రూ.10వేల పెన్షన్.. ఉచిత వైద్యం

సికిల్‌సెల్, తలసేమియా వ్యాధి బారిన పడినవారికి నెలనెలా ప్రభుత్వ ఆర్థిక సాయం (పెన్షన్)తో పాటు ఉచిత వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటారు. ఇప్పటికే గిరిజనుల్లో 1,913 మంది సికిల్‌సెల్, 1,707 మంది తలసేమియా వ్యాధి గ్రస్తులకు రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ.10వేల చొప్పున పెన్షన్, ఉచిత వైద్యం అందిస్తోంది. దేశంలోనే ఇంత పెద్ద మొత్తం పెన్షన్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమే కావడం గమనార్హం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో వారికి సామాజిక భద్రత పెన్షన్ అందిస్తున్నారు.

శతాబ్ది ఉత్సవాల నాటికి అంతం

దేశంలోని గిరిజన ప్రాంతాల్లో సికిల్‌సెల్ నివారణకు నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఈ ఏడాది (2023–24)ని ‘మిషన్ టు ఎలిమినేషన్ సికిల్‌సెల్ ఎనిమియా’గా ప్రకటించింది. దీన్ని జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాల్లోను అమలుచేయాలని ఆదేశించారు. స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాలు (2047) నాటికి గిరిజన ప్రాంతాల్లో సికిల్‌సెల్ రోగం అనేది లేకుండా దాన్ని అంతం చేసేలా కార్యాచరణ అమలులోకి తెచ్చారు. వచ్చే మూడేళ్లలో రోగ లక్షణాలున్న వారిని గుర్తించడం పూర్తిచేస్తారు. ప్రివెంటివ్ మెథడ్‌లో భాగంగా ఈ లక్షణాలున్న ఏ ఇద్దరూ వివాహం చేసుకోకుండా అవగాహన కల్పిస్తారు. తద్వారా భావితరాలకు సికిల్‌సెల్ సోకకుండా అడ్డుకట్ట వేస్తారు. అప్పటికే రోగ లక్షణాలు ఉన్నవారికి పెన్షన్‌తోపాటు వైద్య సేవలు అందించి వారి జీవన కాలాన్ని పెంచేందుకు కృషిచేస్తారు.

సికిల్‌సెల్.. వంశపారంపర్య వ్యాధి

సికిల్ సెల్ అనీమియా అనేది వంశపారంపర్య వ్యాధులలో కూడా ఒకటి. ఇది ఎర్ర రక్త కణాల నిర్మాణంపై ప్రభావం చూపుతుంది. సికిల్‌సెల్, తలసేమియా రెండూ రక్త సంబంధ వ్యాధులే. ఇవి రెండూ గిరిజనుల్లోనే తీవ్రత ఎక్కువగా ఉండటానికి ప్రధాన కారణం రక్త సంబంధీకుల మధ్య పెళ్లిళ్లు ఎక్కువగా జరగడమేనని గుర్తించారు. మైదాన ప్రాంతంలో పల్లెలు, పట్టణాల్లో బయటి వాళ్లతో పెళ్లి సంబంధాలు కలుపుకోవడానికి ఎక్కువ అవకాశముంటుంది. అదే గిరిజన ప్రాంతాల్లో అతి తక్కువ జనాభా ఉండటం, వాటి పరిధి తక్కువగా ఉండటంతో వారిలో వారే మేనరిక వివాహాలు చేసుకుంటారు. దీంతో రక్త సంబంధీకుల మధ్యే తరచూ వివాహాలు జరగడంతో జన్యుపరమైన సమస్యలతో అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని నిర్ధారించారు. వీరిలోనే సికిల్‌సెల్, తలసేమియా వ్యాధులు అధికంగా ఉన్నట్లు గుర్తించారు.



లోకేశ్ యాత్రలో ఫ్లెక్సీలకు డబ్బులు ఎగ్గొట్టారు

- ఆళ్లగడ్డలో వ్యాపారికి అఖిలప్రియ భర్త టోకరా
- ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు



ఎస్పీ రఘువీర్ రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న ఫ్లెక్సీల వ్యాపారి వేణుగోపాల్ దంపతులు

బొమ్మలసత్రం (నంద్యాల): రెండు నెలల క్రితం ఆళ్లగడ్డ పట్టణంలో నారా లోకేశ్ పాదయాత్ర సందర్భంగా ఫ్లెక్సీలతో హడావుడి చేసిన భూమా వారసులు.. ఆ తర్వాత ఫ్లెక్సీల వ్యాపారి కడుపుకొట్టారు. పాదయాత్రకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలకి సంబంధించి మాజీ మంత్రి భూమా అఖిలప్రియ భర్త భార్గవరామ్ సదరు వ్యాపారికి రూ. 1.62 లక్షలు ఎగ్గొట్టారు. దీనిపై ఆ వ్యాపారి జిల్లా ఎస్పీ ఎస్పీ కె.రఘువీర్ రెడ్డికి ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే.. నంద్యాలకు చెందిన వేణుగోపాల్ ఫ్లెక్సీలు, బ్యానర్లు తయారు చేస్తాడు. గడిచిన మే నెల 17, 18 తేదీల్లో లోకేశ్ నంద్యాల, ఆళ్లగడ్డకు వచ్చిన సమయంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీల తయారీ పనిని వేణుగోపాల్‌కు స్థానిక టీడీపీ నేత బొల్లెద్దుల సూరి ద్వారా భార్గవరామ్ అప్పగించాడు. ఇందుకు రూ. 5.87 లక్షల బిల్లు కాగా, రూ.4.25 లక్షలు మాత్రమే ఆ వ్యాపారికి ఇచ్చారు. పాదయాత్ర ముగిసి రెండు నెలలు కావస్తున్నా భార్గవరామ్ మిగిలిన డబ్బు చెల్లించలేదు. దీనికోసం వేణుగోపాల్ ఆళ్లగడ్డలోని అఖిలప్రియ నివాసానికి గతంలో వెళితే పీఏ మహేశ్ పరుషంగా మాట్లాడి పంపేశాడు. భార్గవరామ్ డబ్బు చెల్లించలేకపోతే అప్పు తీర్చలేక ఆత్మహత్య చేసుకోవాల్సి వస్తుందని ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో వేణుగోపాల్ మొరపెట్టుకున్నాడు.

అందరికీ మంచి చేయాలన్నదే సీఎం ఆకాంక్ష

- గుంటూరులోని పార్టీ సమావేశంలో నేతల వెల్లడి
- వచ్చే ఎన్నికల్లో మరోసారి ఘన విజయం ఖాయం
- బీసీల ఓట్ల కోసం చంద్రబాబు పన్నాగం
- డేటా దొంగలు చంద్రబాబు, లోకేశ్‌లే



మాట్లాడుతున్న ఎంపీ అయోధ్యరామిరెడ్డి, చిత్రంలో ఉదయభాను, విష్ణు, రాజశేఖర్

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): సంక్షేమం, అభివృద్ధి, పేద ప్రజలకు అండగా నిలబడాలనే ఆకాంక్ష, అన్ని వర్గాలకు మంచిచేయాలనే తలంపే ప్రతిక్షణం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మనస్సులో ఉంటాయని వైఎస్సార్‌సీపీ నేతలు చెప్పారు. సోమవారం గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ రీజనల్ కార్యాలయంలో గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల సమావేశం జరిగింది. అనంతరం నేతలు మీడియాతో మాట్లాడుతూ.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయదుందుభి మోగించనుందని స్పష్టం చేశారు. వీధి కుక్కలు, పిచ్చికుక్కలు ఎన్ని కలిసి వచ్చినా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సింహంలా సింగిల్‌గా వస్తారని స్పష్టం చేశారు. బీసీల ఓట్ల కోసం చంద్రబాబు పన్నాగం పన్నుతున్నారని, ఇప్పుడు ఆయన ఇస్తున్న హామీలన్నీ 14 ఏళ్ల పాలనలో ఎందుకు అమలు చేయలేదని మండిపడ్డారు.

గడపగడపకూ సంక్షేమం

రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ గుంటూరు, కృష్ణా జిల్లాల కో–ఆర్డినేటర్ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ.. పేదలకు అండగా నిలబడేందుకు సంక్షేమాన్ని వారి గడప ముందుకు తీసుకెళ్లిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్ మాట్లాడుతూ.. చంద్రబాబు బీసీల గురించి మాట్లాడితే ప్రజలే చెంప చెళ్లుమనిపిస్తారని, బీసీల గురించి మాట్లాడితే తాట తీస్తామని హెచ్చరించారు. 14 సంవత్సరాలు అధికారంలో ఉండి వారిని వాడుకున్న చంద్రబాబుకు, నాలుగేళ్లలోనే వారిని బలవంతుల్ని చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఎంతో తేడా ఉందన్నారు. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పిచ్చికుక్కతో సమానమని విమర్శించారు. ఎమ్మెల్సీ, పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ.. ప్రజలకు కావాల్సిన ధ్రువీకరణ పత్రాలను వలంటీర్ల ద్వారా వారి ఇంటికి పంపిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని, ఇలాంటి సురక్ష కార్యక్రమం గతంలో ఏ ముఖ్యమంత్రి చేయలేదని చెప్పారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను మాట్లాడుతూ.. గడప గడపకు మన ప్రభుత్వానికి సంబంధించి పూర్తి స్థాయిలో సమస్యలు పరిష్కరించడం జరిగిందన్నారు. ఏదైనా మిగిలిఉంటే వాటిపైన కూడా సీఎం జగన్ దృష్టి సారిస్తున్నారన్నారు. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష, గడప గడపకు మన ప్రభుత్వం వంటి కార్యక్రమాలను అద్భుతంగా నిర్వహిస్తోందన్నారు. డేటా దొంగలు చంద్రబాబు, లోకేశ్‌లేనని ప్రజలందరికీ తెలుసన్నారు. లోకేశ్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు.

మార్గదర్శివి అడుగడుగునా ఉల్లంఘనలే

- అందుకే ఫిర్యాదు లేకపోయినా రిజిస్ట్రార్ చర్యలు
- ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వొద్దు
- హైకోర్టుకు నివేదించిన అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్
- నేడు నిర్ణయం వెలువరిస్తామన్న న్యాయస్థానం



సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్ గ్రూపులను మూసివేస్తూ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ చందాదారులు దాఖలు చేసిన వ్యాజ్యాల్లో మధ్యంతర ఉత్తర్వుల జారీపై హైకోర్టు తన నిర్ణయాన్ని మంగళవారం వెలువరించనుంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. చందాదారుల తరఫు న్యాయవాదులు ఇప్పటికే వాదనలు పూర్తి చేయడంతో సోమవారం ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ లిమిటెడ్ చట్ట విరుద్ధంగా చిట్ గ్రూపులను నిర్వహించిందని, ఇలాంటి పరిస్థితుల్లో జోక్యం చేసుకుని చందాదారుల ప్రయోజనాలను పరిరక్షించే దిశగా తగిన నిర్ణయం తీసుకునే అధికారం రిజిస్ట్రార్లకు ఉందని తెలిపారు. చందాదారులకు చెల్లింపులు చేయడంలో మార్గదర్శి యాజమాన్యం జాప్యం చేసిందని, ఇది చట్ట ఉల్లంఘనేనన్నారు. నిబంధనల ప్రకారం ప్రతి చిట్‌గ్రూప్‌ను ఓ యూనిట్‌గా పరిగణించాలని, ఆ చిట్ గ్రూప్ నిర్వహణకు ప్రత్యేక బ్యాంకు ఖాతా తెరవాల్సి ఉంటుందన్నారు. అందుకు విరుద్ధంగా మార్గదర్శి యాజమాన్యం చందాదారుల నుంచి వసూలు చేసిన మొత్తాలను ఒకే బ్యాంకు ఖాతాకు మళ్లించిందన్నారు. ఇలా ప్రతి దశలోనూ చట్ట నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడ్డారని శ్రీరామ్ చెప్పారు. నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు రిజిస్ట్రార్ సంతృప్తి చెందితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చునన్నారు. సంబంధిత కంపెనీకి గానీ, చందాదారులకు గానీ నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేదని, అసలు చట్టంలో అలాంటి నిబంధన ఏదీ లేదని కోర్టుకు నివేదించారు. ఫిర్యాదులు లేనప్పటికీ, నిబంధనల ఉల్లంఘనలు జరుగుతున్నాయని తెలిసినప్పుడు చందాదారుల ప్రయోజనాల నిమిత్తం తగిన చర్యలు తీసుకునే అధికారం రిజిస్ట్రార్లకు ఉందని ఆయన వివరించారు. ప్రస్తుత కేసులో కూడా రిజిస్ట్రార్ ఆ పనే చేశారన్నారు. చందాదారుల శ్రేయస్సే పరమావధి అని ఆయన వివరించారు. ఈ మొత్తం వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని, ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వొద్దని ఆయన కోర్టును అభ్యర్థించారు. ఏజీ శ్రీరామ్ వాదనలను చందాదారుల తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది మీనాక్షి అరోరా తోసిపుచ్చారు. పిటిషనర్ల చందా గ్రూపులను అనుమతించేలా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి, మధ్యంతర ఉత్తర్వుల జారీపై మంగళవారం నిర్ణయం వెలువరిస్తానని స్పష్టం చేశారు.

ఎస్‌ఐ పిస్టల్‌తో ఘరానా దొంగ పరారీ
ఎట్టకేలకు పట్టుకున్న కర్ణాటక పోలీసులు

యశవంతపుర: అరెస్టు చేయడానికి వచ్చిన పోలీసులకు ఓ దొంగ చుక్కలు చూపించాడు. ఎస్‌ఐ చేతిలోని పిస్టల్ లాక్కొని చీకట్లో పరారయ్యాడు. తెల్లవార్లు పోలీసులకు చిక్కకుండా వారికి కంటి మీద కునుకు లేకుండా చేశాడు. ఈ ఘటన కర్ణాటకలో కలబురిగి జిల్లా అఫ్జలపురలో ఆదివారం సాయంత్రం జరిగింది. వివరాల్లోకి వెళ్తే... అఫ్జలపుర తాలూకా బళ్లూరగి గ్రామానికి చెందిన ఖాజప్ప గైక్వాడ్ ఓ ఘరానా దొంగ. అతనిపై కర్ణాటక, మహారాష్ట్రలో అనేక చోరీ కేసులున్నాయి. అతన్ని అరెస్ట్ చేయడానికి బెంగళూరు సీసీబీ పోలీసులు ఆదివారం వెళ్లారు. సోన్న గ్రామం వద్ద కారులో కూర్చుని ఉండగా చుట్టుముట్టారు. ఎంతకీ కారులో నుంచి ఖాజప్ప బయటకు రాకపోవడంతో అఫ్జలపుర ఎస్‌ఐ భీమరాయ బంకలి కారు అద్దాలను పగులగొట్టి పిస్టల్ చూపిస్తూ లొంగిపోవాలని బెదిరించారు. ఏమాత్రం భయంలేకుండా ఉన్న ఖాజప్ప అదను చూసి ఎస్‌ఐ చేతి నుంచి పిస్టల్‌ను లాక్కొని చీకట్లోకి పరారయ్యాడు. రాత్రంతా అనేక చోట్ల గాలించినా దొరకలేదు. తుపాకీతో ఏం చేస్తాడోనని పోలీసులు అనుక్షణం ఆందోళనతో తెల్లవార్లు కంటిమీద కునుకులేకుండా గడిపారు. సోమవారం మళ్లీ పోలీసులు అతని కోసం గాలింపు చేపట్టగా, మహారాష్ట్ర దుదణి బళ్లూరి గ్రామంలో ఉన్నట్లు తెలిసింది. అక్కడికి వెళ్లగా ఖాజప్ప పెద్ద చెట్టు ఎక్కి కూర్చున్నాడు. లొంగిపోవాలని పోలీసులు ఎంత హెచ్చరించినా వినలేదు. చెట్టు దిగితే కాల్చేస్తారని భయపడిన ఖాజప్ప ఐదు గంటలపాటు చెట్టుపైనే కూర్చుని ముప్పతిప్పలు పెట్టాడు. గ్రామస్తులు నచ్చజెప్పడంతో చెట్టు దిగిన ఖాజప్పను అరెస్టు చేశారు.

ఉద్యోగుల సంఘాధ్యక్షుడికి బెయిల్ నిరాకరణ

జీఎస్టీ ఉద్యోగుల అవినీతి కేసులో సూర్యనారాయణకు ఏసీబీ కోర్టులో చుక్కెదురు



సాక్షి ప్రతినిధి, విజయవాడ: ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అవినీతికి పాల్పడిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను విజయవాడ ఏసీబీ కోర్టు తోసిపుచ్చింది. వాణిజ్య పన్నుల శాఖ(జీఎస్టీ) ఉద్యోగులు బి.మెహర్‌కుమార్, కె.సంధ్య, కేవీ చలపతి, ఎం.సత్యనారాయణ జీఎస్టీ వసూళ్లలో అక్రమాలకు పాల్పడ్డారనే అభియోగాలపై ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా నేతృత్వంతో సెంట్రల్ ఏసీపీ భాస్కరరావు, పటమట సీఐ కాశీవిశ్వనాథ్ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. వీరి అవినీతి వెనుక సూర్యనారాయణ హస్తం ఉన్నట్టు పోలీసుల విచారణలో బహిర్గతమైంది. వ్యాపారులు చెల్లించాల్సిన పన్ను బకాయిలను ఎక్కువగా చూపించి బెదిరించడం, ఆ తర్వాత వారినుంచి అధికంగా వసూలు చేయడం, వసూలు చేసిన మొత్తంలో కొంత మాత్రమే ప్రభుత్వానికి చెల్లించి మిగిలిన రూ.వందల కోట్లను పక్కదారి పట్టించారనే అభియోగాలపై పోలీసులు కేసు నమోదు చేశారు. సూర్యనారాయణ వెనుక ఉండి ఈ నలుగురు జీఎస్టీ ఉద్యోగులతో అవినీతి చేయించారని పోలీసుల సమగ్ర దర్యాప్తులో వెల్లడైంది. దీనికి సంబంధించిన ఆధారాలను పోలీసులు పూర్తిగా సేకరించి సూర్యనారాయణపై కేసు నమోదు చేశారు. నాటినుంచి ఇప్పటివరకు 45 రోజులపాటు సూర్యనారాయణ పరారీలో ఉన్నారు. ఈ కేసు ప్రస్తుతం విజయవాడ ఏసీబీ కోర్టులో ఉంది. దీంతో సూర్యనారాయణ పరారీలో ఉంటూనే ముందస్తు బెయిల్ కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సూర్యనారాయణ అవినీతికి సంబంధించిన ఆధారాలను సేకరించిన పోలీసులు ప్రాథమిక ఆధారాలను కోర్టుకు సమర్పించారు.

బెయిల్ పిటిషన్ తిరస్కరణ

రూ.వందల కోట్ల అవినీతికి పాల్పడి, ప్రజాధనాన్ని కొల్లగొట్టిన సూర్యనారాయణకు ముందస్తు బెయిల్ ఇవ్వడం కుదరదని న్యాయస్థానం సోమవారం స్పష్టం చేసింది. ఈ పిటిషన్‌పై కొన్ని వారాలుగా న్యాయస్థానంలో వాదనలు జరుగుతున్నాయి. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పీపీ దుష్యంత్‌రెడ్డి వాదనలు వినిపించారు. నలుగురు ఉద్యోగులు పాల్పడిన అవినీతి వెనుక సూర్యనారాయణ పాత్ర ఉందని, ప్రజాధనాన్ని కాజేసిన వ్యక్తికి బెయిల్ ఇవ్వొద్దని ఏపీపీ న్యాయమూర్తికి విన్నవించారు. ఈ నేపథ్యంలో సూర్యనారాయణ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను రద్దు చేస్తున్నట్టు ఏసీబీ కోర్టు న్యాయమూర్తి హిమబిందు ప్రకటించారు.

ఆర్ 5 జోన్‌లో ఇళ్ల స్థలాలు బీఎస్‌వోకు విరుద్ధం

- రాజధాని భూములపై హక్కులు సీఆర్‌డీఏకు దఖలు పడలేదు
- హైకోర్టులో సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు వాదనలు
- తదుపరి విచారణ ఈ నెల 21కి వాయిదా



సాక్షి, అమరావతి: రాజధాని ఆర్ –5 జోన్‌లో ఇతర ప్రాంతాల వారికి స్థలాలు బదలాయించడం బోర్డ్ ఆఫ్ స్టాండింగ్ ఆర్డర్స్ (బీఎస్‌వో)కు విరుద్ధమని సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు హైకోర్టుకు నివేదించారు. అమరావతి రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలివ్వడాన్ని, ఇళ్ల నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ తెలుగుదేశం పార్టీ వేయించిన వ్యాజ్యాల్లో పలువురు పిటిషనర్ల తరఫున మురళీధరరావు సోమవారం హైకోర్టులో వాదనలు వినిపించారు. అమరావతి అభివృద్ధిలో భాగస్వాములైన రైతులను సంప్రదించకుండానే ప్రభుత్వం ఆర్ 5 జోన్‌ను సృష్టించి, బయట ప్రాంతాల వారికి ఇళ్ల పట్టాలివ్వడం, ఇంటి నిర్మాణాలకు రంగం సిద్ధం చేస్తుండటం చట్ట విరుద్ధమన్నారు. ఈ భూములపై సీఆర్‌డీఏకు ఇప్పటివరకు యాజమాన్య హక్కులు దఖలు పడలేదన్నారు. ఇక్కడ ఇళ్ల నిర్మాణంపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. మురళీధరరావు వాదనలు పూర్తి చేయడంతో, ఇతర వ్యాజ్యాల్లో వాదనల నిమిత్తం హైకోర్టు తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు, జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ రవినాథ్ తిల్హరీలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మధ్యంతర ఉత్తర్వులపై వచ్చే విచారణలో పరిశీలిస్తామని ధర్మాసనం తెలిపింది. మురళీధరరావు పలు సందర్భాల్లో ఇతర అంశాల్లోకి వెళుతుండటంతో ధర్మాసనం ఆయన్ని వారించింది. ప్రధానంగా ఇళ్ల నిర్మాణం అంశానికే పరిమితం కావాలని పలుమార్లు స్పష్టం చేసింది. రాజధాని భూముల యాజమాన్యపు హక్కులు సీఆర్‌డీఏకు ఎప్పుడు దఖలు పడ్డాయన్న విషయంపై త్రిసభ్య ధర్మాసనం స్పష్టత కోరడంతో మురళీధరరావు తడబడ్డారు.

పొలంలో నిద్రిస్తున్న యువకుడి హత్య



మధుకర్‌రెడ్డి మృతదేహం

పెద్దతిప్పసముద్రం: అన్నమయ్య జిల్లా పెద్దతిప్ప సముద్రం మండలం నవాబుకోటకు చెందిన ఓ యువకుడిని గుర్తు తెలియని వ్యక్తులు గొంతు కోసి హత్య చేశారు. జిల్లాలో సంచలనం సృష్టించిన ఈ ఘటన వివరాలు.. నవాబుకోటకు చెందిన బత్తల శివరాంరెడ్డి, పద్మావతమ్మ దంపతులకు కుమార్తె అరుణమ్మ, కుమారుడు మధుకర్‌రెడ్డి (35) ఉన్నారు. వీరు ఐదేళ్ల క్రితం నవాబుకోట ఊరి బయట ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్నారు. మధుకర్‌రెడ్డి ఆదివారం రాత్రి పది గంటలకు టమాటా నారు తీసుకుని పొలం వద్దకు వెళ్లాడు. అర్ధరాత్రి వరకు ట్రాక్టర్ రొటావేటర్‌తో పొలాన్ని చదును చేసి అక్కడే గుడిసెలో నిద్రపోయాడు. ఆ తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి మధుకర్‌రెడ్డి గొంతు కోసి హత్యచేసి వెళ్లిపోయారు. రక్తపుమడుగులో పడి ఉన్న మధుకర్‌రెడ్డిని సోమవారం ఉదయం అటు వైపు వెళుతున్న గ్రామస్తులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మధుకర్‌రెడ్డి తండ్రి శివరాంరెడ్డి ఫిర్యాదు మేరకు మదనపల్లి డీఎస్పీ కేశప్ప, పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

తెలంగాణ

28 నుంచి అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

మావోయిస్టు పార్టీ నేత ఆజాద్

చర్ల: ఈనెల 28 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం, అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక లేఖ విడుదల చేశారు. ప్రజల కోసం మరణించడం హిమాలయ పర్వతాల కన్నా గొప్పది కాగా.. దోపిడీదారుల కోసం మరణించడం కోడి ఈక కన్నా హీనమైనదని ఆయన పేర్కొన్నారు. కుటుంబాన్ని, బంధుమిత్రులను వదిలేసి జీవితాన్ని ప్రజల కోసం అంకితం చేసిన అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను జరుపుకోవాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. 2022 జూలై 28 నుంచి 2023 జూలై 28 వరకు వంద మందికి పైగా విప్లవకారులు అమరత్వం పొందారని, అంతకు ముందు కూడా ప్రజల కోసం పోరాడి అమరులైన వారికి నివాళులర్పించాలని ఆజాద్ ప్రజలను కోరారు.

ఫ్రాన్స్ ప్రథమ మహిళకు పుట్టపాక చీర

దుబీయన్ చీరను బహూకరించిన ప్రధాని మోదీ • ప్రపంచ దేశాలకు మన చేనేత ఖ్యాతి

హైదరాబాద్: ఫ్రాన్స్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ.. ఆ దేశ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ సతీమణి, ఆ దేశ ప్రథమ మహిళ బ్రిగెట్టే మెక్రాన్‌కు పుట్టపాక చేనేత చీరను బహూకరించిన సంగతి తెలిసిందే. కళాకారులు నేసిన దుబీయన్ సిల్కు చీరను చందనం పెట్టెలో పెట్టి అందజేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక గ్రామ కళాకారుల నైపుణ్యంతో ఆకర్షణీయమైన రంగులో, అందమైన రాజస్తాన్ డిజైన్‌లో రూపొందించిన ఈ చీరను తెలంగాణ ప్రభుత్వ చేనేత సంస్థ ‘టెస్కో’ కొనుగోలు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించింది.

ఫ్యాబ్రిక్ కూడా..

పుట్టపాకలో సుమారు 4వేల జనాభా ఉండగా, అందులో 300 మందికి పైగా చేనేత కళాకారులు ఉన్నారు. దుబీయన్ వస్త్రం డిజైన్ దేశంలో ఎక్కడా కనిపించదు. పుట్టపాక గ్రామంలోని ప్రతి చేనేత కళాకారుడు దుబీయన్ వస్త్రం నేస్తారు. దేశంలో చేనేత వస్త్ర తయారీలో అడ్డం ఇక్కత్ విధానం పాటిస్తున్నప్పటికీ దుబీయన్ వస్త్రం తయారీలో నిలువు ఇక్కత్ (వార్పుపై పొడుగు దారం) విధానం పాటిస్తారు. డిజైన్‌నూ నిలువు ఇక్కత్‌లోనే రూపొందిస్తారు. ఈ వస్త్రం తయారీలో వాడే దారాలు పలుచగా ఉంటాయి. దుబీయన్ డిజైన్‌తో చీరలు, ఫ్యాబ్రిక్ కూడా రూపొందిస్తారు. పుట్టపాక దుబీయన్ వస్త్రానికే కాకుండా.. ప్రాచీన కళ తేలియా రుమాల్ తయారీకీ ప్రసిద్ధి. తేలియా రుమాల్ తయారీలో అనేక మంది కళాకారులకు జాతీయ అవార్డులతో పాటు, ఇద్దరికి పద్మశ్రీలు కూడా వచ్చాయి.



క్లుప్తంగా...

వలంటీర్లకు పాదాభిషేకం


వలంటీర్‌కు పాదాభిషేకం చేస్తున్న శివప్రసాద్

కొయ్యూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): వార్డు, గ్రామ వలంటీర్లు నిస్వార్థంగా అందిస్తున్న సేవలను అందరూ గుర్తించాలని నేను సైతం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి భర్త కె.శివప్రసాద్ అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా శరభన్నపాలెంలో సోమవారం ఎనిమిది మంది వలంటీర్లకు ఆయన పాదాభిషేకం చేశారు. శివప్రసాద్ మాట్లాడుతూ వలంటీర్లు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని ప్రశంసించారు. అలాంటి వారిపై జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు.

పేదల ఇళ్ల నిర్మాణం హర్షణీయం

1,023వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు


రిలే దీక్షలో బహుజన నేతలు

తాడికొండ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 24వ తేదీన ఆర్–5 జోన్‌లో పేదల ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తుండటం హర్షణీయమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం 1,023వ రోజుకు చేరాయి. పలువురు నాయకులు మాట్లాడుతూ దుష్ట చతుష్టయాన్ని ఎదుర్కొంటూ పేదలకు మేలు చేసేందుకు తపిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని చెప్పారు. వైఎస్సార్ పుణ్యంతో రాజకీయాల్లోకి వచ్చిన పురందేశ్వరి బీజేపీ పంచన చేరి కులవాదులకు కొమ్ము కాస్తుండటం సిగ్గుచేటన్నారు. నాయకులు బి.శ్యామ్యూల్, మాదిగాని గురునాథం, పులి దాసు, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం ఏపీ వ్యవసాయరంగం: నాగిరెడ్డి



చిలకపూడి(మచిలీపట్నం): రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయరంగ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి అన్నారు. ఆయన సోమవారం మచిలీపట్నంలో మీడియాతో మాట్లాడుతూ దేశంలోనే మన వ్యవసాయరంగాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆహార పంటలతో పాటు ఆక్వా, ఉద్యాన పంటల సాగును విశేషంగా ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. నవరత్నాల పథకాలను 90 శాతం మంది రైతులు వినియోగించుకుంటున్నారన్నారు.

'అసైన్డ్' హక్కుల నిర్ణయం చరిత్రాత్మకం: కొమ్మూరి



రాజవొమ్మంగి (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పించడం చరిత్రాత్మక నిర్ణయమని మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు అన్నారు. 'మనసున్న మాదిగ పల్లెను చూసొద్దాం రండి..' అనే కార్యక్రమంలో భాగంగా ఆయన సోమవారం రాజవొమ్మంగి శివారు ఎస్సీ కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా బహిరంగ సభలో కనకారావు మాట్లాడుతూ అసైన్డ్ భూములపై 50 ఏళ్లకు పైగా ఉన్న సమస్యను సీఎం జగన్ కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకుని ఒక్క సంతకంతో పరిష్కరించారని చెప్పారు. ఈ ప్రాంతంలోని కొండ మాదిగలకు ఎస్టీల మాదిరిగా రిజర్వేషన్ కల్పించాలని సీఎం దృష్టికి తీసుకుని వెళతానని చెప్పారు. రెల్లి కార్పొరేషన్ చైర్మన్ వడ్డాది మధుసూదనరావు, దళిత సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డం బాపిరాజు, ఎన్ఆర్ఐ ఐఎంసీటీఐ కన్వీనర్ ముప్పిడి సుశీల్ పాల్గొన్నారు.

'పవన్.. సినిమా డైలాగులు, డ్యాన్సులకు ఓట్లు రావు'



కర్నూలు (టౌన్): 'పవన్.. సినిమా డైలాగులు చెప్పి, డ్యాన్సులు చేస్తే ఓట్లు రాలవు. రాష్ట్రంలో 3 శాతం ఓట్లులేని జనసేనకు 30 శాతం ఓటు బ్యాంకు ఉన్నట్లు కొన్ని మీడియా చానళ్లు వక్రీకరిస్తున్నాయి. ప్యాకేజీ స్టార్.. ప్యాకేజీకి అమ్ముడుపోవద్దు..' అని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకుడు కె.ఎ.పాల్ అన్నారు. ఆయన సోమవారం కర్నూలులో విలేకరులతో మాట్లాడుతూ ప్రత్యేక హోదా విషయంలో నాటి, నేటి ప్రభుత్వాలు విఫలమయ్యాయని చెప్పారు. తన రాజకీయంపై పవన్‌కళ్యాణ్‌కే క్లారిటీ లేదన్నారు.

గిట్టుబాటు ధరకు శాస్త్రీయ పరిష్కారం

వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు ఏపీ బీజం వేసింది

- సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతుల ముంగిటకు తీసుకురావాలన్న దశాబ్దాల డిమాండ్ ఇక్కడ కార్యరూపం దాల్చింది
- వీటితో పరిశోధనల ఫలితాలను ఇక్కడి రైతులు అందుకుంటున్నారు
- సర్టిఫై చేసిన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు రైతులకు అందడం నిజంగా దుర్లభంగా ఉండేది
- కానీ, అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటైన ఆర్బీకేలతో ఇక్కడి రైతుల వెతలు తీరాయి
- వన్‌స్టాప్ సొల్యూషన్ సెంటర్లుగా వీటిని ఏపీ ప్రభుత్వం తీర్చిదిద్దింది
- దేశంలో మరే రాష్ట్రంలోనూ క్షేత్రస్థాయిలో ఇలాంటి వ్యవస్థలేదు
- ఈ–పంట నమోదు ద్వారా ప్రభుత్వం వద్ద పంటల సమాచారం
- తద్వారా డిమాండ్ ఉన్న ప్రాంతాలను అనుసంధానించే అవకాశం
- ముందస్తు ప్రణాళికలతో ప్రతీ రైతుకూ గిట్టుబాటు ధర
- మిల్లెట్స్‌కు కనీస మద్దతు ధర ప్రకటించడం మంచి ఆలోచన
- ఇంటిగ్రేటెడ్ కాల్‌సెంటర్, ఆర్బీకే చానల్, అగ్రిల్యాబ్స్ నిజంగా గొప్ప ఆవిష్కరణలు



'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో సీఏసీపీ చైర్మన్ విజయ్‌పాల్ శర్మ

(పంపాన వరప్రసాదరావు)

సాక్షి, అమరావతి : 'తాము పండించిన పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించకపోవడం ఏళ్ల తరబడి రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య. డిమాండ్–సరఫరాల మధ్య సమతూకం లేకపోవడమే ప్రధాన అవరోధం. ప్రపంచాన్ని పీడిస్తున్న ఈ సమస్యకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం శాస్త్రీయ పరిష్కారం చూపిందనడంలో సందేహంలేదు. ఎందుకీ మాట చెబుతున్నానంటే.. దేశంలో మరెక్కడా లేని విధంగా సాగవుతున్న ప్రతీ పంటను ఇక్కడ ఎలక్ట్రానిక్ క్రాపింగ్ (పంటల నమోదు) ద్వారా నమోదుచేస్తున్నారు. ఏ ప్రాంతంలో ఏఏ పంటలు ఎంత విస్తీర్ణంలో సాగవుతున్నాయో.. ఎంత దిగుబడి వస్తుందోనన్న సమాచారం ఈ–పంట నమోదు ద్వారా పంట చేతికి రాకముందే ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉంటోంది. దీనివల్ల ఏ ఏ పంట ఉత్పత్తులు ఏ మేరకు ఎప్పుడు మార్కెట్లోకి వస్తాయో స్పష్టత ఉంటుంది. అలాగే, ఏ పంట ఉత్పత్తులకు ఎక్కడ డిమాండ్ ఉందో మనందరికీ తెలుసు. ఆ మేరకు రైతులను డిమాండ్ ఉన్న ప్రాంతాల్లోని మార్కెట్లకు అనుసంధానిస్తే చాలు.. ప్రతీ రైతుకు తాను పండించే ప్రతీ పంటకు గిట్టుబాటు ధర దక్కుతుంది. ఇందుకోసం ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక రూపొందిస్తే చాలు''.. అని వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్ చైర్మన్ ప్రొఫెసర్ విజయ్ పాల్ శర్మ అన్నారు. రాష్ట్ర పర్యటనకు విచ్చేసిన ఆయన 'సాక్షి ప్రతినిధి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. వ్యవసాయ రంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు.. రానున్న దశాబ్ద కాలంలో విప్లవాత్మక మార్పులకు ఏపీ బీజం వేసిందని ఆయన పేర్కొంటూ.. ఇందుకు రైతుభరోసా కేంద్రాలు (ఆర్బీకే) వేదిక కాబోతున్నాయని అభిప్రాయపడ్డారు. ఇంటర్వ్యూ వివరాలు ఆయన మాటల్లోనే..

క్షేత్రస్థాయికి పరిశోధనా ఫలాలు..

వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకురావడం అనేది ఆచరణలో కష్టతరంగా మారింది. వ్యవసాయ యూనివర్సిటీలు, పరిశోధనా కేంద్రాలు ఎక్కడో ఉంటాయి.. రైతులు మరెక్కడో ఉంటారు.. పరిశోధనా ఫలాలను క్షేత్రస్థాయిలో రైతులకు అందించాలంటే గ్రామస్థాయిలో బలమైన వ్యవస్థ ఉన్నప్పుడే సాధ్యమవుతుంది. కానీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఆర్బీకే వ్యవస్థతో వ్యవసాయ రంగంలో వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతుల ముంగిటకు తీసుకురావాలన్న దశాబ్దాల డిమాండ్ కార్యరూపం దాల్చిందని చెప్పొచ్చు. వీటితో వ్యవసాయ రంగం పరిశోధన ఫలితాలను ఆంధ్రప్రదేశ్ రైతులు నిజంగా అందుకోగలుగుతున్నారనడంలో సందేహంలేదు. సర్టిఫై చేసిన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు రైతులకు అందడం నిజంగా దుర్లభంగా ఉండేది. కానీ, ఆర్బీకేల రాకతో రైతులకు ఆ వెతలు తీరాయని క్షేత్రస్థాయి పరిశీలనలో నేను గమనించాను.

ఒక్కో ఆర్బీకే 400మంది రైతులకు సేవలు..

ఇక అంతర్జాతీయ ప్రమాణాలకనుగుణంగా ప్రతీ 500 రైతు కుటుంబాలను ఒక యూనిట్‌గా చేసుకుని వారిని సమన్వయపరిచేందుకు ఒక వ్యవస్థ ఏర్పాటుచేయాలి. కానీ, ఇక్కడ ఒక్కో ఆర్బీకే సగటున 400 మంది రైతు కుటుంబాలకు సేవలందిస్తోంది. అంటే.. అంతర్జాతీయ ప్రమాణాలకంటే మెరుగ్గా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతులకు సేవలందిస్తుండడం నిజంగా ప్రశంసనీయం. వన్‌స్టాప్ సొల్యూషన్ సెంటర్లుగా ఆర్బీకేలు రైతులకు గ్రామస్థాయిలో సేవలందిస్తున్నాయనడంలో సందేహంలేదు. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలపై ఆధారపడిన ప్రతీ ఒక్కరి అవసరాలను ఇవి తీరుస్తున్నాయి. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల లభ్యత ప్రధాన సమస్య. దీనికి ఆర్బీకేల ద్వారా శాశ్వత పరిష్కార మార్గం చూపించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని అభినందించాల్సిందే.

ఉత్పత్తి-మార్కెటింగ్‌ను అనుసంధానించే వేదికలు..

ఉత్పత్తి, మార్కెటింగ్.. ఈ రెండింటిని అనుసంధానించడంలో కూడా ఆర్బీకేలు కీలక భూమిక పోషిస్తున్నాయి. విత్తు నుంచి విపణి వరకు వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన అన్ని రకాల సేవలను అందించే వన్‌స్టాప్ సొల్యూషన్ సెంటర్లుగా ఆర్బీకేలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీర్చిదిద్దింది. దేశంలో మరే రాష్ట్రంలోనూ క్షేత్రస్థాయిలో ఇలాంటి వ్యవస్థ లేదని ఖచ్చితంగా చెప్పగలను. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ దేశానికి ఆదర్శంగా నిలుస్తోంది. ఎన్నో రాష్ట్రాలు తాము కూడా ఆర్బీకే తరహా వ్యవస్థలు ఏర్పాటుచేయడానికి ముందుకొస్తున్నాయి. అందుకు సన్నాహాలు కూడా చేసుకుంటున్నాయి.

రైతుల సమస్యలకు ఏకైక పరిష్కార వేదికలుగా..

సరైన ధరలులేక రైతులు ప్రైవేటు వ్యాపారుల చేతుల్లో మోసపోయేవారు. కానీ, ఇక్కడ రైతులకు గిట్టుబాటు ధర అందించే ప్రొక్యూర్‌మెంట్ సెంటర్లుగా ఆర్బీకేలు పనిచేస్తున్నాయి. రైతులను దీర్ఘకాలంగా వేధిస్తున్న అనేక సమస్యలకు ఏకైక పరిష్కార వేదికగా వైఎస్సార్ రైతుభరోసా కేంద్రాలు ప్రశంసనీయ పాత్ర పోషిస్తున్నాయి. ఒక్క ఆర్బీకేలే కాదు... ఇంటిగ్రేటెడ్ కాల్‌సెంటర్, ఆర్బీకే చానల్, నాణ్యమైన ఉత్పాదకాలు అందించే సంకల్పంతో నియోజకవర్గ స్థాయిలో అగ్రిల్యాబ్స్ నిజంగా గొప్ప ఆవిష్కరణలు. రాగులు, జొన్నలు, సజ్జలకు మాత్రమే కేంద్రం మద్దతు ధరలు ప్రకటిస్తుంటే.. మిగిలిన చిరుధాన్యాలకు మద్దతు ధర ప్రకటించిన ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. వీటితో పాటు మరికొన్ని పంటలకు కూడా స్థానికంగా మద్దతు ధరలు ప్రకటించడం నిజంగా అభినందనీయం.

అంజూయాదవ్‌పై చర్యలు తీసుకోండి

- తిరుపతి ఎస్పీకి పవన్‌కళ్యాణ్ ఫిర్యాదు
- మీ ఆరోపణలన్నీ అవాస్తవం..
- అదృశ్యమైన వారి విషయంలో వలంటీర్లకు సంబంధం లేదు
- మీ ఆరోపణలతో శాంతిభద్రతలకు ఆటంకం: పవన్‌కు ఎస్పీ స్పష్టీకరణ


ఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న పవన్‌కళ్యాణ్

సాక్షి, తిరుపతి/తిరుపతి క్రైమ్ : జనసేన నేతలు చాలా క్రమశిక్షణతో ఉంటారని.. పోలీసులు కూడా శాంతిభద్రతలు, పౌర హక్కులను కాపాడాలని ఆ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ చెప్పారు. శ్రీకాళహస్తి సీఐ అంజూయాదవ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పవన్ సోమవారం తిరుపతి ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డికి ఫిర్యాదుచేసి వినతిపత్రం అందించారు. నిజానికి.. ఈ నెల 12న జనసేన శ్రేణులు శ్రీకాళహస్తిలో సీఎం వైఎస్ జగన్ దిష్టిబొమ్మను కాలితో తొక్కుతూ తగలబెడుతుండగా సీఐ అంజూయాదవ్ అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో జనసేన నేత సాయి సీఐని దుర్భాషలాడుతూ తిరగబడ్డారు. అంతటితో ఆగక ఆమెను బలంగా నెట్టడంతో సాయిపై సీఐ చేయిచేసుకోవాల్సి వచ్చింది. ఈ విషయంపై పవన్.. సీఐ తీరును తప్పుబడుతూ తన శ్రేణులతో వచ్చి ఎస్పీ పరమేశ్వరరెడ్డిని కలిశారు. తిరిగి వెళ్తూ రేణిగుంట విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడారు. ఎవరికి ఇబ్బందిలేకుండా శాంతియుత నిరసన చేపట్టడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని అన్నారు. అందులో భాగంగానే సాయి శాంతియుతంగా నిరసన చేపడుతుంటే.. సీఐ రాజ్యాంగ విరుద్ధంగా అతనిని కొట్టారని ఆరోపించారు. జనసేన నేతలు చాలా క్రమశిక్షణతో ఉంటారని ఆయన చెప్పుకొచ్చారు.

పవన్ ఆరోపణలు అవాస్తవం : ఎస్పీ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన వలంటీర్ల వ్యవస్థపై జనసేన ఆరోపణలన్నీ అవాస్తవమని జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి పవన్‌కు స్పష్టంచేశారు. పవన్ ఫిర్యాదు అనంతరం ఎస్పీ స్పందిస్తూ.. ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటుచేసి ఈ ఉదంతంపై సమగ్ర విచారణ చేపడతామన్నారు. కమిటీ నివేదిక ఆధారంగా శాఖాపరమైన చర్యలను తీసుకుంటామన్నారు. సీఐకి జనసేన కార్యకర్తలకు ఎలాంటి పాత గొడవల్లేవని పవన్‌కు ఎస్పీ తెలిపారు. గడిచిన నాలుగేళ్లలో 30వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని, దానికి వలంటీర్లే కారణమని ఆరోపించడం సరైనది కాదన్నారు. అదృశ్యమై దొరికిన వారిని విచారించగా.. వారంతా వలంటీర్లకు సంబంధంలేదని, అసలు ఆ ప్రస్తావన ఎత్తలేదని ఆయన వివరించారు. అలాగే, ఈ మోరల్ ట్రాఫికింగ్ కింద రాష్ట్రవ్యాప్తంగా ఏ వలంటీర్‌పై ఇప్పటి వరకు ఫిర్యాదులు రాలేదని ఎస్పీ స్పష్టంచేశారు. ఇలా మాట్లాడటం భావ్యం కాదని ఆయన పవన్‌కు సూచించారు. అలాగే, రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలగడానికి పూర్తిస్థాయిలో మీ వ్యాఖ్యలే కారణమని ఎస్పీ పవన్‌కు స్పష్టంచేశారు. అయితే, దీనిపై పవన్ స్పందించకుండా తిరిగి వెళ్లిపోయారు.

జనసేన పార్టీ శ్రేణుల రచ్చరచ్చ..

అంతకుముందు.. సీఐ అంజూయాదవ్‌పై ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకంటూ పవన్ చేపట్టిన ర్యాలీ స్థానికులను భయకంపితుల్ని చేసింది. పార్టీ శ్రేణులు చిత్ర విచిత్ర విన్యాసాలతో ద్విచక్ర వాహనాలపై రచ్చరచ్చ చేశారు. రేణిగుంట విమానాశ్రయం నుంచి గాజులమండ్యం పోలీస్‌స్టేషన్, తిరుచానూరు, తుమ్మలగుంట కూడలి, మహిళా యూనివర్సిటీ, బాలాజీ కాలనీ మీదుగా పెద్దఎత్తున బైక్‌లతో శబ్దంచేస్తూ.. చొక్కాలు విప్పి నానా హంగామా చేశారు. దీంతో ఆ మార్గంలో వాహనదారులు, స్థానికులు బెంబేలెత్తిపోయారు. పాదచారులు పరుగులు పెట్టారు. మహిళా యూనివర్సిటీ వద్ద 108 వాహనానికి దారి ఇవ్వకుండా తీవ్ర ఇబ్బంది కల్గించారు. దీంతో.. జనసేన శ్రేణుల తీరు పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తంచేశారు.

ఆధ్యాత్మిక నగరంపై దాడిలా.. : భూమన

మరోవైపు.. పవన్ తిరుపతి పర్యటనపై ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. వినతిపత్రం ఇవ్వడానికి వచ్చిన ఆయన తీరు.. ఆధ్యాత్మిక పట్టణంపై దాడి చేస్తున్నట్లుగా ఉందన్నారు. తనకు ఓట్లు వేస్తే ఏం చేస్తారో చెప్పకుండా.. కారణం లేని పగ, ప్రతీకారంతో తమ పార్టీపై పవన్ నిందలు వేస్తున్నారని విమర్శించారు.

జనసేన రౌడీషీటర్ల పార్టీ

- సీఐ అంజూయాదవ్‌కు క్షమాపణ చెప్పాలి
- బాబు ట్రాప్‌లో ఉన్మాదిలా మారుతున్న పవన్
- ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ధ్వజం



సాక్షి, అమరావతి: టీడీపీ దొంగల పార్టీ అయితే.. జనసేన రౌడీషీటర్ల పార్టీ అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. సీఐ అంజూయాదవ్‌ను దూషించి చేయి చేసుకున్న కార్యకర్తను మందలించాల్సింది పోయి, మహిళ అనే గౌరవం లేకుండా సీఐని వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ ఆమెపై ఫిర్యాదు చేయడం పవన్ దిగజారుడు రాజకీయమని అన్నారు. పోలీసుల స్థైర్యాన్ని దెబ్బతీసేలా వ్యవహరించిన పవన్ సీఐ అంజూయాదవ్‌కి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. శ్రీకాంత్‌రెడ్డి సోమవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ వలంటీర్లలో 60 శాతంపైగా ఉన్న మహిళలపై సిగ్గు లేకుండా విమర్శలు చేయడం, దూషించడం పవన్‌కే చెల్లిందన్నారు. పవన్‌కు దమ్ముంటే వలంటీర్ల వ్యవస్థ మంచిదా? కాదా? అనే విషయంపై ప్రతి గడపకు వెళ్లి అడుగుదామని సవాల్ చేశారు. బాబు ట్రాప్‌లో పడి పవన్ ఉన్మాదిలా మారుతున్నాడని అన్నారు. బాబు చేతిలో మరో బలిపశువు కాబోతున్నాడన్నారు. సీఎం వైఎస్ జగన్, తాను చదువుకునేటప్పుడు పేపర్లు దొంగిలించామని ఆరోపిస్తున్న పవన్ దగ్గర ఏ ఆధారాలున్నాయని నిలదీశారు. రాజకీయాలంటే చంద్రబాబు ఇచ్చిన స్క్రిప్ట్ చదవడం కాదని, వాస్తవాలు తెలుసుకోవాలని చెప్పారు. ఎన్ని సీట్లలో పోటీ చేస్తాడో చెప్పలేని పవన్‌కు రాజకీయాలెందుకని అన్నారు. రష్యా మహిళను పెళ్లి చేసుకున్న పవన్ ఏ అర్హతతో హిందూ ధర్మం గురించి మాట్లాడుతున్నాడో చెప్పాలని నిలదీశారు.

14 ఏళ్లలో చంద్రబాబు చేసిందేమిటి?

14 ఏళ్ల సీఎంగా ఉన్న చంద్రబాబు రాష్ట్రానికి చేసిందేమిటని శ్రీకాంత్‌రెడ్డి ప్రశ్నించారు. రాయలసీమలో ఒక పరిశ్రమ, ఇరిగేషన్ ప్రాజెక్టు కట్టిన చరిత్ర ఆయనకుందా అని అన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో దోచుకుని, కాల్ మనీ సెక్స్ రాకెట్లలో మహిళలను వేధించిన మీరెక్కడ, ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్లు ఎక్కడ అని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్నది బీజేపీయేనని, ఆ పార్టీ నేతలు ఆధారాలతో విమర్శలు చేయాలని చెప్పారు. ప్రత్యేక హోదా, కడప స్టీల్ ప్లాంటు ఏమయ్యాయని వారిని ప్రశ్నించారు. రాజకీయ ఆధిపత్యం కోసం పల్లెల్లో రక్తచరిత్ర అంటూ వార్తలు రాస్తున్న రామోజీకి కొద్దిగన్నా సిగ్గనిపించడం లేదా.. అని ప్రశ్నించారు. దమ్ముంటే చంద్రబాబు హయాంలో కక్షలు, కార్పణ్యాలపై రాయాలని, గోదావరి పుష్కరాల్లో చంద్రబాబు పబ్లిసిటీ కోసం 29 మందిని చంపాడని రాయాలని సవాల్ చేశారు. ప్రజలు ప్రశాంతంగా ఉన్న తరుణంలో వ్యక్తిగత ప్రయోజనాలు, బాబును తిరిగి సీఎంను చేయడం కోసం రామోజీ పడుతున్న పాట్లు నవ్వు తెప్పిస్తున్నాయన్నారు. రామోజీ కోరిక తీరదని స్పష్టం చేశారు. ప్రజలంతా జగన్ వెంట ఉన్నారని, మళ్లీ ఆయనే సీఎం అని చెప్పారు.

పవన్ క్షమాపణ చెప్పాల్సిందే..!


కృష్ణా జిల్లా పెడనలో మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న వలంటీర్లు



శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అనంతసాగరంలో పవన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు

- కొనసాగుతున్న వలంటీర్ల నిరసన

పెడన/చేజర్ల(సోమశిల): జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తమకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, అప్పటి వరకు పోరాటం ఆపబోమని పలువురు వలంటీర్లు ఆగ్రహం వ్యక్తంచేశారు. పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలపై సోమవారం కూడా పలు ప్రాంతాల్లో వలంటీర్లు వివిధ రూపాల్లో నిరసన తెలిపారు. కృష్ణా జిల్లా పెడనలో ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడి 'పవన్ డౌన్ డౌన్...' అంటూ నినాదాలు చేశారు. వలంటీర్లు మాట్లాడుతూ నిస్వార్థంగా ప్రజలకు సేవ చేస్తున్న తమను కించపరిచేలా మాట్లాడటం అన్యాయమన్నారు. తక్షణమే పవన్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా అనంతసాగరంలో వలంటీర్లు నిరసన ప్రదర్శన నిర్వహించి పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

బరితెగించి అయ్యన్న బూతు పురాణం

టీడీపీ సభలో సిగ్గుతో తలదించుకున్న మహిళలు


అయ్యన్నపాత్రుడు మాట్లాడుతుండగా తలపట్టుకున్న టీడీపీ మహిళా నేతలు

పాలకొల్లు సెంట్రల్: పత్రికల్లో రాయలేనంత పచ్చి బూతులతో టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అయ్యన్న పాత్రుడు రెచ్చిపోయారు. సంస్కారం లేకుండా ఆయన పబ్లిక్‌గా బూతులు మాట్లాడుతుంటే అక్కడ సభలో పాల్గొన్న తెలుగు మహిళలు సిగ్గుతో తలదించుకున్న ఘటన పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో సోమవారం జరిగింది. భవిష్యత్‌కు గ్యారంటీ చైతన్య రథయాత్ర సమావేశంలో అయ్యన్న.. సీఎం జగన్‌పై రెచ్చిపోయి మాట్లాడారు. పనికిరాని సన్నాసి, నత్తి నాకొ.. లాంటి దారుణ పదజాలంతో సీఎంను విమర్శించారు. వీడు.. వాడు.. అంటూ సీఎం అనే మర్యాద లేకుండా ఏకవచనంతో సంబోధించారు. సీఎం సతీమణిపైనా అవాకులు చెవాకులు పేలారు. ఇప్పటికే తనపైన 14 కేసులు పెట్టారని, ఎన్ని కేసులు పెట్టినా ఏమీ పీకలేరంటూ అసభ్యంగా సంజ్ఞలు చేస్తూ చూపించారు. మాజీ మంత్రి పితాని సత్యనారాయణ మాట్లాడుతూ 'గత ఎన్నికల ముందు రూ.10 వేలు ఇచ్చాం. అంతా మనకే గుద్దేస్తారని చంకలు కొట్టేసుకున్నాం. అయినా మనకి పెద్ద పువ్వు చూపించారు. గెలుపు అంత ఈజీ కాదు. చివరి వరకూ పోరాటం చేయాల్సిందే' అని చెప్పారు. శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీగల సీఐపై రాజకీయ దాడి తగదు

యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్




అనంతపురం క్రైం : నిజాయితీగా విధులు నిర్వర్తించే శ్రీకాళహస్తి సీఐ అంజూయాదవ్‌పై జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ రాజకీయ దాడిచేస్తున్నారని.. బీసీ మహిళా పోలీసు అధికారిపట్ల ఆ పార్టీ అక్కసు వెళ్లగక్కుతోందని యాదవ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. నిజానికి.. అంజూయాదవ్‌కు విధి నిర్వహణలో అందరూ సమానమేనని, గతంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్ర ఓ ధర్నాలో పాల్గొనగా ఆమెను సైతం అడ్డుకుని శాంతిభద్రతలను కాపాడారన్నారు. బీసీ వర్గానికి చెందిన మహిళా అధికారిపట్ల జనసేన తీరును తాము ఖండిస్తున్నామన్నారు.

పిల్లల చదువులపై రామోజీ క్షుద్ర 'విద్య'!

- ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులపై 'ఈనాడు' కాకి లెక్కలు
- పెరిగిన జీఈఆర్, టాప్ ర్యాంకులు, డిస్టింక్షన్లు కళ్లకు కనపడవా?
- జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సత్తా చాటిన 67 మంది ఎస్సీ, ఎస్టీ గురుకులాల విద్యార్థులు
- పాఠశాలల్లో ఇంకా కొనసాగుతున్న ప్రవేశాలు.. ఆగస్టు చివరిదాకా సమయం
- ప్రతిబంధకాలు లేకుండా 'అమ్మ ఒడి'ని అందిస్తున్న ప్రభుత్వం


ప్రభుత్వ బడుల్లో
ప్రవేశాలు రివర్స్!



సాక్షి, అమరావతి: పిల్లలు చక్కగా చదువుకోవడమే అంతిమ లక్ష్యం కావాలి! అందుకనే ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్.. ఇలా ఎక్కడ చదువుతున్నా సరే అర్హులందరికీ జగనన్న అమ్మ ఒడి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రయోజనాన్ని చేకూరుస్తోంది. మన విద్యార్థులు అంతర్జాతీయంగా రాణించేలా ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బాగు చేసేందుకు సీఎం వైఎస్ జగన్ సర్కారు నాలుగేళ్లలో రూ.66,722.36 కోట్లు ఖర్చు చేసింది. ఈ ఏడాది జగనన్న అమ్మఒడి కింద అందించిన రూ.6,392.94 కోట్లతో కలిపితే ఈ ఒక్క పథకానికే ఇప్పటివరకు రూ.26,067.28 కోట్లు వ్యయం చేసింది. ప్రభుత్వ స్కూళ్లు కళకళలాడుతుంటే కొందరు పెత్తందారులు మాత్రం పేదింటి పిల్లలకు ఈ చదువులేంటని కుళ్లుకుంటున్నారు. సర్కారు స్కూళ్లలో విద్యార్థులు తగ్గిపోయారంటూ క్షుద్ర కథనాన్ని వార్చేశారు.

- ▲ ఈనాడు లెక్కల ప్రకారం ప్రభుత్వ స్కూళ్లలో ఎన్‌రోల్‌మెంట్ 37.88 లక్షలు. ఇందులోనూ నిజం లేదు. ఇప్పటివరకు 38.22 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉన్నారు. ఈ ఏడాది ప్రవేశాలు ఇంకా కొనసాగుతున్నాయి. అడ్మిషన్లకు మరో నెలన్నరకు పైగా సమయం ఇంకా మిగిలే ఉంది! మరి వేల మంది పిల్లలను రామోజీ కాకి లెక్కలతో ఏం చేసినట్లు?
- ▲ 2018–19లో ప్రాథమిక స్థాయిలో 92.91శాతంగా ఉన్న జీఈఆర్ 2022–23లో 100.80 శాతానికి చేరుకుంది. సెకండరీ విద్యలో 79.69 నుంచి 89.63 శాతానికి చేరింది. హయ్యర్ సెకండరీలో 46.88 నుంచి 69.87 శాతానికి పెరిగింది. గతంలో ఎప్పుడైనా ఇలాంటి పరిస్థితి ఉందా?
- ▲ జీఈఆర్‌ను పెంచేందుకు టెన్త్, ఇంటర్ ఫెయిలైన వారికి తిరిగి ప్రవేశాలు కల్పించడంతో పాటు మరోసారి అమ్మఒడిని ప్రభుత్వం అందిస్తోంది.
- ▲ పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు గతేడాది టాప్–10 ర్యాంకులు 25 లభించగా ఈ ఏడాది 64కు పెరిగాయి. 75 శాతానికి పైగా మార్కులతో డిస్టింక్షన్ సాధించిన విద్యార్థులు గతేడాది 63,275 మంది కాగా ఈ ఏడాది 67,114 మంది సత్తా చాటారు. గతేడాది 66.50 శాతం మంది ఫస్ట్‌క్లాస్‌లో ఉత్తీర్ణులు కాగా ఈ ఏడాది 70.16 శాతానికి పెరిగారు.
- ▲ ఈ ఏడాది జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఎస్సీ, ఎస్టీ గురుకులాల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ చూపారు. 67 మంది ఐఐటీ, ఎన్ఐటీ, నిఫ్ట్, సెంట్రల్ యూనివర్సిటీల్లో ప్రవేశాలు పొందారు. మరి ఈ విషయం రామోజీ చదివారా?

విద్యా సంస్కరణల్లో మచ్చుకు కొన్ని..

- ▲ ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.16,500కోట్లతో 'మనబడి నాడు–నేడు'
- ▲ డిజిటల్ విద్యను ప్రోత్సహిస్తూ బైజూస్ కంటెంట్‌తో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు, స్మార్ట్ టీవీలు
- ▲ ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియంతోపాటు సీబీఎస్సీతో అనుసంధానం. ఇంగ్లిష్‌లో పావీణ్యం సాధించేలా 3వ తరగతి నుంచే 'టోఫెల్'కు శిక్షణ.
- ▲ రూ.685.87 కోట్లతో 8వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులకు 5,18,740 ట్యాబ్‌ల పంపిణీ. ఏటా డిసెంబర్ 21న ఈ కార్యక్రమం నిర్వహణ.
- ▲ వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ విద్యార్థులకు కూడా బైజూస్ కంటెంట్, 45 వేల పాఠశాలల్లో ఇంటర్నెట్. మూడో తరగతి నుంచే సబ్జెక్టు టీచర్ విధానం.

గతంలో ఇదీ దుస్థితి...

- ▲ జగనన్న అమ్మ ఒడి లేదు. స్కూళ్లు తెరిచిన 6–7 నెలలకు కూడా యూనిఫాం సంగతి దేవుడెరుగు కనీసం టెక్స్ట్ బుక్స్ కూడా అందించలేని దుస్థితి. శిథిలావస్థలో స్కూళ్లు.
- ▲ రాగిజావ, చిక్కీ ఊసే లేదు. ఆయాల జీతాలు, సరుకుల బిల్లులు 8–9 నెలలు పెండింగ్‌లోనే.
- ▲ గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.1,778 కోట్లు (వీటిని సీఎం జగన్ ప్రభుత్వం వచ్చాక చెల్లించి విద్యార్థులను ఆదుకుంది)
- ▲ విదేశీ విద్యా దీవెనలో అవకతవకలు, భారీగా బకాయిలు.



పారిస్ ఒలింపిక్స్‌కు అవినాశ్ సాబ్లే అర్హత

భారత అథ్లెట్ అవినాశ్ సాబ్లే వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు పురుషుల 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్ ఈవెంట్‌లో అర్హత సాధించాడు. పోలాండ్‌లో జరిగిన డైమండ్ లీగ్ మీట్‌లో మహారాష్ట్రకు చెందిన 28 ఏళ్ల అవినాశ్ 8 నిమిషాల 11.63 సెకన్లలో గమ్యానికి చేరి ఆరో స్థానంలో నిలిచాడు. ఈ క్రమంలో పారిస్ ఒలింపిక్స్ అర్హత ప్రమాణ సమయాన్ని (8ని:15.00 సెకన్లు) అవినాశ్ అధిగమించాడు. టోక్యో ఒలింపిక్స్‌లో హీట్స్‌లోనే వెనుదిరిగిన అవినాశ్ 2022 కామన్వెల్త్ గేమ్స్‌లో, 2019 ఆసియా చాంపియన్‌షిప్‌లో రజత పతకాలు గెలిచాడు.

'యాషెస్' నాలుగో టెస్టుకు అండర్సన్

ఆస్ట్రేలియాతో యాషెస్ సిరీస్‌లోని మూడో టెస్టులో తుది జట్టులో చోటు దక్కించుకోలేకపోయిన ఇంగ్లండ్ వెటరన్ పేస్ బౌలర్ జేమ్స్ అండర్సన్‌ను నాలుగో టెస్టుకు ఎంపిక చేశారు. మాంచెస్టర్‌లో బుధవారం ఇంగ్లండ్, ఆస్ట్రేలియా జట్ల మధ్య నాలుగో టెస్టు మొదలవుతుంది. ఐదు టెస్టుల సిరీస్‌లో ప్రస్తుతం ఇంగ్లండ్ 1–2తో వెనుకంజలో ఉంది. అండర్సన్ తాజా యాషెస్ సిరీస్‌లో తొలి రెండు టెస్టుల్లో కేవలం మూడు వికెట్లు మాత్రమే తీసి నిరాశపరిచాడు.



బోపన్న ర్యాంక్ 7



లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో సెమీఫైనల్ ప్రదర్శన భారత స్టార్ రోహన్ బోపన్న ర్యాంకింగ్స్‌లో పురోగతికి దోహదపడింది. సోమవారం విడుదల చేసిన అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) డబుల్స్ ర్యాంకింగ్స్‌లో 43 ఏళ్ల బోపన్న ఐదు స్థానాలు ఎగబాకి 12 నుంచి ఏడో ర్యాంక్‌కు చేరుకున్నాడు. 2013 తర్వాత బోపన్న ఏడో ర్యాంక్‌ను అందుకోవడం విశేషం. వింబుల్డన్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో చివరి నిమిషంలో ఆడే అవకాశం దక్కించుకున్న యూకీ బాంబ్రీ 64వ ర్యాంక్‌లో... సాకేత్ మైనేని 81వ ర్యాంక్‌లో... జీవన్ నెడుంజెళియన్ 93వ ర్యాంక్‌లో... శ్రీరామ్ బాలాజీ 97వ ర్యాంక్‌లో నిలిచారు.

నాపై మానసికంగా ప్రభావం పడింది: సింధు



న్యూఢిల్లీ: రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత, భారత స్టార్ షట్లర్ పీవీ సింధుకు ఈ ఏడాది కలిసి రావడంలేదు. 2023లో సింధు ఒక్క టైటిల్ కూడా గెలవలేకపోగా, మాడ్రిడ్ మాస్టర్స్ టోర్నీలో రన్నరప్‌గా నిలవడం ఆమె అత్యుత్తమ ప్రదర్శన. తాజాగా యూఎస్ ఓపెన్‌లో సింధు క్వార్టర్ ఫైనల్లోనే ఓటమి పాలైంది. దాంతో ఆమె తీవ్ర నిరాశ చెందింది. ఈ ఓటమి అనంతరం సోషల్ మీడియాలో స్పందించింది. ఆశ్చర్యకరంగా గతంలో ఎన్నడూలేని రీతిలో తన భావోద్వేగాలను ప్రదర్శించింది. 'ఈ ఓటమి మానసికంగా నాపై తీవ్ర ప్రభావం చూపించింది. ముఖ్యంగా అన్ని ప్రతికూలతలు ఎదురవుతున్న ఈ ఏడాదిలో ఇలాంటి ఫలితం రావడం బాగా నిరాశపర్చింది. తాజా పరాజయంతో నేను చాలా బాధపడ్డాను. నా ఈ భావోద్వేగాలను సరైన రీతిలో మలచుకొని నా ఆటను మరింత మెరుగుపర్చుకొనేందుకు, ఎక్కువగా సాధన చేసేందుకు వాడుకుంటా. రాబోయే కొరియా, జపాన్ టోర్నీల కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నా. మీ అభిమానమే నాకు సర్వస్వం. దానికి కృతజ్ఞురాలిని' అని సింధు పోస్ట్ చేసింది.

ఆసియా క్రీడల్లో ఆడనివ్వండి

- ప్రధాని జోక్యం చేసుకోవాలి
- భారత ఫుట్‌బాల్ జట్టు హెడ్ కోచ్ స్టిమాక్ విజ్ఞప్తి



న్యూఢిల్లీ: ఆసియా క్రీడల్లో భారత ఫుట్‌బాల్ జట్టుకు ఆడే అవకాశం కల్పించాలని కోరుతూ సీనియర్ టీమ్ హెడ్ కోచ్ ఐగర్ స్టిమాక్ దేశ ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. సెప్టెంబర్ 23 నుంచి చైనాలోని హాంగ్జూలో ఆసియా క్రీడలు జరగనున్నాయి. ఇందులో ఫుట్‌బాల్ క్రీడాంశంలో వివిధ దేశాలకు చెందిన అండర్–23 స్థాయి టీమ్‌లు పాల్గొంటాయి. ఈ జట్లలో ముగ్గురు సీనియర్ ఆటగాళ్లకు కూడా ఆడే వెసులుబాటు కల్పిస్తారు. అయితే టీమ్ ఈవెంట్లలో ర్యాంకింగ్స్‌లో టాప్–8లో ఉంటేనే మన జట్లను పంపిస్తామని భారత క్రీడా శాఖ మాత్రం విధానం రూపొందించుకుంది. ప్రస్తుతం ఆసియాలో భారత ఫుట్‌బాల్ జట్టు 18వ ర్యాంక్‌లో ఉంది. దాంతో ఫుట్‌బాల్ టీమ్‌ను పంపడానికి అవకాశం లేదు. దీనిపైనే ప్రధాని జోక్యం చేసుకోవాలంటూ స్టిమాక్ సోషల్ మీడియాలో సుదీర్ఘ లేఖ రాస్తూ ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. భారత్ 2017లో అండర్–17 ప్రపంచ కప్‌కు ఆతిథ్యమిచ్చింది. నాటి జట్టులో ఆడినవారే ఇప్పుడు అండర్–23 క్వాలిఫయర్స్‌లో మెరుగ్గా రాణించారు. ఈ కుర్రాళ్లలో మంచి ప్రతిభ ఉంది. కానీ ఇప్పుడు ఆసియా క్రీడల్లో మన జట్టు పాల్గొనకుండా అడ్డు చెబుతున్నారు. ఈ టీమ్‌లో అలాంటి ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో పాల్గొనాలి. జట్టును పంపకుండా ఉండేందుకు చెబుతున్న కారణాలు సహేతుకంగా లేవు. అందుకే భారత్ కోచ్‌గా ఈ విషయాన్ని మీ దృష్టికి, కేంద్ర క్రీడాశాఖ దృష్టికి తీసుకొస్తున్నాను. కాబట్టి మీరు జోక్యం చేసుకొని జట్టు ఆసియా క్రీడల్లో పాల్గొనేలా చేయాలి అని స్టిమాక్ అన్నారు. ఎలాంటి ప్రత్యర్థినైనా ఓడించే సత్తా మన జట్టుకు ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. 'ర్యాంకింగ్ పేరు చెప్పి మన క్రీడా శాఖనే జట్టు పాల్గొనకుండా చేస్తోంది. నిజానికి ఆసియా క్రీడల్లో పాల్గొంటున్న కొన్ని ఇతర క్రీడల టీమ్‌లకంటే మన ఫుట్‌బాల్ జట్టు ర్యాంక్ మెరుగ్గానే ఉంది. పైగా తమకంటే బలమైన జట్లపై చిన్న టీమ్‌లు సంచలన విజయాలు సాధించడం ఫుట్‌బాల్‌లో అసాధ్యమేమీ కాదని చరిత్ర చెబుతోంది' అని స్టిమాక్ అభిప్రాయపడ్డారు. ఇటీవల ఫ్రాన్స్ పర్యటనలో భాగంగా అక్కడి స్టార్ ఆటగాడు కిలియాన్ ఎంబాపె భారత్‌లో సూపర్‌హిట్ అని, అతనికి అక్కడికంటే మన దేశంలోనే ఎక్కువ మంది అభిమానులు ఉన్నారని నరేంద్ర మోదీ చెప్పిన విషయాన్ని స్టిమాక్ గుర్తు చేశారు. 'ఫ్రాన్స్ పర్యటనలో ఎంబాపె గురించి మీరు చేసిన వ్యాఖ్య భారత ఫుట్‌బాల్‌ను అభిమానించేవారందరికీ సంతోషం కలిగించింది. మన జట్టు ఆసియా క్రీడల్లో పాల్గొనేలా చూడాలని భారత టీమ్ తరఫున మిమ్మల్ని కోరుతున్నా. క్రీడాశాఖ సూచనల్లో ఒక ప్రత్యేక నిబంధన కూడా ఉంది. టాప్–8లో లేకపోయినా సరైన కారణంతో నిపుణుల బృందం సిఫారసు చేస్తే ఆ టీమ్‌ను ఆసియా క్రీడలకు పంపవచ్చు. దీని ప్రకారం అవకాశం కల్పించండి' అని స్టిమాక్ కోరారు. భారత ఫుట్‌బాల్ జట్టు 1951 న్యూఢిల్లీ, 1962 జకార్తా ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాలు... 1970 బ్యాంకాక్ ఆసియా క్రీడల్లో కాంస్య పతకం సాధించింది. ఆ తర్వాత పలుమార్లు భారత జట్టు ఆసియా క్రీడల్లో పాల్గొన్నా ఆరంభ రౌండ్లలోనే నిష్క్రమించింది.

సెమీఫైనల్లో భారత్ 'ఎ'

ఎమర్జింగ్ కప్ ఆసియా క్రికెట్ టోర్నీ


అభిషేక్ శర్మ, సాయి సుదర్శన్

కొలంబో: ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) ఎమర్జింగ్ కప్ క్రికెట్ టోర్నీలో భారత 'ఎ' జట్టు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. గ్రూప్ 'బి'లో సోమవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో భారత్ 9 వికెట్ల తేడాతో నేపాల్‌పై ఘనవిజయం సాధించింది. మొదట నేపాల్ 39.2 ఓవర్లలో 167 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ రోహిత్ పాడెల్ (65; 7 ఫోర్లు) రాణించాడు. గుల్షన్ ఝా (38; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) మెరుగ్గా ఆడాడు. భారత్ 'ఎ' బౌలర్లలో నిశాంత్ సింధు 4, రాజ్‌వర్ధన్ 3, హర్షిత్ రాణా 2 వికెట్లు తీశారు. తర్వాత సులువైన లక్ష్యాన్ని భారత జట్టు 22.1 ఓవర్లలో వికెట్ మాత్రమే కోల్పోయి 172 పరుగులు చేసి ఛేదించింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ (87; 12 ఫోర్లు, 2 సిక్స్‌లు), సాయి సుదర్శన్ (58 నాటౌట్; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీలతో జట్టును గెలిపించారు. ధ్రువ్ (21 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) ధాటిగా పరుగులు చేశాడు. ఈ గ్రూపులో బుధవారం తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో భారత్ చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్ 'ఎ'తో తలపడుతుంది.

ప్రపంచ అండర్-21 స్నూకర్‌లో భారత్‌కు మూడు పతకాలు



రియాద్: ప్రపంచ అండర్–21 మహిళల స్నూకర్ టోర్నమెంట్‌లో భారత క్రీడాకారిణులు అదరగొట్టారు. స్వర్ణ, రజత, కాంస్య పతకాలతో మెరిశారు. ఫైనల్లో కీర్తన పాండ్యన్ 3–2 (24–50, 72–50, 71–15, 23–82, 79–45)తో భారత్‌కే చెందిన అనుపమ రామచంద్రన్‌ను ఓడించి స్వర్ణ పతకాన్ని దక్కించుకుంది. అనుపమ ఖాతాలో రజతం చేరింది. సెమీఫైనల్లో ఓడిపోయిన నటాషా చేతన్‌కు కాంస్య పతకం లభించింది.

అభినవ్-గౌతమి జోడీకి స్వర్ణం



చాంగ్వాన్ (కొరియా): ప్రపంచ జూనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు మూడో స్వర్ణ పతకం లభించింది. సోమవారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో అభినవ్ షా–గౌతమి భానోత్ జోడీ పసిడి పతకం సాధించింది. ఫైనల్లో అభినవ్–గౌతమి ద్వయం 17–13తో ఒషీన్ ముల్లర్–రొమైన్ ఔఫ్రెరి (ఫ్రాన్స్) జంటపై గెలిచింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో అభినవ్ చౌదరీ–సంయమ్ ద్వయం కాంస్య పతకం నెగ్గింది. కాంస్య పతక పోరులో అభినవ్–సంయమ్ 17–11తో కిమ్ జూరి–కిమ్ కాంగ్ హున్ (కొరియా)లపై విజయం సాధించారు.

చైనా చేతిలో భారత్ ఓటమి



లింబర్గ్ (జర్మనీ): భారత మహిళల హాకీ జట్టు జర్మనీ పర్యటనను పరాజయంతో ప్రారంభించింది. నాలుగు దేశాల టోర్నమెంట్‌లో చైనాతో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 2–3 గోల్స్ తేడాతో ఓటమి చవిచూసింది. భారత్ తరఫున నవనీత్ కౌర్ 24, 45వ నిమిషాల్లో రెండు గోల్స్ చేసింది. భారత జట్టు పలు పెనాల్టీ కార్నర్‌లను వృథా చేసింది. మరోవైపు ప్రత్యర్థి జట్టుకు లభించిన పెనాల్టీ కార్నర్‌లను చెన్ జియలి (9వ ని.లో), జాంగ్ జియకి (45వ ని.లో) గోల్స్‌గా మలిచారు. మూడో క్వార్టర్ ముగిసేసరికి ఇరు జట్లు 2–2తో సమంగా నిలిచాయి. కానీ ఆఖరి క్వార్టర్‌లో జు యనన్ (51వ ని.లో) ఫీల్డ్ గోల్ చేసి చైనాను గెలిపించింది.

మయామి క్లబ్‌కు మెస్సీ



ఫోర్ట్ లాడెర్‌డేల్ (ఫ్లోరిడా): అర్జెంటీనా ఫుట్‌బాల్ సూపర్‌స్టార్ లయోనల్ మెస్సీ కొత్త గూటికి చేరాడు. అమెరికన్ ప్రొఫెషనల్ సాకర్ క్లబ్ అయిన 'ఇంటర్ మయామి' జట్టుతో ఆడేందుకు సోమవారం ఇక్కడికి వచ్చాడు. ఈ క్లబ్‌కు చెందిన స్టేడియంలో అతను '10 నంబర్ జెర్సీ'తో ప్రవేశించగానే క్లబ్ సహ యజమాని, ఇంగ్లండ్ సాకర్ స్టార్, మాజీ కెప్టెన్ బెక్‌హామ్ ఆలింగనం చేసుకొని అభిమానుల హర్షధ్వానాల మధ్య స్వాగతం పలికాడు. 2025 సీజన్ పూర్తయ్యే వరకు ఇంటర్ మయామితో ఆడేందుకు మెస్సీ ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ ఒప్పందం విలువ సీజన్‌కు రూ. 492 కోట్లు (60 మిలియన్ డాలర్లు) అని క్లబ్ వర్గాలు వెల్లడించాయి.

పాక్‌ను ఆదుకున్న షకీల్, సల్మాన్

- తొలి ఇన్నింగ్స్‌లో 221/5
- లంకతో తొలి టెస్టు



గాలె: శ్రీలంక బౌలర్ ప్రభాత్ జయసూర్య (3/83) స్పిన్ ఉచ్చులో పడిన పాకిస్తాన్ జట్టును మిడిలార్డర్ బ్యాటర్లు సాద్ షకీల్ (69 బ్యాటింగ్; 6 ఫోర్లు), ఆగా సల్మాన్ (61 బ్యాటింగ్; 6 ఫోర్లు, 1 సిక్స్) ఆదుకున్నారు. దీంతో తొలి టెస్టులో ఆతిథ్య జట్టు స్కోరుకు దీటుగా పాక్ తొలి ఇన్నింగ్స్ సాగుతోంది. 101 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన పాక్‌ను షకీల్, సల్మాన్ గట్టెక్కించారు. ఇద్దరు కలిసి ఆఖరి సెషన్ ఆసాంతం క్రీజును అట్టిపెట్టుకోవడంతో మరో వికెట్ పడలేదు. అభేద్యమైన ఆరో వికెట్‌కు 120 పరుగులు జోడించి పాక్‌ను ఆదుకున్నారు. ఆట ముగిసే సమయానికి పాక్ 5 వికెట్లు కోల్పోయి 221 పరుగులు సాధించింది. ప్రస్తుతం బాబర్ బృందం 91 పరుగులు వెనుకబడి వుంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 242/6తో రెండో రోజు ఆట కొనసాగించిన శ్రీలంక 95.2 ఓవర్లలో 312 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్ ధనంజయ డిసిల్వా (122; 12 ఫోర్లు, 3 సిక్సర్లు) సెంచరీతో కదంతొక్కాడు. షాహిన్ అఫ్రిది, నసీమ్ షా, అబ్రార్ తలా 3 వికెట్లు తీశారు.

సినిమా

హార్ట్ ఆఫ్ సైంధవ్


వెంకటేశ్, సారా

సైంధవ్ హృదయానికి దగ్గరగా ఉన్న వ్యక్తి ఎవరు? ఆ మాటకొస్తే సైంధవ్ హార్ట్ ఎవరు? అంటే... బేబీ గాయత్రి. సైంధవ్, గాయత్రిల అనుబంధం ఎలాంటిదో 'సైంధవ్' చిత్రంలో చూడాల్సిందే. వెంకటేశ్ టైటిల్ రోల్‌లో శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న చిత్రం ఇది. ఈ చిత్రంలో గాయత్రి పాత్ర చేస్తోంది బేబీ సారా. వెంకటేశ్‌తో సారా ఉన్న పోస్టర్‌ని 'హార్ట్ ఆఫ్ సైంధవ్' అంటూ సోమవారం విడుదల చేశారు. హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో శ్రద్ధా శ్రీనాథ్ కథానాయికగా, నవాజుద్దీన్ సిద్ధిఖ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. పాన్ ఇండియా మూవీగా దక్షిణాది భాషల్లో, హిందీలోనూ డిసెంబర్ 22న రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణన్, కెమెరా: ఎస్. మణికందన్.



నయనతార

తుఫాను ముందు వచ్చే ఉరుము

'తుఫాను ముందు వచ్చే ఉరుము ఆమె' అంటూ 'జవాన్'లో నయనతార క్యారెక్టర్ లుక్‌ని షారుక్ ఖాన్ సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. షారుక్ ఖాన్, నయనతార కాంబినేషన్‌లో తమిళ దర్శకుడు అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'జవాన్'. హిందీలో నయనతారకు, అట్లీకి ఇది తొలి చిత్రం. ఈ చిత్రంలో నయనతార చేసిన పోలీసాఫీసర్ పాత్ర లుక్‌ని సోమవారం విడుదల చేశారు. రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై గౌరీ ఖాన్ నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 7న హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది.

కుట్రలకీ.. ఆలోచనలకీ మధ్య...

రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'వ్యూహం'. అజ్మల్, మానస లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. రామదూత క్రియేషన్స్ పతాకంపై దాసరి కిరణ్‌కుమార్ నిర్మిస్తున్నారు. ఫస్ట్ ఇంటెన్స్ పోస్టర్ ఆఫ్ 'వ్యూహం' అంటూ ఈ మూవీ పోస్టర్‌ని విడుదల చేశారు మేకర్స్. అజ్మల్ ఫొటో ఉన్న ఈ పోస్టర్‌పై కుట్రలకీ, ఆలోచనలకీ మధ్య... అని రాసి ఉంది. ''వ్యూహం' సినిమాని ఎక్కడా రాజీ పడకుండా తెరకెక్కిస్తున్న వర్మ ప్రతిభను చూసి ఆశ్చర్యపోతున్నాను. కుట్రలకీ, ఆలోచనలకీ మధ్యలో అసామాన్యుడిగా ఎదిగిన నాయకుని కథే 'వ్యూహం'. ఆ నాయకుడే ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి. ఈ సినిమా చిత్రీకరణ దాదాపు 50 శాతం పూర్తయింది'' అన్నారు దాసరి కిరణ్‌కుమార్. ఈ చిత్రానికి కెమెరా: సుజీష్ రాజేంద్రన్.


అజ్మల్

డేట్ నైట్



''బాగా నిద్రపోవాలని ఫిక్స్ అయినప్పుడు కడుపులో ఉన్న బిడ్డ డ్యాన్స్ పార్టీ పెట్టుకోవాలని ఫిక్స్ అయితే.. ఇక నిద్ర ఎలా పోతాం'' అంటూ చిరనవ్వులు చిందిస్తూ తన ప్రెగ్నెన్సీ తాలూకు ఆనందాన్ని ఇటీవల ఇలియానా పంచుకున్న విషయం తెలిసిందే. ''నేను తల్లిని కాబోతున్నా'' అని ఇలియానా ప్రకటించినప్పటి నుంచి తండ్రి వివరాలు తెలుసుకోవాలని చాలామంది ఆసక్తిగా ఉన్నారు. ఆ మధ్య ఓ వ్యక్తి ముఖాన్ని బ్లర్ చేసి, ఇలియానా ఆ ఫొటోను షేర్ చేశారు. సోమవారం స్పష్టంగా ఉన్న ఫొటోను షేర్ చేసి, 'డేట్ నైట్' అంటూ ఆ వ్యక్తితో దిగిన ఫొటోను సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు. అయితే అతని పేరు, ఇతర వివరాలేమీ ఇలియానా బయటపెట్టలేదు. 'డేట్ నైట్' అన్నారు కాబట్టి అతను ఇలియానా బాయ్‌ఫ్రెండ్ అని స్పష్టమవుతోంది. మరి.. రహస్య వివాహం ఏమైనా చేసుకున్నారా? అనేది తెలియాల్సి ఉంది.

డిటెక్టివ్ సినిమాలు గుర్తొస్తాయి


మీనాక్షి, విజయ్ ఆంటోని

''హత్య' సినిమా క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కింది. ఈ సినిమా మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ వింటే హాలీవుడ్ డిటెక్టివ్ చిత్రాలు గుర్తొస్తాయి. గిరీష్ అంత మంచి మ్యూజిక్ ఇచ్చారు. తెలుగు ప్రేక్షకులు 'హత్య' చిత్రాన్ని ఆదరించాలి'' అన్నారు విజయ్ ఆంటోని. బాలాజీ కుమార్ దర్శకత్వంలో విజయ్ ఆంటోని హీరోగా, రితికా సింగ్, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా నటించిన చిత్రం 'హత్య'. ఈ చిత్రం ఈ నెల 21న రిలీజ్ కానుంది. గ్లోబల్ సినిమాస్, సురేశ్ ప్రొడక్షన్స్ సంస్థలు తెలుగులో విడుదల చేస్తున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకి హీరోలు అడివి శేష్, సందీప్ కిషన్ అతిథులుగా హాజరై, 'హత్య' హిట్టవ్వాలన్నారు. ''1923లో జరిగిన ఓ ఘటన ఆధారంగా ఈ చిత్రం తీశాను'' అన్నారు బాలాజీ కుమార్.

ఎమోషన్స్ బాగున్నాయి

– 'దిల్' రాజు



సాయికుమార్, ఆదిత్యా ఓం, ఐశ్వర్య, రాజీవ్ కనకాల, శ్రీనివాస్ సాయి, దీపాలి రాజపుత్ ప్రధాన పాత్రధారులుగా రూపొందిన చిత్రం 'నాతో నేను'. శాంతి కుమార్ తూర్లపాటి (జబర్దస్త్ ఫేం) దర్శకత్వంలో ప్రశాంత్ టంగుటూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని నిర్మాత 'దిల్ రాజు' రిలీజ్ చేసి, మాట్లాడుతూ – ''ఈ ట్రైలర్‌లో చూపించిన ట్రయాంగిల్ ఎమోషన్స్ బాగున్నాయి. సాయికుమార్ నటన గురించి తెలిసిందే. ఇతర ఆర్టిస్టులూ అద్భుతంగా నటించారు'' అని అన్నారు.

ఫొటో స్టూడియోలో ప్రేమ


చెందు ముద్దు

''ప్రేక్షకులకు మనం ఎప్పటి కథ చెబుతున్నామన్నది ముఖ్యం కాదు. ఆ కథను ఎలా చెబుతున్నామన్నదే ముఖ్యం. 'సీతారామం' సినిమా 1960ల నేపథ్యంలో ఉన్నా ప్రేక్షకులు ఆదరించారు. అందుకే 1980ల నేపథ్యంలో రూపొందిన మా 'అన్నపూర్ణ ఫోటో స్టూడియో' కూడా ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అని దర్శకుడు చెందు ముద్దు అన్నారు. చైతన్యా రావ్, లావణ్య జంటగా యష్ రంగినేని నిర్మించిన ఈ సినిమా ఈ నెల 21న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రదర్శకుడు చెందు విలేకరులతో మాట్లాడుతూ– ''నా తొలి చిత్రం 'ఓ పిట్ట కథ'. ఇప్పుడు 'అన్నపూర్ణ ఫోటో స్టూడియో' తీశాను. ఈ చిత్రంలో ఒక స్వచ్ఛమైన ప్రేమ కథను వినోదాత్మకంగా చూపిస్తున్నాం. మాలాంటి కొత్త వాళ్లను ప్రేక్షకులు ప్రోత్సహించినప్పుడే మరిన్ని కొత్త సినిమాలు వస్తాయి'' అన్నారు.

అందమైన దెయ్యం


కాజల్

కాజల్ అగర్వాల్, రెజీనా, జనని అయ్యర్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కార్తీక'. డి. కార్తికేయన్ (డీకే) దర్శకత్వం వహించారు. ముత్యాల రామదాసు సమర్పణలో వెంకట సాయి ఫిల్మ్స్‌పై టి. జనార్దన్ తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్న ఈ చిత్రం ఈ నెల 21న రిలీజ్ కానుంది. ''హారర్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'కార్తీక. ఇందులో కాజల్, జనని దెయ్యాలుగా కనిపిస్తారు'' అన్నారు ముత్యాల రామదాసు. ఈ చిత్రానికి సంగీతం: ప్రసాద్ ఎస్ఎన్.

యాక్షన్ ఎంటర్‌టైనర్

ప్రముఖ దర్శకుడు పి. వాసు తనయుడు శక్తి వాసుదేవన్ హీరోగా రాఘవ ద్వారకి దర్శకత్వం వహించిన చిత్రం 'అలా ఇలా ఎలా'. బ్రహ్మానందం, అలీ, పూర్ణ, నిషా కొఠారి ప్రధాన పాత్రల్లో నటించారు. కళ మూవీ మేకర్స్ పతాకంపై కొల్లకుంట నాగరాజు నిర్మించిన ఈ చిత్రం ఎస్‌కేఎంఎల్ మోషన్ పిక్చర్స్ సంస్థ ద్వారా ఈ నెల 21న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో కొల్లకుంట నాగరాజు మాట్లాడుతూ– ''యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన మా సినిమా ప్రేక్షకులు థ్రిల్ ఫీలయ్యేలా ఉంటుంది'' అన్నారు. ''కర్ణాటకలో పుట్టిన నేను చిరంజీవి గారి స్ఫూర్తితో ఇండస్ట్రీకి వచ్చాను. తెలుగులో నా మొదటి చిత్రం 'అలా ఇలా ఎలా'' అన్నారు రాఘవ ద్వారకి.


పూర్ణ, శక్తి

చరిత్రను వెతుకుతూ...


అశ్విన్, నందితా శ్వేత

''కథని బలంగా నమ్మి చేసిన చిత్రం 'హిడింబ'. స్క్రీన్‌ప్లే, విజువల్స్ రెగ్యులర్‌గా కాకుండా మా మూవీలో కొత్తగా ఉంటాయి. సినిమా బాగా వచ్చింది.. ప్రేక్షకులకు మా చిత్రం నచ్చుతుంది'' అని హీరో అశ్విన్ బాబు అన్నారు. అనిల్ కన్నెగంటి దర్శకత్వంలో అశ్విన్ బాబు, నందితా శ్వేత జంటగా నటించిన చిత్రం 'హిడింబ'. అనిల్ సుంకర సమర్పణలో గంగపట్నం శ్రీధర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 20న రిలీజవుతోంది. ఈ సందర్భంగా సోమవారం 'హిడింబ' రివర్స్ ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. అనిల్ కన్నెగంటి మాట్లాడుతూ– ''ఒక చరిత్ర వెతుక్కుంటూ వెనక్కి వెళ్లే ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'హిడింబ'. నాకు గొప్ప తృప్తి ఇచ్చిన సినిమా ఇది'' అన్నారు. ''మా సినిమాని థియేటర్‌లో చూసి మమ్మల్ని సపోర్ట్ చేయాలి'' అన్నారు గంగపట్నం శ్రీధర్. ఈ కార్యక్రమంలో నటులు శ్రీనివాస్ రెడ్డి, రఘు కుంచె పాల్గొన్నారు.

పాత్రను అర్థం చేసుకోవడానికి భగవద్గీత చదివా!

– హాలీవుడ్ నటుడు సిలియన్ మర్ఫీ



అమెరికన్ భౌతిక శాస్త్రవేత్త జె. రాబర్ట్ ఓపన్‌హైమర్ జీవితం ఆధారంగా రూపొందిన చిత్రం 'ఓపెన్‌హైమర్'. క్రిస్టోఫర్ నోలన్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో ఓపన్‌హైమర్ పాత్రను సిలియన్ మర్ఫీ పోషించారు. ఈ పాత్రను అర్థం చేసుకోవడానికి తాను భగవద్గీత చదివానని పేర్కొన్నారు సిలియన్. భగవద్గీతకి, ఈ పాత్రకి లింక్ ఏంటీ? అంటే.. రెండో ప్రపంచ యుద్ధం అప్పుడు అణు బాంబు తయారు చేయడానికి భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పిన 'సృష్టించింది నేనే.. నాశనం చేసింది నేనే' అనే శ్లోకం ప్రేరణగా నిలిచిందని ఓపెన్‌హైమర్ వెల్లడించారు. అందుకే ఆయన పాత్ర చేయడానికి భగవద్గీత చదివానని సిలియన్ మర్ఫీ అన్నారు. ఓపెన్‌హైమర్ జీవితంలో కీలకంగా నిలిచిన అణు బాంబు తయారీ ప్రధానాంశంగా రూపొందిన 'ఓపెన్‌హైమర్' యూనివర్సల్ పిక్చర్స్ ద్వారా ఇంగ్లిష్‌లో ప్రపంచవ్యాప్తంగా ఈ నెల 21న విడుదల కానుంది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 529	66,590
నిఫ్టీ ▲ 147	19,711

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	14,205	▲	91
డోజోన్స్	34,590	▲	81
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,406	▽	28
డాక్స్	16,069	▽	36
షాంఘై	3,210	▲	28
నికాయ్ (శుక్రవారం ముగింపు)	32,391	▽	28

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	59,270
బంగారం (22 క్యారట్)	59,033
వెండి (కేజీ)	75,066

ప్రాక్సిమస్ గ్రూప్ గూటికి రూట్ మొబైల్

- 58 శాతానికి రూ. 5,922 కోట్లు
- అంతిమంగా 84% వరకు కొనుగోలు



న్యూఢిల్లీ: ఎంటర్‌ప్రైజ్ మెసేజింగ్ సేవల సంస్థ రూట్ మొబైల్‌లో బెల్జియంకు చెందిన ప్రాక్సిమస్ గ్రూప్ 84 శాతం వరకు వాటాలను దక్కించుకోనుంది. ఇందులో భాగంగా ముందు దాదాపు 58 శాతం వాటాలను రూ. 5,922 కోట్లకు కొనుగోలు చేయనుంది. ఈ డీల్‌తో నిబంధనల ప్రకారం.. 26 శాతం ఓపెన్ ఆఫర్ ప్రకటించాల్సి రానుండటంతో, ఆ మేరకు షేర్లన్నింటినీ కొనుగోలు చేస్తే మొత్తం 84 శాతం వరకూ వాటాలను పెంచుకునే అవకాశం ఉంది. అయితే, లిస్టెడ్ కంపెనీల్లో పబ్లిక్ వాటా కనీసం 25 శాతం ఉండాలనే నిబంధన మేరకు 12 నెలల్లోగా కొన్ని షేర్లను విక్రయించి తన వాటాను 75%కి తగ్గించుకోవాల్సి రానుంది. షేరు ఒక్కింటికి రూ. 1,626.40 చొప్పున అనుబంధ సంస్థ ప్రాక్సిమస్ ఓపల్ ద్వారా ప్రాక్సిమస్ గ్రూప్ తమ సంస్థలో 57.56% వాటాలను కొనుగోలు చేయనున్నట్లు రూట్ మొబైల్ తెలిపింది. లావాదేవీ పూర్తయ్యాక రూట్ మొబైల్ సీఈవో రాజ్‌దీప్ గుప్తా తన ప్రస్తుత బాధ్యతల్లో కొనసాగుతూనే.. గ్రూప్ సీపాస్ (కమ్యూనికేషన్స్ ప్లాట్‌ఫాం యాజ్ ఎ సర్వీస్) కార్యకలాపాలకు సారథ్యం వహిస్తారు. రూట్ మొబైల్‌లో వాటాల కొనుగోలుతో అంతర్జాతీయంగా సీపాస్ విభాగంలో తమ స్థానం మరింత పటిష్టం కాగలదని ప్రాక్సిమస్ గ్రూప్ సీఈవో గిలామ్ బూటిన్ తెలిపారు.

ప్రాక్సిమస్ సంస్థలో పెట్టుబడి..

ఒప్పందం ప్రకారం రూట్ మొబైల్ వ్యవస్థాపక వాటాదారుల్లో కొందరు ప్రాక్సిమస్ ఓపల్‌లో అలాగే ప్రాక్సిమస్‌కు చెందిన మరో అనుబంధ సంస్థ టెలిసైన్‌లో మైనారిటీ వాటాలు తీసుకోనున్నారు. ఇందుకోసం 299.6 మిలియన్ యూరోలను వెచ్చించనున్నారు. రూట్ మొబైల్ మరింత ముందుగానే బిలియన్ డాలర్ల ఆదాయ లక్ష్యాన్ని సాధించేందుకు టెలిసైన్‌తో భాగస్వామ్యం ఉపయోగపడగలదని గుప్తా ధీమా వ్యక్తం చేశారు.

సోమవారం బీఎస్‌ఈలో రూట్ మొబైల్ షేరు సుమారు 9% క్షీణించి రూ. 1,486 వద్ద క్లోజైంది.

కొనసాగిన రికార్డుల ర్యాలీ..

- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ షేర్ల దన్ను
- ఇంట్రాడే, ముగింపులో కొత్త గరిష్టాలు
- సెన్సెక్స్ లాభం 529 పాయింట్లు
- 19,700 ఎగువకు నిఫ్టీ



ముంబై: స్టాక్ మార్కెట్లో కొత్త రికార్డుల ర్యాలీ సోమవారం కూడా కొనసాగింది. ఇప్పటి వరకు విడుదలైన కార్పొరేట్ కంపెనీల క్యూ1 ఫలితాలు అంచనాలకు తగ్గట్లు నమోదవడంతో పాటు విదేశీ ఇన్వెస్టర్ల నిధుల వెల్లువతో సెంటిమెంట్ బలపడింది. అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు 2% రాణించి సూచీల ర్యాలీకి దన్నుగా నిలిచాయి. ఫలితంగా సెన్సెక్స్, నిఫ్టీలు ఇంట్రాడే, ముగింపులో సరికొత్త గరిష్టాలను నమోదు చేశాయి. ఆసియా మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు అందుకున్న దేశీయ మార్కెట్ స్వల్ప లాభంతో మొదలైంది. ఉదయం సెన్సెక్స్ 87 పాయింట్లు పెరిగి 66,148 వద్ద, నిఫ్టీ 47 పాయింట్లు పెరిగి 19,612 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. ఆటో, రియల్టీ షేర్లు మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ముఖ్యంగా బ్యాంకింగ్, ఆయిల్ రంగాల షేర్లకు భారీ డిమాండ్ నెలకొంది. ఈ క్రమంలో సెన్సెక్స్ 595 పాయింట్లు ఎగసి 66,656 వద్ద, నిఫ్టీ 167 పాయింట్లు దూసుకెళ్లి 19,732 వద్ద కొత్త జీవితకాల గరిష్ట స్థాయిలను నమోదు చేశాయి. రోజంతా సానుకూల ధోరణిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 529 పాయింట్ల లాభంతో 66,590 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 147 పాయింట్లు పెరిగి 19,711 వద్ద నిలిచింది. చిన్న రంగాల షేర్లను కొనేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపడంతో బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్ సూచీ ట్రేడింగ్‌లో జీవితకాల గరిష్టాన్ని తాకింది. సెన్సెక్స్ రికార్డుల ర్యాలీ నేపథ్యంలో బీఎస్‌ఈలో ఇన్వెస్టర్ల సంపదగా భావించే కంపెనీల మొత్తం విలువ ఆల్‌టైం హై రూ.303.59 లక్షల కోట్లకు చేరింది.

షీలా ఫోమ్ చేతికి కర్లాన్

- 95 శాతం వాటాల కొనుగోలు
- రూ. 2,035 కోట్ల ఒప్పందం



న్యూఢిల్లీ: స్లీప్‌వెల్ పేరిట మ్యాట్రెస్‌లను తయారు చేసే షీలా ఫోమ్ తాజాగా కర్లాన్ ఎంటర్‌ప్రైజెస్‌లో 94.66% వాటాలు కొనుగోలు చేయనుంది. ఇందుకోసం రూ.2,035 కోట్లు వెచ్చించనుంది. అలాగే, ఆన్‌లైన్ ఫర్నిచర్ బ్రాండ్ ఫర్లెంకో మాతృ సంస్థ హౌస్ ఆఫ్ కిరాయా ప్రైవేట్ లిమిటెడ్‌లో రూ. 300 కోట్లతో 35% వాటాలు కొనుగోలు చేయనుంది. దీనికి సంబంధించిన రెండు ప్రతిపాదనలకు జూలై 17న జరిగిన సమావేశంలో కంపెనీ బోర్డు ఆమోదముద్ర వేసినట్లు షీలా ఫోమ్ తెలిపింది. 'రూ. 2,150 కోట్ల ఈక్విటీ వేల్యుయేషన్‌తో కేఈఎల్ (కర్లాన్ ఎంటర్‌ప్రైజెస్)లో 94.66% వాటాను కొనుగోలు చేయబోతున్నాం' అని వెల్లడించింది. మ్యాట్రెస్‌లు, ఫోమ్ ఆధారిత ఉత్పత్తుల విభాగంలో తమ స్థానాన్ని పటిష్టం చేసుకునేందుకు ఈ డీల్ ఉపయోగపడగలదని షీలా ఫోమ్ తెలిపింది. కేఈఎల్‌లో 94.66% వాటా కొనుగోలు వ్యయం రూ.2,035 కోట్లుగా ఉండనున్నట్లు పేర్కొంది. దేశీయంగా ఆధునిక మ్యాట్రెస్‌ల విభాగంలో రెండింటి సంయుక్త మార్కెట్ వాటా దాదాపు 21 శాతంగా ఉంటుందని వివరించింది. దక్షిణాదికి చెందిన బిజినెస్ గ్రూప్ పాయ్ కుటుంబం 1962లో కర్ణాటక కాయిర్ ప్రోడక్ట్స్ (ప్రస్తుతం కేఈఎల్)ను ఏర్పాటు చేసింది. 1995లో దాని పేరు కర్లాన్ అని మారగా 2011లో కేఈఎల్ పేరిట అనుబంధ సంస్థ ఏర్పాటైంది. అటు పైన 2014లో వ్యాపారం కేఈఎల్‌కు బదిలీ అయింది. కంపెనీ ప్రస్తుతం ప్రధానంగా కర్లాన్ బ్రాండ్ కింద ఫోమ్, కాయిర్ ఆధారిత మ్యాట్రెస్‌లు మొదలైనవి తయారు చేస్తోంది. కంపెనీ గత ఆర్థిక సంవత్సరంలో రూ.809 కోట్ల టర్నోవరు నమోదు చేసింది. ఫర్నిచర్ రెంటల్ మార్కెట్లోకి ప్రవేశించేందుకు ఫర్లెంకోలో పెట్టుబడులు ఉపయోగపడగలవని షీలా ఫోమ్ వివరించింది.

జోయాలుక్కాస్ 'అనుగ్రహ బ్రైడల్ ఫెస్ట్'



హైదరాబాద్: ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్ జోయాలుక్కాస్ 'అనుగ్రహ బ్రైడల్ ఫెస్ట్' నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా వజ్రాభరణాలపై 25% తగ్గింపు పొందవచ్చు. అన్ని జోయాలుక్కాస్ షోరూంలలో ఈ ఆగస్టు 27 వరకు ఆఫర్ అందుబాటులో ఉంటుంది. ''వివాహ వేడుకలకు సిద్ధమైన కుటుంబాలు ఈ అద్భుతమైన ఆఫర్‌ను సద్వినియోగం చేసుకోవాలి'' అని గ్రూప్ చైర్మన్ జాయ్ అలుక్కాస్ కోరారు

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

18-7-2023	
విశాఖ	475-00
చిత్తూరు	513-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	470-00
విజయవాడ	470-00
రిటైల్ ధర (డజను)	72.00
17-7-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	455-00
వరంగల్	457-00
రిటైల్ ధర	5.15

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్యూ1 భేష్

- రూ. 12,370 కోట్లకు నికర లాభం
- మొత్తం ఆదాయం రూ. 61,021 కోట్లు



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) తొలి త్రైమాసికం(క్యూ1)లో ప్రయివేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన క్యూ1(ఏప్రిల్-జూన్)లో నికర లాభం 29 శాతం జంప్‌చేసి రూ. 12,370 కోట్లను అధిగమించింది. గతేడాది(2022-23) ఇదే కాలంలో రూ. 9,579 కోట్లు మాత్రమే ఆర్జించింది. అయితే గతేడాది (2022-23) క్యూ4(జనవరి-మార్చి)లో ఆర్జించిన రూ. 12,594 కోట్లతో పోలిస్తే తాజా లాభం స్వల్పంగా తగ్గింది. ఇక మొత్తం ఆదాయం రూ. 44,202 కోట్ల నుంచి రూ. 61,021 కోట్లకు దూసుకెళ్లింది. నిర్వహణ వ్యయాలు 34 శాతం పెరిగి రూ. 15,177 కోట్లకు చేరాయి. ఈ జూలై 1 నుంచి బ్యాంక్ మాతృ సంస్థ, మార్టిగేజ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్‌ను విలీనం చేసుకున్న సంగతి తెలిసిందే.

వడ్డీ ఆదాయం అప్

స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 1.12 శాతం నుంచి 1.17 శాతానికి నామమాత్రంగా పెరిగాయి. గతేడాది క్యూ4లో నమోదైన 1.28 శాతం నుంచి చూస్తే నీరసించాయి. ప్రస్తుత సమీక్షా కాలంలో బ్యాంక్ స్టాండెలోన్ నికర లాభం సైతం 30 శాతం ఎగసి రూ. 11,952 కోట్లను తాకింది. నికర వడ్డీ ఆదాయం 21 శాతం బలపడి రూ. 23,599 కోట్లకు చేరింది. ఇందుకు అడ్వాన్సుల(రుణాలు)లో నమోదైన 15.8 శాతం వృద్ధి, 4.1 శాతానికి బలపడిన నికర వడ్డీ మార్జిన్లు దోహదం చేశాయి. ఈ కాలంలో రూ. 9,230 కోట్ల ఇతర ఆదాయం ఆర్జించింది. ఇందుకు రూ. 552 కోట్లమేర ట్రేడింగ్ లాభాలు సహకరించాయి. గతేడాది క్యూ1లో ఈ పద్దుకింద రూ. 1,077 కోట్ల నష్టం ప్రకటించింది. ప్రొవిజన్లు, కంటింజెన్సీలు రూ. 3,122 కోట్ల నుంచి రూ. 2,860 కోట్లకు తగ్గాయి. కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్) 18.9 శాతాన్ని తాకింది.

ఇతర విశేషాలు...

- జూన్‌కల్లా బ్యాంకు మొత్తం ఉద్యోగుల సంఖ్య 1,81,725కు చేరింది.
- అనుబంధ సంస్థ హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ నికర లాభం రూ. 441 కోట్ల నుంచి రూ. 567 కోట్లకు జంప్ చేసింది.
- హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ లాభం దాదాపు యథాతథంగా రూ. 189 కోట్లుగా నమోదైంది.
- బ్యాంక్ మొత్తం బ్రాంచీల సంఖ్య 7,860కు చేరింది. వీటిలో 52 శాతం సెమీఅర్బన్, గ్రామీణ ప్రాంతాలలోనే ఉన్నాయి.
- గతేడాది 1,400 బ్రాంచీలను ఏర్పాటు చేయగా.. ఈ ఏడాది సైతం ఈ బాటలో సాగనున్నట్లు బ్యాంక్ వెల్లడించింది.

ప్రపంచ బ్యాంకింగ్‌లో 7వ ర్యాంక్

ర్యాంక్	బ్యాంక్ పేరు	మార్కెట్ క్యాప్
1.	జేపీ మోర్గాన్	438
2.	బ్యాంక్ ఆఫ్ అమెరికా	232
3.	ఐసీబీసీ(చైనా)	224
4.	అగ్రికల్చరల్ బ్యాంక్(చైనా)	171
5.	వెల్స్ ఫార్గో	163
6.	హెచ్ఎస్‌బీసీ	160
7.	హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	154

(విలువ బిలియన్ డాలర్లలో- విదేశీ బ్యాంకులు శుక్రవారం(14న) ధరల్లో)

మార్కెట్ క్యాప్ రికార్డ్

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు బీఎస్‌ఈలో 2 శాతం బలపడి రూ. 1,679 వద్ద ముగిసింది. దీంతో బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్(విలువ) రూ. 12.65 లక్షల కోట్లను అధిగమించింది. వెరసి మార్కెట్ విలువరీత్యా రిలయన్స్ ఇండస్ట్రీస్(రూ. 18.91 లక్షల కోట్లు), టీసీఎస్(రూ. 12.77 లక్షల కోట్లు) తర్వాత మూడో ర్యాంకులో నిలిచింది. అంతేకాకుండా డాలర్ల మార్కెట్ విలువలో 154 బిలియన్లకు చేరడం ద్వారా ప్రపంచ బ్యాంకింగ్ దిగ్గజాలు మోర్గాన్ స్టాన్లీ(144 బిలియన్ డాలర్లు), బ్యాంక్ ఆఫ్ చైనా(138 బి.డా.), గోల్డ్‌మన్ శాక్స్(108 బి.డా.)లను దాటేసింది.

సాఫ్రాన్ అతిపెద్ద 'ఎంఆర్‌వో'

- శంషాబాద్ వద్ద ఏర్పాటు
- 2025లో కార్యరూపంలోకి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఏరోస్పేస్ రంగంలో ఉన్న ప్యారిస్ కంపెనీ సాఫ్రాన్ తాజాగా శంషాబాద్ విమానాశ్రయం వద్ద ఇంజన్ మెయింటెనెన్స్, రిపేర్, ఓవరాలింగ్ (ఎంఆర్‌వో) కోసం అతిపెద్ద ఫెసిలిటీ ఏర్పాటు చేస్తోంది. సాఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజన్స్ సర్వీసెస్ ఇండియా ఈ మేరకు జీఎంఆర్ హైదరాబాద్ ఏవియేషన్ సెజ్‌తో ఒప్పందం చేసుకుంది. శంషాబాద్‌లోని ఈ సెజ్‌లో లీజు ప్రాతిపదికన 23.5 ఎకరాల్లో లీడింగ్ ఎడ్జ్ ఏవియేషన్ ప్రొపల్షన్ టర్బోఫ్యాన్ ఇంజన్స్ కోసం ఎంఆర్‌వో కేంద్రం రానుంది. ఏటా 100 ఇంజన్లతో ప్రారంభమై 2035 నాటికి 300 ఇంజన్లకు సర్వీస్ చేయగలిగే స్థాయిలో రూపుదిద్దుకోనుంది. 2023 సెప్టెంబరులో నిర్మాణ పనులు మొదలై 2025లో కార్యరూపం దాల్చనుంది. పూర్తి స్థాయి సామర్థ్యానికి చేరుకునే నాటికి 1,000 మందికి ఉపాధి కల్పించనుంది. సాఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజన్స్ నెట్‌వర్క్‌లో హైదరాబాద్ కేంద్రం అతిపెద్ద ఎంఆర్‌వో ఫెసిలిటీ కానుందని సాఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజన్స్ సపోర్ట్, సర్వీసెస్ వైస్ ప్రెసిడెంట్ నికోలస్ పాచియే తెలిపారు. జీఎంఆర్ ఏరోస్పేస్, ఇండస్ట్రియల్ పార్క్‌లో ఇప్పటికే సాఫ్రాన్ కేబుల్ హార్నెసింగ్, ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజన్ కంపోనెంట్ తయారీ కేంద్రాలను స్థాపించింది.

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ డీఎంఈలో 590 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఏపీ డీఎంఈ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రి, వైద్య కళాశాలల్లోని వివిధ స్పెషాలిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 590
» **స్పెషాలిటీలు:** సి.టి.సర్జరీ, కార్డియాలజీ, ఎండోక్రైనాలజీ, మెడికల్ జీఈ, నియోనాటాలజీ, నెఫ్రాలజీ, న్యూరో సర్జరీ, పీడియాట్రిక్ సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ, సర్జికల్ జీఈ, సర్జికల్ ఆంకాలజీ, యూరాలజీ, వాస్కులర్ సర్జరీ, అనెస్తీషియా, డెర్మటాలజీ, ఎమర్జెన్సీ, మెడిసిన్ జనరల్ సర్జరీ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, న్యూక్లియర్ మెడిసిన్, ఓబీసీ, ఆర్థోపెడిక్స్ తదితరాలు.
» **అర్హత:** మెడికల్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ(డీఎం/ఎండీ/ఎంఎస్/డీఎన్‌బీ/డీఎంఏ) ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** పోస్టు గ్రాడ్యుయేషన్ ఫైనల్ ఎగ్జామ్ మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:**17.07.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**26.07.2023
» **వెబ్‌సైట్:** dme.ap.nic.in

వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో 250 అప్రెంటిస్‌లు

రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్‌కు చెందిన విశాఖపట్నం స్టీల్ ప్లాంట్(వైజాగ్ స్టీల్).. 2023 ఆగస్టు బ్యాచ్‌కు సంబంధించి అప్రెంటిస్‌షిప్ శిక్షణకు దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 250
» **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌షిప్ ట్రైనీ-200,టెక్నీషియన్ అప్రెంటిస్‌షిప్ ట్రైనీ-50
» **విభాగాలు:** మెకానికల్, ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్/ఐటీ, మెటలర్జీ, ఇన్‌స్ట్రుమెంటేషన్, సివిల్, కెమికల్, ఇన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్,సెరామిక్స్,మైనింగ్, కెమికల్.
» **స్టైపెండ్:** నెలకు ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్‌లకు రూ.9000, డిప్లొమా ఇంజనీరింగ్ అభ్యర్థులకు రూ.8000. **శిక్షణ వ్యవధి:** ఒక సంవత్సరం.
» **అర్హత:** 2021/2022/2023 విద్యా సంవత్సరాల్లో సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** డిప్లొమా, బీఈ/బీటెక్‌లో సాధించిన మార్కులు, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **గూగుల్‌ఫాం ద్వారా దరఖాస్తులకు చివరితేది:** 31.07.2023.
» **వెబ్‌సైట్:** www.vizagsteel.com

తెలంగాణ ఆయుష్ విభాగంలో 156 మెడికల్ ఆఫీసర్ పోస్టులు

మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు(ఎంహెచ్ఎస్ఆర్‌బీ).. తెలంగాణ రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ఆయుష్ విభాగంలో మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 156
» **పోస్టుల వివరాలు:** మెడికల్ ఆఫీసర్(ఆయుర్వేదం)-54, మెడికల్ ఆఫీసర్ (హోమియో)-33, మెడికల్ ఆఫీసర్(యునాని)-69.
» **అర్హత:** సంబంధిత విభాగంలో మెడికల్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» **వేతనం:** నెలకు రూ.54,220 నుంచి రూ.1,33,630 చెల్లిస్తారు.
» **వయసు:** 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** విద్యార్హత పరీక్షలో సాధించిన మార్కులు, పని అనుభవం ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** ఆగస్టు 07 నుంచి 22 వరకు.
» **వెబ్‌సైట్:** https://mhsrb.telangana.gov.in

నిమ్స్, హైదరాబాద్‌లో పీజీ డిప్లొమా ప్రవేశాలు

హైదరాబాద్ పంజాగుట్టలోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్).. 2023 సంవత్సరానికి సంబంధించి డిప్లొమా ఇన్ న్యూక్లియర్ మెడిసిన్ టెక్నాలజీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 04
» **వ్యవధి:** రెండేళ్లు.
» **అర్హత:** బీఎస్సీ(ఏదైనా సైన్స్ సబ్జెక్టులు/లైఫ్ సైన్సెస్) ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 31.12.2023 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్షలో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 27.07.2023.
» **దరఖాస్తు హార్డ్‌కాపీ సమర్పణకు చివరితేది:** 31.07.2023.
» **హాల్ టిక్కెట్ల జారీ తేది:** 18.08.2023.
» **ప్రవేశ పరీక్ష తేది:** 23.08.2023.
» **ఫలితాల వెల్లడి తేది:** 25.08.2023.
» **వెబ్‌సైట్:** www.nims.edu.in

కెరీర్ మెరిసే లా



కామన్ లా అడ్మిషన్ టెస్ట్.. సంక్షిప్తంగా క్లాట్! న్యాయ విద్యను అందించడంలో ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్స్‌గా గుర్తింపు పొందిన నేషనల్ లా యూనివర్సిటీల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష. ఇంటర్మీడియెట్ అర్హతతో క్లాట్-యూజీ, ఎల్‌ఎల్‌బీ అర్హతతో క్లాట్-పీజీకి దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ జాతీయ న్యాయవిశ్వ విద్యాలయాల్లో.. బీఏ ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసుకుంటే.. ఇటు లా కెరీర్‌తోపాటు అటు కార్పొరేట్ కొలువులు సైతం సొంతం చేసుకోవచ్చు. తాజాగా 2024-25 విద్యాసంవత్సరం ప్రవేశాలకు సంబంధించి క్లాట్ 2024 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. క్లాట్‌తో ప్రయోజనాలు, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు..

క్లాట్-2024 ద్వారా మొత్తం 24 నేషనల్ లా యూనివర్సిటీల్లో ప్రవేశం కల్పిస్తారు. గత ఏడాది 22 వర్సిటీలే ఉండగా..ఈ ఏడాది మరో రెండు యూనివర్సిటీలు క్లాట్ స్కోర్‌తో ప్రవేశాలు కల్పించేందుకు సిద్ధమయ్యాయి. క్లాట్ యూజీతో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్‌ఎల్‌బీ, క్లాట్ పీజీతో ఎల్‌ఎల్‌ఎం ప్రోగ్రామ్‌లో అడ్మిషన్ లభిస్తుంది.

» క్లాట్-2024 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం
» డిసెంబర్ 3, 2023న పరీక్ష
» పరీక్ష విధానంలో పలు మార్పులు
» క్లాట్ స్కోర్‌తో 24 నేషనల్ లా వర్సిటీల్లో ప్రవేశం

అర్హత

క్లాట్-యూజీకి దరఖాస్తు చేసుకునేందుకు కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులై ఉండాలి. రిజర్వేషన్ కేటగిరీ విద్యార్థులు కనీసం 40 శాతం మార్కులు సాధించాలి. 2023-24లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

తగ్గిన ప్రశ్నల భారం

క్లాట్-యూజీ 2024లో ప్రశ్నల సంఖ్యను తగ్గిస్తూ.. పరీక్ష నిర్వాహక కమిటీ నిర్ణయం తీసుకుంది. గతేడాది వరకు 150 ప్రశ్నలతో ఈ పరీక్ష నిర్వహించగా.. క్లాట్-యూజీ 2024లో 120 ప్రశ్నలే ఉంటాయని పేర్కొన్నారు. పరీక్ష సమయాన్ని మాత్రం గతంలో మాదిరిగానే రెండు గంటలుగా నిర్ణయించారు. అంటే.. గతంలో రెండు గంటల వ్యవధిలో 150 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటే.. ఈ ఏడాది 2 గంటల వ్యవధిలో 120 ప్రశ్నలకు సమాధానం ఇస్తే సరిపోతుంది. దీనివల్ల ఒకవైపు ప్రశ్నల సంఖ్య తగ్గడంతోపాటు ప్రతి ప్రశ్నకు లభించే సగటు సమయం పెరుగుతుంది.

అయిదు విభాగాలు

క్లాట్-యూజీ 2024 పరీక్షను అయిదు విభాగాలుగా నిర్వహిస్తారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ 22-26 ప్రశ్నలు, జీకే అండ్ కరెంట్ అఫైర్స్ 28-32 ప్రశ్నలు, లీగల్ రీజనింగ్ 28-32 ప్రశ్నలు, లాజికల్ రీజనింగ్ 22-26 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ టెక్నిక్స్ 10-14 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష ప్రశ్నల సంఖ్య తగ్గించిన నేపథ్యంలో ఆయా సబ్జెక్ట్‌లలో ప్రశ్నల సంఖ్యా శ్రేణిని కూడా తగ్గించారు. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. పరీక్షకు కేటాయించిన మార్కులు 120. నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కుల కోత విధిస్తారు.

ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలు

క్లాట్-యూజీలో పేర్కొన్న అయిదు విభాగాల్లో.. నాలుగు విభాగా(ఇంగ్లిష్ లాంగ్వేజ్, కరెంట్ అఫైర్స్, లీగల్ రీజనింగ్, లాజికల్ రీజనింగ్)ల్లో పూర్తిగా ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలే అడుగుతారు. క్వాంటిటేటివ్ టెక్నిక్స్ విభాగంలో గ్రాఫ్, టేబుల్స్, డయాగ్రమ్స్ ఆధారిత ప్రశ్నలు ఉంటాయి.

ప్రిపరేషన్ పక్కాగా

- **ఇంగ్లిష్ లాంగ్వేజ్:** ఈ విభాగంలో ఇంగ్లిష్ భాషా నైపుణ్యాన్ని పరిశీలించే ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలు ఉంటాయి. ఇందులో రాణించేందుకు కాంప్రహెన్షన్, ప్యాసేజ్ రీడింగ్‌పై పట్టు పెంచుకోవాలి. సునిశిత పరిశీలన నైపుణ్యం, ఇచ్చిన ప్యాసేజ్ సారాంశాన్ని గ్రహించడం, ఈ ప్యాసేజ్ ప్రధాన ఉద్దేశం తెలుసుకోవడం వంటి నైపుణ్యాలు అవసరం. ఇందుకోసం జనరల్ ఎస్సేలు, న్యూస్ పేపర్ ఎడిటోరియల్స్ వంటివి చదవాలి.
- **కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్:** ఈ విభాగంలో సమకాలీన అంశాలు, కళలు, సంస్కృతి, అంతర్జాతీయ వ్యవహారాలు, ప్రాధాన్యత కలిగిన చారిత్రక అంశాలకు సంబంధించిన ప్యాసేజ్‌లు ఇచ్చి.. వీటి నుంచి ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు జాతీయోద్యమంలో కీలక ఘట్టాలపై దృష్టి పెట్టాలి. భారత రాజ్యాంగ రూపకల్పన నుంచి తాజా సవరణల వరకు అన్నీ తెలుసుకోవాలి. కరెంట్ అఫైర్స్‌కు సంబంధించి అంతర్జాతీయ స్థాయిలో ద్వైపాక్షిక ఒప్పందాలు, ముఖ్యమైన సంఘటనలు, సదస్సుల గురించి పూర్తి స్థాయి అవగాహన పొందాలి.
- **లీగల్ రీజనింగ్:** అభ్యర్థుల న్యాయపరమైన దృక్పథం, సహేతుక ఆలోచన ధోరణి, నిర్ణయ సామర్థ్యాలను పరిశీలించే విభాగం ఇది. ఇందులో ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలు అడుగుతారు. సంబంధిత ప్యాసేజ్‌ల నుంచి నిబంధనలు, సిద్ధాంతాలు, ఫ్యాక్ట్స్, వాటి ద్వారా చోటు చేసుకుంటున్న మార్పులకు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. ముఖ్యమైన చట్టాలు, న్యాయ శాఖకు సంబంధించి ఇటీవల కాలంలో చోటు చేసుకున్న తాజా పరిణామాలు, లీగల్ టెర్మినాలజీపై అవగాహన పెంచుకోవాలి.
- **లాజికల్ రీజనింగ్:** ఈ విభాగంలోనూ ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలకే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఇందులో రాణించాలంటే.. ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలు; అసెర్షన్ అండ్ రీజనింగ్ విధానంలో ప్రశ్నలు అడుగుతారు. ఇందుకోసం సిలాజిజమ్, కోడింగ్-డీ కోడింగ్, డైరెక్షన్, అనాలజీ, సిరీస్, సీటింగ్ అరేంజ్‌మెంట్ వంటి అంశాలపై అవగాహన పొందాలి. స్టేట్‌మెంట్ ఆధారిత ప్రశ్నల కోసం కంపేరిటివ్ అప్రోచ్‌ను అలవర్చుకోవాలి.
- **క్వాంటిటేటివ్ టెక్నిక్స్:** ఈ విభాగంలో టాప్ స్కోర్ కోసం పదో తరగతి స్థాయిలోని గణిత అంశాలపై గట్టి పట్టు సాధించాలి. గత ప్రశ్నపత్రాలను పరిశీలిస్తే అర్థమెటిక్‌కు కొంత ఎక్కువ వెయిటేజీ కనిపిస్తోంది. కాబట్టి పర్సంటేజెస్, టైమ్ అండ్ డిస్టెన్స్, టైమ్ అండ్ స్పీడ్, యావరేజ్, రేషియోస్ తదితర టాపిక్స్‌ను బాగా ప్రాక్టీస్ చేయాలి. దీంతోపాటు గ్రాఫ్‌లు, చార్ట్‌లను విశ్లేషించే నైపుణ్యం సొంతం చేసుకోవాలి.

కార్పొరేట్ అవకాశాల లా

నేషనల్ లా యూనివర్సిటీల్లో కోర్సు పూర్తి చేసుకున్న వారికి విస్తృత అవకాశాలు లభిస్తున్నాయి. న్యాయవాద వృత్తి మాత్రమే కాకుండా.. కార్పొరేట్ కొలువులు సైతం సొంతం చేసుకునే వీలుంది. ప్రస్తుత అంతర్జాతీయ వాణిజ్య విధానాలు, పలు దేశాల కంపెనీల మధ్య అవగాహన ఒప్పందాలు వంటి వాటి కారణంగా న్యాయ నిపుణులకు డిమాండ్ ఏర్పడింది. క్యాంపస్‌లలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్స్‌లో ఎంపికైన విద్యార్థులకు కన్సల్టింగ్ సంస్థలు, బ్యాంకులు సగటున రూ.10 లక్షల వార్షిక వేతనం ఆఫర్ చేస్తున్నాయి.

క్లాట్-పీజీ.. ఇలా

- నేషనల్ లా యూనివర్సిటీల్లో ఎల్‌ఎల్‌ఎం కోర్సులో ప్రవేశాలకు క్లాట్-పీజీ నిర్వహిస్తారు. ఎల్‌ఎల్‌బీ తత్సమాన ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు. అభ్యర్థులు ఎల్‌ఎల్‌బీలో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు కనీసం 45 శాతం మార్కులు సాధించాలి. ఈ ఏడాది చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- క్లాట్-పీజీ పరీక్షను 120 ప్రశ్నలు-120 మార్కులకు నిర్వహిస్తారు. ప్యాసేజ్ ఆధారితంగా ఆబ్జెక్టివ్ ప్రశ్నలుగా అడుగుతారు.
- పరీక్షలో కాన్‌స్టిట్యూషనల్ లా సంబంధిత ప్రశ్నలు, జ్యూరిస్పుడెన్స్, అడ్మినిస్ట్రేటివ్ లా, లా ఆఫ్ కాంట్రాక్ట్, టార్ట్స్, ఫ్యామిలీ లా, క్రిమినల్ లా, ప్రాపర్టీ లా,కంపెనీ లా, పబ్లిక్ ఇంటర్నేషనల్ లా, ట్యాక్స్ లా, ఎన్విరాన్‌మెంటల్ లా, లేబర్ అండ్ ఇండస్ట్రియల్ లా విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- అభ్యర్థులు ముఖ్యమైన తాజా తీర్పులు; రాజ్యాంగ, శాసనపరమైన అంశాలు; చారిత్రాత్మక తీర్పులు, వాటి ప్రభావం వంటి వాటిపై అవగాహన పెంచుకుంటే.. క్లాట్-పీజీలో మెరుగైన మార్కులు సొంతం చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. దీంతోపాటు తాము ఎంపిక చేసుకోనున్న స్పెషలైజేషన్‌కు సంబంధించి అకడమిక్‌గా బ్యాచిలర్ స్థాయిలోని అంశాలపై పట్టు సాధించడం కూడా మేలు చేస్తుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** జూలై 1 – నవంబర్ 3, 2023
- **క్లాట్ పరీక్ష తేదీ:** డిసెంబర్ 3, 2023
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ
- **క్లాట్-పీజీ వెబ్‌సైట్:** https://consortiumofnlus.ac.in/clat2024

క్లుప్తంగా...

నేడో రేపో ఎంబీబీఎస్ ప్రవేశాలకు నోటిఫికేషన్



సాక్షి, అమరావతి: 2023–24 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య, దంత కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నేడో రేపో నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఈ విద్యా సంవత్సరం నుంచి ఐదు కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో 17 ప్రభుత్వ, 16 ప్రైవేట్ వైద్య కళాశాలల్లో 6 వేలకు పైగా సీట్లు అందుబాటులో ఉంటాయి. నోటిఫికేషన్ జారీకి అన్ని ఏర్పాట్లు చేశామని వీసీ డాక్టర్ బాబ్జీ తెలిపారు. కాగా 15 శాతం ఆలిండియా కోటా సీట్ల భర్తీకి ఇప్పటికే మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ(ఎంసీసీ) షెడ్యూల్ విడుదల చేసింది. ఆలిండియా కోటా కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకూ రిజిస్ట్రేషన్/పేమెంట్ చేసుకోవాల్సి ఉంటుంది. 22 నుంచి 26వ తేదీ మధ్య విద్యార్థులు చాయిస్‌లు నమోదు చేసుకోవచ్చు. 27, 28 తేదీల్లో సీట్ల కేటాయింపు చేపడతారు. ఆగస్టు 6వ తేదీ నాటికి తొలి విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ముగుస్తుంది.

31 వరకు 'ఇగ్నో' కోర్సులకు దరఖాస్తు గడువు పెంపు



వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) 2023 జూలై నుంచి ప్రారంభమయ్యే విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ కోర్సులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు ఇగ్నో విజయవాడ ప్రాంతీయ కేంద్రం డైరెక్టర్ కె.సుమలత తెలిపారు. పీజీ రెండో సంవత్సరం, డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరాల విద్యార్థులు రీ రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లింపు గడువును కూడా ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. 0866–2565253 నంబరులో సంప్రదించాలన్నారు.

సీపెట్ డిప్లొమా కోర్సుల దరఖాస్తుకు 28న తుది గడువు



గన్నవరం రూరల్: సీపెట్ (సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ) డిప్లొమా కోర్సులలో ప్రవేశాలకు ఈ నెల 28వ తేదీలోగా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సీపెట్ జాయింట్ డైరెక్టర్ అండ్ హెడ్ డాక్టర్ సీహెచ్ శేఖర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరానికి జాబ్ ఓరియంటెడ్ కోర్సులు మూడు సంవత్సరాల వ్యవధి గల డిప్లొమా, రెండేళ్ల వ్యవధి గల పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ(డీపీటీ), డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ) కోర్సులకు పదోతరగతి ఉత్తీర్ణులైన వారు, పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ కోర్సులకు బీఎస్సీ విద్యార్హత ఉండాలని చెప్పారు. ఏపీ ప్రభుత్వం అర్హులైన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్ సదుపాయం అందిస్తుందని, పదో తరగతి సప్లిమెంటరీ విద్యార్థులూ దరఖాస్తు చేసుకోవచ్చునని, జి.మల్లేశ్వరరావు 9440531978 నంబర్లో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

ఏపీ సచివాలయంలో ఎస్‌బీఐ వీఐపీ లాంజ్

సాక్షి, అమరావతి: రాష్ట్ర సచివాలయంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలో నూతన వీఐపీ లాంజ్‌ను ఆ సంస్థ చైర్మన్ దినేష్ ఖరా సోమవారం ముంబై నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశ వ్యాప్తంగా 29 రాష్ట్ర సచివాలయాల్లోని 33 ఎస్‌బీఐ శాఖల్లో వీటిని ఏర్పాటు చేశారు. లాంజ్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్ హాజరయ్యారు. ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ ఓం నారాయణ శర్మ, డీజీఎంలు మనీష్‌కుమార్‌సింగ్, దినేష్ గులాటి, రీజనల్ మేనేజర్ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విపత్తుల నిర్వహణ సంస్థ కో–ఆర్డినేటర్ ప్రసాద్‌కు డాక్టరేట్

సాక్షి, అమరావతి: రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థలో ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న బాలిబోయిన ప్రసాద్‌కు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. 'రిమోట్ సెన్సింగ్, భౌగోళిక సమాచార వ్యవస్థ' (ఎజ) ఉపయోగించి కృష్ణా, గుంటూరు జిల్లాల భౌతిక, సామాజిక దుర్బలత్వం, వరద విపత్తుల అంచనా' అనే అంశంపై ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పర్యావరణ శాస్త్రం విభాగాధిపతి డా. పి బ్రహ్మాజీరావు మార్గదర్శకత్వంలో ప్రసాద్ పరిశోధన చేశారు. ఈ సందర్భంగా విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డా.బీఆర్ అంబేద్కర్ డాక్టరేట్ పొందిన ప్రసాద్‌ను అభినందించారు.

చేపల వేటలో.. ప్రమాదాలకు స్వస్తి

ఈశాన్య రాష్ట్రాల్లో గిరిజన మత్స్యకారులు విధ్వంసకర పద్ధతుల్లో చేపల వేట సాగిస్తుంటారు. చేపల్ని వేటాడేందుకు విద్యుత్ షాక్, విష, రసాయన ప్రయోగాలు వంటి విధానాలను అవలంబిస్తుంటారు. ఆధునిక సాంకేతికత అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో కూడా వీరు ఇప్పటికీ ఆమోద యోగ్యం కాని రీతుల్లోనే చేపల వేట కొనసాగిస్తుండటంపై సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ (సీఐఎఫ్‌టీ) తొలిసారిగా దృష్టి సారించింది. విశాఖలోని ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ (ఐకార్)–సీఐఎఫ్‌టీ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు ఇందుకు నడుం బిగించారు. ఈశాన్య రాష్ట్రాల్లోని గిరిజన ప్రజలు ఎక్కువగా వ్యవసాయం, చేపల వేటపైనే ఆధారపడి జీవిస్తారు. వీరు చేపలను తినడానికి అమితంగా ఇష్టపడతారు. కానీ.. అక్కడ చల్లని వాతావరణం వల్ల చేపల లభ్యత తక్కువగా ఉంటుంది.

– సాక్షి, విశాఖపట్నం



ఫోల్డబుల్ ఫిష్ ట్రాప్‌ల గురించి వివరిస్తున్న సీఐఎఫ్‌టీ శాస్త్రవేత్తలు

ఈశాన్య రాష్ట్రాల్లో మార్పు కోసం విశాఖ సీఐఎఫ్‌టీ శాస్త్రవేత్తల యత్నం

- అనాదిగా విద్యుత్ షాక్, విష, రసాయన ప్రయోగమే గిరిజనులకు అలవాటు
- ఆ విధానానికి స్వస్తి పలికేలా శాస్త్రవేత్తల కృషి
- తొలుత సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలతో ఎంవోయూ
- భవిష్యత్‌లో మరిన్ని ఈశాన్య రాష్ట్రాలకు విస్తరణ
- అక్కడి మత్స్యకారులకు కొత్త పద్ధతులపై అవగాహన, శిక్షణ



వ్యాల్యూ యాడెడ్‌పై మత్స్యకారులకు శాస్త్రవేత్తల అవగాహన

ప్రమాదం.. ప్రాణాంతకం

విద్యుత్ షాక్ ఇవ్వడం, బాంబులను పేల్చడం వల్ల గిరిజనులు క్షతగాత్రులవడం, ప్రాణాలు కోల్పోవడమే కాకుండా జలాశయాల్లో పచ్చదనం హరించిపోతోంది. ప్రమాదకర రసాయనాలు వినియోగించడంతో వాటిని తిన్న చేపల అనారోగ్యానికి హేతువవుతోంది. దీనిని నిలువరించడంపై అవగాహన కల్పిస్తున్నారు. గిరిజన మత్స్యకారులకు వెదురు బుట్టలు, గాలాలకు బదులు సులువుగా ఎక్కువ మొత్తంలో చేపలు పడే ఫోల్డబుల్ నెట్ ట్రాప్ (మడత బుట్ట)లు, హుక్‌లు, అక్కడ లభ్యమయ్యే చేపలు పట్టేలా ఆధునిక గిల్ వలలను పరిచయం చేస్తున్నారు. ఈ వలల తయారీపై కూడా శిక్షణ ఇస్తున్నారు. పట్టిన చేపల నాణ్యత పెంపు, అవి పాడవకుండా నిల్వ ఉంచే విధానంపై శిక్షణ ఇస్తున్నారు. తొలిసారిగా ఫైబర్ రీయిన్‌ఫోర్స్ ప్లాస్టిక్ బోట్లను సమకూర్చే వీలు కల్పిస్తున్నారు. ఇంకా జలాశయాల్లో చేపల పెంపకం ఎక్కడెక్కడ చేయొచ్చో, ఏ జాతుల చేప పిల్లలను పెంచవచ్చో సూచిస్తున్నారు.

మత్తిస్తారు.. బాంబులేస్తారు

అక్కడి జలాశయాల్లో చేపల్ని వేటాడేందుకు గిరిజనులు బోట్లకు బదులుగా వెదురు ర్యాఫ్టలు, రబ్బరు ట్యూబులతో వెళ్తారు. బ్యాటరీల నుంచి విడుదలయ్యే విద్యుత్‌తో షాక్ ఇవ్వడం ద్వారా చేపలను చంపుతారు. అలాగే.. మత్తునిచ్చే గుణాలున్న కొన్నిరకాల చెట్ల నుంచి తీసిన పసరు, విష పూరిత రసాయనాలు వినియోగిస్తారు. దీంతో మత్తెక్కిన చేపలు నీటిపైకి తేలిపోతాయి. మరికొందరు వాటర్ బాంబులను పేల్చి చేపల్ని చంపుతారు. చనిపోయిన, నీటిపై తేలిన చేపలను పట్టుకెళ్తారు. ఇలాంటి అవాంఛనీయ పద్ధతులకు స్వస్తి పలుకుతూ ఆధునిక విధానంలో చేపలు పట్టడం, ఆ చేపలకు విలువ ఆధారిత ప్యాకింగ్‌లతో మంచి ధర లభించేలా చేయడం, నాణ్యత చెడిపోకుండా నిల్వ ఉంచడం తదితర అంశాలపై శాస్త్రవేత్తలు వారికి అవగాహనతో పాటు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ ఇస్తున్నారు. విశాఖ ఐకార్–సీఐఎఫ్‌టీ పరిశోధనా కేంద్రం సైంటిస్ట్ ఇన్‌చార్జి యు.శ్రీధర్ నేతృత్వంలోని ప్రిన్సిపల్ సైంటిస్ట్ బి.మధుసూదన రావు, శాస్త్రవేత్తలు జస్మిదేబ్బర్మ, జి.కమి దీనిని చేపట్టారు. ఇందులోభాగంగా ప్రస్తుతం అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాలతో అవగాహన ఒప్పందాలు (ఎంవోయూలు) చేసుకున్నారు. అరుణాచల్‌ప్రదేశ్‌లోని 'జిరో' అనే పర్యాటక ప్రాంతంలో ఒకటి, సిక్కింలోని గ్యాంగ్‌టక్‌లో మరొకటి మినీ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేశారు. ఐస్ తయారీ యంత్రాలు ఇచ్చారు.



ఈశాన్య రాష్ట్రాల ప్రతినిధులతో సీఐఎఫ్‌టీ ఎంవోయూ

మంచి ఫలితాలొస్తున్నాయి



ఈశాన్య రాష్ట్రాల్లో విధ్వంసకర విధానంలో జరుగుతున్న చేపల వేటకు స్వస్తి పలికి ఆధునిక పద్ధతుల్లో సాగించేలా అక్కడి వారికి శిక్షణ ఇస్తున్నాం. వెదురు బుట్టల స్థానంలో ఫోల్డబుల్ ట్రాప్స్, ఫైబర్ రీయిన్‌ఫోర్స్ ప్లాస్టిక్ బోట్లు మేలని చెబుతున్నాం. అక్కడ చేపల జాతులకు అనువైన వలలను తయారు చేసి ఇస్తున్నాం. తయారీని నేర్పిస్తున్నాం. దీంతో వారికి చేపల లభ్యత 20% పెరుగుతుంది. అరుణాచల్‌ప్రదేశ్, సిక్కింలలో ప్రస్తుతానికి ఒక్కో మినీ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేశాం. వీరు పట్టిన చేపలు నిల్వ, కటింగ్, ప్యాకింగ్ విధానాలు, విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేయడంపై తర్ఫీదు నిస్తున్నాం. గతంకంటే ఎక్కువఆదాయం పొందుతున్నారు. ఈ ఏడాది మిజోరాం, అస్సాం రాష్ట్రాలకు, వచ్చే ఏడాది మణిపూర్ రాష్ట్రాలకూ విస్తరిస్తాం.

– శ్రీధర్, సైంటిస్ట్ ఇన్‌చార్జి, కార్–సీఐఎఫ్‌టీ, విశాఖ

విద్య అత్యంత శక్తివంతమైన ఆయుధం

- సవాళ్లను అధిగమించే వినూత్న పరిష్కారం వెతకాలి
- నూతన జాతీయ విద్యావిధానం 2020 నవ శకానికి నాంది
- విద్యా సంస్కరణల అమలులో క్రియాశీలకంగా ఏపీ సర్కారు
- ఎస్‌కేడీ వర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ జస్టిస్ నజీర్

అనంతపురం: విద్య అత్యంత శక్తివంతమైన ఆయుధమని, ఉజ్వల భవిష్యత్‌ను సృష్టించేందుకు, ప్రపంచాన్ని మార్చడానికి దోహదం చేస్తుందని తాను దృఢంగా విశ్వసిస్తానని ఏపీ గవర్నర్, యూనివర్సిటీల చాన్సలర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ (ఎస్‌కేడీ) విశ్వవిద్యాలయం 21వ స్నాతకోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ తరఫున గౌరవ డాక్టరేట్‌ను కర్ణాటకకు చెందిన మాజీ అంధ క్రికెటర్, సమర్థనం ట్రస్ట్ వ్యవస్థాపకుడు మహంతేష్ జీకేకు గవర్నర్ ప్రదానం చేశారు. గవర్నర్ జస్టిస్ నజీర్ మాట్లాడుతూ.. 'మీకు ఎలాంటి సమస్యా రాకపోతే మీరు తప్పు మార్గంలో ప్రయాణిస్తున్నారని కచ్చితంగా అనుకోవచ్చు. విజయం సాధించడం సులువు కాదు. సవాళ్లు లేని జీవితం వ్యర్థం. సవాళ్లను ఎదుర్కోకపోతే ఏమీ నేర్చుకోలేరు. జీవితంలో ఎదగలేరు. ఏదైనా సాధించడానికి తొలి అడుగు ఏదీ



సులభంగా రాదని అంగీకరించడమే. సానుకూల దృక్పథమే అత్యంత ముఖ్యమైనది. జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులను ఎదుర్కోవడానికి సానుకూల మనస్తత్వమే ప్రధానమన్న స్వామి వివేకానంద మాటలు మనకెప్పుడూ గుర్తుండాలి' అని విద్యార్థులకు హితబోధ చేశారు.

వినూత్న పరిష్కారాలు వెతకండి

వాతావరణ మార్పులు, సాంకేతిక పురోగతి నుంచి సామాజిక అసమానత వంటి అనేక గణనీయమైన సవాళ్లను ప్రపంచం ఎదుర్కొంటోందని జస్టిస్ నజీర్ పేర్కొన్నారు. వీటిని కరుణ, సానుభూతి, ప్రపంచ పౌరసత్వ భావనతో పరిష్కరించడం రేపటి బాధ్యతాయుతమైన నాయకులుగా యువకుల బాధ్యత అన్నారు. వీటి కోసం వినూత్న పరిష్కారాలు వెతకాలని, స్థిరమైన భవిష్యత్‌కు కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా సంస్కరణల అమలులో క్రియాశీలకంగా ఉందని, నూతన జాతీయ విద్యా విధానం–2020ను రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలు అమలు చేస్తుండటం సంతోషదాయకమన్నారు. పీజీలతో సరితూగే రీతిలో డిగ్రీ కోర్సుల్లో సమూల మార్పులు తీసుకురావడం ఆనందంగా ఉందన్నారు. వైస్ చాన్సలర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి తదితరులు హాజరయ్యారు.





సర్కారీ స్కూళ్లకు డిజిటల్ సొబగులు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగస్టు నెలాఖరులోగా ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యా బోధన ప్రారంభం కానుంది. ఆరు నుంచి పదో తరగతి వరకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ ద్వారా.. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు స్మార్ట్ టీవీల ద్వారా బోధించనున్నారు. కొన్ని పాఠశాలల్లో ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభమయ్యింది . ఈ చిత్రాలు కృష్ణా జిల్లా నిడమానూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనివి. ఇక్కడ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్, ట్యాబ్లెట్ల సాయంతో ఇప్పటికే విద్యార్థులకు బోధన కొనసాగుతోంది.

– విశాల్, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

హజ్ యాత్రికులకు ఘన స్వాగతం

విమానాశ్రయం (గన్నవరం): హజ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని తిరిగి వచ్చిన తొలి బృందానికి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం(గన్నవరం)లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, ఏపీ హజ్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘన స్వాగతం లభించింది. సౌదీ అరేబియాలోని మదీనా నుంచి 175 మంది హాజీలతో స్పైస్ జెట్‌కు చెందిన బోయింగ్ 737 విమానం రాత్రి 7.45 గంటలకు ఇక్కడికి చేరుకుంది. విమానాశ్రయంలోని అంతర్జాతీయ టెర్మినల్‌లో హాజీలకు ఏపీ హజ్ కమిటీ చైర్మన్ బద్వేల్ షేక్ గౌస్ లాజాం, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, పలువురు ఉన్నతాధికారులు పూల మాలలతో ఘనంగా స్వాగతం పలికారు. విమానాశ్రయంలో హాజీలకు భోజన ప్యాకెట్లను కూడా అందజేశారు. అనంతరం డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా మాట్లాడుతూ.. విజయవాడ విమానాశ్రయం నుంచి హజ్‌కు వెళ్లిన 1,800 మంది హాజీలు యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని తిరిగి వస్తున్నారని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా హజ్ యాత్రికులపై అదనంగా పడుతున్న రూ.80 వేల భారాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరించే విధంగా సీఎం వైఎస్ జగన్ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు.



హాజీలకు స్వాగతం పలుకుతున్న డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, ఎమ్మెల్సీ రుహుల్లా

సంక్షేమ హాస్టళ్లపై సమగ్ర పర్యవేక్షణ

- 3,783 సంస్థల్లో విద్యార్థుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ
- మేలైన ఫలితాల కోసం కమిటీలు.. మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: సంక్షేమ హాస్టళ్లపై సమగ్ర పర్యవేక్షణకు రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. వసతి గృహాల నిర్వహణ, సంక్షోభ సమస్యల పరిష్కారం, విద్య, వైద్యం, ఆహారం వంటి అన్ని అంశాల్లో సమగ్ర ప్రామాణిక నిర్వహణ విధానాలను (ఎస్‌వోపీ) తీసుకురావాలని అధికారులను ఆదేశించింది. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగుల, జువైనల్ సంక్షేమ శాఖలకు చెందిన 3,783 వసతి గృహాల్లో చదివే విద్యార్థుల రక్షణ, సంరక్షణకు మరింత పటిష్ట చర్యలు చేపట్టింది. పిల్లలకు కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా నాణ్యమైన విద్యను అందించేలా పర్యవేక్షణ పెంచారు. మెనూ, కాస్మెటిక్ చార్జీలు, సౌకర్యాలు, ట్యూటర్లు, ఉపాధ్యాయులను సమకూర్చడంతోపాటు వారి అభివృద్ధి, సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలను ప్రభుత్వం నిర్వచించింది. బయోమెట్రిక్ ఆధార్ ఆధారిత హాజరు, ఆన్‌లైన్ రిజిస్టర్ల నిర్వహణ, విద్యార్థుల ఆరోగ్యం, వసతి గృహాలు, అనుబంధ సంస్థల రోజువారీ నిర్వహణ మరింత సులభతరంగా ఉండేలా సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకోవాలని ఆదేశించింది. హాస్టల్స్‌లో ఉదయం 5 గంటలకు విద్యార్థులు నిద్ర లేచిన దగ్గర్నుంచి రాత్రి 10 గంటలకు నిద్రపోయే వరకు ఏఏ సమయంలో ఏం చేయాలి(టైం టేబుల్) అనేది విధిగా అమలు జరిగేలా చూడాలని ఆదేశించింది.

సైబర్ నేరాలు.. అసాంఘిక శక్తులపై ప్రత్యేక దృష్టి

నాడు–నేడు పనులు వేగంగా చేపట్టేందుకు, దివ్యాంగులకు అవరోధాలు తొలగించేందుకు, సైబర్ నేరాలు, అసాంఘిక శక్తులపై ప్రత్యేక దృష్టి సారించేలా చర్యలు ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. గ్రామ, వార్డు సచివాలయాల్లోని మహిళా పోలీస్, సమీపంలోని హెల్త్ క్లినిక్‌లకు చెందిన ఏఎన్‌ఎంలు విధిగా హాస్టల్స్‌ను సందర్శించి పిల్లలపై శ్రద్ధ పెట్టాలని స్పష్టం చేసింది. వసతి గృహాలకు మంచినీరు, కరెంట్, వంట గది, బాత్రూమ్‌లు, ప్రహరీ గోడ, గేటు, గార్డెనింగ్, పర్యావరణ పరిరక్షణ వంటి వాటిని పర్యవేక్షించేలా కమిటీలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సూచించింది. తల్లిదండ్రుల కమిటీ, గ్రామ, వార్డు, హాస్టల్ అభివృద్ధి, పర్యవేక్షణ, నిర్వహణ కమిటీలను ఏర్పాటు చేయాలని పేర్కొంది. హాస్టల్ వార్డెన్, ప్రిన్సిపల్, అసిస్టెంట్ వెల్ఫేర్ ఆఫీసర్, జిల్లా సంక్షేమ అధికారి, జిల్లా కలెక్టర్ వంటి మూడు స్థాయిల్లో కచ్చితంగా వసతి గృహాలను, గురుకులాలను తనిఖీలు చేసి మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించింది.



కార్పొరేట్ సంస్థల్లో అతివల హవా!

పురుషులతో సమానంగా మహిళలు

- 2021తో పోలిస్తే 2022లో 17 శాతం పెరుగుదల
- 50 శాతానికి చేరిన మగువల ప్రాతినిధ్యం
- మిడ్ మేనేజ్‌మెంట్ నుంచి సీనియర్ స్థాయి వరకు
- హెర్‌కీ సంస్థ సర్వేలో వెల్లడి

సాక్షి, అమరావతి: పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో అతివలు దూసుకుపోతున్నారు.దేశంలోని కార్పొరేట్ సంస్థల్లో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతోంది. పురుషులతో సమానంగా రాణిస్తున్నారు. ఈ క్రమంలో కార్పొరేట్ రంగంలో మహిళల ప్రాతినిధ్యం 50 శాతానికి చేరిందని హెర్‌కీ సంస్థ తన సర్వే నివేదికలో వెల్లడించింది. 2022–23కి సంబంధించిన సర్వే నివేదికను ఈ సంస్థ ఇటీవల విడుదల చేసింది. సర్వేలో భాగంగా 2022 జనవరి నుంచి 2023 జనవరి మధ్య దేశ వ్యాప్తంగా 300కు పైగా కంపెనీల డేటాను విశ్లేషించింది. కాగా 2022లో 81 శాతం కంపెనీలు మహిళలకు ఆరు నెలలు, అంతకంటే ఎక్కువ కాలం వేతనం చెల్లింపులతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేశాయి. ఈ విధానాన్ని అమలు చేసిన కంపెనీలు 2021లో 47 శాతమే. 2022 నాటికి ఈ అంశంలో 34 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. అలాగే 2007కు ముందు 3 శాతం కంపెనీలు మాత్రమే కెరీర్‌లో విరామం తీసుకున్న మహిళలను నియమించుకున్నాయి. ఈ సంఖ్య 2021లో 38 శాతానికి పెరగడం విశేషం.

33 నుంచి 50 శాతానికి పెరుగుదల

సర్వే నిర్వహించిన కంపెనీల్లో 2021తో పోలిస్తే 2022లో మహిళల ప్రాతినిధ్యం పెరిగింది. 2021లో ఆయా కంపెనీల్లో మగువలు 33 శాతం ఉండగా ఈ సంఖ్య 2022లో 50 శాతానికి చేరింది. 2021తో పోలిస్తే 17 శాతం పెరుగుదల నమోదైంది. అదేవిధంగా మొత్తం ఉద్యోగుల్లో సీనియర్ నుంచి నాయకత్వ స్థానాల్లో 37 శాతం మంది మహిళలు నియమితులు కావడం విశేషం. మిడ్–మేనేజ్‌మెంట్ నుంచి సీనియర్ స్థాయి వరకూ మహిళల నియామకంలో గణనీయ పెరుగుదల చోటు చేసుకుంది. ఈ స్థానాల్లో 2021లో 19 శాతం మంది ఉండగా.. 2022 నాటికి 26 శాతానికి పెరిగింది. మరోవైపు 70 శాతం కంపెనీలు తమ నియామకాల్లో లింగ వైవిధ్యానికి పెద్దపీట వేస్తున్నాయి. ఈ అంశంలో 2021తో పోలిస్తే 2022లో 13 శాతం మేర పెరుగుదల నమోదైంది. సర్వే నిర్వహించిన నాటికి ఏడాది వ్యవధిలో 91 శాతం పెద్ద కంపెనీలు, 90 శాతం చిన్న సంస్థలు విజయవంతంగా లింగ వైవిధ్యం లక్ష్యాన్ని అందుకున్నాయి.

కేజీబీవీ ఫలితాలు అత్యుత్తమంగా ఉండాలి

- విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ
- 1,543 మంది కేజీబీవీ కొత్త ఉపాధ్యాయులకు నియామక పత్రాల అందజేత

సాక్షి, అమరావతి: కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల(కేజీబీవీ)ల్లోని విద్యార్థినుల భవిష్యత్‌ను తీర్చిదిద్దే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకుని అత్యుత్తమ ఫలితాలు సాధించే దిశగా ప్రోత్సహించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. కేజీబీవీల్లో కొత్తగా నియమితులైన 1,543 మంది ఉపాధ్యాయులకు పాఠశాల విద్యాశాఖ–సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సోమవారం విజయవాడ సమీపంలోని నిడమానూరులో ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి బొత్స వారందరికీ నియామక పత్రాలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. కేజీబీవీల్లో చదివే విద్యార్థినులు ప్రతి రంగంలో రాణించే దిశగా బోధన ఉండాలని, ఈ విద్యా సంవత్సరం టెన్త్, ఇంటర్‌లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. పాఠశాలల్లో బాలికల కోసం ప్రత్యేకంగా టాయిలెట్ల నిర్మాణం, కౌమార దశ బాలికలకు శానిటరీ నాప్కిన్స్, రక్తహీనత లోపం లేకుండా పౌష్టికాహారం అందజేస్తున్నామన్నారు. బడుల్లో సౌకర్యాలు మెరుగుపడటంతో బాలికల నమోదు శాతంతో పాటు ఆదరణ పెరుగుతోందని మంత్రి



పేర్కొన్నారు. తొలుత రాష్ట్రంలో 53 కేజీబీవీలతో ప్రారంభమైన ఈ విద్యాలయాల సంఖ్య ప్రస్తుతం 352కు చేరడంతో పాటు విద్యార్థులు కూడా దాదాపు లక్షకు చేరడం సంతోషంగా ఉందన్నారు. దేశానికే దిక్సూచిగా విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టి, వినూత్నమైన పథకాలు ప్రవేశపెట్టి దేశం మొత్తం రాష్ట్రం వైపు చూసేలా చేయడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాత్ర అద్వితీయమన్నారు. పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాశ్ మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు చారిత్రాత్మకమైనవన్నారు. సబ్జెక్టుతో సంబంధం లేకుండా ఆంగ్లభాషలో పట్టు సాధించడం, డిజిటల్ టెక్నాలజీ నేర్చుకోవడం, టోఫెల్ ట్రైనింగ్, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, చాట్ జీపీటీ, ఈ–కాన్ఫరెన్స్ యాప్, బైజూస్ కంటెంట్‌తో ఉచిత ట్యాబ్‌లు తద్వారా నైపుణ్యాలు పెంచుకునే అంశాలను వివరించారు. సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, కేజీబీవీ కార్యదర్శి డి.మధుసూదనరావు, పాఠశాల విద్య డైరెక్టర్ పార్వతి, ఎగ్జామినేషన్స్ డైరెక్టర్ దేవానందరెడ్డి, ఎస్‌ఈఆర్‌టీ డైరెక్టర్ డాక్టర్ ప్రతాప్‌రెడ్డి, టెక్స్ట్ బుక్స్ డైరెక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి, ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ కార్యదర్శి నర్సింగరావు, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.